ఈనాడు

విజయవాడ 8-7-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 329

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ప్రమాదంలో మృతి చెందిన తేజస్విని, సిద్ధార్థ, మృదా, వెంకట్

అమెరికాలో రోడ్డు ప్రమాదం


నలుగురు హైదరాబాద్ వాసుల సజీవ దహనం

రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొన్న ట్రక్కు

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలోని గ్రీన్‌కౌంటీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు సజీవ దహనమయ్యారు. విహార యాత్రలో భాగంగా తమ కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రక్కు ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. కారులో మంటలు చెలరేగడంతో తల్లిదండ్రులు, వారి ఇద్దరు పిల్లలు దుర్మరణం చెందారు. మృతులు హైదరాబాద్‌లోని తిరుమలగిరికి చెందినవారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి జూపిటర్ కాలనీకి చెందిన (మిగతా 2లో)

రంగులలో 'భూ దర్శిని'

- ప్రభుత్వ, ప్రైవేటు భూములు, చెరువులు, గ్రామ కంఠాలకు వేర్వేరు రంగులతో వర్గీకరణ
- ఆక్రమణలు, రహదారుల విస్తీర్ణాన్ని తెలుసుకోవచ్చు
- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరికొత్త సమాచారం
- దేశంలోనే తొలిసారిగా రూపకల్పన



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కోటవూరు గ్రామ మ్యాపులో రంగులతో గుర్తించిన భూములు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలోని భూముల వివరాలను మరింత సులభంగా గుర్తించే అవకాశం రాబోతోంది. కొత్తగా తీర్చిదిద్దుతున్న వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులతో పాటు చెరువులు, కుంటలు, వాగులు, వంకల వంటి వివరాలు, రహదారులు.. ఇలాంటివన్నీ వేర్వేరు రంగుల్లో స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా భూముల మీద క్లిక్ చేయగానే భూ విస్తీర్ణం, యజమాని పేరు తదితర సమాచారం స్పష్టంగా తెలిసేలా వెబ్‌ల్యాండ్‌ను తీర్చిదిద్దుతున్నారు. 'భూ దర్శిని' పేరుతో దేశంలోనే తొలిసారిగా ఈ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం తీసుకువస్తోంది. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌లో భూ విస్తీర్ణం, యజమాని పేరు, స్వభావం, ఇతర వివరాలు తెలుస్తున్నాయి. కొత్త విధానం ద్వారా ఆక్రమణలు, రహదారులు, జలవనరుల గురించి కూడా స్పష్టంగా గుర్తించవచ్చు. రాష్ట్రంలో 16,816 గ్రామాలు (1,27,547.856 చదరపు కిలోమీటర్లు) ఉండగా, వాటిలో 6,690 గ్రామాల్లో రీసర్వే (34,984.18 చ.కి.మీ. మేర) పూర్తయింది. పొలాల కొలతలు, హద్దులు, భూముల వర్గీకరణను ఆధునిక పరిజ్ఞానం సాయంతో రోవర్ల ద్వారా ఖరారు చేస్తున్నారు. ఆ వివరాలే రికార్డుల్లో నమోదవుతున్నాయి. అవి ఆటోమేటిగ్గా.. వెబ్‌ల్యాండ్‌లోకి చేరుతున్నాయి.

భూమి వివరం	రంగు
ప్రభుత్వ భూములు	ఎరుపు
ప్రైవేట్ భూములు	ఆకుపచ్చ
గ్రామ కంఠ భూములు	ఊదా
నీటి కుంటలు/చెరువులు	నీలం
రహదారులు	పసుపు

5 రంగుల్లో..

రీసర్వే ఆధారంగా కొత్తగా తయారైన గ్రామాల మ్యాపుల్లో ఉన్న భూములను 5 వేర్వేరు రంగుల్లో గుర్తించడానికి వీలు కలుగుతుంది. రీసర్వే పూర్తయిన చోట్ల భూముల వివరాలు సమగ్రంగా ఉన్నందున ఈ డేటాబేస్‌కు తగ్గట్లు మ్యాపులు తయారయ్యాయి. డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దృశ్యరూపంలో నమోదుకు సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో భూముల వద్ద క్లిక్ చేయగానే పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఈ విధానం క్రయ, విక్రయాల సమయంలో జాగ్రత్త పడేందుకు దోహదం చేస్తుంది.

కొత్త విధానంతో ఉపయోగాలు

- హద్దులు కచ్చితంగా తెలిసిపోతాయి కనుక ఆక్రమణల గురించి తెలుసుకోవచ్చు.
- ప్రభుత్వ శాఖల వారీగా ఉన్న భూములను గుర్తించడం సులభతరం.
- ప్రభుత్వ భూముల ఆక్రమణలు (మిగతా 2లో)

ఖనిజాలను ఆయుధాలుగా మారనివ్వొద్దు


- క్రిటికల్ మినరల్స్ సరఫరా గొలుసులను ఏర్పాటు చేసుకుందాం
- బ్రిక్స్ సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- ధనిక దేశాలు పర్యావరణ పరిరక్షణకు మరిన్ని నిధులివ్వాలని వ్యాఖ్య
- మానవతా విధానాలకు భారత్ అగ్ర ప్రాధాన్యమిస్తుందని ఉద్ఘాటన



బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా

రియో డి జనీరో: అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీలో కీలకమైన ఖనిజాలను (క్రిటికల్ మినరల్స్) ఏ దేశమూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వాటిని ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఆ ఖనిజాల సరఫరా గొలుసులను ఏర్పాటుచేసుకునేందుకు కలిసికట్టుగా కృషిచేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా 'బహుళపక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై బ్రిక్స్ ఏర్పాటుచేసిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. (మిగతా 2లో)

రాజకీయం ముసుగులో నేరాలు చేసేవారితో జాగ్రత్త



- తప్పులు చేస్తూ వాటిని ప్రభుత్వంపైకి నెడుతున్నారు
- ప్రజా భద్రత చట్టం కింద ఇలాంటి వారి నుంచి డేటా తీసుకోవాలి
- వారి నేరాల్ని ఆధారాలతో బయటపెట్టేలా సాంకేతికత వినియోగించాలి
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'రాజకీయం ముసుగులో కొందరు నాయకులు నేరాలకు పాల్పడుతూ.. వారి తప్పుల్ని ప్రభుత్వంపైకి నెడుతున్నారు. ఇలాంటి నేతలు, వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రజా భద్రత చట్టం కింద పోలీసులు వారి నుంచి డేటా తీసుకోవాలి. ఆయా నేరాలకు వారిని బాధ్యుల్ని చేయాలి. వారి నేరాలను బయటపెట్టేలా సాంకేతికతను మరింత వినియోగించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని ఆంధ్రప్రదేశ్‌ను నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని (మిగతా 2లో)



కాంతులీనుతున్న గుంటూరు మెడికల్ కళాశాల ముఖద్వారం



మరమ్మతులు చేసిన తర్వాత ఫర్నిచర్ ఇలా..

పూర్వ విద్యార్థి సంకల్పం..
కళాశాలకు పునర్వైభవం!

బ్రిటిష్ కాలం నాటి ప్రతిష్ఠాత్మక గుంటూరు మెడికల్ కళాశాలలోని భవనాలు సంవత్సరం క్రితం వరకు నిర్వహణ సరిగా లేక రూపు కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇనుప దూలాలు బయటకు వచ్చి వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీరు కారేది. కళాశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చిన సుందరాచారికి ఈ పరిస్థితులు బాధ కలిగించాయి. ఎందుకంటే ఆయన ఒకప్పుడు ఈ కళాశాల విద్యార్థే. ఈ భవనాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పం పెట్టుకుని పూర్వ విద్యార్థుల సహకారంతో నిధులు సేకరించడం ప్రారంభించారు. ఆ నిధులతో ఇప్పటి వరకు తరగతి గదుల పైకప్పులు, చుట్టూ గోడలను సుందరీకరించారు. పక్కన పడేసిన బర్మా టేకు ఫర్నిచర్‌ను మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. 500లకు పైగా కుర్చీలు, బెంచీలు, బల్లలకు మరమ్మతులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు రూ.3 కోట్ల విలువైన పనులు పూర్తికాగా కొన్ని ఇంకా కొనసాగుతున్నాయి. - ఈనాడు, గుంటూరు

నాడు..



పెచ్చులూడి పాడైపోయిన బయోకెమిస్ట్రీ ల్యాబ్ పైకప్పు

నేడు ఇలా..



మరమ్మతుల అనంతరం..

నలుగురు హైదరాబాద్ వాసుల సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

బెజుగం శ్రీవెంకట్(40), కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్సీఎల్ నార్త్ ఎవెన్యూకు చెందిన పొట్లెటి తేజస్విని(36)కి 2013లో వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వీరికి సిద్దార్థ(9), మృద(7) ఇద్దరు పిల్లలున్నారు. మూడున్నరేళ్ల కిందట శ్రీవెంకట్ ఉద్యోగరీత్యా అమెరికాలోని డాలస్ వెళ్లారు. ఆర్నెల్ల తర్వాత భార్య, పిల్లల్ని అక్కడికి రప్పించుకున్నారు. తర్వాత తన తల్లిదండ్రులు పశుపతినాథ్, గిరిజను కూడా అమెరికా తీసుకెళ్లారు. శ్రీవెంకట్ సోదరి దీపిక, ఆయన మామ నాగరాజు ప్రస్తుతం అట్లాంటాలోని వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఇటీవల వారం రోజులు సెలవులు రావడంతో విహారయాత్ర కోసం శ్రీవెంకట్ కుటుంబం అట్లాంటా వెళ్లింది. ఇద్దరి ఇళ్లలో మూడేసి రోజులు ఉన్నారు. తిరుగు ప్రయాణంలో తల్లిదండ్రులు ప్రయాణం వాయిదా వేసుకుని కుమార్తె దీపిక వద్దనే ఉండిపోయారు. వయసు రీత్యా కారులో ప్రయాణించలేమని, తర్వాత విమానంలో వస్తామని చెప్పి ఆగిపోయారు. దీంతో ఆదివారం తెల్లవారుజామున శ్రీవెంకట్, తేజస్విని ఇద్దరు పిల్లలతో కలిసి కారులో డాలస్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో గ్రీన్‌కౌంటీ వద్దకు రాగానే ప్రమాదం జరిగింది. రాంగ్ రూట్‌లో వేగంగా దూసుకొచ్చిన మినీ ట్రక్కు వెంకట్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. కారులో మంటలు చెలరేగడంతో మృతదేహాలు బూడిదైనట్లు బంధువులు తెలిపారు.



దగ్ధమవుతున్న కారు

ఐడీ కార్డు ఆధారంగా..

ప్రమాద స్థలంలో పోలీసులు పరిశీలించగా శ్రీవెంకట్ కుమారుడు సిద్దార్థ పాఠశాల ఐడీ కార్డు లభ్యమైంది. దీని ఆధారంగా డాలస్‌లోని పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా శ్రీవెంకట్ చిరునామా దొరికింది. ఆయన నివాసానికి వెళ్లగా తాళం వేసి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో నలుగురూ అట్లాంటాలోని దీపిక ఇంటికి వెళ్లినట్లు తెలుసుకుని ఆమెకు సమాచారం ఇచ్చారు. ప్రమాద స్థలంలో సిద్దార్థ మృతదేహంలో కొంత భాగం లభ్యమైంది. పోలీసులు డీఎన్ఏ నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.



వెబ్‌ల్యాండ్‌లో మనకు కావలసిన భూమిపై క్లిక్ చేయగానే యజమాని పేరు, సర్వే నంబరు తదితర వివరాలు ఇలా తెలుస్తాయి

రంగులలో ‘భూ దర్శిని’

(మొదటి పేజీ తరువాయి)

జరిగితే ఏ స్థాయిలో ఎంతవరకు జరిగాయో తెలుసుకోవచ్చు. ■ విపత్తుల సమయంలో ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి కుదురుతుంది. ■ పంటల సాగు వివరాలు తెలుసుకునేందుకు, చెరువులు, కుంటలు ఎక్కడెక్కడ ఉన్నాయి? సాగునీరు ఎక్కడి నుంచి వస్తుంది వంటివి గుర్తించవచ్చు. ■ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చేవారు ఆయా గ్రామాల్లోని పంటల సాగు, భూముల స్వభావం తెలుసుకోవచ్చు. ■ గ్రీన్ ఎనర్జీలో భాగంగా విద్యుత్తు ఉత్పాదనకు అనువైన పరిస్థితులు సదరు గ్రామంలో ఉన్నాయో లేవో కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

పట్టాదారు పుస్తకాల్లో ‘క్యూఆర్ కోడ్’: రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంది. పుస్తకాల్లో ‘క్యూఆర్ కోడ్’ సాయంతో భూముల వివరాలు తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ‘క్యూఆర్ కోడ్’లోని నావిగేషన్ సాయంతో భూముల వద్దకు వెళ్లే సదుపాయం కూడా ఉంటుంది. గత వైకాపా పాలనలో జగన్ ప్రచారానికి వీలుగా ఆయన ఫొటోలతో పట్టాదారు పుస్తకాలను ముద్రించారు. కూటమి ప్రభుత్వం వాటిని తొలగించి పూర్వ విధానంలో మాదిరిగానే రాజముద్రతో కొత్త పుస్తకాలను ముద్రిస్తోంది.

ఖనిజాలను ఆయుధాలుగా మారనివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

క్రిటికల్ మినరల్స్ రంగంలో చైనా జిత్తులమారి విధానాలను అవలంబిస్తోందని, ఆ ఖనిజాల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని కొంతకాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాని తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీ స్టోరేజ్, డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల తయారీలో కీలకమైన లిథియం, నికెల్, గ్రాఫైట్ వంటి ఖనిజాలను క్రిటికల్ మినరల్స్‌గా పిలుస్తారు.

అంతర్జాతీయ ప్రమాణాలు అవసరం

రోజువారీ కార్యకలాపాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో జీవితం బాగా మెరుగవుతుందని మోదీ పేర్కొన్నారు. అయితే ఏఐ దుర్వినియోగమయ్యే ముప్పు పొంచి ఉందంటూ హెచ్చరించారు. డిజిటల్ కంటెంట్ వాస్తవమో కాదో ధ్రువీకరించుకునేందుకు అంతర్జాతీయ ప్రమాణాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో ‘ఏఐ ఇంపాక్ట్ సదస్సు’ను నిర్వహిస్తామని ప్రకటించారు.

గ్లోబల్ సౌత్‌కు మరింత చేయూతనిద్దాం

దక్షిణార్ధ గోళానికి (గ్లోబల్ సౌత్) చేయూతనిచ్చేలా బ్రిక్స్ చేపడుతున్న చర్యలను మోదీ ప్రస్తావించారు. గ్లోబల్ సౌత్ దేశాలకు బ్రిక్స్‌పై కొన్ని ప్రత్యేక అంచనాలు, ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని.. వాటిని నెరవేర్చేందుకు మరింత కలిసికట్టుగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. బ్రిక్స్ శాస్త్ర పరిశోధనల భాండాగారం ఏర్పాటును ప్రధాని ప్రతిపాదించారు. మరోవైపు- అంతర్జాతీయ పరిపాలనా సంస్కరణల ఎజెండాను ముందుకు తీసుకెళ్లడంలో బ్రిక్స్ దేశాలు ప్రధాన భూమిక పోషించాలని సదస్సులో చైనా ప్రధాని లీ కియాంగ్ పిలుపునిచ్చారు. చైనా-బ్రిక్స్ పరిశోధన కేంద్రాన్ని ఈ ఏడాది స్థాపించనున్నట్లు ప్రకటించారు.

అది అభివృద్ధి చెందిన దేశాల ప్రత్యేక బాధ్యత

పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలకు, ప్రస్తుత ఆర్థిక వనరుల లభ్యతకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన ప్రత్యేక,



బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా సభ్యదేశాల అధినేతలు, ప్రతినిధులతో ప్రధాని మోదీ

ముఖ్యమైన బాధ్యత అభివృద్ధి చెందిన దేశాలపై ఉందని మోదీ అన్నారు. అందుకోసం ధనిక దేశాలు మరిన్ని నిధులు కేటాయించాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల వల్ల ఆహార, ఇంధన, ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్న దేశాలకు అండగా నిలవాలన్నారు. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో భారత్ మానవతా విధానాలకు అగ్ర ప్రాధాన్యమిస్తుందని ఉద్ఘాటించారు. బ్రిక్స్‌ను ‘బిల్డింగ్ రెసిలియన్స్ అండ్ ఇన్నొవేషన్ ఫర్ కోవాపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ’ అనే కొత్త రూపంలో పునర్నిర్వచించేందుకు దిల్లీ కృషి చేస్తుందని చెప్పారు. ‘పర్యావరణం, కాప్-30, ప్రపంచ ఆరోగ్యం’పై బ్రిక్స్ నిర్వహించిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ‘జి-20’ అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు దక్షిణార్ధ గోళం (గ్లోబల్ సౌత్) అంశాలకు భారత్ ప్రాధాన్యమిచ్చిన సంగతిని ఆయన గుర్తుచేశారు.

భవిష్యత్తుపై విశ్వాసం కల్పించాలి

అభివృద్ధి చెందిన దేశాలకు భవిష్యత్తుపై ఉన్నంత విశ్వాసాన్ని ఇతర దేశాలకూ కల్పించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ.. పారిస్ వాగ్దానాలను గడువులోగా పూర్తిచేసిన తొలి దేశం భారతేనని గుర్తుచేశారు. 2070 కల్లా ‘నెట్ జీరో’ సాధించాలన్న లక్ష్యాన్ని అందుకునేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల బారి నుంచి భూమిని రక్షించుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు చేతులు కట్టుకొని కూర్చోలేమన్నారు.

మలేసియా ప్రధానితో మోదీ భేటీ

బ్రిక్స్ సదస్సు సందర్భంగా రియోలో మలేసియా ప్రధానమంత్రి అన్వర్ బిన్ ఇబ్రహీంతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, విద్య, ఆరోగ్య సేవలు, పర్యాటకం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై వారిద్దరూ చర్చించారు. ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్), భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) సమీక్షకు సంబంధించిన అంశాలపై కూడా సమాలోచనలు జరిపారు.

క్యూబా, బొలీవియా, ఉరుగ్వే అధ్యక్షులతోనూ..

క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కనెల్ బెర్ముడెజ్‌తోనూ రియోలో మోదీ సమావేశమయ్యారు. బయోటెక్నాలజీ, సంప్రదాయ ఔషధాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. క్యూబాలో ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరుగుతుండటం గొప్ప విషయమని ప్రధాని పేర్కొన్నారు. బొలీవియా అధ్యక్షుడు లూయిస్ అల్బర్టో ఆర్సె క్యాటకోరా, ఉరుగ్వే అధ్యక్షుడు యమండు ఓర్సిలతోనూ మోదీ విడివిడిగా సమావేశమై పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించారు.

పేదల ఇళ్లు..
పూర్తికాక కన్నీళ్లు



అసంపూర్తిగా రాజీవ్ స్వగృహ నిర్మాణాలు

వైఎస్సార్ కడప జిల్లాలో వేల గృహాలు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. మాజీ సీఎం రాజశేఖరరెడ్డి అప్పట్లో కడప ఎయిర్‌పోర్టు సమీపంలో రాజీవ్ స్వగృహ కింద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినా పూర్తి కాలేదు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. మాజీ సీఎం జగన్ గత ఐదేళ్లలో పులివెందులలో సుమారు 6,500 జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలివేయడంతో అవి కూడా పేదలకు అందకుండా ఆగిపోయాయి. తండ్రీ కుమారులు సీఎంల హోదాలో రూ.వందల కోట్లతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినా సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వమైనా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. -ఈనాడు, కడప



పులివెందులలోని జగనన్న కాలనీ పరిస్థితి

రాజకీయం ముసుగులో నేరాలు చేసేవారితో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో ఏపీని దేశానికి ఆదర్శంగా మార్చాలని సూచించారు. క్రైమ్ హాట్‌స్పాట్లపై సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. ‘ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల నుంచి ఫుటేజ్ తీసుకునే విషయంలో నిబంధనలు మార్చేలా చర్యలు చేపట్టాలి. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజ్‌ను సేకరించే అంశంలో ప్రజాభద్రత చట్టాన్ని వర్తింపజేయాలి. వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలి’ అని సూచించారు. సమీక్షలో సీఎం ఆదేశాలు, సూచనల్లోని ప్రధానాంశాలివి.

బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగించాలి

■ ప్రభుత్వ శాఖల రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగించాలి. ఈ సమాచారాన్ని డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలి.

■ వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా అందిస్తున్న 517 పౌర సేవల్ని యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలి. పిడుగులు పడే సమాచారాన్ని ముందే తెలిపే హెచ్చరికల వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలి. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చేయాలి.

■ భూగర్భజలాల పర్యవేక్షణకు పీజియోమీటర్లు, సెన్సర్లు త్వరితగతిన పునరుద్ధరించాలి. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ప్రవాహాలు, విడుదల తదితర వివరాల్ని నమోదు చేయటం వల్ల రియల్‌టైమ్‌లో వరద నిర్వహణకు వీలవుతుంది.

పేదరిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకే సంక్షేమ పథకాలు

■ అన్ని శాఖలు వారి వద్దనున్న లబ్ధిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణమే ఆర్టీజీఎస్‌కు తెలిపి సవరించుకోవాలి. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అందుకు తగినట్లుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలి.

■ పీ-4లో భాగంగా బంగారు కుటుంబం-మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి

● ఈయూ వినతి

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంపై ఆర్టీసీ బోర్డు సమావేశంలో చర్చించి, సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కోరింది. మంగళవారం బోర్డు సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పాత పద్ధతిలో రిఫరల్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం, పనిష్మెంట్లకు చెందిన 1/2019 సర్క్యులర్ అమలు, డబుల్ డ్యూటీ చేసే డ్రైవర్, కండక్టర్లకు ఆ సొమ్ము రూ.1,200, రూ.1,100కు పెంచడం తదితర సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావం: ఉద్యోగుల హక్కుల సాధన కోసం అన్ని ట్రేడ్ యూనియన్ల పిలుపులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా జరిగే ఒకరోజు సమ్మెకు సంఘీభావం తెలియజేస్తున్నట్లు ఈయూ తెలిపింది. ఆ రోజు ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరవుతారని, ట్రేడ్ యూనియన్లు నిర్వహించే నిరసనల్లో పాల్గొంటారని పేర్కొంది.

వసతిగృహాలకు సామాజిక వర్గాల పేర్లు తొలగింపు

చెన్నై, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో కుల మత విద్వేషాలను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా వసతిగృహాల పేర్లలో ఉన్న సామాజిక వర్గాల పేర్లను తొలగిస్తూ తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యాసంస్థల్లో ఏర్పడే కుల ఘర్షణలు అడ్డుకునేందుకు మార్గదర్శకాల రూపకల్పనకు గతంలో స్టాలిన్ ప్రభుత్వం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రు నేతృత్వంలో కమిటీని నియమించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పేర్లు కులాన్ని సూచించేలా ఉండకూడదని, అలా ఉన్న పేర్లను తొలగించాలని ఆ కమిటీ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,739 వసతి గృహాలను ‘సోషల్ జస్టిస్ హాస్టల్’ అనే ఉమ్మడి పేరుతో పిలవనున్నట్లు సోమవారం ప్రకటించింది. విద్యార్థులకు రాయితీలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. నాయకుల పేర్లతో ఉన్నవాటిని ఆ పేరుకు సోషల్ జస్టిస్ హాస్టల్ అని కలిపి సంబోధించనున్నట్లు వెల్లడించింది.

ద్రోణి ప్రభావంతో 3 రోజుల్లో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: గంగా పరివాహక పశ్చిమబెంగాల్ పరిసరాల్లోని అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రాబోయే రెండు రోజుల్లో ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మరోవైపు అల్పపీడనానికి అనుబంధంగా ద్రోణి కూడా కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది.

గ్రహం అనుగ్రహం

8-7-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
త్రయోదశి: రా. 11-50 తదుపరి చతుర్దశి
జ్యేష్ఠ: తె. 3-21 తదుపరి మూల
వర్జ్యం: ఉ. 7-16 నుంచి 9-01 వరకు
అమృత ఘడియలు: సా. 5-45 నుంచి 7-29 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-11 నుంచి 9-03 వరకు
తిరిగి రా. 10-58 నుంచి 11-42 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.35; సూర్యాస్తమయం: సా.6.35

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.6	26.6
నెల్లూరు	37.3	30.0
ఒంగోలు	36.3	28.9
విజయవాడ	35.4	29.0
కడప	35.0	27.0
విజయనగరం	35.0	25.0
నరసాపురం	34.8	28.0
తాడేపల్లిగూడెం	34.7	25.1
కర్నూలు	34.1	25.2
రాజమహేంద్రవరం	34.0	24.0
విశాఖపట్నం	33.4	26.6
శ్రీకాకుళం	33.0	27.0

ఇదీ సంగతి!



అర్హత కలిగిన ఓటరు తన ఓటుహక్కు సాధించుకోవడానికి, ఎన్ని రకాల పాట్లు పడాలో దానిపై మేం తయారుచేసిన వీడియోగేమ్ ఇది!

రాజధానిలో బహుళ అంతస్తుల నివాస, వాణిజ్య ప్రాజెక్టులు

- మూడు చోట్ల 57.99 ఎకరాల్లో 1.13 కోట్ల చ.అడుగుల నిర్మాణాలు
- పీపీపీ విధానంలో చేపడుతున్న సీఆర్‌డీఏ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో సీఆర్‌డీఏ బహుళ అంతస్తుల నివాస, వాణిజ్య ప్రాజెక్టులు చేపట్టబోతోంది. ఆర్థిక, క్రీడా నగరాల్లోని మూడు ప్రాంతాల్లో 57.99 ఎకరాలు ఇందుకు ఎంపిక చేసింది. మందడం గ్రామ సమీపంలో హైడెన్సిటీ నివాస ప్రాంతం, రాయపూడి, పిచ్చుకలపాలెంలో మిశ్రమాభివృద్ధి (మిక్స్‌డ్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టులు చేపడతారు. రెసిడెన్షియల్ ప్రాజెక్టులో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, విలాసవంతమైన నివాస భవనాలు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు వంటివి వస్తాయి. మిశ్రమాభివృద్ధి ప్రాజెక్టుల్లో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లతో పాటు అత్యాధునిక వసతులతో కార్యాలయ భవనాలు, రిటైల్ అవుట్‌లెట్లు, రెస్టారెంట్లు, వినోద కేంద్రాలు వంటివి వస్తాయి. వీటితో పాటు కమ్యూనిటీ సెంటర్లు, ఉద్యానవనాలు, రిక్రియేషన్ జోన్లు వంటివి అభివృద్ధి చేస్తారు. మొత్తంగా మూడు ప్రాంతాల్లో కలిపి సుమారు 1.13 కోట్ల చదరపు అడుగుల నిర్మాణాలు చేపడతారు. అంతర్జాతీయ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా త్వరలోనే ఈ ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ టెండర్లు పిలవనుంది.

సీఆర్‌డీఏకు అత్యధిక వాటా ప్రాతిపదిక!

ఈ ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ స్థలం ఇవ్వడంతో పాటు, అప్రోచ్ రోడ్లు, డ్రెయిన్లు వంటి బాహ్య మౌలిక వసతులు కల్పిస్తుంది. అన్ని రకాల అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తుంది. మిగతా బాధ్యతలన్నీ టెండర్లలో ఎంపికైన సంస్థవే. ప్రాజెక్టుకు అవసరమైన పెట్టుబడి, డిజైన్ల రూపకల్పన, నిర్మాణం, మార్కెటింగ్, నిర్వహణ వంటి కార్యకలాపాలు ఆ సంస్థలే చూసుకోవాలి. మూడు ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ వేర్వేరుగా టెండర్లు పిలుస్తుంది. ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం (బిల్ట్ ఏరియా)లో సీఆర్‌డీఏకు అత్యధిక వాటా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంస్థల్ని ఎంపిక చేస్తారు.

'ఉత్ప్రేరకం'గా ఉపయోగపడేలా!

రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు సీఆర్‌డీఏకు ఆదాయం సమకూర్చుకునేలా ఈ మూడు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. రాజధానిలో ప్రస్తుతం సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న హ్యాపీనెస్ట్ ఒక్కటే మొదటి రెసిడెన్షియల్ ప్రాజెక్టు. ఇది పూర్తిగా సీఆర్‌డీఏ నిధులతో చేపట్టినది. ప్రైవేటు రంగంలో ఇంత వరకు రెసిడెన్షియల్, కార్యాలయ భవనాల ప్రాజెక్టులు రాలేదు. రాజధానిలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇప్పుడు చేపట్టే మూడు ప్రాజెక్టులు ఉత్ప్రేరకంగా ఉపయోగపడతాయని భావిస్తున్నారు. రాజధానిలో ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధితోపాటు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస భవనాలను వచ్చే మార్చినాటికి పూర్తి చేయాలని సీఆర్‌డీఏ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, బిట్స్, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వంటి విద్యా సంస్థలూ త్వరలో నిర్మాణాలు ప్రారంభించబోతున్నాయి. వాటితో పాటు పలు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం ఇప్పటికే స్థలాలు కేటాయించింది. వాటి నిర్మాణాలన్నీ పూర్తయి, కార్యాలయాలు మొదలైతే పెద్ద ఎత్తున నివాస, కార్యాలయ భవనాలు అవసరమవుతాయి. దాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మూడు ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ రూపకల్పన చేసింది.

ప్రాంతం	గ్రామం	క్యాటగిరీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	నిర్మితప్రాంతం (చ.అడుగుల్లో)
ఆర్థిక నగరం	మందడం	నివాస	19.72	30,06,511.1
ఆర్థిక నగరం	రాయపూడి	మిశ్రమాభివృద్ధి	30.349	66,10,012.2
క్రీడా నగరం	పిచ్చుకలపాలెం	మిశ్రమాభివృద్ధి	7.94	17,29,332

14న దిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 14న సాయంత్రం దిల్లీ వెళ్లనున్నారు. 16 వరకు ఆయన అక్కడే ఉంటారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తదితరులతో సమావేశమవుతారు.

గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులకు ఊరట

రెండేళ్ల ప్రవేశాలకు గుర్తింపు

తిరుపతి (పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర పశువైద్య వర్సిటీ పరిధిలోని విజయనగరం జిల్లా గరివిడి పశువైద్య కళాశాలలో ప్రస్తుతం బీవీఎస్సీ (ఏహెచ్) మూడు, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. వారి ప్రవేశాలకు గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పశువైద్య మండలి (వీసీఐ) అనుమతులు లేకుండానే గత వైకాపా ప్రభుత్వం ప్రవేశాలు కల్పించి కళాశాలను కొనసాగించింది. 2022-23, 24లో ప్రవేశాలు పొందిన 220 మందికి పైగా పశువైద్య విద్యార్థులు నష్టపోతుండడాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వర్సిటీ వీసీ డా.జె.వి. రమణ దిల్లీలో కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్‌సింగ్‌ను కలిసి వివరించారు. దీంతో అప్పటి ప్రవేశాలకు గుర్తింపునిస్తూ కేంద్ర పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.




తిరుచ్చెందూర్ ఆలయ జీర్ణోద్ధరణకు రూ.206 కోట్లు

హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ భారీ విరాళం



కుంభాభిషేకం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలు



శివ్ నాడార్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరుచ్చెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు ప్రముఖ పారిశ్రామికవేత్త శివ్ నాడార్ రూ.206 కోట్లు విరాళం అందించారు. ఇక్కడి మురుగన్ ఆలయంలో 15 ఏళ్ల తర్వాత సోమవారం కుంభాభిషేకం జరిగింది. లక్షల మంది భక్తులు తరలివచ్చారు. మొత్తం రూ.300 కోట్లతో జీర్ణోద్ధరణ, ఇతర సదుపాయాల కల్పన చేపట్టడంతో గుడి కొత్తరూపు సంతరించుకుంది. అందులో హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ తన 'వామా సుందరి ఫౌండేషన్' ద్వారా రూ.206 కోట్లు విరాళం అందించారు. దక్షిణాది జిల్లాల్లో ఉన్న పలు ఆలయాల్లోనూ ఈ ఫౌండేషన్ జీర్ణోద్ధరణ పనులు చేపడుతోంది. శివ్ నాడార్ సొంతూరు తిరుచ్చెందూర్ సమీపం మూలైపొలి గ్రామం.

29.510 కిలోల దుర్గమ్మ బంగారం ఎస్‌బీఐలో డిపాజిట్



బంగారు ఆభరణాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి చెందిన 29.510 కిలోల బంగారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గాంధీనగర్ బ్రాంచ్‌లో సోమవారం డిపాజిట్ చేశారు. డిపాజిట్‌పై సంవత్సరానికి 0.60 శాతం వడ్డీ లభిస్తుందని ఈవో శీనానాయక్ తెలిపారు. డిపాజిట్ చేసిన బంగారం విలువ రూ.26.58 కోట్లు ఉంటుందన్నారు. నగల నిర్ధారణ అధికారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పల్లంరాజు, పర్యవేక్షకుడు సుబ్రహ్మణ్యం, దుర్గ గుడి ఏఈవోలు చంద్రశేఖర్, రమేష్‌బాబు తదితరుల సమక్షంలో బంగారాన్ని బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

గోదావరి పుష్కరాలకు 202 ఘాట్లు

- అవసరమైతే మరిన్ని పెంచే అవకాశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లపై దేవాదాయశాఖ కసరత్తు ఆరంభించింది. దీనిపై ఇటీవలే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందజేసింది. 13 రాష్ట్ర శాఖలు, కేంద్ర పరిధిలో రైల్వేశాఖ కలిపి మొత్తం 14 శాఖలు ఇందులో పాలుపంచుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. గత పుష్కరాలు 2015లో జులై 14 నుంచి 25 వరకు జరిగాయి. అప్పట్లో 5.20 కోట్ల పుణ్యస్నానాలు జరిగినట్లు లెక్కించారు. ఈసారి ఆ సంఖ్య భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2027లో పుష్కరాలు జూన్ చివరి వారం, జులై మొదటి వారంలో జరిగే అవకాశముందని భావిస్తున్నారు. వైదిక నిపుణులతో సమావేశం నిర్వహించి, తేదీల అధికారిక ప్రకటనకు దేవాదాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపనుంది. పుష్కరాల సన్నద్ధత, ఏర్పాట్లపై ప్రభుత్వం గత నెల 12 మంది మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది.

అవసరాలకు అనుగుణంగా ఘాట్లు

గోదావరి మన రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రవహిస్తుంది. గత పుష్కరాల్లో 202 ఘాట్లు ఏర్పాట్లు చేశారు. ఇందులో కుడివైపు 127, ఎడమవైపు 75 ఘాట్లు ఉన్నాయి. ఈసారి మరిన్ని ఘాట్లు పెంచాల్సి ఉంటుందని భావిస్తున్నారు.

సీజీఎఫ్ నుంచి నిధులు

పుష్కరాలు జరిగే ఐదు జిల్లాల్లో ఆలయాల మరమ్మతులు, పెయింటింగ్ పనులు, క్యూలైన్ల ఏర్పాట్లు, వసతి, తాగునీరు, మరుగుదొడ్లు తదితరాలకు రూ.150 కోట్లు అవసరం ఉంటుందని దేవాదాయశాఖ అంచనా వేసింది. వీటిని సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) నిధి నుంచి వెచ్చిస్తారు.

జిల్లాల వారీగా ఘాట్లు

జిల్లా	నదికి ఎడమవైపు	నదికి కుడివైపు
తూర్పుగోదావరి	22	26
పశ్చిమగోదావరి	0	29
కోనసీమ	46	68
ఏలూరు	0	4
అల్లూరి సీతారామరాజు	7	0
మొత్తం	75	127

మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలో తప్పిదాలంటూ అభ్యర్థుల నిరసన

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు రాక

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలో తప్పిదాలు జరిగాయంటూ 15 మంది అభ్యర్థులు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చారు. తాను అన్ని ప్రశ్నలకు సమాధానాలు పెట్టినా కేవలం 10 ప్రశ్నలకు మాత్రమే పెట్టినట్లు రెస్పాన్స్ షీట్‌లో వచ్చిందని ఓ అభ్యర్థి వాపోయారు. తనకు మూడు ప్రశ్నలకు జవాబులు రాకుండా చుక్కలు వచ్చాయని.. ఒక్కదానికి సమాధానం రాయనట్లు వచ్చిందని మరో అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కొంత సేపు నిరసన తెలియజేశారు. అన్నింటికి సమాధానాలు రాసినా 10 ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు రాసినట్లు వచ్చాయని పేర్కొన్న అభ్యర్థి ఆన్‌లైన్ ఆడిట్‌ను అధికారులు పరిశీలించారు. ఇందులో అభ్యర్థి ప్రశ్నపత్రాన్ని స్క్రోల్ చేసుకుంటూ వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఎక్కడా జవాబులకు టిక్ మార్కు పెట్టలేదని పేర్కొన్నారు. దీంతో ఆయనకు రెస్పాన్స్ షీట్‌లో అలా వచ్చిందని వెల్లడించారు. మిగతా వారికి సంబంధించిన ఆన్‌లైన్ బ్యాకప్ ఆడిట్ రిపోర్టు తీసుకునేందుకు కొంత సమయం పడుతుందని.. బుధ, గురువారాల్లో కార్యాలయానికి రావాలని సూచించారు.

డీఎస్సీపై వదంతులు నమ్మొద్దు: కన్వీనర్

మెగా డీఎస్సీపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మొద్దని కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. 'అభ్యర్థులకు సందేహాలు ఉంటే అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న అభ్యంతరాల నమోదు అవకాశాన్ని వినియోగించుకోవాలి. డీఎస్సీని పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాం. ప్రతి అభ్యర్థి లాగిన్, జవాబుల ఎంపిక, నమోదు తదితర వివరాలతో కూడిన ఆడిట్ ట్రయల్ సర్వర్‌లో భద్రంగా ఉంటుంది'' అని తెలిపారు.

త్వరలో శ్రీవారి భక్తులకు పుస్తక ప్రసాదం!



నమూనా పుస్తకాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులతోపాటు వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలు, మత్స్యకార గ్రామాల్లో తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో త్వరలో పుస్తక ప్రసాదాన్ని అందించేందుకు తితిదే ప్రణాళికలు చేస్తోంది. వేంకటేశ్వర స్వామివారిపై ఉన్న రచనలతో పాటు దేవతామూర్తుల స్తోత్రాలు, భజనలు, కథలు, భగవద్గీత పుస్తకాలు దాతల సహకారంతో అందించే అంశాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలిస్తున్నారు. ముందుగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు వాటిని అందించనున్నారు. అనంతరం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లోనూ పంపిణీచేసి, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం, హిందూ ధర్మంపై అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

పారిశుద్ధ్యంలో మండపేటకు జై

ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రథమ స్థానంలో పురపాలక సంఘం

మండపేట, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణపై రాష్ట్రంలోని 77 పురపాలక సంఘాల పరిధిలో ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా నిర్వహించిన సర్వేలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పురపాలక శాఖ సంచాలకుడు పి.సంపత్‌కుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు పురపాలక శాఖ నిర్వహించిన సర్వేలో ఆయా అంశాల్లో మండపేట పురపాలక సంఘం మెరుగైన ఫలితాలు సాధించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రోజూ ఉదయం వేళల్లో మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వార్డుల్లో సంయుక్తంగా పర్యటించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గృహిణులకు తడి, పొడి చెత్తను వేరుచేయడం, కూరగాయల వ్యర్థాలతో వర్మీకంపోస్టు తయారీ అంశాలను వివరించారు. నీటి సరఫరాపై ఆరా తీసి లీకులు ఉంటే అప్పటికప్పుడు ఇంజినీరింగ్ సిబ్బందితో బాగుచేయించారు. పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీలు శుభ్రం చేసే కార్యక్రమాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పర్యవేక్షించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో కూడా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మండపేటకు పారిశుద్ధ్య విభాగంలో ప్రథమస్థానం లభించింది.



తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

ఈ ఏడాది 18 లక్షల టన్నుల పశుగ్రాసం సాగు

ఈనాడు, అమరావతి: పశుగణాభివృద్ధితో పాటు మేలురకం పశుగ్రాసాల సాగు ప్రాధాన్యాన్ని వివరిస్తూ పశుసంవర్ధక శాఖ సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పశుగ్రాస వారోత్సవాలు ప్రారంభించింది. ఇవి ఈ నెల 14 వరకూ కొనసాగనున్నాయని ఆ శాఖ సంచాలకుడు డాక్టర్ టి.దామోదరనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పశుపోషకులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు పశు వైద్య కేంద్రాలు/రైతు సేవా కేంద్రాల ద్వారా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రూ.28.54 కోట్ల వ్యయంతో 3,622 మెట్రిక్ టన్నుల విత్తనాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ ఏడాది 72,440 హెక్టార్లలో 18.11 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసాలను ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేశామని ప్రకటించారు. పశుపోషకులకు ఖర్చులు తగ్గించేందుకు 100 శాతం రాయితీపై పశుగ్రాసాలను అభివృద్ధి చేసుకోవడానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

ఈనాడు

స్ఫూర్తిదాయక విజయం

అండర్సన్-టెండుల్కర్ ట్రోఫీలో భాగంగా లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో తమ జట్టుపై ఇండియా ఓడిపోయాక ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ నోటికి పనిచెప్పాడు. శుభ్‌మన్ గిల్‌ను విరాట్, రోహిత్‌లతో పోలుస్తూ, అతని సారథ్య సామర్థ్యాలపై దుమ్మెత్తిపోశాడు. టీమిండియా కొత్త కెప్టెన్‌లో నాయకుడి లక్షణాలేవీ లేవని నాసిర్ నాలుక చప్పరించాడు. కానీ, అదే శుభ్‌మన్ ఇప్పుడు కోహ్లికి కాదు కదా; అంతకు ముందు ఎంఎస్ ధోని, అజారుద్దీన్, కపిల్‌దేవ్, పటౌడీ వంటి సారథులకు సైతం సాధ్యం కాని ఘనతను సాధించాడు. గడచిన 58 ఏళ్లలో ఏనాడూ గెలుపు రుచి చవిచూడని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇండియాను గెలిపించిన గిల్- విదేశాల్లో టెస్ట్ విజయాన్ని అందుకున్న అతిపిన్న వయసు భారత కెప్టెన్‌గా గావస్కర్ రికార్డును తిరగరాశాడు. ఆధిపత్యం, నైపుణ్యం కలగలిసిన ఆటతో ఇంగ్లిష్ బౌలర్లను ఉతికారేస్తూ 430 రన్స్ చేసిన శుభ్‌మన్- ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. నాయకుడిగా ముందుండి నడిపించిన శుభ్‌మన్‌కు రెండు ఇన్నింగ్స్‌లలో ఇంగ్లాండ్ వెన్నువిరిచిన ఆకాశ్‌దీప్, సిరాజ్‌ల బౌలింగ్ సత్తా జతకూడటంతో టీమిండియా అత్యద్భుత విజయాన్ని దక్కించుకుంది!

మొదటి టెస్టులో చేతివరకు వచ్చిన గెలుపు నోటికి అందకుండా పోయింది. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ నుంచి కనీస ప్రతిఘటన కరవవడం, కీలక క్యాచ్‌లు నేలపాలు కావడం, రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ల బాదుడును అడ్డుకోలేకపోవడంతో లీడ్స్‌లో ఓటమి అనివార్యమైంది. ఆ వైఫల్య భారం నుంచి త్వరగా బయటపడి స్థిరచిత్తంతో ముందడుగు వేసిన భారత జట్టు- ఎడ్జ్‌బాస్టన్‌లో సమష్టిగా వీరవిహారం చేసింది. గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, రిషభ్ పంత్, రాహుల్ బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తే- ఆకాశ్‌దీప్, సిరాజ్‌లు ఇద్దరే 17 వికెట్లు నేలకూల్చి ఇంగ్లిష్ జట్టు పతనాన్ని శాసించారు. ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగిన చోట... ముఖ్యంగా కొత్త బంతితో మన పేసర్లు చెలరేగడం అభిమానులను హర్షాతిరేకాల్లో ముంచెత్తింది. కచ్చితమైన లెంగ్త్‌లలో ఆకాశ్‌దీప్, సిరాజ్ సంధించిన బంతుల ధాటికి దూకుడుకు మారుపేరైన ఇంగ్లాండ్ 'బజ్‌బాల్' వ్యూహం పటాపంచలైంది. కిందటి మ్యాచ్‌లో చేసిన తప్పులను సరిచేసుకుని సర్వశక్తులూ ఒడ్డి విజయనాదం చేసిన శుభ్‌మన్ సేనపై అభినందనల వర్షం కురుస్తోంది!

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ అస్త్రసన్యాసం చేయడంతో భారత జట్టు ఒక్కసారిగా అనుభవజ్ఞుల సేవలు కోల్పోయింది. బుల్లెట్ బంతులతో ఎదుటి పక్షానికి పీడకలలు మిగిల్చే జస్‌ప్రీత్ బుమ్రా సైతం అందుబాటులో లేకపోవడంతో బౌలింగ్ దళం బలహీనపడింది. కానీ, బుమ్రా స్థానంలో జట్టులో చోటు సంపాదించుకున్న ఆకాశ్‌దీప్- అందివచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నాడు. చేతన్‌శర్మ తర్వాత ఇంగ్లాండ్ గడ్డపై ఒక టెస్టులో పది వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డు పుటలకెక్కాడు. సమకాలీన టెస్ట్ క్రికెట్‌లో మేటి బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందిన జో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్‌దీప్ బంతిని 'బాల్ ఆఫ్ ది సిరీస్'గా సచిన్ అభివర్ణించడం విశేషం. సీమర్లు తేలిపోవడంతో పాటు జాక్ క్రాలీ, ఒలీ పోప్‌ల బ్యాటింగ్‌లో అస్థిరత, స్పిన్నర్లను ఎదుర్కోవడంలో బెన్ స్టోక్స్ బలహీనత తదితరాలు ఇంగ్లాండ్ పుట్టిముంచాయి. బ్యాట్‌తో బంతితో సమంగా రాణిస్తూ, మైదానంలో చురుకుగా కదులుతూ చిరస్మరణీయ ప్రదర్శన చేసిన టీమిండియా ఇదే ఊపుతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలన్నది అభిమానుల ఆకాంక్ష!



పెద్ద పెద్ద ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు దేశానికి చాలా అవసరం, అందులో సందేహమే లేదు. అయితే అంతకన్నా ముఖ్యమైనవి సమాజంలో అత్యంత బలహీనుడైన సామాన్య మానవుడి అవసరాలు. అవి చూశాకే మిగిలినవి ఏవైనా.

– మేఘనాథ్ సాహా, ఆస్ట్రో ఫిజిసిస్ట్

మీలోనూ ఓ హనుమంతుడు!

జీవితంలో ప్రతి మనిషికీ ఒక లక్ష్యం ఉండాలి. అదే లేకపోతే మన ప్రస్థానం దిక్కుతెలియని పడవలా అయిపోతుంది. లక్ష్యసాధన అంటే ఆ గమ్యాన్ని చేరుకోవడానికి మనం చేసే ప్రయాణం, పడే శ్రమ. లక్ష్యం స్థిరంగా ఉండాలి. సాధన దృఢంగా ఉండాలి. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలం.

ద్రోణాచార్యుడు తన శిష్యులకు ఒక పరీక్ష పెడతాడు. ఒక పెద్ద చెట్టుపైన చిట్టచివరి కొమ్మల్లో ఒక పక్షి కూర్చుని ఉంది. దాని కంటిని బాణంతో కొట్టాలన్నది పరీక్ష. ముందుగా ధర్మరాజు వచ్చాడు. చెట్టుమీద ఏం కనిపిస్తోందని అడిగాడు ద్రోణుడు. 'చెట్టు, చెట్టుమీద పక్షి, ఆకాశం, పక్షికి చుట్టూ ఆకులు ఉన్నాయి' అన్నాడు యుధిష్ఠిరుడు. సరే... నువ్వు వెనక్కి వెళ్లు అని చెప్పి భీముణ్ని పిలిచి అదే ప్రశ్న అడిగాడు. చెట్టు, కొమ్మలు, పక్షి, ఆకాశం... చెప్పాడు భీముడు. ఇలా అందరూ అదే సమాధానం చెప్పడం, గురువు వాళ్లను తిప్పి పంపడం జరిగింది. చివరికి అర్జునుణ్ని పిలిచి అందర్నీ అడిగిన ప్రశ్నే అతణ్నీ అడిగాడు. అర్జునుడు నిశ్చలంగా 'నాకు కేవలం పక్షి కన్నే కనబడుతోంది. ఇంకేం కనబడటంలేదు' అని చెప్పాడు. ద్రోణాచార్యుడు చిరునవ్వుతో 'బాణం వెయ్యి అర్జునా' అన్నాడు. మరుక్షణం అర్జునుడి ధనుస్సులోంచి బాణం దూసుకుపోయింది. పక్షి నేలకూలింది.



అంతర్యామి

అక్కడ లక్ష్యం పక్షి కన్ను కొట్టడం. అంటే మనకు అదే కనబడాలి తప్ప ఇంకేవీ కనిపించకూడదు. అంత స్థిరమైన దృష్టి కోణం ఏర్పరచుకున్నప్పుడే ఎవరమైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం. అర్జునుడి లక్ష్యం పక్షి కన్ను లాగా మనకీ మన లక్ష్యం ఏంటో కచ్చితంగా తెలియాలి. దానిపైనే దృష్టి నిలపాలి. లక్ష్యసాధనకు కావాల్సింది స్పష్టమైన దృష్టి, ఏకాగ్రత. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా... దాన్ని చేరాలంటే మనసు, శక్తి, శ్రద్ధ అన్నీ ఒకే బిందువులో కలిసి ఉండాలి. అడ్డంకులను అధిగమించాలే కానీ లక్ష్యం నుంచి వెనక్కి మళ్లకూడదు.

రామరావణ యుద్ధంలో లక్ష్మణుడు గాయపడ్డాడు. వైద్యుడు సుషేణుడు వచ్చి చూసి హిమాలయాల్లో ఉన్న సంజీవనిని తెస్తేనే లక్ష్మణుడి ప్రాణాలు నిలబడతాయని చెప్పాడు. హనుమంతుడు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా హిమాలయాలకు దూసుకెళ్లాడు. అక్కడ సంజీవని ఏదో తెలియలేదు. అందుకని ఆయన తల పట్టుకుని కూర్చోలేదు. ఏ చెట్టో తెలియదు కాబట్టి మొత్తంగా పర్వతాన్నే పెకిలించుకు తీసుకెళ్లాడు. లక్ష్మణుడి ప్రాణాలను కాపాడాడు. నిత్యజీవితంలో మనకూ ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటికి వెరచి వెనక్కి తగ్గవద్దని చెబుతుంది హనుమంతుడి దివ్యగాథ. ఆనాడే కాదు, ఈనాడైనా లక్ష్యసాధనకు పట్టుదలే ప్రధానం.

అవసరమైతే పర్వతాన్నే మోయగల శక్తి మనలోని సంకల్పానికి ఉంటుంది! హనుమంతుడు మనలోనూ ఉన్నాడు. ఆ సత్యం తెలుసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానివైపు బలంగా అడుగేసినప్పుడు ఆయన బయటపడతాడు.

– మావూరు విజయలక్ష్మి

గ్రీన్ హైడ్రోజన్... రేపటి ఇంధనం!

శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణ మార్పులు తీవ్రతరమవుతున్నాయి. విపత్తులు ముంచుకొస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పర్యావరణ హితకరమైన గ్రీన్ హైడ్రోజన్ వినియోగంపై భారత్ దృష్టి సారించింది. ఈ క్రమంలో దేశీయ ఇంధన రంగంలో జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగలదు. భావి తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్నీ, నూతన ఉద్యోగ అవకాశాలనూ అది అందివ్వగలదు.

ప్రపంచం శుద్ధ ఇంధనం వైపు మళ్లుతున్న తరుణంలో, భారత్ గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023లో 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్'ను ప్రారంభించింది. దేశీయంగా హరిత హైడ్రోజన్ ఉత్పత్తిని పెంచి పరిశ్రమలకు సరఫరా చేయడంతో పాటు, ఈ ఇంధన రంగంలో ఇండియాను ప్రపంచంలోనే ప్రధాన ఎగుమతిదారుగా నిలిపేందుకు దీన్ని ఉద్దేశించారు. సౌర, పవన విద్యుత్ సాయంతో నీటి నుంచి ఉత్పత్తి చేసే స్వచ్ఛమైన ఇంధనమే గ్రీన్ హైడ్రోజన్. ఈ ప్రక్రియలో ఎలాంటి కర్బన ఉద్గారాలూ వెలువడవు. మీథేన్‌ను మండించడం ద్వారా తయారయ్యేది 'గ్రే హైడ్రోజన్'. ఇది పర్యావరణానికి తీవ్రనష్టం కలిగిస్తుంది. ఇదే విధానంలో ఇంధనాన్ని



తయారుచేసి కర్బన ఉద్గారాలను భూమిలో నిల్వచేస్తే- దాన్ని 'బ్లూ హైడ్రోజన్' అంటారు. దీనివల్లా పర్యావరణానికి కొంత హాని తప్పదు. అందుకనే, ప్రపంచ దేశాలు గ్రీన్ హైడ్రోజన్ తయారీకే ప్రాధాన్యమిస్తున్నాయి. వాయు రూపంలో ఉండే ఈ ఇంధనాన్ని నిల్వ చేయడం, తరలించడం చాలా సులభం. కాబట్టి ఇది పరిశ్రమలు, రవాణా సాధనాలకు బాగా ఉపయోగపడుతుంది.

చవగ్గా అందుబాటులోకి?

కేంద్రం 2023లో జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌కు రూ.19,744 కోట్లు మంజూరు చేసింది. ఈ మిషన్ ద్వారా 2030నాటికి అయిదు మిలియన్ మెట్రిక్ టన్నుల ఇంధనోత్పత్తి సామర్థ్యాన్ని సాధించడంతో పాటు- ఎనిమిది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి, ఆరు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 50మిలియన్ టన్నుల వాయు ఉద్గారాలను, రూ.లక్ష కోట్ల విలువైన ఇంధన దిగుమతులను తగ్గించుకోవచ్చని భావిస్తున్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం 'స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్' పథకానికి రూ.17,490 కోట్లు ప్రత్యేకించారు. తద్వారా దేశీయ ఎలక్ట్రోలైజర్ తయారీకి, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తోంది. దీనికి తోడు పైలట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, పరిశోధనలూ నూతన నైపుణ్యాల శిక్షణ కోసం మరో రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ఉపయోగించే పునరుత్పాదక విద్యుత్తుపై ట్రాన్స్‌మిషన్ చార్జీలను మరో అయిదేళ్ల వరకూ మాఫీ చేస్తున్నారు. దానివల్ల హైడ్రోజన్ ధర సుమారు 20శాతం వరకు తగ్గే అవకాశముంది. తద్వారా 2030 నాటికి కిలో గ్రీన్ హైడ్రోజన్‌ను 100-150 రూపాయలకే అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల దేశంలోనే మొదటిసారిగా లద్దాఖ్‌లో హైడ్రోజన్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. వాటి కోసం అక్కడ ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో శుద్ధ ఇంధనోత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. దీంతో దేశవ్యాప్తంగా ఇటువంటి రవాణా వ్యవస్థను తీసుకురావడం సాధ్యమేనని నిపుణులు అంటున్నారు. ఇంధన సంస్థలు సైతం గ్రీన్ హైడ్రోజన్ వైపు మొగ్గుచూపుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తన పానిపట్ రిఫైనరీలో ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు సరఫరాదారులను ఎంపిక చేసింది.

క్వాంటమ్ వ్యాలీతో ఊతం

భారతదేశ హరిత హైడ్రోజన్ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక దగ్గర దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ కేంద్రానికి అంకురార్పణ చేశారు. ఇక్కడ రోజూ 1500టన్నుల హైడ్రోజన్‌తో పాటు 7500 టన్నుల గ్రీన్ అమోనియా, మెథనాల్, విమానయాన ఇంధనం తయారవుతుంది. ఈ ప్రాజెక్టు అంచనా విలువ సుమారు రూ.1.85లక్షల కోట్లు. మరోవైపు, ఐరోపా సంస్థల భాగస్వామ్యంతో కాకినాడలో ఏటా పది లక్షల టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పుతున్నారు. దీనికోసం 1.3 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్లను ఆర్డర్ చేశారు. ఇది భారత్‌లోనే ఇప్పటివరకు ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్. ఇందులో పూర్తిగా సౌర, పవన విద్యుత్తునే వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఐరోపా దేశాలకు అమోనియాను ఎగుమతి చేస్తారు. అమరావతిలో ఏర్పాటవుతున్న 'క్వాంటమ్ వ్యాలీ' సైతం గ్రీన్ హైడ్రోజన్ రంగానికి ఇతోధికంగా తోడ్పడనుంది. ముఖ్యంగా వాతావరణం ఎక్కడ అనుకూలంగా ఉంటుంది? ఇంధనాన్ని ఎక్కడ నిల్వ చేయాలి? అనేది నిర్ణయించడానికి డేటా కీలకం. ఇందుకు అమరావతిలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ వాతావరణం అక్కరకు వస్తుంది.

సవాళ్లను అధిగమించడమే కీలకం

ప్రపంచ గ్రీన్ హైడ్రోజన్ రంగంలో విధానాలు, నిబంధనలు, పెట్టుబడుల పరంగా ఐరోపా దేశాలు ముందంజలో ఉన్నాయి. అయినప్పటికీ, భారత్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ దిగుమతికి అవి ఆసక్తి చూపుతున్నాయి. ఆస్ట్రేలియా సైతం పెద్దయెత్తున ఈ హరిత ఇంధనోత్పత్తిని చేపట్టి జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేయాలని భావిస్తోంది. ఇండియా వాటితో సమానంగా పోటీపడుతున్నప్పటికీ, కొన్ని సవాళ్లు తప్పడం లేదు. మన దగ్గర కిలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి రూ.450 వరకు ఖర్చవుతోంది. ఈ భారాన్ని తగ్గించుకోవాలంటే మెరుగైన ఉత్పత్తి విధానాలు చేపట్టడంతో పాటు చవగ్గా లభించే ఎలక్ట్రోలైజర్లను అభివృద్ధి చేసుకోవాలి. పైపులైన్లు, నిల్వ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లను విస్తరించాలి. పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్నీ గణనీయంగా పెంచుకోవాలి. కిలో హైడ్రోజన్ తయారీకి దాదాపు తొమ్మిది లీటర్ల నీరు అవసరమవుతుంది. కాబట్టి, జల వనరుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అమెరికా, ఐరోపా దేశాలు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తుండటంతో గ్లోబల్ మార్కెట్‌లో తీవ్ర పోటీ నెలకొంది. స్థిరంగా మౌలిక సదుపాయాలను కల్పించడం, ప్రోత్సాహకర విధానాలు చేపట్టడం, పరిశోధనలకు ఊతమివ్వడం ద్వారా భారత్ ఈ సవాళ్లన్నింటినీ అధిగమించవచ్చు.



మంగళంపల్లి కిరణ్
నానో శాస్త్ర పరిశోధకులు



సరిహద్దులు లేని సేవ

ప్రకృతి వైపరీత్యాలు ఏదో ఒక రూపంలో ప్రపంచంలో ఎక్కడో ఒకచోట మానవాళిని దెబ్బకొడుతూనే ఉన్నాయి. ప్రజా జీవితాలను అవి అస్తవ్యస్తం చేస్తున్నాయి. ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం కలిగిస్తున్నాయి. అలాంటివి జరిగినప్పుడు బాధితులకు ఒకరకంగా కాదు, ఎన్నో రకాలుగా సాయం అవసరమవుతుంది. పునరావాసం కల్పించే క్రమంలో వైద్యం, వసతి, భోజనాల ఏర్పాటు చేయాల్సి వస్తుంది. మరోపక్క దెబ్బతిన్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనమీదా దృష్టి పెట్టాలి. ఇన్ని రకాల సేవలు ఒక్క ప్రభుత్వ యంత్రాంగం వల్లే అందడం కష్టం. ఇలాంటి సందర్భాల్లోనే స్వచ్ఛంద సేవాసంస్థలు కీలకపాత్ర పోషిస్తాయి. బాధితులను ఆదుకుంటాయి. అలా అంతర్జాతీయ స్థాయిలో వైద్యసేవలందిస్తున్న సంస్థ డాక్టర్స్ విదౌట్ బార్డర్స్. ఈ సంస్థ అందించిన సేవలకు గుర్తింపుగా 1999లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. అంతకన్నా ముందే 1996లో మనదేశం ఇందిరాగాంధీ శాంతి బహుమతిని ఇచ్చింది.

డాక్టర్స్ విదౌట్ బార్డర్స్ 1971లో ఫ్రాన్స్‌లో రూపుదిద్దుకుంది. యుద్ధాలూ కరవు కాటకాల వల్ల సతమతమవుతున్న పేద దేశాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందించే ఉద్దేశంతో డాక్టర్లు, జర్నలిస్టులు కలిసి ఈ వినూత్నమైన సంస్థను ఏర్పాటుచేశారు. మూడువందల మంది సభ్యులతో మొదలై, క్రమేణా పెరుగుతూ ఇప్పుడు 69 వేలకి చేరిందిది. వీరిలో 169 దేశాల వారున్నారు. వారంతా డెబ్బై దేశాల్లో చురుగ్గా సేవలందిస్తున్నారు. విపత్తులు సంభవించినప్పుడు తక్షణ సేవలందించడమే కాక, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నారు. క్షయ, ఎయిడ్స్‌లాంటి సమస్యలకు ప్రత్యేక చికిత్సలు చేస్తున్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకునేలా చూస్తున్నారు. మన దేశంలో కూడా వీరి ప్రత్యేక ప్రాజెక్టులు జమ్మూకశ్మీర్, బిహార్, మణిపూర్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. పలు దేశాలు ఎదుర్కొంటున్న నిపుణుల కొరత సమస్యని కొంతవరకు ఈ సంస్థ తీర్చగలుగుతోంది.

డాక్టర్స్ విదౌట్ బార్డర్స్ ఎందరో ప్రొఫెషనల్స్‌ను, ఇతర స్వచ్ఛంద సంస్థలను ప్రభావితం చేసింది. దీనినుంచి స్ఫూర్తి పొంది ఇప్పుడు పలు రంగాల్లో సేవలందించే సంస్థలు ఏర్పడటం విశేషం. లాయర్స్ విదౌట్ బార్డర్స్, అకౌంటింగ్ విదౌట్ బార్డర్స్, ఇంజినీర్స్ విదౌట్ బార్డర్స్... ఇలా విభిన్న రంగాల్లో సేవలందించే సంస్థలు రూపుదిద్దుకున్నాయి. వృత్తినిపుణుల నుంచి క్రీడాకారులదాకా సంఘటితమై దేశాలమధ్య హద్దులను చెరిపేస్తుండటం విశేషం. ఇంటర్నెట్లో ఏ-టు-జెడ్ గైడ్ ఆఫ్ ద వరల్డ్స్ విదౌట్ బార్డర్స్ గ్రూపులను చూస్తే ఈ ఆలోచన ఎన్ని రంగాలకు ప్రేరణ కలిగించిందో కదా అనిపిస్తుంది.

మీరూ వృత్తి నిపుణులైతే, సేవచేయాలన్న ఆలోచన ఉంటే ఇంకెందుకూ ఆలస్యం? మీ వృత్తికి సంబంధించిన సంస్థలో చేరండి... వివిధ దేశాల్లో విపత్కర పరిస్థితుల్లో సేవలు అందించి వృత్తిగతంగానూ వ్యక్తిగతంగానూ చక్కటి అనుభవం సంపాదించుకోండి.

– మధుర

ఒత్తిళ్ల పద్మవ్యూహంలో యువత

దేశాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం యువతదే. అలాంటి నవతరం మానసిక ఒత్తిళ్లతో చిత్తవుతోంది. 18-45 ఏళ్ల వారిలో మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరిగిపోతున్నట్లు ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. యువశక్తులు ఇలా హరించుకుపోతుంటే దేశ భవితకే ప్రమాదం!

దేశంలో ఎక్కువమంది యువత దీర్ఘకాలిక ఒత్తిళ్లతో బాధపడుతున్నారు. ముఖ్యంగా జనరేషన్ జడ్ (1997-2012 మధ్య జన్మించినవారు), జనరేషన్ ఆల్ఫా (2012 తరవాత జన్మించినవారు) తరాలకు అధిక ఒత్తిడి, జీవనశైలి వ్యాధులు పెద్ద సమస్యగా మారాయి. యువతలో మానసిక ఒత్తిడి కారణంగా డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి సమస్యలు పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు గుర్తించాయి. మానసిక ఆరోగ్యం స్థిరంగా లేకపోవడం వల్ల సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ నష్టాలు తప్పట్లేదు. భారత నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే(ఎన్ఎంహెచ్ఎస్)-2022 ప్రకారం, 15-29 ఏళ్ల మధ్య వయస్సు యువతలో మానసిక వ్యాధుల తీవ్రత 14.7శాతానికి పెరిగింది. ముఖ్యంగా డిప్రెషన్, యాంగ్జయిటీ, ఆత్మహత్య ఆలోచనలు అధికమయ్యాయి. ప్యూ రీసెర్చి సెంటర్ సర్వే-2023 ప్రకారం జనరేషన్ జడ్‌లో 71శాతం మంది ఉద్యోగ భద్రత, సామాజిక విజయాలపై మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, అధిక పనిభారం, భవిష్యత్ ప్రణాళికలపై అస్పష్టత, సామాజిక సంబంధాల్లో ఒడుదొడుకులు, ఆర్థిక ఒత్తిళ్లు వంటివి వీరిలో సమస్యలకు దారితీస్తున్నాయి.

జీవనశైలి వ్యాధుల పెరుగుదల

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2023లో విడుదల చేసిన నేషనల్ హెల్త్ ప్రొఫైల్ నివేదిక ప్రకారం, 18-45 ఏళ్ల యువతలో అధిక రక్తపోటు, మధుమేహం, హృద్రోగం వంటి జీవన శైలి సంబంధిత వ్యాధులు గత అయిదేళ్లలో 25.4శాతం పెరిగాయి. 25-30 సంవత్సరాల వయస్సు వారిలో మధుమేహం 15శాతం ఎక్కువైంది. హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (హెచ్ఐఎంఎస్-2023) నివేదిక ప్రకారం, పాతికేళ్లలోపు యువతలో రక్తపోటు 18శాతం, మధుమేహం 12శాతం పెరిగాయి. ఇవి శారీరక సామర్థ్యాన్ని తగ్గిస్తూ, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. 18-45 ఏళ్ల వారిలో హృద్రోగాలు, మధుమేహం, ఒత్తిడి సంబంధిత



వ్యాధులు ప్రధాన అనారోగ్య సమస్యలుగా గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ సైతం గుర్తించింది. యువత మానసిక ఆరోగ్యంపై సామాజిక సంబంధాల ప్రభావం కూడా అధికంగానే ఉంటోంది. ముఖ్యంగా ప్రేమ బంధాలు విఫలం కావడం వల్ల ఏర్పడే ఒత్తిడి గణనీయంగా ఉంటోంది. 87శాతం యువత మానసిక ఒత్తిడికి ప్రధాన కారణం ప్రేమ బంధాల్లో వైఫల్యమేనని ఇండియా యూత్ రిలేషన్‌షిప్ స్టడీ (2023) తేల్చిచెప్పింది. ప్రేమబంధంలో బ్రేకప్‌ల కారణంగా గుండె నొప్పులు, డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు పెరిగాయి. ఒత్తిడితో కూడిన జీవనశైలి వ్యాధులు యువజనంలో శారీరక సామర్థ్యాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా జీవన నాణ్యతను, సామాజిక భాగస్వామ్యాలను నాశనం చేస్తున్నాయి. యువత పనిసామర్థ్యం మందగించడం, విద్యార్థుల విజయావకాశాలూ ఉద్యోగ అవకాశాలు తగ్గడం వంటి ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది దేశ ఆర్థికాభివృద్ధికీ పెద్ద సవాలే.

పరిష్కార మార్గాలు...

ఒత్తిడిని తగ్గించడం, జీవన శైలి వ్యాధులను నియంత్రించడం కోసం సమగ్ర, బహుముఖ విధానాలు అవసరం. ధ్యానం, యోగా, శారీరక వ్యాయామం, సమయపాలన వంటి పద్ధతులు ఒత్తిడిని తగ్గించడంలో సహాయ పడతాయని అనేక అధ్యయనాలు తేల్చాయి. ఇవి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా అవగాహన, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నారు. అయితే, యువతకు సులభంగా అందుబాటులో ఉండేలా డిజిటల్ వేదికల ద్వారా ఇలాంటి సేవలను అందించాలి. ప్రైవేట్ రంగం, విద్యా సంస్థలు కూడా ఒత్తిడి తగ్గించే వర్క్‌షాప్‌లు, మానసిక ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టాలి. యువత తేలికగా ఒత్తిడి బారిన పడకుండా, సమస్యల్ని సానుకూలంగా ఎదుర్కొనేలా శిక్షణ ఇవ్వడం ముఖ్యం. మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు దేశ పురోగతికి ప్రధాన అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం, ఆరోగ్య సంస్థలు, విద్యా రంగం, ప్రైవేట్ పరిశ్రమలు కలిసి సమగ్ర విధానాలు అమలు చేయకపోతే, యువత ఒత్తిడిలో చిక్కి, బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేని దుస్థితి నెలకొంటుంది. యువతలో మానసిక ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి మార్పులపై అవగాహన పెంచడం ముఖ్యం. విద్యాసంస్థల్లో సంబంధిత పాఠాలు, యోగా, ధ్యాన కార్యక్రమాలను తప్పనిసరి చేయాలి. కార్పొరేట్ రంగంలో యువతకు ఆరోగ్య పరిరక్షణ పద్ధతులు, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సూత్రాలను నేర్పించాలి. సమయపాలన పాటించడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, సామాజిక సంబంధాలను మెరుగుపరచుకోవడం తదితరాలను ప్రోత్సహించడం ద్వారా యువతను సరైన దారిలో నడిపించాలి.

– డాక్టర్ వీరభద్రం భూక్యా
(అసోసియేట్ ప్రొఫెసర్, తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం)



ఉద్యాన ఉత్పత్తుల వృద్ధి

ఉద్యాన పంటల ఉత్పత్తుల పరంగా చైనా తరవాతి స్థానం ఇండియాదే. పండ్లు, కూరగాయలు, పువ్వులు, పరిమళభరిత, ఔషధ మొక్కలు, సుగంధద్రవ్యాలు తదితరాలు ఉద్యాన పంటల కిందకి వస్తాయి. దేశీయంగా ఉద్యాన పంటల సాగు క్రమంగా పెరుగుతోంది. 2014-15లో ఇండియాలో 2.34 కోట్ల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగయితే, 2023-24లో అది 2.89 కోట్లకు చేరింది. దశాబ్ద కాలంలో ఉత్పత్తి ఏడు కోట్ల టన్నులకు పైగా పెరిగింది. ఉత్పాదకత సైతం హెక్టారుకు 12 టన్నుల నుంచి 12.19 టన్నులకు చేరింది. గత ఆరు ఆర్థిక సంవత్సరాల్లో దేశీయంగా ఉద్యాన పంటల ఉత్పత్తి... (కోట్ల టన్నుల్లో)

2018–19	31.10
2019–20	32.04
2020–21	33.46
2021–22	34.71
2022–23	35.54
2023–24	35.31


(ఆధారం: కేంద్రం వార్షిక నివేదిక)

రాజంటే భయం వద్దు!

హాయ్! బుజ్జీ!!

దేవగిరి అడవిలో రకరకాల జంతువులు ఉండేవి. ఒకరోజు ఓ సింహం ఆ అడవిలోకి వచ్చింది. అది చూసిన జంతువులు భయంతో పరుగులు తీయసాగాయి. అప్పుడా సింహం.. 'ఆగండి! నేను మిమ్మల్ని ఏమీ అనను' అని నీరసమైన గొంతుతో అంది. దాంతో ఆ జంతువులన్నీ దాని దగ్గరికి వెళ్లి.. 'ఇంతకీ ఎవరు నువ్వు. ఇక్కడికి ఎందుకు వచ్చావు?' అని అడిగాయి. 'నేను పక్క అడవి మృగరాజుని' అని బదులిచ్చిందా సింహం. 'మృగరాజు అయి ఉండి.. ఇలా రావడమేంటి? అసలేం జరిగింది' అని ప్రశ్నించింది ఎలుగుబంటి. 'మీలాగే మా అడవిలో కూడా చాలా జంతువులు ఉండేవి. నేను అవసరం లేకున్నా... ఇష్టం వచ్చినట్లుగా వాటిని వేటాడాను. దాంతో చాలా జీవులు చనిపోయాయి. మరికొన్ని భయంతో పారిపోయాయి. ఇప్పుడు తినడానికి ఏం దొరకట్లేదు. కనీసం నాతో మాట్లాడటానికి కూడా ఒక్క జంతువు లేదు. అందుకే ఇలా వచ్చాను' అని బదులిచ్చింది సింహం.

'సరే అయితే..! ముందు మా మృగరాజుని కలుద్దువు పద' అంటూ దాన్ని తీసుకెళ్లాయి జంతువులు. మృగరాజు దగ్గరికి వెళ్లాక.. విషయమంతా వివరించింది పక్క అడవి సింహం. 'మీ అడవిలో మంత్రి ఆ జిత్తులమారి నక్కే కదా?' అడిగింది మృగరాజు. 'అవును! ఆ విషయం మీకెలా తెలుసు' అడిగిందా సింహం. 'అది ముందు మా అడవిలోనే ఉండేది. ఎలాంటి కష్టం లేకుండా ఆహారం తినడానికి.. ఇలాగే జంతువులను వేటాడమని, దానివల్ల అందరికి నేనంటే భయం ఉంటుందని సలహాలు ఇచ్చేది. దాంతో ఇక్కడి నుంచి తరిమేస్తే మీ అడవికి వచ్చినట్లుంది. దాని మాటలు నమ్మి.. నువ్వు ఇంత వరకు తెచ్చుకున్నావు. మంత్రి సలహాలు తీసుకోవడం మంచిదే కానీ అవి ఎంత వరకు అడవికి మంచి చేస్తాయో ఆలోచించాలి. సొంత ప్రయోజనాల కోసం చూస్తే చివరికి మనమే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాజును చూసి జంతువులు భయపడాల్సిన పని లేదు. ధైర్యంగా వచ్చి వాళ్ల సమస్యలు చెప్పుకోగలిగేలా ఉండాలి అర్థమైందా?' అంది మృగరాజు.



– కూచిమంచి నాగేంద్ర

నేనెవర్ని?

1. మూడు అక్షరాల పదాన్ని నేను. 'సభ'లో ఉంటాను. కానీ 'సత్యం'లో లేను. 'వల'లో ఉంటాను కానీ 'కల'లో లేను. 'జనం'లో ఉంటాను కానీ 'జలం'లో లేను. నేనెవరో తెలిసిందా?
2. నేనో నాలుగక్షరాల పదాన్ని. 'సుత్తి'లో ఉంటాను కానీ 'నత్తి'లో లేను. 'రణం'లో ఉంటాను కానీ 'కణం'లో లేను. 'పక్షి'లో ఉంటాను కానీ 'పన్ను'లో లేను. 'గతం'లో ఉంటాను కానీ 'గమ్యం'లో లేను. నేనెవర్ని?

జవాబు: 1.భవన 2.సురక్షిత

కరెన్సీనగర్ : ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రత్యేక కేటగిరీ కింద చేర బీయే ఫార్మసీ, అగ్రికల్చర్, బీఎస్సీ


నేడు, రేపు ఏపీఈసెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

గణితం డిప్లొమా కోర్సులు చేసిన విద్యార్థులు ఏపీఈసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు, రేపు (8, 9 తేదీల్లో) తమ ప్రత్యేక కేటగిరీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోవాలని అధికారులు తెలిపారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 8న ఆర్మీ సంతతి ర్యాంకర్లు 1 - 20,000 వరకు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభ్యర్థులు 1- 15 వేల ర్యాంక్ వరకు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులు ఒకటి నుంచి ఆఖరి ర్యాంకు వరకు హాజరు కావాలి. 9న ఆర్మీ సంతతి 20,001 నుంచి చివరి ర్యాంకు వరకు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 15,001 నుంచి చివరి ర్యాంక్ వరకు, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒకటి నుంచి చివరి ర్యాంకు వరకు హాజరుకావాలి. జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్‌కు ఐచ్ఛికాలు ఇవ్వడం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఐచ్ఛికాలను 11న మార్చుకునే వీలు కల్పించారు. 13న సీట్లు కేటాయిస్తారు.

పాఠశాలల్లో సమస్యలున్నాయా?.. పథకాలు అందలేదా?

ఈనాడు మీతోడు

9న డీఈఓ సుబ్బారావుతో 'ఈనాడు' ఫోన్‌ఇన్



ఇటీవలే విద్యా సంవత్సరం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. పాఠశాలల్లో వసతుల లేమి, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు రాకపోవడం, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, ఫీజులు, పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు, తరగతి గదులు, తాగునీటి ఇబ్బందులు తదితర సమస్యలపై ఫోన్ చేస్తే డీఈఓ సమాధానాలిస్తారు. మీరు చేయాల్సినదంతా దిగువ సెల్ నంబరుకు నిర్ణీత సమయంలో కాల్ చేయడమే. **- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

97041 69998 | తేదీ: బుధవారం (9.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట

అవకాశమివ్వండి.. రూ.కోట్లు గడిస్తా!

నా అనుభవంతో ట్రేడింగ్‌లో మరింత సంపాదిస్తా
పోలీసు విచారణలో నిందితుడు ఆదిత్య వేడుకోలు

> ‘నేను షేర్లలో పెట్టుబడి పెట్టడంలో దిట్ట. ఏ షేర్ ధర ఎప్పుడు పెరుగుతుందో పసిగట్టగలను. షేర్ మార్కెట్లో బడా వ్యక్తులతో నేరుగా మాట్లాడగలిగే పరిచయాలు ఉన్నాయి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్.. ట్రేడింగ్‌లో నాకున్న అనుభవంతో భారీగా సంపాదిస్తానని' అద్విక ఎండీ ఆదిత్య పోలీసుల విచారణలో వేడుకున్నాడు.

> అధిక వడ్డీల పేరుతో రూ.కోట్లు దోచేసిన అద్విక ట్రేడింగ్ కంపెనీ కేసులో పోలీసులు నిశిత దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆదిత్య జల్సాలకు రూ.కోట్లు వెచ్చించినట్లు తేల్చారు. దుబాయ్‌లో మూడు కార్యాలయాలు ప్రారంభించి, ట్రేడింగ్ ఖాతాలనూ తెరిచాడు.

> మొత్తంగా 1,109 మంది రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తేలింది. ఏజెంట్లకు కమీషన్ల రూపంలో.. పెట్టుబడిదారులకు వడ్డీల రూపంలో రూ.250 కోట్లు చెల్లించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున సోమవారం విచారణ సాగలేదు.

ఆ ఖాతాలపైనే గురి..

విజయవాడలో రెండేళ్లలో మూడుచోట్ల కార్యాలయాలు మార్చినట్లు గుర్తించారు. కొన్నినెలల కిందట దుబాయ్‌లో మూడుచోట్ల మూడు కార్యాలయాలు పెట్టాడు. ట్రేడింగ్ కోసం గోల్డెన్ లీప్, మల్టీ బ్యాంకు, ఖబానాలో మూడు ఖాతాలు తెరిచాడు. ఈ ఖాతాల నగదు నిల్వలు, లావాదేవీల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని నగర పోలీసులు ఆయా బ్యాంకులకు రాసినా వారు పట్టించుకోలేదు. ఫెమా చట్టం కింద కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లేఖలు పంపనున్నారు. ఈవివరాలు వస్తే.. ఆ ఖాతాల్లో ఎంత నగదు ఉంది? అన్ని లావాదేవీలు తేలనున్నాయి.

కరెంట్ ఖాతాల వివరాలు కొలిక్కి..

సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి బోర్డు తిప్పేసే వరకు సంస్థకు చెందిన ఏడు కరెంటు ఖాతాలు ఉన్నాయి. వీటి వివరాలు అందించమని ఆయా బ్యాంకులకు దర్యాప్తు అధికారి లేఖలు రాయగా.. ఇవి సోమవారం పోలీసులకు అందాయి. ఇవేకాక.. ఆదిత్య వ్యక్తిగత ఖాతా వివరాలూ చేరాయి. ఖాతాల్లో జమైన, బదిలీ అయిన నగదు వివరాలు విశ్లేషిస్తున్నారు. లెక్క తేలేందుకు 7-10 రోజులు పట్టే వీలుందని భావిస్తున్నారు.

Advika trading company

విచ్చలవిడి ఖర్చులు...

దుబాయ్ కార్యాలయాల్లో ఇంటీరియర్ డిజైనింగ్‌కు రూ.20-30 లక్షలు వెచ్చించినట్లు తెలిసింది. విజయవాడ కార్యాలయంలోనూ రూ.20 లక్షలు వెచ్చించాడు. డిపాజిటర్లను ఆకట్టుకునేందుకే ఈ ఎత్తుగడ. నగరంలో రూ.3 కోట్ల విలువైన ఫ్లాట్ కొన్నాడు. నిరుడు.. ఓ ఏజెంట్‌కు కారు కొనేందుకు అతనితోపాటు ఆదిత్య కూడా షోరూమ్‌కు వెళ్లాడు. కారు కొన్న తర్వాత సిబ్బందికి టిప్‌గా రూ.50 వేలు ఇచ్చాడు. ఏజెంట్లను ఉత్తేజపరిచేందుకు గోవాలో విలాసవంత పార్టీలు ఇచ్చేవాడు.

ఇప్పటికి 110 మంది ఫిర్యాదు...

ఏజెంట్ల ఖాతాలు, వారి లాకర్లు కూడా ఫ్రీజ్ అయ్యాయి. ఇప్పటికే 44 మంది ఏజెంట్లు వివరాలు ఇవ్వగా.. ఐదుగురు పరారీలో ఉన్నారు. నిత్యం బాధితులు ఏసీపీ కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. ఇప్పటికి 110 మంది ఫిర్యాదు చేశారు. ఏజెంట్లకు ఎంత కమీషన్ ఇచ్చాడు? బాధితులకు వడ్డీ రూపంలో ఎంత తిరిగిచ్చాడు? మిగిలిన నగదు ఎక్కడుందో తెలుసుకునేందుకు పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

పండ్ల మొక్కల పండగకు శ్రీకారం నేడే

ఈనాడు, అమరావతి: పల్లెపండగ స్ఫూర్తితో పండ్ల మొక్కల పండగకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఉభయ జిల్లాల్లో ఒకేరోజు భారీఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టనున్నారు. నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఉద్యానశాఖ సహకారంతో నిర్వహిస్తున్నారు.



ఒకేరోజు 503 ఎకరాల్లో ...

నిరుడు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 4 వేల కిమీ మేర రహదారులు నిర్మించి కూటమి సర్కారు చరిత్ర సృష్టించింది. అదే తరహాలో ఉమ్మడి కృష్ణాలో ఒకే రోజు 503 ఎకరాల్లో మొక్కలు నాటి మరో నూతన ఆవిష్కరణకు రంగం సిద్ధం చేసింది. గంపలగూడెం మండలం గోసవీడులో 500 ఎకరాల్లో, గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో 3 ఎకరాల్లో మొక్కలు నాటుతారు. మామిడి, జామ, సీతాఫలం, సపోటా, నేరేడు, మునగ, బత్తాయి, అంజీరా, చింత, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీరా, యాపిల్‌బేర్, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ, తదితర మొక్కలు నాటుతారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు.

రూ.4.53 కోట్ల నిధులు: ఒక్క రోజులో నాటే మొక్కలకు రూ.4.53 కోట్లు కేటాయించారు. మొక్కలు, సామగ్రి కొనుగోలు, కూలీల వేతనాలు తదితర ఖర్చులు ఉంటాయి. పండ్ల తోటల ఏర్పాటు లక్ష్యం... ఎన్టీఆర్‌లో 4,000 ఎకరాలు, కృష్ణా జిల్లాలో 300 ఎకరాలుగా నిర్ణయించారు. మంగళవారం నుంచి పండ్ల తోటల ఏర్పాటు మొదలు కానుండగా.. జులై ఆఖరుకు లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు.



శాకంబరికి కూరగాయల హారం

ఇంద్రకీలాద్రిపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలతో దండలు సిద్ధం చేస్తున్నారు. ఆలయ ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి అలంకరణకు శ్రీకారం చుట్టారు. సేవా మహిళలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో దండలు అల్లారు.

- ఈనాడు, అమరావతి

ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే

పచ్చదనం పెంపునకు స్థలాల గుర్తింపు

ఈనాడు - అమరావతి: అమరావతి పునర్నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లేఔట్లలో సర్వే ప్రారంభమైంది. వీటిలో మౌలిక వసతుల కల్పన బాధ్యతను ప్రభుత్వం ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)కు అప్పగించింది. ఇటీవల వరకు ఈ బాధ్యతలను సీఆర్డీఏ పర్యవేక్షించింది. రాజధానిలోని 18 ఎల్పీఎస్ జోన్లలో సర్వేలో భాగంగా పచ్చదనం పెంచే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఎల్పీఎస్ లేఔట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు టెండర్లు పిలిచి, గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. క్షేత్రంలో ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 1,281 కి.మీ నిడివితో రహదారులు, వాన నీటి మళ్లింపు డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్తు, కమ్యునికేషన్ల డక్ట్‌లు నిర్మించాలి.



సర్వే నిర్వహిస్తున్న సీఆర్డీఏ, ఏడీసీ సిబ్బంది

1,500 ఎకరాల్లో 489 పార్కులు...: అమరావతిని హరిత రాజధానిగా అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా లేఔట్లలో విస్తృతంగా ఉద్యానాలను పెంచనున్నారు. అన్ని లేఔట్లలో 1,500 ఎకరాలను ఇందుకు ఉద్దేశించారు. అనువైన ప్రాంతాల కోసం సీఆర్డీఏ, ఏడీసీఎల్, సర్వే శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. గుర్తించిన ప్రాంతాల్లో హద్దులను నోటిఫై చేస్తున్నారు. తర్వాత వాటిల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. ఇందులో తొలి ప్రాధాన్యంగా జోన్-7లో చేపట్టగా... 22 పార్కులు రానున్నాయి. అన్ని జోన్లలో 489 ఉద్యానాలను అభివృద్ధి చేయనున్నారు. వీటి విస్తీర్ణం మేరకు కమ్యూనిటీ, నైబర్‌హుడ్, సిటీ, టౌన్ పార్కులు, తదితర పలు రకాలను ప్లాట్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకున్నారు.

కష్టపడి పనిచేయడం కాదు.. స్మార్ట్‌గా ఆలోచించి పని చేయడం నేర్చుకోవాలనే సీఎం

ఆలోచిస్తే అధనంగా సంపాదించొచ్చు గురూ..!

చంద్రబాబు తరచూ చెబుతున్న మాటలు విజయవాడ మురళీనగర్ శ్రీరాంజీ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఇస్త్రీ చేసే బల్లంట్ల రాము తూచా తప్పకుండా పాటిస్తున్నాడు. కాలంతోపాటే వచ్చే మార్పులను.. మెలకువలను గమనిస్తే చేసేపని తేలికవ్వడమే కాక అదే కష్టంతో రెండింతల డబ్బులు సంపాదించొచ్చు అని నిరూపిస్తున్నాడు. ఇస్త్రీ పెట్టెలో బొగ్గులు ఒక్కసారి రాజేస్తే మళ్లీ ఎప్పుడుకావాలంటే అప్పుడు ఆపి వెలిగించడానికి అవ్వదు. దానికితోడు బరువైన ఇత్తడి పెట్టెతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇస్త్రీ చేయడంతో రాత్రికి నొప్పులు.. నిప్పుల సెగ వల్ల వేడి తప్పదు. బొగ్గుల నుంచి నిప్పురవ్వలు ఎగిరి బట్టలపై పడి కాలిపోవడం వంటి ప్రమాదాలు ఉంటాయి. ఈ కష్టాలన్నింటికీ గ్యాసుతో నడిచే ఇస్త్రీపెట్టెతో చెక్ పెట్టవచ్చని చెబుతున్నాడు. మొదట పెట్టెబరువు సగం తగ్గి.. జబ్బల నొప్పి ఉండదు. సిల్క్ బట్టకి తగ్గించుకుని.. కాటన్ బట్టకి వేడి పెంచుకుని చేసుకోవడమే కాదు.. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆపి వెళ్లిపోవచ్చు. బొగ్గులకు రోజుకు రూ.150 చొప్పున నెలకు రూ.4500 అయ్యేది.. నేడు నెలకు గ్యాసుకు రూ.1000 మాత్రమే ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో కూడా బొగ్గుల రేటు ఎక్కువవ్వడమే కాకుండా.. అమ్మకందారులు బరువు ఎక్కువ తూగడానికి వాటిని తడిపి అమ్ముతున్నారు. తడి ఆరబెట్టడానికి సమయం వృథా.. లేదంటే మంట అంటుకోక.. పొగతో ఇబ్బంది. విజయవాడ వన్‌టౌన్‌లో రూ. 7500 తో గ్యాస్ ఇస్త్రీపెట్టె, రెగ్యులేటర్, పైప్ కి ఖర్చుపెట్టానని ఇప్పుడు ఆరోగ్యంగా.. సౌకర్యవంతంగా ఉందని చెబుతున్నాడు. పాతమూసధోరణిలో కాకుండా.. మారుతున్న కాలంతో పాటు మనం మారాలని సందేశం ఇస్తున్నాడీ రాము. - ఈనాడు, అమరావతి.



పోగొట్టుకున్నా.. తిరిగి పొందొచ్చు!

ఆర్టీసీలో 'లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్'తో సాధ్యం

ఈనాడు - అమరావతి

ప్రయాణ హడావుడిలో బస్సులో మర్చిపోయిన వస్తువులపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు. వాటిని తిరిగి పొందే అవకాశం ఉంది. ఆర్టీసీ దానికోసం లాస్ట్ ప్రాపర్టీ హ్యాండోవర్ విధానాన్ని అన్ని డిపోల పరిధిలో అమలు చేస్తోంది. ఈ ప్రక్రియ తెలియక చాలా మంది బస్సులో వస్తువులు పోగొట్టుకుని నష్టపోతున్నారు.

తిరిగి పొందడమెలా: బస్సుల్లో సామగ్రి మర్చిపోతే హైరానా పడకుండా టిక్కెట్‌పై కండక్టర్ గురించి తెలిపే గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఆ బస్సు ఏ డిపో పరిధిలోదో తెలుసుకుని మేనేజర్‌కు ఫోన్ చేయాలి. టిక్కెట్‌పై ఉన్న గుర్తింపు సంఖ్య చెబితే కండక్టర్, డ్రైవర్ ఫోన్ నంబర్, వివరాలు చెబుతారు. వారి ద్వారా సామగ్రి జాడ తెలుసుకోవచ్చు.

నిర్ధారించాకే అప్పగింత: డ్రైవర్, కండక్టర్లు ట్రిప్ పూర్తి కాగానే బస్సులో సామగ్రి ఎవరైనా మర్చిపోతే వాటిని డిపోలోని యర్నింగ్ సెక్షన్‌లో డీపీ క్లర్క్‌కు అప్పగించాలి. పోగొట్టుకున్న వారు నేరుగా ఆ క్లర్క్‌ను సంప్రదిస్తే.. పోగొట్టుకున్న వస్తువుల వివరాలు క్షుణ్నంగా తెలుసుకుని... వారివే అని నిర్ధారించుకునే అప్పగిస్తారు.

మనకూ బాధ్యత ఉండాలి: ఉమ్మడి కృష్ణా జిల్లాలో 13 డిపోలు.. 1,186 బస్సులు ఉన్నాయి. రోజుకు సగటున 3.1 లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. సిబ్బంది బాధ్యత లేకుండా వ్యవహరించినా, తోటి ప్రయాణికులు ఆ వస్తువులను సిబ్బందికి అప్పగించకున్నా.. వస్తువులు దొరకడం సాధ్యం కాదు. ప్రయాణికులు బాధ్యతగా వ్యవహరించాలి. బస్సుల్లో దొరికిన వస్తువులను కండక్టర్‌కు అప్పగిస్తే పోగొట్టుకున్న వారికి సులభంగా చేర్చవచ్చు. నెలకు సగటున రెండు ఘటనలు జరుగుతాయనీ.. పోగొట్టుకున్న వారికి వస్తువులు అప్పగిస్తున్నామని ఆర్టీసీ ఆర్ఎం దానం తెలిపారు.

✦ శివరామ్‌ప్రసాద్... రేపల్లె నుంచి విజయవాడ వచ్చారు. విజయవాడలో బస్సు దిగే హడావుడిలో పర్సు పడిపోయినా చూసుకోలేదు. అందులో డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, ఏటీఎం, పాన్ కార్డులు, రూ.5 వేలు ఉన్నాయి. దిగాక సరిచూసుకుంటే బస్సు వెళ్లిపోయింది. టిక్కెట్‌పై ఉన్న వివరాలతో కండక్టర్‌ను సంప్రదించగా విజయవాడ బస్టాండ్ లోని యర్నింగ్ సెక్షన్‌లో ఉన్నట్లు తెలుసుకుని తిరిగి తీసుకున్నారు

✦ ఆరు నెలల కిందట అవనిగడ్డ నుంచి గుడివాడ వెళుతున్న బస్సులో మొగదారయ్య బ్యాగు మర్చిపోయి చల్లపల్లిలో దిగారు. తర్వాత చూసుకుంటే బస్సు గుడివాడ వెళ్లిపోయింది. తెలిసిన వారి సలహా మేరకు డిపో మేనేజర్ నంబరు తీసుకుని సంప్రదించగా బ్యాగు తిరిగి అప్పగించారు. ఇందులో పొలం పాస్ పుస్తకాలు, ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయి.



వేళకు రాకుంటే..!

గ్రీవెన్స్‌లో అధికారుల హాజరుపై కలెక్టర్ ఆగ్రహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్/ గ్రీవెన్స్) కార్యక్రమానికి జిల్లా అధికారులు ఠంచన్‌గా వేళకు రావాలని, ఆలస్యమైనా, గైర్హాజరయినా సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. పీజీఆర్ఎస్ నిర్వహించే నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరానికి సోమవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ చేరుకున్నారు. అధికారుల హాజరు సమయాలపై ఆరా తీశారు. కొందరు ఆలస్యంగా వస్తున్న విషయాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది హెచ్చరికలు జారీ చేశారు. నిర్ణీత వేళకు రావాలని ముందుగానే డీఆర్వో ద్వారా పంపిన సమాచారాన్ని పలువురు బేఖాతరు చేయడాన్ని అలసత్వంగా భావిస్తామన్నారు. పీజీఆర్ఎస్ నిర్వహించే రోజు ఉదయం 9.30 గంటలకు సమావేశ మందిర తలుపులను మూసి వేయాలని సిబ్బందిని ఆదేశించారు. 10 గంటల కల్లా అధికారుల హాజరుపట్టికను తమ ముందు ఉంచాలన్నారు. సమయపాలన అధికారుల పనితీరుకు కొలమానమన్నారు. టీం ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రగతిలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జిల్లాను అగ్రగామిగా నిలపడం ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించాలని సూచించారు. కాగా కొందరు హెచ్‌వోడీలు రాకుండా కింది స్థాయి అధికారులను పంపుతున్నారు. దీనిపైనా కలెక్టర్ దృష్టి సారించాల్సి ఉంది.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, హాజరైన అధికారులు

138 అర్జీల స్వీకరణ.. పీజీఆర్ఎస్‌లో మొత్తం 138 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 53 వినతులు వచ్చాయి. పోలీస్ 23, మున్సిపల్ 17, పౌరసరఫరాలు, వైద్య, పంచాయతీ రాజ్ శాఖలకు ఆరు చొప్పున అర్జీలు అందాయి. మిగతావి డీఆర్డీఏ, వ్యవసాయ, డ్వామా, గనులు, రిజిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు తదితర శాఖల సంబంధించినవి ఉన్నాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

శాకంబరి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8నుంచి నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు దాతలు ఇచ్చిన కూరగాయలు సోమవారం దేవస్థానానికి చేరాయి. దాతలు ఇచ్చిన కూరగాయలకు అర్చకులు పూజ చేశారు. ఈవో శీనానాయక్ హారతి ఇచ్చి దండల అలంకరణకు శ్రీకారం చుట్టారు. మల్లికార్జున మహామండపంలో మహిళలు దండలు తయారు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు విఘ్నేశ్వరపూజ, సాయంత్రం 4గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, మండపారాధన కార్యక్రమాలు రుత్వికులు నిర్వహిస్తారు. 9న మూలమంత్ర హవనాలు, మండప పూజలు, హారతి, 10న ఉదయం 8గంటలకు సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ, శాంతి పౌష్టిక హోమాలు, 9.30 గంటలకు మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈవో పేర్కొన్నారు. గత ఏడాది మూడు రోజులకు 36 టన్నుల కూరగాయలు దాతలు అందజేయగా, ఈసారి మొదటి రోజు అలంకరణకు 16 టన్నులు ఇచ్చారు.



మహామండపంలో కూరగాయలకు హారతి ఇస్తున్న ఈవో శీనానాయక్, వైదిక కమిటీ సభ్యులు

సాగు ఖర్చు తగ్గాలని.. గుంటక పరికరం తయారీ



ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మునగచర్లకు చెందిన సన్నకారు రైతు షేక్ మీరా హుస్సేన్ సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి గుంటక పరికరం తయారుచేసి తానే అంతర కృషి చేస్తున్నారు. అతనికి రెండెకరాల పొలం ఉంది. ఎకరం పత్తి సాగు చేస్తున్నారు. పత్తిలో సాళ్ల మధ్య కలుపు మొక్కలను ఎడ్లతో దున్నించడానికి ఎకరానికి రూ. 800 కిరాయి చెల్లించాలి. ఇలా నాలుగు సార్లు దున్నించాలంటే రూ. 3,200 ఖర్చు అవుతుంది. ఈ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం అతను ఫౌండ్రీలో రూ. 2700 వెచ్చించి ఇనుప గుంటక పరికరం తయారు చేయించారు. దీనిపై బరువు కోసం మట్టి మూటకట్టి ఎడ్లకు బదులు తానే ఎకరం పత్తిలో రెండు రోజులు శ్రమించి దున్నుకున్నారు. దీంతో ఖర్చు ఆదా అవుతుందని, అంతరకృషి చేయడంవల్ల కలుపు సమస్య నివారించుకోవచ్చని చెప్పారు. ఖర్చులు తగ్గించుకోవడానికి తానే ఈ పరికరాన్ని తయారు చేశానని చెప్పారు. - నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



దయతలచండి.. దారిచూపండి

'జాతీయ రహదారుల అధికారులూ.. మొద్దు నిద్ర వీడండి' అంటూ విజయవాడలోని కృష్ణలంక రాణిగారితోట సర్వీసు రోడ్డులో ఎన్‌హెచ్ ప్రాంతీయ కార్యాలయం సమీపంలో కృష్ణలంక వాసులు పేరిట ఆసక్తికర బ్యానర్ సోమవారం ఏర్పాటు చేశారు. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'బ్యానర్‌పై మేము కూడా మనుషులమని గుర్తించండి. ఎంత మంది చనిపోతే.. ఎన్ని కుటుంబాలు రోడ్డున పడాలి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో ఏదైనా వంతెన ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే ఈ నెల 10న తేదీన జాతీయ రహదారుల భవనాన్ని ముట్టడిస్తామని బ్యానర్‌పై పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

రాజ్‌భవన్‌లో మాక్ డ్రిల్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రాజ్‌భవన్‌లో సోమవారం రాత్రి ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. తొలుత ఆక్టోపస్ డీఎస్పీ ఐ.తిరుపతయ్య నేతృత్వంలో భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్, అగ్నిమాపకశాఖ, విద్యుత్తు, ట్రాఫిక్, సిటీ సెక్యూరిటీ వింగ్, నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే క్షణం చేసి చూపించారు. వివిధ శాఖలకు చెందిన పోలీసు బలగాలు ఏ విధంగా స్పందిస్తాయో ప్రత్యక్షంగా చూపించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్టోపస్, పోలీస్, అగ్నిమాపక, సిటీ సెక్యూరిటీ వింగ్ ఇతర సంస్థల సిబ్బంది

డ్రెయిన్ పూడిపోకుండా పరికరం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఔట్‌ఫాల్ డ్రెయిన్ వద్ద చెత్త నిలిచి పూడిపోకుండా ఉండే పరికరాన్ని సోమవారం నగరంలో ఏర్పాటు చేశారు. రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరికరం మోటార్ సాయంతో పనిచేస్తుంది. ఈ స్టీల్ పరికరం ద్వారా చెత్తను సైతం వాహనాల్లోకి సునాయాసంగా తరలిస్తుందని స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీ తెలిపారు. ప్రాజెక్టు డీఈ బూసిరెడ్డి, స్థానిక శానిటరీ అధికారి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



పరికరం ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ తదితరులు

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల ముందుకు పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: రెండు ఫిర్యాదుల విషయమై ఈ నెల 10న దిల్లీలో తమ ఎదుట హాజరు కావాలని పటమట కమిషనరేట్ రాజశేఖరబాబును జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లు ఆదేశించాయి. గత ఏడాది పటమట, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లలో అందిన ఎస్సీ ఎస్టీ ఫిర్యాదులను విచారణ చేశారు. ఆ ఫిర్యాదులు నిజం కావని కేసు నమోదు చేయలేదు. దాంతో ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో ఫిర్యాదుదారు ఆదిలక్ష్మి జాతీయ ఎస్సీ కమిషన్‌కు, పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడు శంకర్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యూనిట్ ఇన్‌ఛార్జి సీపీ రాజశేఖరబాబు, ఆదిలక్ష్మి కేసు విచారణ అధికారి, వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు, శంకర్ కేసు విచారణ అధికారి, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని కమిషన్లు ఆదేశించాయి.

పీజీ విద్యార్థిని బలవన్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: మానసిక వ్యాధితో బాధపడుతున్న యువతి (24) బలవన్మరణానికి పాల్పడినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులు తెలిపారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ వద్ద పసుపులేటి యశస్విని కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్న ఆమె కొన్నాళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఇటీవల ఆమెను ఎయిమ్స్‌లో సైకాలజిస్టుకు చూపించగా నిద్రమాత్రలు ఇచ్చారు. అందులో ఎనిమిది మాత్రలను గతంలో మింగడంతో చికిత్స చేయించారు. ఈనెల 6న సాయంత్రం తల్లి సుజాత దుర్గగుడికి వెళ్లారు. తిరిగి రాత్రి 9గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియ పెట్టి ఉంది. తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు యశస్విని ఉరి వేసుకుంది. 108 సిబ్బంది వచ్చే సమయానికే చనిపోయింది. మానసిక వ్యాధి కారణంగానే కుమార్తె చనిపోయినట్లు తల్లి సుజాత ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అక్రమాలపై విచారణ జరపండి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమాల్లో కడప జిల్లాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి చేసిన అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని విజయవాడకు చెందిన గుత్తేదారు కంచి రాజేష్ కోరారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2020 సంవత్సరంలో నాడు-నేడు పనుల కోసం గ్రీన్ చాక్ బోర్డు మెటీరియల్ సరఫరా చేసేందుకు సుదర్శన్‌రెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. దీని నిమిత్తం పలు దఫాలుగా రూ.1.50 కోట్లు చెల్లించానని తెలిపారు. కానీ మెటీరియల్ సరఫరా చేయలేదని, తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వలేదని వాపోయారు. వైకాపాను వీడిన సుదర్శన రెడ్డి.. ప్రస్తుతం తెదేపాలో ఉన్నారని, డబ్బుల గురించి అడిగితే బెదిరిస్తున్నారని రాజేష్ ఆరోపించారు. దీనిపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇది సివిల్ ఫిర్యాదు అని చెప్పి.. కేసు నమోదు చేయలేదన్నారు. తనకు న్యాయం చేయాలని రాజేష్ విజ్ఞప్తి చేశారు.

నకిలీ బంగారం తాకట్టు కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి కరూర్ వైశ్యా బ్యాంకులో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన కేసులో మరో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ వీరాస్వామి తెలిపిన వివరాల మేరకు. . విజయవాడ పరిధిలోని పటమటలో ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ప్రకాష్... ఆ బ్యాంకులో పనిచేసే అప్రైజర్ మదన్‌కుమార్, స్థానికంగా నివాసం ఉండే తాపీమేస్త్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి 145 ఖాతాల ద్వారా 19.17 కిలోల నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.9.12కోట్లు రుణం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే మదన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా తెనాలి పైవంతెన సమీపాన ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి సంబంధించి నిందితుడి పేరుపై ఉన్న ఆస్తులను అటాచ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా వివరాల కోసం సంబంధిత శాఖలకు లేఖలు పంపినట్లు చెప్పారు. రూ.లక్ష నగదు రికవరీ చేసినట్లు ప్రకటించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వీరాస్వామి తెలిపారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM
ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారకపోవడంతో దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. - పి.వెంకట్రావు గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
- బసవలింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం



• కోడూరు గ్రామంలో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 7వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా స్పందించిన కార్యదర్శి, సర్పంచి ప్రసాద్ సోమవారం గ్రామంలో సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



పూడిక తొలగింపును తనిఖీ చేస్తున్న కమిషనర్ మనోజ

• పట్టణంలోని 12వ వార్డులో డ్రెయినేజీ అంతా పూడికతో పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పురపాలిక కార్మికులతో శుభ్రం చేయించారు. • పట్టణంలోని 6 వార్డులో కాలువల్లో పూడికలు తొలగించాలని స్థానికుల ఫిర్యాదును కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక తొలగింపజేశారు. • పట్టణంలోని 8వ వార్డులో రహదారి పక్కన పిచ్చి చెట్లు పెరిగి అపరిశుభ్రంగా ఉందని ప్రజలు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలుపగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారి పక్కన శుభ్రం చేయించారు. • పట్టణంలోని ఇందిరా కాలనీలో రహదారి పక్కన చెత్త కుప్పలు అడ్డుగా ఉన్నాయని స్థానికులు చేస్తున్న ఫిర్యాదుపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. పురపాలిక కార్మికులతో రహదారి పక్కన చెత్త లేకుండా తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, తిరువూరు

పట్టాదారు పాస్ పుస్తకాలకు వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పూర్వీకుల నుంచి సంక్రమించి, తమ సాగులో ఉన్న అసైన్డు భూములను రెవెన్యూ రికార్డులో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని మైలవరం మండలం గణపవరానికి చెందిన కోట సురేష్, ఏసుపాదం, ప్రసాద్ తదితరులు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై న్యాయవాది, సీపీఎం నాయకుడు రావూరి రమేష్‌బాబుతో కలిసి వారు కలెక్టర్ జి.లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు.

కొత్తూరు చెరువులో అక్రమ తవ్వకాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కె.తాడేపల్లి శివారు కొత్తూరు గ్రామంలోని ఆర్.ఎస్.నంబరు 63 లోని చెరువులో గత 20 రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి అక్రమంగా తవ్వుతున్నారని మెండెం జమలయ్య తదితరులు కలెక్టర్ జి.లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఛాయాచిత్రాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా జలాలను నూజివీడు ట్రిపుల్‌ఐటీకి తాగునీటి అందించే పైపులైన్ కె.తాడేపల్లిలోని నివాస ప్రాంతాల్లో లీక్ కావడంతో స్థానికులకు ఇబ్బందిగా మారిందని పలువురు వినతి పత్రం సమర్పించారు.



కలెక్టర్‌కు వివరాలు వెల్లడిస్తున్న జమలయ్య

నేనున్నా.. నిఘా పెట్టేస్తున్నా
కేసుల ఛేదనకు సీసీ కెమెరాల సాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

▶ ఇటీవల కావలారం ఇందిరమ్మ కాలనీకి వెళ్తున్న ఆటోడ్రైవరును ప్రత్యర్థులు కారుతో ఢీ కొట్టి చంపారు. దీనికి ఆది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసును పక్కదారి పట్టించాలని ప్రయత్నం చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లోని దృశ్యాలను పరిశీలించి అది హత్యగా నిర్ధారించి నిందితులను జైలుకు పంపారు.

▶ కేతనకొండ పొలాల్లో పనిచేసేందుకు ఇబ్రహీంపట్నం నుంచి వెళ్తున్న కూలీల ఆటోను మూలపాడు వద్ద ఓ కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. మూలపాడు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాల సాయంతో కారును గుర్తించి డ్రైవరును అరెస్టు చేశారు.

▶ కొండపల్లికి చెందిన బాలిక ఇంట్లో చెప్పకుండా ఇబ్రహీంపట్నం రింగు సెంటరు వద్ద ఆమె కోసం వేచి ఉన్న యువకుడితో కలిసి ఆటోలో విజయవాడ వైపు వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి 24 గంటలో వారిని గుర్తించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.



జూపూడి వద్ద జాతీయరహదారి బ్లాక్ స్పాట్ వద్ద స్తంభానికి ఏర్పాటు చేశారిలా..

గతంలో తలకు మించిన భారం

గ్రామాలతో పాటు జాతీయరహదారి వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ఇబ్రహీంపట్నం పోలీసులు పలు చోరీలు తదితర కేసులను ఛేదించి నిందితులను పట్టుకుంటున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని జాతీయరహదారి వెంట జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మృతి కేసులు, ద్విచక్రవాహన చోరీలు, ఇంటి దొంగతనాలు తదితర నేరాల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేయడం పోలీసులకు తలకుమించిన భారంగా తయారైంది. ప్రస్తుతం పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా నీడలో పర్యవేక్షణ చేస్తుండడంతో నేరాలకు అడ్డుకట్ట పడింది.

నిరంతర పర్యవేక్షణ

ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని కొండపల్లి పురపాలక సంఘం, గ్రామీణ మండలం పరిధిలో 316 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 98 ప్రాజెక్టు కెమెరాలు గతంలోనే ఉన్నాయి. 17 ప్రధాన కూడళ్లలో నాలుగు డైరెక్షన్లలో 68 కెమెరాలు ఉన్నాయి. బహుళ అంతస్తుల భవనాల వద్ద మూడు దొవ్వున 150 కెమెరాలు బిగించారు. మరో వంద కెమెరాల ఏర్పాటుకు అధికారులు రూపొందించిన ప్రణాళికలు త్వరలో అమల్లో కానున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

నేరాల కట్టడికి సాయం

ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల పలు కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేస్తున్నాం. సాంకేతికతను వినియోగించుకుంటూ నేరాలను కట్టడి చేస్తున్నాం.
- చంద్రశేఖర్, సీఐ ఇబ్రహీంపట్నం

ఆలయంలో అన్ని వసతులు కల్పిస్తాం

కొండపల్లి, న్యూస్‌టుడే: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని వసతులు కల్పించేందుకు ఆలయ నూతన కమిటీ సభ్యులందరూ కృషి చేస్తారని శ్రీ గాయత్రీ ఆలయ గౌరవ అధ్యక్షుడు, వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులోని గాయత్రీ క్షేత్రం పాలక వర్గ ఎన్నిక, సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. శివస్వామి అధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా వంగేటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా బసవ ఉమా, ప్రధాన కార్యదర్శిగా వాసులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ కొన్నేళ్లుగా మరుగున పడిన ఆలయ అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మాధురి, సురేష్, సోమయాజులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తున్న ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకులు

రాష్ట్రాభివృద్ధికి సాంకేతిక బాటలు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి సాంకేతిక బాటలు వేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి మెప్మా రిసోర్స్ పర్సన్లకు ఛైర్మన్ చిట్టిబాబు ట్యాబ్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఒకరిని పారిశ్రామికవేత్తగా రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ముఖ్యంగా పొదుపు సంఘ మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. అందులో భాగంగానే రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు సీతారామయ్య, మేనేజర్ శ్రీధర్, సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ వెంకటేశ్వరమ్మ, వెంకయ్య, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నారు..



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ పరిధిలో డ్రెయినేజీల్లో పూడిక, చెత్తతో మురుగు నీటి పారుదల సమస్యపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సోమవారం రెడ్డిగూడెం పంచాయతీలోని 2 వార్డుల్లో సీసీ రహదారి పక్కన ఉన్న డ్రెయినేజీలను సిబ్బందితో శుభ్రం చేయించారు. ఎంపీడీవో టి.కె.వి.రమణ, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు పనులు పర్యవేక్షించారు.

ఈనాడు కథనానికి స్పందన

స్నేహపూర్వకంగా సాగుదాం

గంపలగూడెం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు నియోజకవర్గాలైన తిరువూరు, మధిర నుంచి వారిరువురూ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండల సరిహద్దునే భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం ఉంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల ప్రజల మధ్య స్నేహపూర్వక సహాయ సహకారాలు అందించుకోవాలని మాట్లాడుకున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఏర్పడిన పరిచయం 3 దశాబ్దాలైనా మా మధ్య స్నేహం నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా కొలికపూడి..విక్రమార్కకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు.



తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు కరచాలనం

సజావుగా నామినేషన్లు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెం పాలసంఘం సభ్యుల ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో నిర్వహించాల్సి ఉండగా, జాతీయ రహదారి పక్కన ఇబ్బంది నేపథ్యంలో చిలుకూరివారిగూడెంలోని కార్యాలయంలో ప్రక్రియను పూర్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఎన్నికలను తాము బహిష్కరిస్తున్నామంటూ తెదేపా ఆదివారమే ప్రకటించినా, గత పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఎస్సై కె.సుధాకర్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి ఎన్నికల అధికారి ఎం.వెంకటేశ్వరరావు నామినేషన్లను స్వీకరించారు. నాలుగు స్థానాలు ఖాళీగా ఉండగా, అందులో 2 జనరల్, మరో 2 మహిళలకు కేటాయించారు. వైకాపా మద్దతుతో మొత్తం ఐదుగురు నామినేషన్లను దాఖలు చేశారు. పోటీ లేని నేపథ్యంలో నాలుగు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. తాను ఉన్నతాధికారుల సూచనల మేరకు, నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించడమే తన బాధ్యత అని, తనపై విమర్శలపై తానేమీ చెప్పదలచుకోలేదని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.



నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు

ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా గుంటుపల్లి గ్రామీణ పశువైద్యశాల ఆవరణలో సోమవారం పశుగ్రాస పెంపకాలపై పశుపోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు హాజరైన జేడీ హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసాలకు అందిస్తున్న రాయితీలను వివరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టరు మోసెస్ వెస్లీ, అసిస్టెంట్ డైరెక్టర్లు రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసరావు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ, తెదేపా నాయకుడు తిరుమలరావు, కొండపల్లి, గుంటుపల్లి పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాకర్ల(తిరువూరు), న్యూస్‌టుడే: జాతీయ పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాకర్లలో సోమవారం పశుపోషకులకు గ్రాసం పెంపకంపై పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు సీవో-4 బహువార్షిక పశుగ్రాసం కాండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించి, నవధాన్యాలతో మాగాణిలో సాగు చేసిన పచ్చిరొట్టను పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ విజయవాడ ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, ఏడీ హెచ్‌లు కిషన్‌సింగ్, సునంద, పశువైద్యాధికారులు అభిలాష్, శ్వేత, వీఎల్వో ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు



తిరువూరు: కాకర్లలో పశుగ్రాసం పరిశీలించిన పశుసంవర్ధకశాఖ అధికారులు



జి.కొండూరు: అరటికాయలు పంచుతున్న లక్ష్మీతిరుపతమ్మ, అరుణ తదితరులు

చనమోలు సేవలు చిరస్మరణీయం

జి.కొండూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దివంగత చనమోలు వెంకట్రావు వర్ధంతిని వెలగలేరు, జి.కొండూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జి.కొండూరులో వృద్ధులు, పేదలకు ఫలాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, సర్పంచి మండల అరుణ, నాయకులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పాత ప్రభుత్వాస్పత్రి ఎదుట ఉన్న చనమోలు, రాజీవ్‌గాంధీ, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు, వారి సేవలను కొనియాడారు. నాయకులు గిరిధర్‌కుమార్, రామకృష్ణ, పిట్ల నాగేశ్వరరావు, దుర్గారావు, ఆంజనేయులు, సుధాకర్, వెంకటరెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు గోసవీడుకు కలెక్టర్ లక్ష్మీశ

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడులో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు పర్యటిస్తారని ఎంపీడీవో డి.బాబూరావు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించే కార్యక్రమంలో పాల్గొని మామిడి మొక్కలు నాటతారని చెప్పారు. అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులు, విగ్రహావిష్కరణలో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొంటారని, ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయనతో పాటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఉండనున్నారు.

పంచాయతీని వీడిన జూనియర్ అసిస్టెంట్

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పెన్నేరు అజయ్‌కుమార్‌ను సోమవారం రిలీవ్ చేసినట్లు విజయవాడ గ్రామీణ మండలం ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. 'ఈనాడు'లో సోమవారం 'పంచాయతీలో పాతుకుపోయారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి రిలీవ్ చేసినట్లు పేర్కొన్నారు. అజయ్‌కుమార్‌ను చందర్లపాడుకు బదిలీ చేస్తూ గత నెలలోనే డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.



గంపలగూడెం: కరపత్రాలు అందజేస్తున్న దేవదత్



మైలవరంలో..



విస్సన్నపేట: తాతకుంట్లలో



ఇబ్రహీంపట్నం: ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో..

ఇంటింటా సుపరిపాలన

మైలవరం, గొల్లపూడి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు : 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో సోమవారం కూటమి నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ఏడాది పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు.



కొత్తపల్లి గుడిలో అలంకరించిన శివలింగం

ఉమాపతికి విశేష పూజలు

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో సోమవారం అర్చకులు పి.కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి పుష్పాలతో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపుతారని పట్టణానికి చెందిన డాక్టర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. విద్యాభ్యాసం చేస్తున్న వారికి ఆరోగ్యం, వ్యాయామం, పౌష్టికాహారం కూడా ముఖ్యమేనన్నారు. పాత తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం లయన్స్‌క్లబ్, సమత, లెజెండ్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు కూడా ఉచితంగా అందజేస్తామని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పీవీ.రావు, కొమ్మినేని రాజేశ్ ఖన్నా, డీజే నరసింహారావు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీవీ లక్ష్మి అధ్యక్షత వహించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, మందకృష్ణ మాదిగ పుట్టినరోజును సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక సిద్ధిపేట వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి కేకు కోశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏబీసీడబ్ల్యూఓ వీరాస్వామి, సర్పంచి మంజుభార్గవి, నాయకులు నారాయణ, నాగరాజు, ఏసు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో దొండపాటి విజయ్, వెల్వడంలో పత్తిపాటి ప్రభాకరరావు తదితరుల ఆధ్వర్యంలో జెండా ఎగరవేసి, వేడుకలు చేశారు.

అవీ ఇవీ

షర్బత్ పంపిణీ

గొల్లపూడి, న్యూస్‌టుడే: మొహర్రంను పురస్కరించుకుని గొల్లపూడిలోని పోసాని నరసింహారావుచౌదరి ఉన్నత పాఠశాల సమీపంలో షర్బత్‌ను తెదేపా మైనార్టీ నాయకుడు కరీముల్లా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ పెద్దలను సన్మానించారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం మైలవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి, లేబర్ కోడ్‌ల రద్దు కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాసరావు, సురేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో సోమవారం ద్విచక్రవాహనాలపై ప్రదర్శన చేశారు. సీఐటీయూ, భవన నిర్మాణ సంఘం జిల్లా, మండల నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రవి, రమేష్, ఖాసిం పాల్గొన్నారు. విస్సన్నపేటలో సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడులో రెండు రోజుల కిందట యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన గుగులోతు హేమంత్‌నాయక్‌పై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా కత్తులతో దాడి చేసిన సంగతి తెలిసిందే. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా నిందితులైన గుగులోతు తెండూల్కర్‌నాయక్, దోపతి రాజేశ్, బానోతు విజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారిని తిరువూరు న్యాయస్థానంలో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో నూజివీడు జైలుకి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

మూలపాడులో జూదరుల..

ఇబ్రహీంపట్నం గ్రామీణం: మూలపాడులో జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శిబిరంపై దాడిచేసి 9 మందిని అదుపులోకి ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.11,430 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమ వ్యవహారంలో యువతి హత్య!

మృతదేహం పక్కనే కత్తి గాయాలతో ప్రియుడు


రమ్య

జి.నార్లంపూడి(రామచంద్రపురం), న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారంలో యువతి హత్యకు గురైంది. ఆమె మృతదేహం పక్కనే ప్రియుడు కూడా గొంతుపై కత్తిగాట్లతో పడి ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ప్రియుడే ఈ పని చేశాడా... ఇంకెవరి హస్తమైనా ఉందా...? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ శివారులోని రామచంద్రాపురం రాజా పరిధిలోని బండ్లగూడలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన బొత్స శ్రీనివాస్, ఈశ్వరమ్మ దంపతులు 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె రమ్య(23)కు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్(25)తో మూడేళ్ల నుంచి పరిచయముంది. బీటెక్ పూర్తి చేసిన ప్రవీణ్ ప్రస్తుతం అల్విన్ కాలనీలో ఉంటూ ట్యూషన్లు చెబుతున్నాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం తమ ప్రేమ గురించి యువకుడు... రమ్య తల్లిదండ్రులకు చెప్పగా... వారు అంగీకరించలేదు. ఆమెకు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. సోమవారం మధ్యాహ్నం యువతి తల్లి ఈశ్వరమ్మ ఇంటికి వచ్చేసరికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలోంచి పరిశీలించగా... రమ్య గొంతుపై తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉంది. ఆ పక్కనే మెడ మీద గాయాలతో ప్రవీణ్ పడి ఉన్నాడు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.



అలాంటి వాటికే మీ సమయాన్ని వెచ్చించండి

అవసరం లేని విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటే మీ సమయం వృథా కావడమే కాదు, మరింత ముఖ్యమైన పనులపై మీరు దృష్టి పెట్టలేరు. ఓ విషయం వల్ల మీకు

1. వ్యక్తిగత ప్రయోజనమైనా ఉండాలి.
2. మనశ్శాంతైనా లభించాలి.
3. మీ కుటుంబానికి, సమాజానికి పనికొచ్చే అర్థవంతమైన విషయమైనా అయ్యుండాలి.

అలాంటి వాటి కోసమే మీ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తూ పూర్తి ఏకాగ్రతను నిలపండి.
– మోర్గాన్ రిచర్డ్ ఒలివియర్, రచయిత్రి

జగన్ కారులో వచ్చి వెళ్లా.. నాకేం తెలియదు

పోలీసుల విచారణలో మాజీ మంత్రి పేర్ని నాని


సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేర్ని నాని


★ సీఐ గది వద్ద గుమికూడిన వైకాపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 18న సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ చేయడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన విషయం మీకు తెలుసా? రప్పా రప్పా అనే ప్లకార్డులు మీరు చూశారా? వాటిని ఎక్కడ ముద్రించారు? జనసమీకరణలో మీ పాత్ర ఉందా? పట్టణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా ర్యాలీ చేయడమే కాకుండా డీజేతో నృత్యాలు చేయడం, వాహనాలు శబ్దం చేస్తూ నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి విషయాలు మీకు తెలియవా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానిని సత్తెనపల్లి పోలీసులు ప్రశ్నించారు. జగన్ కారు ఎక్కమంటే ఎక్కాను.. తాడేపల్లి నుంచి కారులో వచ్చా.. కారులోనే తిరిగి వెళ్లా.. అనుమతుల గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పేర్ని నానిని సోమవారం విచారించారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో మీరు పాల్గొన్నారా అని పోలీసులు ప్రశ్నించగా కారులో ఉన్నానని చెప్పారు. జగన్ పర్యటనకు 3 వాహనాలు, 100 మందికి అనుమతి ఇచ్చారు కదా అని నాని పోలీసుల్ని అడిగారు. పట్టణంలో ర్యాలీకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, రెంటపాళ్లకు పెద్దసంఖ్యలో వాహనాలు, జనం వస్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఉన్నతాధికారులు ముందుగానే చెప్పారని పోలీసులు సమాధానమిచ్చారు. విచారణకు మరోసారి పిలిస్తే రావాలని సీఐ నాగమల్లేశ్వరరావు మాజీ మంత్రికి చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు పోలీస్‌స్టేషన్‌లోకి గుంపుగా వచ్చేసి.. విచారణ పూర్తయ్యే వరకు సీఐ గది ముందే హడావుడి చేశారు.

రెంటపాళ్ల ఎక్కడో తెలియదు

తనకు రెంటపాళ్లే కాదు సత్తెనపల్లి ఎక్కడో కూడా తెలియదని.. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. పోలీసుల విచారణ తర్వాత వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 11 సెక్షన్లతో తనపై కేసు పెట్టారని, మచిలీపట్నంలోని కార్యాలయంలో ఆదివారం పోలీసులు నోటీసు అంటించి వెళ్లడంతో విచారణకు వచ్చానని చెప్పారు. పోలీసుల ఆంక్షలు అతిక్రమించారని, ప్రజల్ని ఇబ్బందులకు గురి చేశారని, స్టంట్లు వేశారని రుజువు కావడంతో మిమ్మల్ని విచారణకు పిలుస్తున్నామంటూ నోటీసులో పేర్కొన్నారన్నారు. సత్తెనపల్లిలో వైకాపా ఇన్‌ఛార్జి, ఛైర్‌పర్సన్ ఎవరో కూడా ఇక్కడికి వచ్చేవరకు తనకు తెలియదని, తాను ఎవరితోనూ మాట్లాడలేదని అన్నారు. పాలకుల ఒత్తిడితో వారి కుర్చీలను కాపాడుకునేందుకు పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, సత్తెనపల్లి పోలీసులు అమాయకులని వ్యాఖ్యానించారు. తనపై కేసులు పెట్టినా జగన్ జెండాను వదిలేది లేదన్నారు.

గ్రూప్-1 కేసులో మధుసూదన్‌కు బెయిల్

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2018) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం కేసులో రెండో నిందితుడు, క్యామ్‌సైన్ మీడియా సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌కు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. విజయవాడ కోర్టులో రూ.25 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి (ఐవో) ముందు హాజరుకావాలని మధుసూదన్‌కు స్పష్టం చేశారు. మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం మధుసూదన్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇటీవల వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏపీపీఎస్సీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగానే మధుసూదన్ పనులు నిర్వహించారన్నారు. వైద్య నివేదికలు, కేసులోని వివరాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

● ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు ● హైకోర్టులో నేడు విచారణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ39) ఉపసంహరించుకున్నారు. సోమవారం జరిగిన విచారణలో వ్యాజ్యం ఉపసంహరణకు మోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులిచ్చారు. సిట్ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని, కేసులో తనను నిందితుడిగా పేర్కొంటూ 'సాక్షి'గా విచారణకు రావాలని దర్యాప్తు అధికారి నోటీసు ఇవ్వడం చెల్లదంటూ మోహిత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంలో ఇటీవల జరిగిన విచారణలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అతని తరఫు సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు అభ్యర్థించగా, ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. అరెస్ట్‌పై ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలన్నారు.

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది. 'మద్యం ముడుపులను తరలించడానికి నేను తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో వాహనాలను వినియోగించానని నాపై ఆరోపణ చేస్తున్నారు. వాస్తవానికి అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తుడా వాహనాలను వినియోగించం. ఆ సొమ్ము తరలింపుతో నాకు సంబంధం లేదు. నేను నేరానికి పాల్పడలేదు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు రాజకీయ నేతలు చెప్పిన మాటలు విని పోలీసులు నన్ను ఈ కేసులో ఇరికించారు' అని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇప్పటికే బెయిలు కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిందని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ-8) బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టివేసింది. అతనికి బెయిల్ ఇవ్వొద్దని సిట్ న్యాయవాదుల వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● ఇంటి నుంచి ఆహారం తెప్పించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసు నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా విజయవాడ ఏసీబీ న్యాయస్థానం కొట్టివేసింది.

● మద్యం కుంభకోణం కేసులో నిందితులైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. వీరిద్దరికీ బెయిల్ ఇవ్వొద్దంటూ సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు.

కరోనా కట్టుకథల కరోడ్‘పతి’

● బెంగళూరు మహిళను వంచించి కోట్ల ఆస్తి కాజేసిన చిత్తూరువాసి


శివప్రసాద్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: భాగస్వామి కరోనా సోకి మృతి చెందారని మాయమాటలతో ఓ మహిళను నమ్మించి పెళ్లి చేసుకుని వంచించి రూ.28 కోట్ల సొత్తు కాజేసి పరారయ్యాడొక మోసగాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజ్‌పేటకు చెందిన నాగమణి (50)కి చాన్నాళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వెంకటపురెడ్డితో పెళ్లయింది. కొద్దికాలం క్రితం వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ బెంగతో భర్త వెంకటపురెడ్డి అనారోగ్యంతో మరణించారు. కన్నబిడ్డ లేని ఆమె మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని మధ్యవర్తి మహిళను ఆశ్రయించారు. ఆ మహిళ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన శివప్రసాద్‌కు ఈ విషయాన్ని చెప్పింది. అప్పటికే అతడికి భార్య, కుమార్తె ఉన్నారు.

అయినా.. నాగమణి ఆస్తిపరురాలని తెలుసుకున్న శివప్రసాద్ పథకం పన్నాడు. తన భార్య, కుమార్తె కొవిడ్‌తో మరణించారంటూ నకిలీ మరణ ధ్రువపత్రాలు తయారు చేసి నాగమణికి చూపాడు. నాగమణి వాటిని నమ్మడంతో 2022లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

డబ్బున్నందని ఆశజూపి..: ఆమె ఆస్తిపై కన్నేసిన శివప్రసాద్ ఆర్‌బీఐ నుంచి కోట్లలో సొమ్ము రానుందని చెబుతూ కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఆ నగదు రావాలంటే కొంత సొమ్ము ఆర్‌బీఐకి చెల్లించాలని నమ్మించాడు. భర్తే కదా అని ఆమె నమ్మడంతో తన తండ్రి, సోదరుడు, పరిచయస్థుల ఖాతాల్లోకి ఆమె నుంచి సొమ్ము బదలాయించుకున్నాడు. అప్పటికే నాగమణి సంతకాలు ఫోర్జరీ చేసిన శివప్రసాద్ బెంగళూరులో మొదటి భర్త నుంచి ఆమెకు సంక్రమించిన రూ.15 కోట్ల విలువైన భూమిని, రూ.10 కోట్ల విలువైన భవనాన్ని అమ్మేశాడు. ఆమె ఆభరణాలు కూడా బ్యాంకులో తనఖా పెట్టాడు. బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉందని, ఆభరణాలు కావాలని నాగమణి కోరగా అప్పటి నుంచి ఆమెకు దూరమయ్యాడు. భర్తను వెతుక్కుంటూ ఆమె బంగారుపాళ్యానికి రాగా... అప్పటికే అతనికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. దీంతో బాధితురాలు ఎస్పీ మణికంఠను ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించారు.

మాలిలో కిడ్నాపర్ల చెర నుంచి మా బిడ్డను కాపాడండి

అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల వేడుకోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? వెళ్లే ముందు ఆపరేషన్ చేశారు కదా.. ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నావా' అని చివరిసారిగా తన కుమారుడు అమరలింగేశ్వరరావు అన్న మాటలను గుర్తు చేసుకుని ఆ తల్లి కుమిలిపోతున్నారు. ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన అమరలింగేశ్వరరావును వారం రోజుల క్రితం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, భార్య, ముగ్గురు పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఆయన తల్లిదండ్రులను పలకరించగా.. 'అమరలింగేశ్వరరావు గ్రామంలో పదో తరగతి చదివాక మాచర్లలో ఐటీఐ పూర్తి చేశాడు. తర్వాత నల్గొండలో సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం చేశాడు. పెళ్లై ముగ్గురు పిల్లలు పుట్టాక కుటుంబ పోషణ కష్టమైంది. మరోవైపు ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి ద్వారా మాలిలో ఉద్యోగం ఉందంటే దరఖాస్తు చేసి వెళ్లాడు. అప్పటికి 11 ఏళ్లు అయ్యింది. ఏటా ఒకసారి వచ్చి వెళ్తాడు. ఈసారి రెండు నెలల్లో వస్తానని మాతో అన్నాడు' అని తల్లి రాజ్యలక్ష్మి తెలిపింది. చివరిసారి జులై 1న ఫోన్‌లో తాము మాట్లాడామని, తర్వాత కిడ్నాప్ విషయం తెలిసిందని తల్లిదండ్రులు చెప్పారు. ఉగ్రవాదుల చెర నుంచి తమ కుమారుడిని విడిపించి క్షేమంగా ఇక్కడికి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

త్వరలోనే ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు

ఏపీమార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతుల బకాయిలను (ఖరీఫ్ 2024-25 పంట కాలానికి) త్వరలో చెల్లించనున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.1,000 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అనుమతించిదన్నారు. మూడు రోజుల్లో ఆ మొత్తం మార్క్‌ఫెడ్‌కు బదిలీ అవనుందన్నారు. రుణం బదిలీ అయిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు.

మిద్దె పంట.. మేలు ఇంట

రైతేరాజు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

విజయవాడ టీచర్స్ కాలనీలో ఉంటున్న వైద్యులు మన్నె గోపీచంద్, నాగభాస్కరాంబ దంపతులు మిద్దె తోట సాగు చేస్తున్నారు. కొన్నేళ్ల పాటు ఆస్పత్రి నిర్వహించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు. పదేళ్ల నుంచి సేంద్రియ విధానంలో మిద్దె పంటలు పండిస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇల్లు కట్టుకున్నప్పుడే సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నారు. కుండీలు పెట్టుకునేలా గోడలు నిర్మించారు. వాటిపై ఇనుప స్టాండ్లు ఏర్పాటు చేశారు. అందులో కుండీలు, డ్రమ్ములు పెట్టారు. వాటిలో పూలు, ఫలాలు, కూరగాయల మొక్కలు నాటారు. భవనం పాడైపోకుండా యాంటీ శ్లాబ్ లీకింగ్ చేయించారు. దానిపై టైల్స్ వేయించారు. బిందు సేద్యం, సాధారణ పద్ధతిలో నీరు పోసి సంరక్షిస్తున్నారు. ఒక్క చుక్క నీరు కూడా శ్లాబ్‌పై నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇంటి ముందు, ప్రహరీ, మెట్ల పక్కన, మిద్దెపైన ఖాళీ లేకుండా మొక్కలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ ఏర్పాటు


మెట్ల మార్గంలో పెంచుతున్న మొక్కలు

ఎరువులు తయారు చేస్తూ..

ఇంట్లో నుంచి వచ్చిన కూరగాయల వ్యర్థాలు, వ్యాపారుల వద్ద పాడైపోయి మిగిలిన కూరగాయలు, రాలిన ఆకులను ఎరువుగా తయారు చేసి వాడుతున్నారు. బెండ, వంకాయ, దోస, కాకర, బీర, పొట్లకాయ, బత్తాయి, నారింజ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం, రామాఫలం వంటి ఫలాల మొక్కలతో పాటు ఆరు రకాల మందారాలు, పది రకాల చామంతులు, కనకాంబ్రాలు, పారిజాతం, సన్నజాజి, విరజాజి, చుక్కమల్లి, బిళ్ల గన్నేరు, ఆకుకూరలు పెంచుతున్నారు. మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్ వేశారు. ఇద్దరూ ఇక్కడ పండిన ఆకుకూరలు, కూరగాయలు తినడమే కాకుండా బంధువులు, ఇరుగుపొరుగు వారికి కూడా ఇస్తున్నారు.



★ ఈ సందర్భంగా వైద్య దంపతులు మాట్లాడుతూ.. 'సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటలో కూరగాయలు, ఆకుకూరలు, ఫలాల మొక్కలు పెంచుతున్నాం. వాటిని తిని ఆరోగ్యంగా ఉంటున్నాం. ఉదయం, సాయంత్రం రెండు గంటలు తోట పనికి కేటాయిస్తాం. ఇల్లు చల్లగా ఉంటుంది. మంచి గాలి వస్తుంది. ఆహ్లాదంగా ఉంటుంది.' అని వివరించారు.

డ్రోన్ వినియోగిస్తే.. సమయం.. ఖర్చు ఆదా



డ్రోన్ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ అధికారులు

ఘంటసాల, చల్లపల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, ప్రయోజనాలు, రాయితీ గురించి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి వివరించారు. డ్రోన్ కావాలంటే ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలి. అందులో ఒకరు ఇంటర్మీడియట్ లేదా అగ్రికల్చర్ డిప్లమా లేదా అగ్రికల్చర్ ఇంజినీరింగ్ చదివి ఉండాలి. అతనికి డ్రోన్ వినియోగంపై 15 రోజుల పాటు గుంటూరు లాంలో శిక్షణ ఇస్తారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దాని ఖరీదు రూ.9.80 లక్షలు. అందులో రైతులు రూ.4.90 లక్షలు (50 శాతం) తమ ఖాతాల్లో ఉన్నట్టు బ్యాంక్‌కు చూపించాలి. 2 నెలల్లో దాని ఖరీదులో రూ.7.80 లక్షలు (80 శాతం) రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్‌ను రైతులకు అందిస్తుంది. ఇంకా అన్నదాతలు చెల్లించాల్సిన రూ.2 లక్షలు నెల నెల వాయిదాల పద్ధతిలో మూడేళ్లలో చెల్లించాలి. డ్రోన్ ఆపరేట్ చేసే వ్యక్తికి రైతులు ఎకరానికి రూ.300-350 చొప్పున చెల్లిస్తారు.

ప్రయోజనాలు కొన్ని..

90 శాతం నీరు, 95 శాతం సమయం ఆదా చేయవచ్చు. 10 లీటర్ల ట్యాంకు సామర్థ్యం గల వ్యవసాయ డ్రోన్‌తో ఎకరా పొలాన్ని 10-15 నిమిషాల్లో రసాయన మందు చల్లవచ్చు. విత్తనాలు, పురుగులు, తెగుళ్ల, కలుపు మందులు, నీళ్లలో కరిగే ఎరువులు పిచికారీ చేయవచ్చు. రైతులు రసాయనాలు పిచికారీ చేయడం వలన కలిగే శ్వాసకోశ వ్యాధులను దూరం చేస్తుంది. బురదలో నడుస్తూ మందులు వేయాల్సిన అవసరం ఉండదు. పని ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. ఎత్తు ఎక్కువగా పెరిగే మొక్కజొన్న, జొన్న, చెరకు తదితర పంటలకు తేలికగా మందులు పిచికారీ చేయవచ్చు. డ్రోన్ వాడినప్పుడు అదనంగా 6-7 సెట్ల బ్యాటరీలు దగ్గర ఉంచుకుంటే మంచిది.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: కాలీఫ్లవర్ పంటకు నేలలు, నాటే కాలం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి? – కె.రంగారావు, రైతు, రుద్రవరం

సమాధానం: కాలీఫ్లవర్ పంటకు చల్లని వాతావరణం అవసరం. స్వల్పకాలిక రకాలకు జులై, ఆగస్టు నెలలు అనువైనవి. బాగా నీరు ఇంకే గరప నేలలు పంట సాగుకు అనుకూలం. విత్తనాన్ని సన్నని ఇసుకతో కలిపి మడుల్లో నారుపోసి, 30-35 రోజుల తరువాత నాటు వేయాలి. ఎరువుల యాజమాన్యానికి... హెక్టారుకు సుమారు 40-50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. తరువాత హెక్టారుకు 60-80 కిలోల నత్రజనిని మూడు సమాన భాగాలుగా చేసి, తొలిసారి నారు నాటిన 25-30 రోజులకు, రెండో సారి 50-60 రోజులకు, మూడో సారి 75-80 రోజులకు వేయాలి. ఫలితంగా హెక్టారుకు దాదాపు 20 టన్నుల దిగుబడి పొందవచ్చు. - వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం - ఘంటసాల, న్యూస్‌టుడే

అరటిలో సస్యరక్షణ చర్యలు


లంకలో సాగు చేసిన అరటి పంట

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణానది పరీవాహక లంక గ్రామాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. ఆ వివరాలను ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ తెలియజేశారు. అరటి పిలకలు నాటే సమయంలో శుద్ధి అవసరం. పిలకలను మైక్రోక్రోటాపాస్ ద్రావణంలో 30 నిమిషాల పాటు నిల్వ ఉంచి నాటితే తెగుళ్లను ఎదుర్కొంటుంది. ఎకరానికి 900 నుంచి వెయ్యి పిలకల వరకు నాటుకోవాలి. పిలక నాటడానికి తవ్విన గుంతలో 300 గ్రాముల పాస్ఫరస్, ఐదు కిలోల పశువుల ఎరువు వేయాలి. మొక్క ఎదిగిన తర్వాత నత్రజని, పొటాషియం ఎరువులను తగిన మోతాదులో వాడాలి. అరటికి ఆశించే తెగుళ్లలో సిగటోకా ఆకుమచ్చ తెగులు ప్రధానమైంది. దాని నివారణకు మాంకోజెబ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పనామా తెగులు పిలకల ద్వారా వ్యాపిస్తుంది. దాని నివారణకు శుద్ధి చేసిన పిలకలు నాటుకుంటే మంచిది.

గవర్నర్ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

10న ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం


సూచనలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, పక్కన జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావు తదితరులు

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరులో 10న గవర్నర్ పర్యటనలో భద్రతా లోపం తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో జరిగే వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డీజీ డా. ఎమ్.ఎల్.జాట్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధరరావులతో కలిసి కలెక్టర్.. సోమవారం సభా ప్రాంగణ పరిసరాలను సందర్శించారు. అతిథులకు ప్రత్యేక వసతులు, పరిసరాల్లో స్వచ్ఛత, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం డీన్ ప్రసన్నకుమార్‌కు కలెక్టర్ సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో చర్చించిన కలెక్టర్.. పలు సూచనలు చేశారు. అసోసియేట్ డీన్ దొరాజీరావు, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, డీపీవో అరుణ, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

9న లేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నిడమానూరు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా రేజర్ రన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా మోడరన్ పెంటాథ్లాన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెలగపూడి ఉజ్వల్, మరీదు సురేంద్రబాబు తెలిపారు. అండర్-9, 11, 13, 15, 17, 19, 30 కేటగిరీలతో పాటు మాస్టర్ 'ఎ' 31-40, మాస్టర్ 'బి' 41-50, మాస్టర్ 'సి' 51+ కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలకు పాఠశాల మైదానంలో పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12వ తేదీన నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు డీఎస్ఏ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో తలపడతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94418 12694 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వల్లభనేని వంశీకి అస్వస్థత

విజయవాడ ఆసుపత్రిలో చేరిక


చికిత్స పొందుతున్న వంశీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సంబంధిత సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న ఈయన.. సోమవారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో నివాసం ఉంటున్న వంశీ సోమవారం ఉదయం గన్నవరం కోర్టులో హాజరయ్యారు. అనంతరం అక్కడకు వచ్చిన కార్యకర్తలు, అభిమానుల్ని కొద్దిసేపు కలిసి మాట్లాడారు. అక్కడ్నుంచి నేరుగా విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నా పలుమార్లు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది గత నెల మొదటి వారంలో న్యాయస్థానాన్ని అభ్యర్థించి ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా తరచూ జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో గత శుక్రవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ కొన్ని వైద్య పరీక్షల అనంతరం, ఇతర పరీక్షలు, వైద్య చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో సోమవారం హుటాహుటిన బందరు రోడ్డులోని ఓ ఆసుపత్రిలో చేరారు. ముక్కులో ఓ రంధ్రం పూడుకుపోవడంతో శ్వాస తీసుకోలేకపోతున్నారని, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు పేర్కొన్నారని, రెండ్రోజుల పరిశీలన తర్వాత శస్త్రచికిత్స చేసే అవకాశముందని వంశీ అనుచరులు తెలిపారు.

సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు అభినందనీయం


రిబ్బన్ కోస్తున్న ఎంటీ కృష్ణబాబు, పక్కనే లక్ష్మీశ, ఢిల్లీరావు తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: వైద్యులు ఆహారం తినేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు తమ సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు ఏర్పాటు చేసుకుని క్యాంటీన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొత్తం రూ.1.50 కోట్ల వైద్యుల నిధులతో క్యాంటీన్‌ను నిర్మించుకున్నారని, అందులో రూ.48 లక్షలు కొవిడ్ సమయంలో వైద్యులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, అడిషనల్ డీఎంఈ వెంకటేష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఏడుకొండలు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన


పరిశీలిస్తున్న గోపీచంద్, వివిధ జిల్లాల ఉద్యోగులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను సోమవారం 13 జిల్లాల ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పరిశీలించారు. వీటి నిర్మాణంలో సాంకేతిక వివరాలను ఉపాధి హామీ పథకం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి(సీక్యూసీవో) గోపీచంద్ వివరించారు. ఇందుకు వినియోగించే కంకర, రాళ్ల గురించి చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎలా నిర్మించుకోవాలో వివరించారు. తక్కువ ఖర్చుతో నిర్మించే ఈ డ్రెయిన్ల వల్ల నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ఇంజినీర్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర స్థాయి సిబ్బంది బస్సులో గ్రామానికివచ్చి వీటిని పరిశీలించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఎంపిక చేసిన 13 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ డ్రెయిన్లు నిర్మిస్తారు. ఉపాధి హామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి జె.సురేష్‌బాబు, ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, స్థానిక తెదేపా నాయకుడు ఉప్పుకొండూరు గురుప్రసాద్, యోగానందం తదితరులు పాల్గొన్నారు.

నిద్ర కాదు... ఇనెమురి!



ఉద్యోగినుల పరిస్థితి భలే విచిత్రంగా ఉంటుంది కదూ! మిగతారోజుల్లో ఇల్లు, ఆఫీసు పనులతో అలసిపోతాం. పోనీ సెలవు రోజుల్లో ఏమైనా విశ్రాంతి దొరుకుతుందా ఏంటి? మరుసటి వారానికి సిద్ధమవడం, ఇల్లు సర్దుకోవడం, కావాల్సినవి తెచ్చుకోవడం.. ఈ పరుగుల మధ్య సెలవు ఎలా వచ్చి పోయిందో కూడా అర్థమవదు. ఇంత ఉరుకుల పరుగుల మధ్య నిద్ర మాత్రం ఏం సరిపోతుంది. దీంతో భోజనం చేశాకో, పనితో అలసిపోయాకో ఆఫీసులో అప్పుడప్పుడూ కళ్లు మూతలు పడటం మామూలే. అలాగని నిద్రపోలేం. ఎలాగోలా ప్రయత్నిద్దామన్నా నిద్రను ఆపుకొంటూ చేద్దామన్నా పనీ ముందుకు సాగదు. అలాంటప్పుడు జపనీయులు ఏం చేస్తారో తెలుసా? 'ఇనెమురి'ని ప్రయత్నిస్తారు. అంటే పడుకోవడమే కానీ ప్రస్తుతంలో ఉండటమని అర్థమట. అదెలాగంటారా? అలసటగా అనిపించినప్పుడు నిద్ర వస్తున్నప్పుడు కుర్చీలో వెనక్కి వాలో, ముందుకు వంగి బల్లమీద తల ఆన్చో పడుకోవడమే. అలాగని గాఢ నిద్రలోకి జారకూడదు. విశ్రాంతి తీసుకున్నా.. పక్కనవాళ్లు పిలవగానే పలికే స్థితిలో ఉంటారు. దీన్నే ఇనెమురి అంటారు. ఈ చిన్న కునుకు మెదడుకు విశ్రాంతిని ఇవ్వడమే కాదు, ఉత్పాదకతనూ పెంచుతుందట. అందుకే అక్కడి కళాశాలలు, ఆఫీసుల్లో ఎవరైనా ఇలా చిన్న కునుకు వేస్తోంటే పనిచేయట్లేదు, బద్ధకిస్తున్నారు అనుకోరట. కష్టపడ్డారు, విశ్రాంతి తీసుకుంటున్నారనే భావిస్తారట. అందుకే కళాశాలల్లో, ఆఫీసుల్లో ఇనెమురికి తప్పక అనుమతి ఉంటుంది. బాగుంది కదూ... అలసట అనిపించినప్పుడు ఇలాంటి రెస్ట్‌కి ప్రాధాన్యం ఇవ్వమంటారు నిపుణులు. పది నిమిషాలే కానీ... ప్రయోజనాలు బోలెడు. ఈసారి ప్రయత్నించి చూడండి మరి.

చినుకుల్లో ఇల్లు... పొడిగా!

వానలు పడుతున్నాయి. వాతావరణంలో తేమ, ఎండ తగ్గడం వంటివి ఇంట్లో ఫంగస్ చేరడానికే కాదు... మనం అనారోగ్యాల బారినపడటానికీ కారణాలే. ఇలాంటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలేంటో తెలుసా?



- వానల కారణంగా తడి మెట్లు, ఫ్లోర్లు ప్రమాదకరంగా మారతాయి. జారిపడే ప్రమాదాన్ని నివారించేందుకు నీరు నిలవకుండా వెంటనే తుడవాలి. తడి గుడ్డలు, కార్పెట్లు... తేమ పడకుండా చూసుకోవాలి. ఒకవేళ తడిస్తే గాలికైనా ఆరేయాలి. లేదంటే ఫంగస్ చేరుతుంది.
- తేమ వల్ల చెక్క సామగ్రి డ్యామేజ్ అవుతుంది. వాటిపై వర్షపు నీరు పడకుండా చూడాలి. అవసరమైతే వాటిని మృదువైన క్రిమినాశినితో తుడవాలి.
- వర్షాకాలంలో దోమలు విస్తారంగా పెరుగుతాయి. టబ్‌లు, బకెట్లలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలి. విండో స్క్రీన్లు, నెట్‌లలో రంధ్రాలు ఉంటే మరమ్మతులు చేయాలి. అప్పుడే డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా ఉండగలం.
- ఈ రోజుల్లో గాలి మార్పిడి తక్కువగా ఉంటుంది. వాతావరణంలో తేమ పెరిగి, ఫంగస్ తయారయ్యే అవకాశముంటుంది. రోజుకు కనీసం ఒకసారైనా తలుపులు, కిటికీలను తెరిచి గాలి వచ్చేటట్లు చేయాలి.
- తేమ వల్ల వచ్చే చెడు వాసనను దూరం చేయటానికి సహజ ఎయిర్ ఫ్రెషనర్స్ లేదా అరోమా ఆయిల్స్ వాడొచ్చు.
- వర్షాల్లో దుస్తులు చల్లగా, తేమగా ఉండటం వల్ల అవి చెడు వాసన వస్తాయి. ఎండ లేకపోయినా, ఫ్యాన్ సమీపంలో ఆరబెట్టడం మంచిది.
- బయట నుంచి ఇంటికి తీసుకొచ్చే వస్తువులు (షూస్, బ్యాగ్స్, ఉల్లిపాయలు, కూరగాయలు) తడి వాతావరణం వల్ల త్వరగా పాడవుతాయి. వాటిని ఇంట్లోకి తీసుకురావడానికి ముందు శుభ్రం చేయాలి.


ప్లాస్టిక్ నుంచి ఫ్యాషన్!


అమిత

'ప్లాస్టిక్ కొనడం మానేస్తాం... సరే! మరి ఇప్పటికే భూమి మీదకు చేరిన, చేరుతున్న వాటి సంగతేంటి? వాటి వల్ల కొన్ని తరాలకు ముప్పు పొంచి ఉంది' అనే **అమితా దేశ్‌పాండే**... దీనికో పరిష్కారం కనుక్కోవాలనుకుంది. ఫలితమే 2015లో ప్రారంభమైన 'రీచర్కా'. ఈమెది పుణె. ఐటీ ఇంజినీర్. బహుళజాతి సంస్థల్లో పనిచేసింది. సీఎస్ఆర్ టీమ్‌లతో కలిసి పనిచేస్తున్నప్పుడు తన దృష్టి ప్లాస్టిక్ మీద పడింది. దీంతో యూఎస్‌లో సస్టెయినబిలిటీ కోర్సు చేయడమే కాదు, సంబంధిత సంస్థలతోనూ పనిచేసింది. భారత్‌కి తిరిగొచ్చాక ఇక్కడి గిరిజనులకు సాయపడాలనుకుంది. దాంతోపాటే ప్లాస్టిక్‌కీ తిరిగి రూపు ఇవ్వాలనుకుంది. ప్లాస్టిక్ కవర్లు, సంచులు తెప్పించి, వాటిని బాగు చేయించి... దారాలుగా వడికిస్తుంది. వాటిని వస్త్రాలుగా వడికించి అందమైన బ్యాగులుగా తీర్చిదిద్దుతుంది. దీనికి సంబంధించిన శిక్షణంతా తనే ఇప్పిస్తుంది. మార్కెటింగ్ వ్యవహారాలూ చూసుకుంటుంది. వీటన్నింటినీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో అమ్ముతోంది. పర్యావరణానికి సాయపడుతూనే ఉపాధినీ కల్పిస్తున్నందుకు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలెన్నో అందుకుంది. 2022లో 'ఫేస్ ఆఫ్ ఇండియా'గా నిలిచిన అమిత ఫోర్బ్స్ గుర్తింపునీ పొందింది. యువతకోసం ఎక్స్‌పరిమెంటల్ టూర్లనీ నిర్వహిస్తోంది అమిత. పర్యావరణంపై అవగాహన కల్పించడం దీని ఉద్దేశం.

'పరిణతి'నీ చెక్ చేసుకోవచ్చు!

సాధారణంగా అమ్మాయిలంటే మెచ్యూర్‌గా ఆలోచిస్తారంటారు. అయినప్పటికీ జీవితంలో ఏదో ఒక దశలో స్నేహితుల నుంచో, ఇంట్లోవాళ్లనుంచో 'కాస్త పరిణతితో ఆలోచించు'... అన్న సలహానీ అందుకునే ఉంటాం. అప్పుడే అసలేంటీ పరిణతి? అన్న ప్రశ్న మనసులో మెదులుతుంది కదా! అత్యుత్సాహం, బాధ, సంతోషం లాంటి భావోద్వేగాల సమయంలోనూ, ప్రమాదకర పరిస్థితుల్లోనూ మనల్ని మనం స్థిమితంగా ఉంచుకోగలగటమే 'పరిణతి' గా చెబుతున్నాయి పరిశోధనలు. మరి ఆ లక్షణాల్లో ఇవీ కొన్ని. ఇందులో మీకెన్ని ఉన్నాయో చెక్ చేసుకోండి.



- చేస్తానన్నవి కచ్చితంగా చేస్తారు. పనిపట్ల నిబద్ధత కలిగి ఉంటారు.
- మీ మాటలు, పనుల మీద మీకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే, భావోద్వేగాల్ని నియంత్రించుకోగలుగుతారు.
- నిర్ణయం తీసుకునే ముందే అన్ని కోణాల్లో ఆలోచిస్తారు.
- ఎంత పరిజ్ఞానం ఉన్నా... వినయంగా ఉంటారు. నేర్చుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు.
- నిత్యం మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటుంటారు. ఎవరిమీదా ఆధారపడరు. ఆర్థిక స్వేచ్ఛ తప్పనిసరి అనుకుంటారు.
- లక్ష్యంపై పూర్తి స్పష్టతతో ఉంటారు. మొత్తం ఒకేసారి చేసేస్తా... అన్నట్లు కాకుండా, ప్రణాళికాబద్ధంగా చిన్న చిన్న భాగాలుగా విడగొట్టుకుని పనులు చేసుకుంటారు.
- మిమ్మల్ని మీరు నిర్లక్ష్యం చేసుకోరు. ఇతరుల కోసం పనిచేసినా, మీ పరిధి ఏంటో కూడా తెలుసుకుంటారు. అలానే, ఇతరుల అభిప్రాయాల్నీ గౌరవిస్తారు.
- మీ తప్పులకు మీరే బాధ్యత తీసుకుని, సరిచేసుకుంటారు. ఇతరులను నిందించరు.
- ఆరోగ్యకర జీవనశైలిని పాటిస్తారు. సృజనాత్మక హాబీలను ఏర్పరచుకుంటారు.
- అలవాట్లు, బంధాలు, ఆలోచనావిధానాలు, మరేదైనా యాక్టివిటీలు... ప్రయోజనకరంగా లేవనుకున్నప్పుడు వదిలేయడానికి ఏమాత్రం సంకోచించరు. సాయం పొందిన వారిని మర్చిపోరు. ఎప్పుడూ కృతజ్ఞతాభావంతో ఉంటారు.

ఈ పదింటిలో ఎనిమిది లేదా అంతకు మించి ఉంటే మీరు పూర్తి స్థాయిలో పరిణతి చెందినట్లే. ఐదు నుంచి ఎనిమిది లోపు ఉంటే పర్వాలేదని అర్థం.

వసుంధర

vasundhara@eenadu.in



గ్రామీణ మహిళలూ వ్యాపారవేత్తలు కావాలి!

'మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. అది ఎంతో ధైర్యాన్నిస్తుంది. అందుకు వృత్తి నైపుణ్యాలు కీలకం' అంటారు ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ఛైర్‌పర్సన్ ప్రతిభా కుందా. అమరజీవి పొట్టి శ్రీరాములు కుటుంబానికి చెందిన ఈమె, ఆ లక్ష్యంతోనే భువనగిరిలో మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. ఆ వివరాలు 'వసుంధర'తో పంచుకున్నారిలా...

డబ్బు ఇస్తే... అది కొంతకాలమే ఉంటుంది. అదే నైపుణ్యాలను అందిస్తే జీవితాంతం ఉపయోగపడతాయి. అందుకే, గ్రామీణ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించటంపై దృష్టి పెట్టా. తాజాగా భువనగిరిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేశా. తక్కువ మందిని తీసుకునే కంటే, ఒక ప్రాంతాన్ని ఎంచుకుని శిక్షణ ఇస్తే దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందనిపించింది. అందుకే, స్థానిక 'మెప్మా' గ్రూప్ మహిళలతో అనుసంధానమయ్యాం. స్కిల్ ప్రోగ్రామ్ తరగతుల నిర్వహణ కోసం ప్రభుత్వం 6 గదులను కేటాయించింది. మొదటి రౌండ్లో భాగంగా... డిజిటల్ లిటరసీ, టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు మొదలుపెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు భాషపరంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ వంటివీ నేర్పిస్తున్నాం. తదుపరి దశలో ఫైనాన్షియల్ లిటరసీ, సైబర్ సెక్యూరిటీ, హాస్పిటాలిటీ, ట్యాలీ ప్రో, డ్రైవింగ్ కోర్సులు, సెల్ఫ్ డిఫెన్స్, లీగల్ రైట్స్, వెడ్డింగ్ ఇండస్ట్రీకి సంబంధించిన నైపుణ్యాలూ నేర్పించాలన్నది మా ప్రణాళిక.

వీటన్నింటికీ కావాల్సిన మెటీరియల్ అంతా మేమే ఉచితంగా ఏర్పాటు చేస్తాం. ఇదంతా సీఎస్ఆర్ ఫండ్స్‌తో చేస్తున్నాం. వాలంటీర్లుగా మా సభ్యులే అక్కడకు వెళ్లి నేర్పిస్తారు. కేవలం మహిళలు వచ్చి నేర్చుకుంటే చాలు. కోర్సు అయిపోయాక, సర్టిఫికెట్ అందిస్తాం. ఆన్‌లైన్‌లో బిజినెస్‌ను ఎలా ప్రమోట్ చేసుకోవాలన్నదీ నేర్పిస్తున్నాం. వాళ్లని మైక్రో ఆంత్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. ప్రస్తుతం 200మంది దాకా మహిళలు ఉన్నారు. ఈ ఏడాది కనీసం 2వేల మందికి నేర్పించాలనేది మా టార్గెట్. ప్రతి ఒక్కరిలోనూ నేర్చుకోవాలనే తపన. దాన్ని చూస్తే మరింతగా చేయాలనే ఉత్సాహం వస్తుంటుంది. అలానే, ఆదిలాబాద్‌లో 4వేల సంవత్సరాల చరిత్ర ఉన్న కళ 'డోక్రా'. అంతరించిపోతోన్న ఈ కళకు తిరిగి జీవం పోయాలన్నది మా ఉద్దేశం. ఇందుకోసం అక్కడి ఐటీడీఏతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కళలో పాతకాలం డిజైన్లు తప్ప కొత్తవి తెలియదు వారికి.


ప్రతిభ

అందుకే, మార్కెట్లో డిమాండ్ ఉన్న కోస్టర్లు, పెన్ స్టాండ్లు, పేపర్ వెయిట్లు వంటివి తయారుచేసేలా ఒక ఆర్టిస్ట్‌ని పెట్టి అక్కడి మహిళలకు శిక్షణ ఇచ్చాం. దాంతో వాళ్లు కొత్త డిజైన్లు నేర్చుకున్నారు. ఆ ఉత్పత్తులను మేమే మార్కెట్ చేయిస్తున్నాం. వాళ్లతో ప్రదర్శనలూ ఇప్పిస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి. అదే మనకూ, మన కుటుంబానికీ గౌరవం. అందుకోసం ఎప్పుడూ కృషి చేయాలి. ఖాళీగా అస్సలు కూర్చోకూడదు. అందుకే, 'సురేంద్రపురి' కళాధామానికి ఎండీగా వ్యవహరిస్తూనే ఈ బాధ్యతలనీ చేపట్టా. పొట్టి శ్రీరాములు మునిమనుమరాలిగా ఆయన ప్రభావమూ నాపై ఉంది. వృత్తి, వ్యక్తిగత జీవితాలను బ్యాలెన్స్ చేయటం కష్టమే. కానీ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే చేయలేనిది ఏదీ లేదు.



తియ్యగా... పుల్లగా!

వర్షాకాలం... వానలతోపాటూ జలుబు, దగ్గు, జ్వరాలు లాంటి ఎన్ని సమస్యల్ని వెంటబెట్టుకుని వస్తుందో. పిల్లల్నీ, పెద్దల్నీ ఈ అనారోగ్యాల బారిన పడకుండా కాపాడటానికి అమ్మలు ఎన్ని ప్రయత్నాలు చేస్తారో. అవన్నీ విఫలయత్నాలైతే... సమస్యల్ని దూరం చేయడానికి వాళ్లకు తెలిసిన వంటింటి చిట్కాలన్నీ పాటిస్తారు. వీటన్నింటి బదులు కాలానికి అనుగుణంగా ప్రకృతి ఇచ్చే పండ్లని తినడం మేలంటారు నిపుణులు. అలా ఈ కాలంలో వచ్చే పండ్లలో ఆలూ బుఖారాలు ఒకటి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఆంథోసైనిన్లు పుష్కలంగా ఉంటాయి. చెడు కొవ్వును తగ్గించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అంతేకాదు, వీటిల్లో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గిస్తుంది. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయుల్ని నియంత్రిస్తాయివి. అలానే, విటమిన్-సి, కె... రోగనిరోధక శక్తిని పెంచి, ఈ కాలంలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరాల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈ పండ్లలో ఫైబర్ కూడా ఎక్కువే. మలబద్ధకం లాంటి జీర్ణ సంబంధిత సమస్యలకు ఇవి చక్కని ఉపశమనం. తీపి, పులుపు సమ్మేళనంతో తినడానికీ బాగుంటాయి. కాబట్టి పిల్లలు కూడా బెట్టు చేయకుండా తినేస్తారు. వ్యాధి వచ్చాక జాగ్రత్తలు తీసుకుంటూ బాధపడేకంటే... రాకుండానే నివారణ చర్యలు తీసుకోవడం మేలు కదూ..!



లింగ సమానత్వంలో కొన్ని అభివృద్ధి చెందిన దేశాలకంటే భారత్ ముందుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ, రాజకీయాలు, వ్యాపారం, క్రీడలు, వైద్యం... ఏ రంగంలో చూసినా మహిళలు ఉన్నత స్థానాల్లో కనిపిస్తారు. సమస్య అక్కడ ఎంతమంది ఉన్నారన్నదే. ఆ విషయంలో కచ్చితంగా పురోగతి సాధించాలి. ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పుడు చాలాచోట్ల గ్లాస్ సీలింగ్ లేదు. మహిళా నాయకత్వం కోసం సంస్థలు తలుపులు తెరచి ఉంచుతున్నాయి.

- నిష్ఠా సత్యం, ఉప ప్రతినిధి, ఐరాస మహిళా విభాగం, భారత్

మీకు తెలుసా?

ప్రెగ్నెన్సీలో తల్లి రక్త పరిమాణం 30–50 శాతం పెరుగుతుందట. ఈ దశలో శిశువు ఎదుగుదలకు అనుగుణంగా ఎక్కువ రక్తాన్ని పంప్ చేయటానికి తల్లి గుండెపై ఎక్కువ భారం పడుతుందట. ఈ సమయంలో హార్ట్‌రేట్ కాస్త పెరుగుతుందట. అయితే, డెలివరీ తరవాత ఆ రక్త పరిమాణం తగ్గి, గుండెపై ఉండే ఆ పని భారమూ తగ్గుతుందట.

శోధిత

పోషకాలు పెంచే... 'పాట్ హాపింగ్'

ఇంటిల్లిపాదికీ ఆరోగ్యాన్ని అందించాలని అమ్మ ఎప్పుడూ తపన పడుతుంది. అందుకే, ఏం వండినా సరే... అది ఎలా చేస్తే బావుంటుందనే దానిపై ఓ చిన్నపాటి పరిశోధనే చేసేస్తుంది. అయితే, అనేక ఆరోగ్య ప్రయోజనాలనిచ్చే గుడ్డును ఎలా ఉడికిస్తే మంచిదో చెబుతున్నాయి తాజా పరిశోధనలు. గుడ్డులో పోషకాలు పెరిగేలా, దానికి మంచి టెక్స్చర్ వచ్చేలా వండే సైంటిఫిక్ పద్ధతిని కనిపెట్టారు నేపుల్స్ ఫెదెరికో 2 యూనివర్సిటీ, ఇటలీ జాతీయ పరిశోధనా మండలి నేషనల్ రిసెర్చ్ కౌన్సిల్ పరిశోధకులు. అదే పాట్ హాపింగ్ పద్ధతి. దీన్నే పీరియాడిక్ కుకింగ్ అనీ అంటారు. దీన్లో భాగంగా ముందుగా గుడ్లను వేడి నీళ్లలో రెండు నిమిషాలు ఉడికించి, ఆ తరవాత గోరువెచ్చని నీటిలో ఇంకో రెండు నిమిషాలు ఉడికించాలట. ఇలా ఉడికేంత వరకూ చేయాలట. ఇలా చేయటం వల్ల గుడ్డులోని తెల్లసొన, పచ్చసొన రెండూ బాగా ఉడికి, టెక్స్చర్‌కూడా బాగుంటుందట. ఈ పద్ధతి వల్ల గుడ్డు పచ్చసొనలో పాలీఫెనాల్స్ స్థాయులు పెరుగుతాయట. క్యావిటీల నుంచి రక్షణ కల్పించటం, టైప్ 2 డయాబెటీస్ నుంచి కాపాడటంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందించటంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయట. కాబట్టి, సాధారణ బాయిలింగ్ పద్ధతుల కంటే ఇది ఉత్తమమనీ, కాస్త ఎక్కువ సమయం తీసుకున్నా సరే ఈ విధానాన్ని పాటించటం వల్ల మరిన్ని పోషకాలు పొందొచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. మనం కూడా ప్రయత్నిద్దామా మరి.



ఇప్పుడు సెటిల్ చేసుకోవచ్చా?

మా తాతయ్య తన అన్న చనిపోయిన తర్వాత అతని కొడుకుని పెంచారు. ఆపై కొన్నాళ్లకు నాన్న, బాబాయ్, అత్తయ్య పుట్టారు. మా తాత ఆస్తిని అతడు అనుభవిస్తుంటే మేము పార్టిషన్ దావా వేశాం. డిక్రీ వచ్చింది. ఇప్పుడు సెటిల్ చేసుకుందాం అంటున్నారు. చేసుకోవచ్చా? ఎలా చేసుకోవాలి? – ఓ సోదరి

భాగస్వామ్య దావా ప్రిలిమినరీ డిక్రీ ప్రకారం ఎవరెవరికి ఎంత వాటా రావాలన్నది కోర్టు నిర్ణయిస్తుంది కానీ ఎలా పంచుకోవాలో నిర్ణయించదు. అయితే ఇది పాసైన 12 సంవత్సరాల లోపు ఫైనల్ డిక్రీ పాస్ చేయమని సూట్ వేసిన వాళ్లు కోర్టులో మళ్లీ పిటిషన్ వేసుకోవాలి. అప్పుడు దాని ప్రకారం వాళ్లంతట వాళ్లు ఎలా పంచుకోవాలో నిర్ణయించుకోవచ్చు. అలా చేయడంలో ఇబ్బందులు ఉంటే న్యాయస్థానం సాయం కోరవచ్చు. ఒకవేళ దానిపైనా ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీల్‌కి వెళ్లే అవకాశమూ ఉంది. ప్రిలిమినరీ డిక్రీ వచ్చిన తర్వాత ఎవరి వాటాను వాళ్లు, బయటవాళ్లకి అమ్మడానికి ఉండదు. వారిలో ఒకరికి లేదా ప్రతివాదికి కానీ అమ్మదలుచుకుంటే ఆ విధంగా అందరూ కలిసి సెటిల్మెంట్ డీల్ రాసుకుని కోర్టుకి సమర్పించాలి. అప్పుడు న్యాయస్థానం దాన్ని రిజిస్టర్ చేసి ఫైనల్ డిక్రీ పాస్ చేస్తుంది. మీరు ఏదైతే మెమో ఆఫ్ అండర్‌స్టాండింగ్‌తో సెటిల్మెంట్ చేసుకున్నారో దాని ప్రకారం 6 నెలల్లోపు అందరూ బాండ్ పేపర్ మీద సంతకాలు పెట్టి కోర్టుకి సమర్పించాలి. దాని ప్రకారం అందర్నీ విచారించి ఎవరికీ అభ్యంతరాలు లేకుంటే ఫైనల్ డిక్రీ పాస్ చేస్తారు. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా చేయించుకోండి.

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి, న్యాయవాది

అన్నయ్యకి వాటా ఇవ్వాల్సిందేనా?

తాతయ్య చనిపోయాక... ఆయన ఆస్తి అమ్మమ్మకు బదిలీ అయ్యింది. ఇది జరిగి 65 ఏళ్లు అవుతోంది. అమ్మ పెళ్లైన కొన్నేళ్లకే భర్తను కోల్పోయింది. తర్వాత తనూ చనిపోవడంతో అమ్మమ్మ నాకు, తమ్ముడికి ఆస్తిపై వీలునామా రాసి మరణించింది. అయితే తనకు వాటా రాయలేదన్న ఉద్దేశంతో అన్నయ్య కోర్టుకెక్కాడు. తాత ఆస్తిలో తన తల్లికి వాటా ఉంటుందనీ, అందులో తనకు భాగం వస్తుందనీ కోర్టును ఆశ్రయించాడు. అసలు వీలునామా చెల్లుబాటు అవుతుందా? అమ్మమ్మ ఆస్తిలో మా అన్నయ్యకు వాటా ఇవ్వాల్సిందేనా? – ఓ సోదరి

మీ అమ్మమ్మకి బదిలీ అవ్వగానే అది పూర్తిగా ఆవిడకే చెందిన ఆస్తి అయిపోయింది. 65 ఏళ్ల కిందటే హిందూ వారసత్వ చట్టం-1956 వచ్చింది. అందులో సెక్షన్-14... స్త్రీలకు గిఫ్ట్, వారసత్వం, పసుపుకుంకుమల ద్వారా వచ్చిన, భర్త ద్వారా సంక్రమించిన ఆస్తి అంతా స్వార్జితమని చెబుతోంది. ఇక మీ అమ్మమ్మ రాసిన వీలునామా రిజిస్టర్ అయ్యిందా? లేదా విల్లు కచ్చితంగా ఉండాలి అంటే దాన్ని రాసిన వారితోపాటు ఇద్దరు సాక్షుల సంతకం ఉండి ఉండాలి. ఒకవేళ సాక్షులు ఇప్పుడు లేకపోయినా వారి సంతకాలను నిరూపించవచ్చు అని ఇటీవల ఓ కోర్టు తీర్పునిచ్చింది. వీలునామా ఎప్పుడూ రాసిన వారి తదనంతరమే చెల్లుబాటులోకి వస్తుంది. మీ అన్నయ్య భాగస్వామ్య దావా వేసి ఉంటే అమ్మమ్మ తరఫున... అది ఆవిడ స్వార్జితమని వాదించొచ్చు. మీ అమ్మకి చెందాల్సిన వాటా ఆవిడ వీలునామా రాయకుండా చనిపోయినప్పుడు మాత్రమే మీ అన్నయ్యకి వస్తుంది. మీ అమ్మమ్మ మీ అన్నయ్యకు వాటా ఇవ్వకపోవడానికి కారణాలు ఏమైనా ఉన్నాయా? కోర్టులో విల్ డీడ్ చూపించి నిరూపించుకుంటే మీ ఆస్తి మీరు పొందవచ్చు. సాక్షులు, సాక్ష్యాలను బట్టి మీరు ఈ కేసు నెగ్గడం ఆధారపడి ఉంటుంది.

బంగారం - వెండి



7న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,860	90,500	1,10,518
విజయవాడ	96,630	90,100	1,10,900
ప్రొద్దుటూరు	96,900	89,150	1,08,500
రాజమహేంద్రవరం	98,290	90,100	1,20,000
విశాఖపట్నం	97,940	90,100	1,12,000
తమిళనాడు	-----	90,100	1,20,000



నగా నట్రా

పుల్లాకు... నేటి అమ్మాయిలకూ!



పెళ్లి వేడుక... పెళ్లికూతురు ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారంతా. ఆ ఎదురు చూపులకు తెర తీస్తూ వేదిక మీదకు అడుగు పెట్టింది వధువు. ఒంటి నిండా బంగారం. తాజా డిజైన్లతో కూడిన నెక్లెస్‌లు, బంగారు గాజులు... కానీ అక్కడి మహిళల చూపంతా ఆమె ముఖమ్మీదే, ముఖ్యంగా ముక్కుకు అందంగా అమరిన పుల్లాకు మీదే! చక్కని ముఖానికి ఎంత నిండుదనం వచ్చిందో అనుకున్నారట. పుల్లాకు లేదా బులాకీకి ఒకప్పుడు ఎంత ప్రాధాన్యం ఉండేదో వివరించే ఉదాహరణే ఇది. తమిళనాడు సంప్రదాయ నగల్లో ఇదీ ఒకటి. భరతనాట్యం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్యాలు నేర్చుకునేవారికీ ఇది పరిచయమే. దీన్ని ముక్కుకు ఇరువైపులా కాదు, మధ్యలో పెడతారు. ఇది కేవలం ఆభరణమే కాదు. అంతకు మించి. దీన్ని మాతృత్వానికి గుర్తుగా... చెడు దృష్టి వధువు మీద పడొద్దనీ, అందరి ఆశీర్వాదాలూ ఆమెకు దక్కాలనీ పెడతారట. చాలావరకూ పెళ్లిళ్లలోనే పెట్టేవారు. దీంతో సాక్షాత్తూ ఆ అమ్మవారి దీవెనలు వధువు వెంటే ఉంటాయన్న నమ్మకం కూడా. ఇప్పటిది కాదు ఈ ఆచారం 16వ శతాబ్దం నుంచీ ఉంది. అకస్మాత్తుగా ఇప్పుడెందుకు దీని ప్రస్తావన అన్న అనుమానమొచ్చిందా? ఏఐ, 6జీ... ఎన్ని టెక్నాలజీలు రానీ... ఏ రంగంలోనైనా దూసుకుపోనీ! అలంకరణ విషయానికొచ్చే సరికి అమ్మాయిలు మనసు పడేది సంప్రదాయ నగలపైనే! అందుకు రుజువే ఈ పుల్లాకు. పెళ్లి మాత్రమే కాదు, సంప్రదాయ వేడుకలేవైనా ఇప్పుడు ప్రాంతంతో సంబంధం లేకుండా మన అమ్మాయిలూ ఈ నగపై మనసు పారేసుకుంటున్నారు. సీజెడ్స్, డైమండ్స్, ఫ్లోరల్ డిజైన్లతో చేయించుకుంటున్నారు. ఇదిగో ఇలా వేడుకేదైనా పెట్టుకుని మురిసిపోతున్నారు. ఏమాటకా మాటే చెప్పుకోవాలి... దీన్ని పెట్టుకున్న అమ్మాయిలను చూడగానే కుందనపు బొమ్మ అనాలని అనిపించట్లేదూ? మీకూ అలా సిద్ధమవాలని ఉందా? అయితే ఓసారి ప్రయత్నించేయండి... ఓ బులాకీని!



రెండు వారాల్లో ఖాళీ చేస్తా

అధికార నివాస వివాదంపై జస్టిస్ చంద్రచూడ్

దిల్లీ: ఏడు నెలల క్రితం పదవీ విరమణ చేసినా ఇంకా తాను అధికార నివాసం ఖాళీ చేయని విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్పందించారు. మరో రెండు రోజుల్లో లేదా గరిష్ఠంగా రెండు వారాల్లో... భవనాన్ని ఖాళీ చేస్తానని జస్టిస్ చంద్రచూడ్ సోమవారం ఒక వార్తా సంస్థకు వివరణ ఇచ్చారు. త్వరలోనే తాము అద్దె చెల్లింపు ప్రాతిపదికన మరో ప్రభుత్వ భవనంలోకి మారుతామని ఆయన అన్నారు. కొత్త నివాసం సిద్ధమైందని తనకు చెప్పగానే వెళ్లిపోతామన్నారు. ప్రస్తుతం ఆయన తన భార్య కల్పన, దివ్యాంగులైన తన ఇద్దరు కుమార్తెలు ప్రియాంక, మహిలతో కలిసి దిల్లీలో నంబర్ 5, కృష్ణమీనన్ మార్గ్‌లోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధికార నివాసంలో ఉంటున్నారు. "మేం లగేజి అంతా ప్యాక్ చేసేశాం. కొంత లగేజి ఇప్పటికే కొత్త ఇంటికి తరలించేశాం. మరికొంత స్టోర్ రూమ్‌లో మిగిలివుంది" అని ఆయన వార్తా సంస్థకు తెలియజేశారు. వివాదంపై విచారం వ్యక్తం చేస్తూ తన ఇద్దరు కుమార్తెల ఆరోగ్య సమస్యల్ని గురించి వివరించారు. "నా పిల్లలు నెమలీన్ మయోపతీ అనే కండర సంబంధమైన అనువంశిక అనారోగ్య స్థితితో బాధపడుతున్నారు. వారికి కొన్ని ప్రత్యేక వైద్య సంబంధ అవసరాలున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. రిటైరైనా అధికార నివాసంలో మరి కొంత కాలం అదనంగా ఉన్నది తానొక్కటే కాదని, గతంలో కూడా కొందరికి ఆ సదుపాయం కల్పించారని అన్నారు.



అందరూ చేసే పనులే మీరూ చేస్తే..



ఇతరులు వెళ్లడానికి సాహసించని మార్గాన్ని మీరు ఎంచుకోండి. ఎవ్వరూ ఎదుర్కోవడానికి ధైర్యం చేయలేని సవాళ్లను స్వీకరించండి. ఇంతవరకూ పరిష్కరించడానికి ముందుకురాని సమస్యలను మీరు పరిష్కరించడానికి నడుంబిగించండి. అప్పుడు ఇంతవరకెవ్వరికీ సాధ్యం కాని ఫలితాలను మీరు సొంతం చేసుకుంటారు. అలా కాకుండా అందరూ చేసే పనులే మీరూ చేస్తుంటే, అందరిలో ఒకరిగానే మిగిలిపోతారు.

– డేవిడ్ నికోలస్, పర్సనల్ గ్రోత్ కోచ్

రేపు కార్మిక సంఘాల భారత్ బంద్

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘాలు, వాటి అనుబంధ సంఘాల ఐక్య వేదిక బుధవారం సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా 'భారత్ బంద్' నిర్వహించనున్నట్లు తెలిపింది. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పోస్టల్, గనులు, జాతీయ రహదారులు, నిర్మాణం తదితర రంగాలకు చెందిన కార్మికులు ఈ నిరసనలో పాల్గొననున్న నేపథ్యంలో సాధారణ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా కార్మిక సంఘానికి ఐక్యవేదిక పిలుపునిచ్చింది. "ఈ సమ్మెలో రైతులు సహా 25 కోట్ల మంది కార్మికులు పాల్గొనబోతున్నారు" అని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం వార్షిక కార్మిక సమావేశాన్ని ఏర్పాటు చేయడం లేదని, కార్మిక వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకమైన విధానాలను అవలంబిస్తోందని ఐక్యవేదిక ఆరోపించింది.

కింగ్ కోబ్రాను బంధించిన మహిళా అధికారి



తిరువనంతపురం: అత్యంత విషపూరితమైన కింగ్ కోబ్రా ఎదురుపడితే ఇంకేముంది.. మనలాంటివారికి ప్రాణాలు పైనే పోతాయి. కానీ, కేరళలోని అటవీ శాఖకు చెందిన ఓ మహిళా అధికారి ఏమాత్రం భయపడకుండా సాహసానికి దిగారు. పరుథిపల్లీ రేంజ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రోషిణి.. పెప్పరా అభయారణ్యంలోని ఓ కాలువలో 18 అడుగుల పొడవున్న కింగ్ కోబ్రాను ఓ కట్టె సాయంతో చాకచక్యంగా పట్టుకొని సంచిలో బంధించారు. గతంలోనూ రోషిణి 500 పైగా పాములను పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మా మద్దతు ఆర్జేడీకే: అఖిలేశ్



లఖ్‌నవూ: త్వరలో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు ఆర్జేడీకేనని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. సోమవారం లఖ్‌నవూలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా సంపూర్ణ మద్దతు లాలూప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లకే. యూపీలో భాజపా చేసిన కుంభకోణాలను బిహార్ ఎన్నికల ప్రచారంలో బయటపెడతాం" అని అఖిలేశ్ పేర్కొన్నారు.

ప్రతీకార సుంకాలు 1కి వాయిదా

- జపాన్, దక్షిణ కొరియాలపై 25%
- చర్చలకు రావాలని మిగిలిన దేశాలకు సూచన



వాషింగ్టన్: ఆసియాలో తమకు అత్యంత కీలకమైన భాగస్వాములుగా ఉన్న జపాన్, దక్షిణ కొరియాలపై ట్రంప్ ప్రతీకార సుంకాల మోత మోగించారు. ఈ రెండు దేశాలపై 25శాతం సుంకాలను విధిస్తూ సోమవారం లేఖలను విడుదల చేశారు. ఈ సుంకాలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. రెండు దేశాల నేతలను ఉద్దేశిస్తూ రాసిన లేఖలను ఆయన తన సామాజిక మాధ్యమం ట్రూత్‌లో ఉంచారు. రెండు దేశాలు ప్రతీకార సుంకాలను పెంచవద్దని, అలా చేస్తే వారి ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు దెబ్బతింటాయని హెచ్చరించారు. 'మీరు ఏ కారణాలవల్ల సుంకాలను పెంచినా ఇప్పుడు మేం విధించిన 25శాతానికి అదనంగా ఆ సుంకాలను వేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మిగిలిన దేశాలకూ ప్రతీకార సుంకాల గడువును ఆగస్టు 1 వరకు పొడిగించారు.

భారత్‌కు మరికొంత సమయం

సుంకాల ఉపశమనానికి ఇచ్చిన గడువు బుధవారంతో ముగియనుండటంతో దానిని ఆగస్టు 1 వరకు పొడిగిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సోమవారం ట్రంప్ సంతకం చేశారు. ఈలోగా చర్చలకు రావాలని ఆయా దేశాలపై ఆయన ఒత్తిడి తెస్తున్నారు. ఒప్పందాలు కుదుర్చుకోని దేశాలకు సోమవారం నుంచి లేఖలను పంపడం ప్రారంభించిన ప్రభుత్వం.. ఆగస్టు 1 నుంచి భారీ సుంకాల మోత మోగించనున్నట్లు హెచ్చరిస్తోంది. దీంతో భారత్‌కు మరికొంత కాలం గడువు లభించింది. బుధవారంలోగా భారత్, అమెరికాల మధ్య ఒప్పందం కుదిరే అవకాశముందని తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ.. తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలకు ఇది దారితీసింది. ప్రపంచ స్టాక్ మార్కెట్లలో సంక్షోభ తలెత్తడంతో సుంకాలను 90 రోజులపాటు ట్రంప్ వాయిదా వేశారు. ఈలోగా ఆయా దేశాలు ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఆ గడువు బుధవారంతో ముగియనుంది. దీంతో మరో సారి సుంకాల యుద్ధం తెరమీదకు వచ్చింది.

బ్రిక్స్‌కు మద్దతిచ్చే దేశాలపై 10% అదనపు సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, బీజింగ్: వాణిజ్య సుంకాల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక ప్రకటన చేశారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే దేశాలపై 10% అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఇందులో మినహాయింపులేవీ ఉండవని స్పష్టం చేశారు. 'ట్రూత్ సోషల్'లో ఈ మేరకు పోస్ట్ పెట్టారు. ఏకపక్ష సుంకాల పెంపుపై బ్రిక్స్ కూటమి ఆదివారం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు స్పందించారు.

బ్రిక్స్ ఘర్షణ కోరుకోదు: చైనా

బ్రిక్స్‌కు మద్దతిచ్చే దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామన్న ట్రంప్ హెచ్చరికపై చైనా ఆచితూచి స్పందించింది. బ్రిక్స్ ఘర్షణను కోరుకునే కూటమి కాదని స్పష్టం చేసింది. ఏ ఒక్క దేశాన్నీ అది లక్ష్యంగా చేసుకోదని కూడా పేర్కొంది. వాణిజ్య/సుంకాల యుద్ధంలో విజేతలెవరూ ఉండబోరని వ్యాఖ్యానించింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ బీజింగ్‌లో విలేకరుల సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు.

బిహార్‌లో ఓటరు జాబితా సవరణపై 10న సుప్రీం విచారణ



దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలుచేస్తూ దాఖలైన పలు అభ్యర్థనలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ నెల 10న విచారణ చేపట్టనున్నట్లు జస్టిస్ సుధాంశు దూలియా, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన పాక్షిక పనిదిన(పీడబ్ల్యూడీ) ధర్మాసనం వెల్లడించింది. పలువురు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ నేతృత్వంలోని న్యాయవాదుల బృందం చేసిన అభ్యర్థనల్ని పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు గురువారం విచారణ చేపడతామని ప్రకటించింది. నవంబరులో బిహార్‌లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంత స్వల్ప కాలంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ పూర్తి చేయడం అసాధ్యమని కపిల్ సిబల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 8 కోట్ల మంది ఓటర్లుండగా జాబితా సవరణ కసరత్తులో ఓటర్లు నాలుగు కోట్ల మంది తమ గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదికి ముందస్తు నోటీసులు ఇవ్వాల్సిందిగా ధర్మాసనం పిటిషనర్లను కోరింది. ఎన్నికల ఆధారాలుగా ఆధార్ కార్డును కానీ, ఓటరు కార్డును కానీ గుర్తింపు పత్రంగా అంగీకరించడం లేదని మరో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టు దృష్టికి తెచ్చారు.

ఓటు హక్కు హరించే తుంటరి చేష్ట: కాంగ్రెస్

బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకించే విషయంలో దేశ ప్రతిపక్ష పార్టీలన్నీ సమైక్యంగా ఉన్నాయని కాంగ్రెస్ వెల్లడించింది. సవరణను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఆ పార్టీ ఎన్నికల సంఘం చర్యను ఓటు హక్కు హరించే తుంటరి విధానంగా అభివర్ణించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో న్యాయం చేస్తుందన్న పూర్తి నమ్మకం తమకుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ అన్నారు.

హూతీల మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ దాడులు

- ఎర్ర సముద్రంలో మరో ఓడపైనా హూతీల దాడి!

దుబాయ్: ఇజ్రాయెల్ సైన్యం సోమవారం యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారుల నియంత్రణలోని ఓడరేవులు, ఇతర మౌలిక సదుపాయాలపై దాడులు జరిపింది. ఎఫ్-16 యుద్ధ విమానంతో చేసిన దాడికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది. మూడు ఓడరేవులు, ఒక విద్యుదుత్పత్తి కర్మాగారంపై దాడులు కొనసాగాయి. లైబీరియా జెండా ఉన్న వాణిజ్య నౌక 'మేజిక్ సీస్'పై ఎర్ర సముద్రంలో దాడి ఘటన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ నుంచి వస్తున్న ఆయుధాలను రవాణా చేసేందుకు హూతీలు ఈ ఓడరేవుల్ని వాడుకుంటున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపించింది. రెండేళ్ల క్రితం హైజాక్‌కు గురైన 'గెలాక్సీ లీడర్' నౌకను తాజాగా ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ నౌకపై రాడార్ వ్యవస్థను హూతీలు అమర్చుకున్నారని, ఇతర నౌకల కార్యకలాపాలపై కన్నువేసి ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించింది. తిరుగుబాటుదారులు క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. మేజిక్ సీస్ నౌకపై దాడి చేసింది తామేనని హూతీలు తాజాగా ప్రకటించారు. తీవ్రంగా దెబ్బ తిన్న ఆ నౌకనుంచి 22 మంది సిబ్బంది బయట పడగా అది సోమవారం సముద్రంలో మునిగిపోయింది. తాజాగా ఎర్ర సముద్రంలోనే మరో నౌక పైనా చిన్న పడవలతో, డ్రోన్లతో దాడి జరిగింది. ఇది హూతీల పనేనని భావిస్తున్నారు.

దలైలామాకు మోదీ శుభాకాంక్షలపై చైనా అభ్యంతరం

బీజింగ్: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ పుట్టినరోజును పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలపడంపై చైనా అభ్యంతరం తెలిపింది. 'టిబెట్ సంబంధిత అంశంలో బీజింగ్ సున్నితత్వాన్ని దిల్లీ పరిగణనలోకి తీసుకోవాలి. 14వ దలైలామా అనుసరిస్తున్న చైనా వ్యతిరేక వేర్పాటువాద స్వభావాన్ని గుర్తించాలి. టిబెట్‌కు సంబంధించిన విషయాల్లో చైనాకు ఇచ్చిన హామీని గౌరవించాలి' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన దలైలామా జన్మదిన వేడుకలకు భారత ప్రతినిధులు హాజరుకావడాన్ని ఆక్షేపించారు. దలైలామా వారసుడి అంశం కూడా భారత్-చైనా మధ్య ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారింది.

హిమాచల్‌లో బ్యాంకును ముంచెత్తిన వరద

- బంగారం, డబ్బు ఏమైందోనని స్థానికుల్లో ఆందోళన

దిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు ఓ బ్యాంకులోకి వరదనీరు ముంచెత్తడంతో తమ సొమ్ము ఏమైందోనని డిపాజిటర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండీ జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని 8 వేల మంది ప్రజలకు ఒక సహకార బ్యాంకు ఉంది. గత నెల నుంచి కురుస్తున్న వర్షాల ప్రభావం దానిపై పడింది. వాన నీరు, కొట్టుకొచ్చిన శిథిలాలు బ్యాంకు రెండంతస్తుల భవనంలోని మొదటి ఫ్లోర్‌ను ముంచెత్తాయి. దాంతో దాని షట్టర్లు దెబ్బతిన్నాయి. ఈ విపత్తుతో బ్యాంకులోని రూ.కోట్ల నగదు, బంగారం డిపాజిట్లపై స్పష్టత లేకుండా పోయింది. వీటిలో కొన్ని కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో ఇప్పటివరకు 78 మంది ప్రాణాలు కోల్పోయారు. 37 మంది ఆచూకీ లేకుండా పోయారు.



వరదలకు ధ్వంసమైన బ్యాంకు

ఎఫ్‌అండ్‌వో హస్తలాఘవంపై మోదీ మౌనం


- సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చే ప్రయత్నం
- రాహుల్ గాంధీ ధ్వజం



దిల్లీ: సామాన్య మదుపరులను ముంచేలా స్టాక్ మార్కెట్లోని ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్‌అండ్‌వో) పెద్ద పెట్టుబడిదారులు హస్తలాఘవానికి పాల్పడటంపై ప్రధాని మోదీ మౌనం దాలుస్తున్నారని, దీనివల్ల సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఎఫ్ అండ్‌వోలో పలు లొసుగులు ఉన్నాయని తాను గతంలోనే హెచ్చరించానని తెలిపారు. 'ఎఫ్‌అండ్‌వో మార్కెట్ పెద్ద పెట్టుబడిదారులకు ఆటస్థలంగా మారిందని 2024లోనే నేను చెప్పా. దీనివల్ల సామాన్య మదుపరుల జేబులు ఖాళీ అవుతున్నాయని హెచ్చరించా. దానిని నిజం చేస్తూ జేన్ స్ట్రీట్ గ్రూపు వేల కోట్ల రూపాయల హస్తలాఘవానికి పాల్పడిందని ఇప్పుడు సెబీ చెబుతోంది. మరి ఇంతకాలం పాటు సెబీ దీనిపై మౌనంగా ఎందుకు ఉంది' అని సోమవారం ఎక్స్‌లో రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుంభకోణం బయటపడ్డాకా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇలాంటి మరిన్ని రిగ్గింగ్‌లు మార్కెట్లో జరిగితే పరిస్థితేంటని నిలదీశారు. 'ఎవరి ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది. ఇంకా ఎన్ని పెద్ద తిమింగలాలు.. సామాన్య మదుపరులను ముంచనున్నాయి.. ఇలాంటి ప్రతి కేసులోనూ మోదీ ప్రభుత్వం.. సంపన్నులను మరింత సంపన్నులను చేస్తోంది' అని రాహుల్ ఆరోపించారు. నియంత్రణలేని ఎఫ్ అండ్‌వో ట్రేడింగ్.. ఐదేళ్లలో 45 రెట్లు పెరిగిందని, 90శాతం మంది చిన్న మదుపరులు 1.8 లక్షల కోట్లు నష్టపోయారని తాను గతంలో పెట్టిన పోస్టును రాహుల్ దీనికి జత చేశారు. ఎఫ్‌అండ్‌వోలో ఉన్న పెద్ద పెట్టుబడిదారుల పేర్లు వెల్లడించాలని సెబీని డిమాండు చేశారు.

పైలట్ల వైద్య పరీక్షలపై డీజీసీఏ కొత్త నిబంధనలు

ఇంటర్నెట్‌డెస్క్: వాణిజ్య విమానాలు నడిపే పైలట్ల వైద్య పరీక్షలపై 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) ఇచ్చిన ఆదేశాలు విమానయాన సంస్థల్లో కలవరం సృష్టిస్తున్నాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బోర్డింగ్ సెంటర్లో మాత్రమే ఈ పైలట్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్పష్టంచేసింది. విధుల్లో ఉండగా పైలట్లు గుండెపోటుకు గురికావడం వంటి సంఘటనలను పరిగణనలోకి తీసుకున్న డీజీసీఏ ఇలాంటి కఠిన ఆదేశాలు జారీ చేసింది. మిలిటరీ పైలట్లకు నిర్వహించే వైద్య పరీక్షల స్థాయి కఠినంగా ఉంటుందని, వాటిని వాణిజ్య విమానాలను నడిపే పైలట్లకు వర్తింపజేయడం సరికాదని విమానయాన సంస్థలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాయి. ఈ పరీక్షలతో ఎక్కువమంది వైద్యపరంగా అనర్హులుగా మారి, పైలట్ల కొరతకు దారితీయొచ్చని, ఇది విమానయాన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని ఆందోళన చెందుతున్నాయి.



ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. దాని నుంచి దాదాపు 18 కి.మీ.ఎత్తుకు బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసింది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రస్తుతం ఆ ప్రదేశంలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏడాదిలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది మూడోసారి

అంత్యక్రియలకు వెళ్లి దొరికిన నిందితుడు

బిహార్ వ్యాపారవేత్త హత్య కేసులో కీలక పరిణామం

పట్నా: బిహార్‌లో ప్రముఖ వ్యాపారవేత్త, భాజపా నేత గోపాల్ ఖేమ్కా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మరి కొన్ని నెలల్లో ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఖేమ్కా హత్య రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో పోలీసులు ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేశారు. తాజాగా ఆయన అంత్యక్రియలు నిర్వహించినప్పుడు ఓ నిందితుడు పూలదండ తీసుకొని వెళ్లి పోలీసులకు దొరికిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఖేమ్కా కుటుంబసభ్యులు ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు, వ్యాపారవేత్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వ్యాపారవేత్తను హత్య చేసిన నిందితుడు కూడా తనపై ఎవరికీ అనుమానం రాకూడదనే ఉద్దేశంతో పూలదండ తీసుకొని అంత్యక్రియలకు వచ్చాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పట్నాకు చెందిన పున్‌పున్ ప్రాంత నివాసి రోషన్ కుమార్‌గా గుర్తించారు. హత్య కేసులో అతడి పాత్రపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. హత్యకు ముందు ఓ టీ దుకాణం వద్ద తాము కూర్చున్నామని అతడు తెలిపినట్లు పేర్కొన్నారు. గోపాల్ ఖేమ్కా హత్యకు ముందు ఇద్దరు వ్యక్తులు ఆయన కదలికలను ట్రాక్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.

హోమియో వైద్యులూ ఆధునిక మందులు సిఫార్సు చేయొచ్చు

మహారాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నోటిఫికేషన్

ముంబయి: ఆరు నెలల ఫార్మకాలజీ కోర్సు పూర్తి చేసిన హోమియో వైద్యులు కూడా తమ రోగులకు అలోపతి (ఆధునిక) మందులు సూచించవచ్చని మహారాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (ఎంఎంసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. కౌన్సిల్ నిర్ణయంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తీవ్రంగా స్పందించింది. మహారాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నిర్ణయం ఆధునిక వైద్య విధానాన్ని నీరుగారుస్తుందని పేర్కొంది. కౌన్సిల్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఐఎంఏ జిల్లా, తాలూకా విభాగాలు జిల్లా కలెక్టర్లు, తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు దరఖాస్తులు సమర్పిస్తాయని అసోసియేషన్ తెలిపింది. తమ ఆందోళనను పట్టించుకోని పక్షంలో ఈ నెల 11న 24 గంటల పాటు అత్యవసరం కాని వైద్య సేవల్ని నిలిపివేస్తామని హెచ్చరించింది.

తహవ్వుర్ రాణా నేరాంగీకారం!

- ఉగ్ర దాడుల సమయంలో ముంబయిలోనే..
- ఎన్ఐఏ విచారణలో వెల్లడి



ఇంటర్నెట్ డెస్క్: ముంబయి ఉగ్ర దాడుల కుట్రదారుడు తహవ్వుర్ రాణా నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. దాడుల సమయంలో తాను ముంబయిలోనే ఉన్నట్లు అతడు ఒప్పుకొన్నట్లు సమాచారం. జాతీయ దర్యాప్తు సంస్థ విచారణలో వీటితోపాటు పలు విషయాలను అతడు అధికారుల ముందు వెల్లడించినట్లు తెలిసింది. తాను పాకిస్థాన్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌గా వ్యవహరించానని పేర్కొన్నట్లు సమాచారం. గల్ఫ్ యుద్ధం సమయంలోనూ సీక్రెట్ మిషన్‌లో భాగంగా పాక్ సైన్యం తనను సౌదీ అరేబియాకు పంపిందని తహవ్వుర్ రాణా చెప్పినట్లు తెలిసింది. తాను, తన స్నేహితుడు హెడ్లీ.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబాతో కలిసి అనేక శిక్షణల్లో పాల్గొన్నట్లు వెల్లడించాడని సమాచారం. ఉగ్రవాదుల ప్రణాళికలో భాగంగా తన సంస్థకు చెందిన ఇమ్మిగ్రేషన్ సెంటర్‌ను ముంబయిలో ప్రారంభించడానికి తాను వచ్చానని అతడు తెలిపాడని సమాచారం. అందులో భాగంగానే పలు ఆర్థిక లావాదేవీలు చేశానని అతడు అంగీకరించినట్లు తెలిసింది. ఆ సమయంలోనే ముంబయిలోని ప్రఖ్యాత రైల్వే స్టేషన్ ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ సహా పలు ప్రదేశాలను సందర్శించినట్లు అతడు తెలిపాడని సమాచారం.

పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడైన తహవ్వుర్ రాణా 26/11 ముంబయి దాడుల్లో కీలక కుట్రదారుడు. ముంబయి దాడులకు ముందు ఆ కుట్రకు మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబయిలో రెక్కీ నిర్వహించగా.. అతడికి రాణా సహకరించినట్లు ఆరోపణలున్నాయి.

ఎలాన్ మస్క్ గాడి తప్పారు

అమెరికాలో మూడో పార్టీ విజయం అసాధ్యం: ట్రంప్

న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ గాడి తప్పారని, ఆయన పార్టీ ప్రకటన హాస్యాస్పదమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండు పార్టీల వ్యవస్థను అనుసరిస్తున్న దేశంలో మూడో పార్టీ గందరగోళానికి, ఘర్షణలకు తావిస్తుందని మండిపడ్డారు. గత 5 వారాలుగా మస్క్ పూర్తిగా మానసిక నియంత్రణ కోల్పోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. తమ మధ్య బంధాన్ని దారుణంగా ముగించే స్థితికి ఆయన చేరుకున్నారని పేర్కొన్నారు. అమెరికాలో మూడో రాజకీయ పార్టీ అనేది విజయవంతం కాదని జోస్యం చెప్పారు. అలాంటి వ్యవస్థను అమెరికన్లు అంగీకరించబోరని చరిత్ర చెబుతోందని తాను పెట్టిన సుదీర్ఘ పోస్టులో ట్రంప్ స్పష్టం చేశారు. 'ప్రస్తుతం డెమోక్రాట్లపై విశ్వాసం సన్నగిల్లింది. రిపబ్లికన్ల ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. ఇటీవల దేశ చరిత్రలోనే తొలిసారి ఓ భారీ చట్టాన్ని తీసుకొచ్చాం. అది గొప్ప చట్టం. కానీ మస్క్‌కు కాదు. ఎందుకంటే దానివల్ల మస్క్ కోరుకుంటున్న తప్పనిసరి విద్యుత్తు వాహనాల వినియోగం సాధ్యం కావట్లేదు. చాలా తక్కువ సమయంలో ప్రతి ఒక్కరూ విద్యుత్తు కారును కొనుగోలు చేయాలని ఆయన కోరుకుంటున్నారు. దీన్ని నేను ముందు నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. ఈ చట్టంతో ఇప్పుడు ప్రజలు తమకు నచ్చిన వాహనాన్ని కొనుగోలు చేయొచ్చు. అమెరికా ప్రజలను రక్షించడానికే నా మొదటి ప్రాధాన్యం' అని ట్రంప్ స్పష్టం చేశారు.

బంగారం వలలో చిక్కి రూ.72 లక్షలు పోగొట్టుకున్నాడు

- డేటింగ్ యాప్‌లో మహిళ మోసం
- మహారాష్ట్రలో ఘటన

ముంబయి: మహారాష్ట్రలోని ముంబయిలో ఓ వ్యక్తి.. డేటింగ్ యాప్‌లో పరిచయమైన మహిళ మాటలు నమ్మి బంగారంలో పెట్టుబడి పెట్టి రూ.73.72 లక్షలు పోగొట్టుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. న్యూ పన్వేల్‌లో నివసిస్తున్న 62 ఏళ్ల బాధితుడికి గతేడాది మార్చిలో ఓ మహిళ డేటింగ్ యాప్‌లో పరిచయమైంది. కొన్ని నెలల సంభాషణ తర్వాత ఆ మహిళ తనని తాను జియాగా పరిచయం చేసుకుంది. అదే సమయంలో అధిక లాభం వస్తుందని ప్రలోభపెట్టి ఒక ప్రత్యేక యాప్‌లో బాధితుడు బంగారంలో పెట్టుబడి పెట్టేలా నమ్మించింది. మూడు నెలల్లో విడతల వారీగా రూ.72.72 లక్షలు బదిలీ చేయించింది. ఎటువంటి లాభం రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు నిలదీయడంతో ఆమె స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు ఈ నెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం పోలీసులు తెలిపారు.

ఫిలడెల్ఫియాలో కాల్పుల కలకలం

ముగ్గురి మృతి, 10 మందికి గాయాలు

ఫిలడెల్ఫియా: అమెరికాలో మరోసారి తుపాకుల మోత మోగింది. ఫిలడెల్ఫియా సౌత్ స్ట్రీట్‌లోని గ్రేస్ ఫెర్రీ నివాస సముదాయంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణాలింకా తెలియలేదు. ఫిలడెల్ఫియా పరిసర ప్రాంతాల్లో ఈ నెల 4న ఇదే తరహాలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఒక్క సౌత్ ఫిలడెల్ఫియా నైట్‌క్లబ్‌లోనే కాల్పుల్లో 8 మంది మరణించారు.

రష్యా దాడిలో 10 మంది ఉక్రెయిన్ పౌరుల మృతి

కీవ్: గడచిన 24 గంటల్లో ఉక్రెయిన్ ఆవాస ప్రాంతాలపై రష్యా 100 డ్రోన్‌లు ప్రయోగించిందని అధికారులు సోమవారం వెల్లడించారు. ఈ దాడుల్లో కనీసం 10 మంది సామాన్యులు మరణించారు. ముగ్గురు పిల్లలతో సహా 38 మంది గాయపడ్డారని వారు తెలిపారు. గత వారం రోజుల్లో రష్యా 1,270 డ్రోన్‌లు, 39 క్షిపణులు, దాదాపు వెయ్యి శక్తివంతమైన గ్లైడ్ బాంబులను ఉక్రెయిన్‌పై ప్రయోగించింది.



రష్యా దాడితో జపోరిజియాలో ఓ భవనంపై అలముకున్న పొగ

మరోవైపు శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. గతవారం అమెరికా అందిస్తానన్న ఆయుధాలూ ఉక్రెయిన్‌కు ఇవ్వలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మరిన్ని ఆయుధాలు అందించాల్సిందిగా అమెరికా, యూరప్‌లను ఉక్రెయిన్ కోరింది. మరోవైపు తమకు లక్షలాది డ్రోన్‌లు అందించే విధంగా ఉత్పత్తిని పెంచాల్సిందిగా అమెరికాకు చెందిన ఒక రక్షణ పరిశ్రమతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం తెలిపారు.

ఇరాన్‌పై దాడులను ఖండించి.. రష్యాను విమర్శించకుండా..

రియో డి జనీరో: బ్రిక్స్ నేతలు రియో వేదికగా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో- ప్రధానంగా సుంకాల ఏకపక్ష పెంపును ఖండించారు. అలాంటి చర్యలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని తగ్గిస్తాయని, సరఫరా గొలుసులకు అంతరాయాలు సృష్టిస్తాయని, అనిశ్చితికి కారణమవుతాయని పేర్కొన్నారు. సుంకాల పెంపునకు ఉపక్రమించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరును మాత్రం అందులో నేరుగా ప్రస్తావించలేదు. మరోవైపు- ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైనిక చర్యలను కూడా బ్రిక్స్ నేతలు తమ ప్రకటనలో ఖండించారు. గాజాలో దారుణ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఉక్రెయిన్‌పై దాడుల విషయంలో తమ కూటమిలోని సభ్యదేశమైన రష్యాపై విమర్శలకు మాత్రం వారు దూరంగా ఉన్నారు.

మూడు రోజుల్లో గోదావరికి వరద!

● 9 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం


రేవులో తాత్కాలిక రహదారిపైకి చేరిన వరదనీరు

ఈనాడు, రాజమహేంద్రవరం-అయినవిల్లి, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో మూడు రోజుల్లో తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరం బ్యారేజీకి వరద వచ్చే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలోని నాసిక్ బేసిన్‌లో ఇటీవల భారీగా వర్షాలు కురవడంతో అక్కడ వరద ఉద్ధృతి పెరిగింది. మరో రెండ్రోజుల్లో తెలంగాణలోనూ భారీ వర్ష సూచనల నేపథ్యంలో గోదావరి డెల్టా అధికారులు అప్రమత్తమయ్యారు. దాదాపు 9 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కుల జలాలు బ్యారేజీకి వచ్చే అవకాశం ఉందని ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు.

సముద్రంలోకి 1.85 లక్షల క్యూసెక్కులు: ధవళేశ్వరం బ్యారేజీకి సోమవారం ఉదయం 2.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సాయంత్రానికి 1,85,143 క్యూసెక్కుల జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 4,200, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరోవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి మండలం ముక్తేశ్వరం రేవు వద్ద గోదావరి నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడి రేవులో పంటు వద్దకు వెళ్లే తాత్కాలిక రహదారిని నీళ్లు చుట్టుముట్టాయి. మరింత పెరిగితే పూర్తిగా నీటమునిగి రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే చాలా వరకు కోతకు గురైంది. గ్రామస్థులు సోమవారం సగం మునిగిన రోడ్డుపైనా భయం భయంగా రాకపోకలు సాగించారు.

నేడు శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల

● కృష్ణమ్మకు జలహారతి ఇవ్వనున్న సీఎం చంద్రబాబు

● డ్యాంకు రికార్డు స్థాయిలో వరద

ఈనాడు, అమరావతి, కర్నూలు: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఫలితంగా శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం డ్యాంకు 1,71,550 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 880.80 అడుగుల వరకు చేరింది. జలాశయ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ఇప్పటికే 192 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది. కొన్ని గంటల వ్యవధిలో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నీటిని దిగువకు విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ విషయాన్ని జలవనరులశాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. అందుకు ఆయన తానే స్వయంగా వచ్చి నీటిని విడుదల చేస్తానని చెప్పడంతో సోమవారం మధ్యాహ్నం అప్పటికప్పుడు సీఎం శ్రీశైలం పర్యటన ఖరారు అయింది. మంగళవారం ఉదయం 11.50 గంటలకు కృష్ణమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి ఇచ్చిన తర్వాత గేట్లు ఎత్తనున్నారు.


ఈ నెల 5 వరకు 125 టీఎంసీల ప్రవాహం..

సాధారణంగా ఆగస్టు ఆఖరు నాటికి లేదంటే సెప్టెంబరులో గానీ శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తుతుంటారు. ఈ ఏడాది ఎగువన జూన్ నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరద ప్రవాహం భారీగా ఉంటోంది. జూన్ 1 నుంచి ప్రారంభమైన నీటి సంవత్సరంలో జులై 5 వరకు శ్రీశైలం జలాశయంలోకి 125 టీఎంసీల ప్రవాహం వచ్చింది. గత 15 ఏళ్ల సగటు.. ఈ కాలవ్యవధికి 12.26 టీఎంసీలే. దాంతో ఎప్పుడూ లేనట్లు జులై తొలి వారంలోనే శ్రీశైలం నీటిని విడుదల చేయనున్నారు. గతేడాది జులై 30న గేట్లు ఎత్తగా, ప్రస్తుతం దానికి మూడు వారాల ముందే గేట్లు ఎత్తుతుండటం విశేషం. మరోపక్క పోతిరెడ్డిపాడు నుంచి 15 వేల క్యూసెక్కులను వెలిగోడు జలాశయానికి పంపుతున్నారు.

■ కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహించే అద్భుతమైన దృశ్యాలను చూసేందుకు ఏటా వేల మంది వస్తుంటారు. మంగళవారం గేట్లు ఎత్తనుండటంతో డ్యాంకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


నీటితో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

మల్లన్నను దర్శించుకోనున్న చంద్రబాబు



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శ్రీశైలం వెళ్లనున్నారు. ఉండవల్లిలోని నివాసం నుంచి ఉదయం 10 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో బయలుదేరతారు. ఉదయం 11.15కు భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణా నదికి జలహారతి ఇచ్చే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.25 నుంచి 1.10 గంటల వరకు సున్నిపెంటలో నీటి వినియోగదారుల సంఘం ప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం అమరావతి చేరుకుంటారు.

విద్యా వ్యవస్థను అత్యుత్తమంగా
తీర్చిదిద్దుతాం

వీఆర్ హైస్కూల్‌ను పునఃప్రారంభించడంలో నారాయణ కృషి ఎనలేనిది

● 175 నియోజకవర్గాల్లోనూ ఇలాంటి పాఠశాలల అభివృద్ధి ● విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్


వీఆర్ స్కూల్‌లో ఓ విద్యార్థినికి హై ఫైవ్ ఇస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, నెల్లూరు: 'నెల్లూరులో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన వీఆర్ (వెంకటగిరి రాజా) హైస్కూల్‌ను తిరిగి ప్రారంభించడం సంతోషకరం. పేద విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో, అత్యుత్తమ విద్యను అందించేందుకు మంత్రి నారాయణ రూ.15 కోట్లు ఖర్చు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రాత్రి పది గంటల సమయంలోనూ ఫోన్ చేసి, వెంటబడి పాఠశాల అనుమతులు సాధించుకున్నారు. పాఠశాలలోని వసతులు చూస్తుంటే నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది దేశంలోనే ఆదర్శ పాఠశాలగా అవతరిస్తుంది. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులోనూ ఇలాంటి పాఠశాలను అభివృద్ధి చేస్తున్నాం. ఇదే తరహాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 చోట్ల పాఠశాలలను అభివృద్ధి చేస్తాం. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం' అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలో వీఆర్ మున్సిపల్ హైస్కూల్ పునఃప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. 'మంత్రి నారాయణ ఇదే పాఠశాలలో చదువుకుని, ఇక్కడే ఉపాధ్యాయుడిగా పనిచేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ ముఖ్యమంత్రులు బెజవాడ గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వంటి ప్రముఖులు చదివిన పాఠశాలకు నారాయణ చొరవతో పునర్వైభవం వచ్చింది. ప్రపంచస్థాయి సౌకర్యాలతో తొలి ఏడాది 1,050 మంది నిరుపేద విద్యార్థులు డిజిటల్ విద్య పొందుతున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు హైడ్రోఫోనిక్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు నృత్యం, సంగీతం, డ్రాయింగ్ రూములు, ఆట స్థలం, రోబోటిక్స్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పేదరిక నిర్మూలనకు చంద్రబాబు తీసుకొచ్చిన పీ4 విధానం ద్వారా.. నారాయణ కుమార్తె శరణి 20 కుటుంబాలను దత్తత తీసుకోవడం విశేషం. దీంతోపాటు వీఆర్ విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల ద్వారా 4 సెట్ల యూనిఫాంలు, సైకిళ్లను ఉచితంగా అందిస్తామని ప్రకటించడం అభినందనీయం' అని లోకేశ్ కొనియాడారు. 'పేద చిన్నారులు వెంకయ్య, వెంకటేశ్వర్లు ఇక్కడ ప్రవేశాలు పొందినందుకు చాలా సంతోషిస్తున్నారని, వారి ఉన్నత విద్యకు తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని లోకేశ్ ప్రకటించారు.

విద్యాశాఖలో సమూల మార్పు కోసం..

'మంగళగిరి నియోజకవర్గంలో తెదేపా జెండా ఎగరేసేందుకు 2019లో పోటీ చేసి ఓడిపోయా. అయినా కసితో పనిచేశా. కష్టపడ్డా. అక్కడి ప్రజల అండతో భారీ విజయం సాధించా. అలాగే విద్యాశాఖను సవాలుగా స్వీకరించా.. సమూల మార్పులకు కృషి చేస్తున్నా' అని లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు మీద విద్యా కిట్లు, డొక్కా సీతమ్మ పేరిట సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామని చెప్పారు. వన్ క్లాస్.. వన్ టీచర్ విధానంతో 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేశామని, తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లు జమ చేశామని వివరించారు. తరగతి గది నుంచే మహిళలను గౌరవించే పాఠ్యాంశాల బోధనతో పాటు వారికి పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం కల్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు మార్కెట్ యార్డులు, దేవాలయ కమిటీల భర్తీ

కార్యకర్తల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోపు ఏఎంసీలు, దేవాలయ పాలకవర్గాల కమిటీలను భర్తీ చేస్తామని మంత్రి, తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. నెల్లూరులో సోమవారం నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పార్టీలో పనిచేసే వారికి, కష్టపడే వారికే పదవులు ఇస్తాం. కార్యకర్తల బలోపేతం చేసేందుకు, క్యాడర్ అంతా ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నాం' అని పేర్కొన్నారు. సొంత కార్యకర్తలను కారు కింద తొక్కేసిన నేత రాష్ట్రంలో ఉన్నారని, కనీసం ఇంటికి వెళ్లి పరామర్శించడానికి కూడా జగన్‌కు మనసు రాలేదని విమర్శించారు. చంద్రబాబు కందుకూరు వెళ్లినప్పుడు తొక్కిసలాట జరిగితే ఇంటింటికీ వెళ్లి క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని కార్యకర్తలకు సూచించారు.



వీఆర్ హైస్కూలు పునఃప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. వేదికపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి, మంత్రులు నారాయణ, ఫరూక్, ఆనం, కలెక్టర్ ఆనంద్

చంద్రబాబు కోసం ఆరోగ్య రొట్టె

నెల్లూరు స్వర్ణాల చెరువులో రొట్టెల పండగలో పాల్గొన్న మంత్రి లోకేశ్.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని 'ఆరోగ్య రొట్టె'ను అందుకున్నారు. చంద్రబాబు బాగుంటే.. రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అందుకే ఆరోగ్య రొట్టె తీసుకున్నట్లు తెలిపారు. తొలుత ముస్లిం మత పెద్దలు లోకేశ్‌కు స్వాగతం పలికి, గలేఫ్‌ను అందించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కులమతాలకు అతీతంగా పాలన చేస్తోందని.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ఈ పండగ నిర్వహణకు రూ.10 కోట్లు కేటాయించామని లోకేశ్ చెప్పారు.


స్వర్ణాల చెరువులో రొట్టె అందుకుంటున్న మంత్రి లోకేశ్

'అమరావతి క్వాంటం డిక్లరేషన్'కు ఆమోదం

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: క్వాంటం సైన్స్, సాంకేతికతలో ప్రపంచంతో పోటీపడేలా అమరావతి క్వాంటం వ్యాలీని తీర్చిదిద్దేందుకు రూపొందించిన డిక్లరేషన్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2030 కల్లా ఏడాదికి రూ.5,000 కోట్ల ఎగుమతులే లక్ష్యమని పేర్కొంది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్‌లో.. ప్రభుత్వం, పరిశ్రమ వర్గాలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి అందిన సూచనలతో డిక్లరేషన్‌ను రూపొందించింది.

వర్క్‌షాప్‌లో 3 రౌండ్‌టేబుల్ సమావేశాల్లో చర్చించిన అంశాలు

■ క్వాంటం కంప్యూటింగ్.. అల్గారిథమ్‌లు, హార్డ్‌వేర్ ఎకోసిస్టం
■ క్వాంటం సెన్సింగ్.. కమ్యూనికేషన్, క్వాంటం మెటీరియల్, చిప్‌లు
■ సామర్థ్య నిర్మాణం.. ప్రామాణీకరణ, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం

ప్రధాన లక్ష్యాలు

✦ **2026, జనవరి 1:** ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో అమరావతిలో క్వాంటం సిస్టం-2ను అందుబాటులోకి తేవడం.
✦ **2026, జనవరి 1:** 100 క్వాంటం అల్గారిథమ్‌లను పరీక్షించే సామర్థ్యాన్ని సాధించడం.
✦ **2027, జనవరి 1:** సూపర్ కండక్టింగ్ సర్క్యూట్‌లు, ట్రాప్డ్ అయాన్‌లు, ఫోటానిక్ క్యూబిట్స్, న్యూట్రల్ ఆటమ్స్ లేదా టోపోలాజికల్ క్యూబిట్స్‌తో పనిచేసే మూడు క్వాంటం కంప్యూటర్లను అమరావతిలో ఏర్పాటు చేయడం.
✦ **2028, జనవరి 1:** ఏడాదికి 1,000 కొత్త క్వాంటం అల్గారిథమ్‌లను పరీక్షించే స్థాయికి చేరుకోవడం.
✦ **2029, జనవరి 1:** 1,000 ఎఫెక్టివ్ క్యూబిట్స్ క్వాంటం సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం.

నైపుణ్య సాధన

■ 2025-26లో అమరావతి క్వాంటం అకాడమీ ఏర్పాటు చేసి.. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ఫెలోషిప్‌లు, ఇంజినీర్ అప్‌స్కిల్లింగ్, టెక్నీషియన్ సర్టిఫికేషన్‌లను అందించడం. ఏటా 5 వేల మంది చొప్పున.. 2030 వరకు శిక్షణ ఇవ్వడం.
■ 2027 జనవరి నాటికి రాష్ట్రంలో 20 విశ్వవిద్యాలయాలు, దేశంలో 100 విశ్వవిద్యాలయాల్లో క్వాంటం టెక్నాలజీలో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలను అందించడం.

అవకాశాలు.. పెట్టుబడులు

■ లివింగ్-ల్యాబ్ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.1,000 కోట్ల క్వాంటం ఫండ్‌తో క్వాంటం హార్డ్‌వేర్, సెక్యూరిటీ స్టార్టప్‌లకు అవకాశాలు.
■ 2027 జనవరి నాటికి కంప్యూటింగ్, చిప్‌లు, సెన్సింగ్, కమ్యూనికేషన్స్ రంగాల్లో కనీసం 500 మిలియన్ డాలర్ల పెట్టుబడుల ఆకర్షణ.

ఉపాధ్యాయుడిని అభినందించిన మంత్రి లోకేశ్



గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే మార్గదర్శి పాఠశాలకు వెళ్లేందుకు మార్గం చూపించారంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజును విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు. సోమవారం ఈనాడులో 'పాఠాలు చెప్పే మాస్టారు.. పాఠశాలకు బాట వేశారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని చూసి స్పందించారు. సొంత డబ్బులతో కాలిబాట వంతెనను నిర్మించిన సీతారామరాజుకు అభినందనలు అని పోస్టులో పేర్కొన్నారు.




అంతరిక్ష రంగాన్నీ అందిపుచ్చుకుందాం!

● రూ.25 వేల కోట్ల పెట్టుబడులు... 35 వేల మందికి ఉపాధి లక్ష్యం

● శ్రీహరికోట, లేపాక్షిలో స్పేస్ సిటీల అభివృద్ధి

● స్పేస్ పాలసీ 4.0ను రూపొందించిన ప్రభుత్వం



ఈనాడు, అమరావతి: అంతరిక్ష (స్పేస్) పరిశోధన రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందించింది. 2024-29 మధ్య పెట్టుబడులు పెట్టే సంస్థలకు పాలసీ నిబంధనలు వర్తిస్తాయని, రాబోయే పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. అంతరిక్ష పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, తయారీ, లాంచ్ సేవల పరంగా రాష్ట్రాన్ని హబ్‌గా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని వివరించింది. లేపాక్షి, తిరుపతిల్లో స్పేస్ సిటీల అభివృద్ధికి 'ఏపీ స్పేస్ సిటీ కార్పొరేషన్' పేరిట స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, భారీ, మెగా పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను అందించనుంది.

ప్రధాన లక్ష్యాలివీ...

■ అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు, భారీ సంస్థలు, విద్యా సంస్థలు, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా సమ్మిళిత పారిశ్రామిక ఎకోసిస్టంను అభివృద్ధి చేయడం.
■ స్పేస్ వ్యాల్యూ చైన్‌లో ఉన్నత, మధ్య, కింది స్థాయిల్లో దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
■ గవర్నెన్స్, విద్యారంగం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణలో స్పేస్ ఆధారిత ఆవిష్కరణలను సులభతరం చేయడం.
■ శ్రీహరికోట సమీపంలో పారిశ్రామిక బేస్ ఏర్పాటు. తయారీ క్లస్టర్‌లను అభివృద్ధి పరచడం.

రాబోయే పదేళ్లలో..

❖ శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలో స్పేస్ డిజైన్ సెంటర్‌ను నెలకొల్పి సబ్‌సిస్టం ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్, పేలోడ్, డిజైన్ క్లస్టర్ అభివృద్ధి.
❖ తిరుపతి జిల్లా శ్రీహరికోటలో స్పేస్ అప్లికేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చేలా స్పేస్ డేటా బేస్డ్ సర్వీసెస్, భౌగోళిక విశ్లేషణల క్లస్టర్‌ల ఏర్పాటు.
❖ డిజైన్లు, పరిశోధన, తయారీ, లాంచింగ్ అవసరాలకు రెండు స్పేస్ ఇండస్ట్రియల్ జోన్‌ల అభివృద్ధి.
❖ స్టార్టప్‌లు, నవకల్పనలకు అనువైన వాతావరణం కల్పించడం.
❖ ఉపగ్రహ అప్లికేషన్లు, లాంచ్ లాజిస్టిక్స్ కోసం అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో క్రిటికల్ స్పేస్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడం.

స్టార్టప్‌లకు, తయారీ రంగ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు...
https://epaper.eenadu.net లో

9న భాజపా అధ్యక్షుడు మాధవ్ బాధ్యతల స్వీకరణ

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్.. ఈ నెల 9 (బుధవారం)న బాధ్యతలు స్వీకరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 1న పురందేశ్వరి నుంచి అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నా.. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్ష హోదాలో కూర్చొని, దస్త్రంపై సంతకం చేయలేదు. ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన మాధవ్.. ఆ సంస్థ ఆవిర్భావ దినమైన జులై 9నే బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. దీంతోపాటు 10న సాధువులు, గురువులు తదితరుల ఆశీస్సులు తీసుకునేందుకు 'గురు పరంపర' కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నారు.

వీఆర్ హైస్కూల్ పేరు మార్చడం సబబు కాదు: మంత్రి ఆనం

ఈనాడు, నెల్లూరు: 'వీఆర్ హైస్కూల్‌కు.. వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌గా పేరు మార్చడం సబబు కాదు. పాఠశాల అభివృద్ధికి పురపాలక శాఖ మంత్రి నారాయణ సహకరిస్తే.. పాఠశాల పేరు కార్పొరేషన్ స్కూల్‌గా మారుస్తారా? దీని ఆధునికీకరణకు కార్పొరేట్ సంస్థలు, బ్యాంకులు సీఎస్ఆర్ నిధులు ఇచ్చాయి. కార్పొరేషన్ నిధి ఎక్కడుందో నగర కమిషనర్ సమాధానం చెప్పాలి. ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా మంత్రులు నారా లోకేశ్, నారాయణలు చర్యలు తీసుకోవాలి' అని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. వీఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రారంభోత్సవంలో ఆనం అన్న ఈ మాటలు చర్చనీయాంశమయ్యాయి. 'వెంకటగిరి రాజా విద్యా సంస్థల్లోనే నేనూ చదువుకున్నా. 65 ఏళ్లపాటు వీఆర్ విద్యా సంస్థల నిర్వహణను ఆనం కుటుంబం చూసింది. రాజకీయ కక్షతో మేనేజ్‌మెంట్‌ను రద్దు చేసి.. పేద, మధ్యతరగతి పిల్లలకు విద్యను దూరం చేశారు. ఈ పాఠశాల ప్రారంభానికి ముందు వెంకటగిరి రాజాలు రూ.50 వేలు ఇస్తామని, దానికి వారి పేరు పెట్టాలని కోరడంతో పెట్టాం. ఆ తర్వాత వారు నిధులు ఇవ్వకపోయినా.. అదే కొనసాగించాం. ఏసీ సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి అధికారంలో ఉన్నా మార్చలేదు. ఇప్పుడు ఆ పేరు మార్చడం సరికాదు. వీఆర్ హైస్కూల్‌గా ఉంటేనే గౌరవప్రదంగా ఉంటుంది. నెల్లూరు నగరంతో పాటు రూరల్ ప్రజలకూ ఈ పాఠశాల అందుబాటులో ఉండాలి' అని ఆయన సూచించారు. కార్పొరేట్ల చేతుల్లో విద్యా వ్యవస్థ చిక్కుకుపోయిందని విమర్శించారు. పెద్ద కార్పొరేట్ విద్యా సంస్థలు నారాయణవేనని.. ఆయన ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుంటే, తామూ అదే బాటలో నడుస్తామని ఆనం వ్యాఖ్యానించారు.

తీరు మార్చుకోకపోతే జైలే

● గంజాయి, మాదకద్రవ్యాల స్మగ్లర్లపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం

● విచారణ, శిక్షతో సంబంధం లేకుండా ఏడాది పాటు ముందస్తు నిర్బంధం

ఈనాడు-అమరావతి: గంజాయి, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, రవాణాకు పాల్పడుతున్న నేరగాళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎన్ని సార్లు అరెస్టు చేస్తున్నా తీరు మార్చుకోకుండా పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని ఏడాది పాటు జైల్లో నిర్బంధించేలా 'ప్రివెన్షన్ ఆఫ్ ఇలిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ యాక్ట్‌ను (పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం-1988)' ప్రయోగిస్తోంది. ఇప్పటివరకూ విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో 8 మంది, విజయవాడ కమిషనరేట్‌లో ఐదుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇద్దరు సహా మొత్తం 15 మందిని నిర్బంధించారు. రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఇలాంటి స్మగ్లర్లు దాదాపు 100 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిపైనా ఈ చట్టాన్ని ప్రయోగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చేనెల రోజుల్లో వీరందరిపైనా పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రయోగించి నిర్బంధించనున్నారు.

ఇలా అరెస్టై.. అలా బయటకొచ్చేస్తున్నారు

■ గంజాయి స్మగ్లర్లు, ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేస్తున్నా.. వారు కొద్ది రోజుల్లోనే బయటకొచ్చేస్తున్నారు. న్యాయస్థానాల్లో ఆ కేసుల విచారణ సంవత్సరాల తరబడి కొనసాగుతుండటంతో అదే అదునుగా మరిన్ని నేరాలు చేస్తున్నారు. ప్రధానంగా భౌతిక దాడులు, గొలుసు దొంగతనాలు, బెదిరింపులు తదితర నేరాలు వీరి వల్ల ఎక్కువవుతున్నాయి. నగరాలు, పట్టణాల్లో గంజాయి స్మగ్లర్లు ముఠాలు ఏర్పాటు చేసుకుని మరీ నేరాలకు తెగబడుతున్నారు.
■ ఆయా కేసుల్లో విచారణ, శిక్షలతో సంబంధం లేకుండా.. ముందస్తు నిర్బంధం వల్ల నేర కార్యకలాపాలను కట్టడి చేసేందుకు వీలవుతుందనేది ప్రభుత్వ భావన.
■ గంజాయి, మాదకద్రవ్యాల సాగు, తయారీ, నిల్వ, క్రయవిక్రయాలు, రవాణా, వినియోగం, ఎగుమతి, దిగుమతి, వాటికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వనరులు సమకూర్చడం, ఈ కార్యకలాపాలను ప్రేరేపించడం నేరమే. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడేవారిని ఈ చట్టం కింద నిర్బంధిస్తున్నారు.

● విజయవాడ విద్యాధరపురం ప్రాంతానికి చెందిన షేక్ అక్బర్ బాషాపై 31 కేసులున్నాయి. వీటిలో 5 గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించినవి కాగా.. 26 ఇతర నేరాల్లో నమోదైనవి. గంజాయి కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లడం.. బెయిల్‌పై బయటకొచ్చాక మరింత విస్తృతంగా స్మగ్లింగ్ చేయడం అతనికి అలవాటైపోయింది.

● విశాఖపట్నంలోని భీమునిపట్నానికి చెందిన సీరం ఆకాశ్‌పై 3 గంజాయి కేసులున్నాయి. ఆయా కేసుల్లో అరెస్టైనప్పటికీ బయటకొచ్చాక మళ్లీ అదే దందా కొనసాగిస్తున్నారు.

వీరిపై ఇప్పటికే చట్టప్రయోగం

విజయవాడలో: కొండ రమేష్, షేక్ బాషా, తుమ్మల మనోజ్, షేక్ అక్బర్ బాషా, అద్దంకి సతీష్‌కుమార్

విశాఖపట్నం: మేడిశెట్టి వరప్రసాద్, సుంకరి సతీష్, పెద్దిన రవి, సీరం ఆకాశ్, పితాని అప్పలరాజు, కలిమి రమేష్, పెద్దిశెట్టి రూపేష్, సరకం మహేష్

అల్లూరి సీతారామరాజు జిల్లా: ఉలంగి ప్రకాశ్, కిలో గోవర్ధన్.



ఆనందం ఉండేది మన ఆలోచనల్లోనే..

ఆనందం అనేది ఒక వస్తువును పొందినప్పుడో, ఒక పనిలో మంచి ఫలితం వచ్చినప్పుడో కలిగే అనుభూతి కాదు. ఆనందకర జీవితమనేది పూర్తిగా మన ఎంపిక మాత్రమే. అంటే ఆనందంగా ఉండాలని మనం కోరుకున్నప్పుడే ఆ విధంగా జీవించగలం తప్ప డబ్బు, విలాసాలు, విజయాలు, గుర్తింపు.. ఇవేవీ మనకు ఆనందాన్ని కలిగించలేవు. అందుకే సానుకూల ఆలోచనలను ప్రోదిచేసుకుంటూ సాధారణ జీవితాన్ని గడపండి.

– లారెన్ జోసెఫ్, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

ఆకాంక్షిత జిల్లాల్లో ప్రకాశం, శ్రీసత్యసాయి, అన్నమయ్య!


● చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తా

● 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ దినకర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: ప్రకాశం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలను ఆకాంక్షిత జిల్లాల జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తానని 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఆకాంక్షిత జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, వైఎస్సార్ కడపలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై త్వరలో సమీక్షించనున్నట్లు సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. "దేశంలో 117 అభివృద్ధి చెందని, సామాజిక, ఆర్థిక వృద్ధిలో బాగా వెనుకబడిన ప్రాంతాలను ఆకాంక్షిత జిల్లాలుగా ఎంపిక చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు అమలు చేస్తున్నారు. ఇందులో రాష్ట్రానికి సంబంధించి మూడు జిల్లాలను ఎంపిక చేశారు. ఈ జిల్లాల్లో రహదారుల అనుసంధానం, ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం తదితరాలతో కలిపి మొత్తం 49 రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి'' అని తెలిపారు.

ఛాంపియన్

లార్డ్స్‌లో పేస్ విందు



లండన్

ఇంగ్లాండ్‌లో టెస్టు మ్యాచ్ అంటే బంతి రయ్యిన దూసుకెళ్తుంటుంది. బంతి స్వింగ్ అవుతూ మన బ్యాటర్లకు పరీక్ష పెడుతుంది. పరుగులు చేయడమూ కష్టంగా ఉంటుంది. కానీ భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ముఖ్యంగా భారత ఆటగాళ్లు చెలరేగిపోయారు. సెంచరీల మోత మోగింది. పరుగుల వరద పారింది. తొలి టెస్టులో నాలుగు రోజులు భారతే పైచేయి సాధించగా.. చివరి రోజు ఇంగ్లాండ్ ధాటిగా ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండో టెస్టులో భారత్ 336 పరుగుల తేడాతో గెలవడం ఇంగ్లాండ్ జీర్ణించుకోలేని విషయం. అందుకే మూడో టెస్టుకు పిచ్‌లో మార్పు కోరుకుంటోంది ఆ జట్టు యాజమాన్యం. ఈ మ్యాచ్‌కు వేదికైన లార్డ్స్ మైదానంలో మామూలుగానే పేసర్లకు బాగా సహకారం అందుతుంది. పేస్, స్వింగ్‌తో బ్యాటర్లకు సవాలు విసురుతుంది. మూడో టెస్టుకు మరింతగా పేసర్లకు సహకరించే జీవమున్న పిచ్‌ను ఇవ్వాలని కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్, కెప్టెన్ బెన్ స్టోక్స్ కోరారట. గత నెల ఇదే వేదికలో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పేసర్ల ఆధిపత్యం సాగింది. ఈ మ్యాచ్‌కు ఫాస్ట్‌బౌలర్ ఆర్చర్ తుది జట్టులోకి రావడం ఖాయం. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన బౌలర్లలో అతనొకడు. అతడితో పాటు మంచి వేగం ఉన్న గస్ అట్కిన్సన్‌ను కూడా జట్టులోకి తీసుకోవాలని ఇంగ్లాండ్ భావిస్తున్నట్లు సమాచారం. టంగ్, కార్స్‌లను పక్కన పెట్టే అవకాశముంది. అవసరమైన స్పిన్నర్ బషీర్‌ను తప్పించి మొత్తం పేసర్లతోనే బరిలోకి దిగేందుకూ ఆస్కారముంది. కాబట్టి అక్కడ భారత బ్యాటర్లకు అంత తేలికగా ఉండదన్నది స్పష్టం. అయితే లార్డ్స్ పిచ్ పేసర్లకు ఎక్కువ సహకారమందిస్తే.. అది భారత్‌కూ ప్రయోజనమే. రెండో టెస్టుకు అందుబాటులో లేని బుమ్రా లార్డ్స్‌లో ఆడబోతున్నాడు. పేసర్లకు అనుకూలించే పిచ్ మీద భారత త్రయాన్ని ఎదుర్కోవడం ఇంగ్లిష్ బ్యాటర్లకూ సవాలే. మరి ఇక్కడి పరిస్థితులను ఎవరు బాగా ఉపయోగించుకుంటారో?

బిహార్‌లోని ఒక చిన్న ఊరు.. అక్కడి ప్రజలకు నిత్యం జీవన పోరాటమే. ఆటలు లేవక్కడ ఆటుపోట్లు తప్ప! అలాంటి చోటి నుంచి ఒక కుర్రాడు క్రికెటర్ కావడమే ఎక్కువ. అలాంటిది అంతర్జాతీయ క్రికెటర్ అయి దేశాన్ని గెలిపిస్తే..! ఇది సినిమా కథ కాదు.. నిజం! క్రికెటర్ కావాలని అనుకున్న ఆ కుర్రాడు ఆ కలను తీర్చుకోవడానికి కన్న వారిని.. సొంత ఊరిని వదిలి వేరే రాష్ట్రానికి వెళ్లిపోయాడు. పేసర్‌గా ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకెళ్లాడు. బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్టులో 10 వికెట్లు తీసి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన ఆకాశ్‌దీప్ గురించే ఈ ఉపోద్ఘాతమంతా. బిహార్‌లోని మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన అతడి నేపథ్యం ఆసక్తికరం, స్ఫూర్తిదాయకం.

కష్టాలు దిద్దిన పేసర్



ఆకాశ్‌దీప్

ఈనాడు క్రీడావిభాగం

బిహార్‌లోని దేహ్రీకి చెందిన ఆకాశ్‌దీప్‌ది మధ్య తరగతి కుటుంబం. ఆరుగురు సంతానంలో అతడే చిన్నవాడు. క్రికెట్ అంటే చాలా ఇష్టం. 2011లో ధోని సిక్సర్‌తో భారత్ ప్రపంచకప్ గెలిచిన క్షణాలను కళ్లార్పకుండా చూసిన అతడికి ఆ ఆటపై ప్రేమ మరింత పెరిగింది. కోహ్లి సూపర్‌స్టార్‌గా ఎదిగిన తీరుతో ఎంతో స్ఫూర్తి కలిగింది. వాళ్లతో ఆడే అవకాశం వస్తుందని అతడు కలలో కూడా ఊహించి ఉండడు. ఊరిలో ఆటలాడే వాళ్లంటే మంచి అభిప్రాయం లేదు. ఉపాధ్యాయుడిగా పని చేసే నాన్న రామ్‌జీ సింగ్ కూడా క్రికెట్ ఆడితే జీవితంలో బాగుపడవు అని చెప్పేశాడు. కానీ ఆయనకు తెలియకుండా ఆకాశ్ ఆడేవాడు. అతడికి 18 ఏళ్ల వయసులో నాన్న చనిపోయాడు. అదే పెద్ద షాక్! ఆ తర్వాత మళ్లీ ఇంకో దెబ్బ. అన్న మరణించాడు. ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు కుటుంబ సభ్యులు మరణించారు. ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. అయినా తన మనసులోంచి క్రికెట్‌ను చెరిపేయలేకపోయాడు. 'క్రికెట్‌ను వదలకు' అని అక్క అఖండ్ జ్యోతి చెప్పిన మాటలతో ఎలాగైనా ఈ ఆటలో రాణించాలనుకున్నాడు. కొన్ని రోజులు దిల్లీలో క్లబ్ క్రికెట్ ఆడాడు. అక్కడ కుదురుకోలేకపోయాడు. 'ఆటను సీరియస్‌గా తీసుకో. దిల్లీ నుంచి ఇంకో చోటికి వెళ్లు. నీ కలను నెరవేర్చుకో' అని సోదరి మాటలు మళ్లీ అతడిని ఆలోచింపజేశాయి. 2017లో బెంగాల్‌లోని దుర్గాపుర్‌కు వెళ్లి టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడాడు. తర్వాత కోల్‌కతాకు వచ్చాడు.

కోల్‌కతాలో పడని కష్టం అంటూ లేదు. మనుగడ కోసం బెంగాలీ నేర్చుకున్నాడు. యునైటెడ్ క్లబ్ తరపున ఆడి వచ్చిన డబ్బుల్లో కొన్ని మిగిల్చి ఊరిలో ఉండే అమ్మకు పంపేవాడు. అదృష్టవశాత్తూ మాజీ భారత ఆటగాడు అరుణ్ లాల్ రూపంలో అతడికి ఒక మార్గదర్శి దొరికాడు. మరోవైపు బెంగాల్ మాజీ సారథి మనోజ్ తివారి కూడా ఆకాశ్‌కు అండగా నిలిచాడు. పేసర్లు మహ్మద్ షమి, రణదేబ్ బోస్‌ల సహచర్యం అతడికి లాభించింది. ఒక దశలో వెన్నుకు గాయం కావడంతో కెరీర్ ముగుస్తుందేమో అనిపించింది. బెంగాల్ అండర్-23 కోచ్ సౌరశిష్ లాహిరి.. ఆకాశ్ తిరిగి ఫిట్‌గా కావడంలో కీలకపాత్ర పోషించాడు. ఇందరి ప్రోత్సాహమే ఆకాశ్‌ను వేరే స్థాయికి తీసుకెళ్లగలిగింది. 2019లో బెంగాల్ సీనియర్ జట్టు తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో అరంగేట్రం చేసిన ఆకాశ్.. వైవిధ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 2021 సీజన్లో 35 వికెట్లు తీసి బెంగాల్ రంజీ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లోనూ సత్తా చాటాడు. 2021లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు నెట్ బౌలర్‌గా సేవలందించాడు. 'కోహ్లిని మెప్పించగలిగితే ఐపీఎల్‌లో ఆడే అవకాశం ఉంటుంది' అని తివారి చెప్పిన మాటలు ఆకాశ్‌దీప్ మనసులో నాటుకుపోయాయి. నెట్స్‌లో తన సామర్థ్యాన్ని చూపించగలిగాడు. 2022 ఐపీఎల్ వేలంలో రూ.20 లక్షల కనీస ధరకు ఆకాశ్‌ను బెంగళూరు సొంతం చేసుకుంది. ఐపీఎల్ అరంగేట్రంలో తన హీరో కోహ్లి నుంచి క్యాప్ అందుకుంటుంటే ఆకాశ్ నమ్మలేకపోయాడు. అంతేకాదు ఎంతో ఆరాధించిన ధోనితో ఆడడం కూడా అతడికి కలలా అనిపించింది. తర్వాత అదే ధరకు ఆర్సీబీ అతడిని అట్టి పెట్టుకుంది. ఈ ఏడాది మెగా వేలంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఏకంగా రూ.5 కోట్లు పెట్టి ఈ పేసర్‌ను దక్కించుకుంది. క్రికెటర్‌గా కుదురుకున్నాక ఆకాశ్.. నాన్న ఉపాధ్యాయుడిగా పని చేసిన ససారామ్‌లో పిల్లలకు క్రికెట్ కలను తీర్చే పనిలో పడ్డాడు. సోదరుడు భైవా కుమార్‌తో కలిసి 2019లో అకాడమీని ఏర్పాటు చేశాడు. ఇక్కడ 200 మందికి పైగా పిల్లలు శిక్షణ పొందుతున్నారు.

సోదరి కోసం

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో చేసిన పది వికెట్ల ప్రదర్శనను క్యాన్సర్‌తో బాధపడుతున్న సోదరికి అంకితమిచ్చాడు ఆకాశ్‌దీప్. ''నా సోదరి జ్యోతికి క్యాన్సర్ సోకినట్లు రెండు నెలల క్రితం బయటపడింది. ఇప్పటిదాకా ఈ విషయాన్ని ఎవరితో పంచుకోలేదు. బర్మింగ్‌హామ్ ప్రదర్శనతో సోదరి చాలా సంతోషంగా ఉంది. ఆమె ముఖంలో నవ్వులు తెప్పించినందుకు ఆనందంగా అనిపిస్తోంది. బంతిని అందుకున్న ప్రతి సారి ఆమె ఆలోచనలే మనసులో మెదిలేవి. ఈ ప్రదర్శనను అక్కకి అంకితమిస్తున్నా. 'అక్కా మేమంతా నీతో ఉన్నాం'.. '' అని ఆకాశ్‌దీప్ ఉద్విగ్నభరిత స్వరంతో చెప్పాడు. ఆకాశ్‌దీప్ కంటే జ్యోతి పదేళ్లు పెద్దది. ఆమెతోనే అతడికి అనుబంధం ఎక్కువ. తండ్రి, అన్న మరణించాక జ్యోతినే ఆకాశ్‌ను క్రికెట్ కెరీర్‌లో ముందుకు నడిపించింది. పేగు క్యాన్సర్‌కు ఇటీవలే జ్యోతికి శస్త్రచికిత్స జరిగింది. ఇప్పుడు కీమోథెరపీ చేయించుకుంటోంది.



సోదరి జ్యోతితో ఆకాశ్‌దీప్

ఈ విజయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా



గిల్

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో సాధించిన విజయం ఎప్పటికీ మధుర స్మృతిగా నిలిచిపోతుందని టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఈ మ్యాచ్ కంటే ముందు ఎడ్జ్‌బాస్టన్‌లో 8 టెస్టులు ఆడిన భారత్.. ఒక్క విజయమూ సాధించలేదు. ఏడు టెస్టులు ఓడి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇలాంటి రికార్డున్న మైదానంలో ఇప్పుడు ఇంగ్లాండ్‌ను శుభ్‌మన్‌సేన ఏకంగా 336 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ విజయం ఎంత ప్రత్యేకమో శుభ్‌మన్ చెప్పాడు. ''నా జీవితాంతం గుర్తు పెట్టుకునే గెలుపిది. ఇంకా చెప్పాలంటే రిటైరయ్యాక కూడా ఇది అత్యంత మధుర స్మృతుల్లో ఒకటిగా నిలిచిపోతుంది. మ్యాచ్‌లో చివరి క్యాచ్‌ను పట్టడం అంటే నాకు రాసి పెట్టి ఉన్నట్లే. ఈ టెస్టును ముగించిన తీరుపై నేను చాలా సంతోషంగా ఉన్నా. సిరీస్‌లో ఇంకో మూడు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ దశలో మేం ఇలా పుంజుకోవడం గొప్ప విషయం. సిరీస్‌లో ప్రస్తుతం సానుకూలత మాకే ఉంది. జట్టులోని ప్రతి ఒక్కరూ బ్యాటుతో, బంతితో తమ వంతు పాత్ర పోషించారు. వివిధ దశల్లో వేర్వేరు ఆటగాళ్లు ముందుకొచ్చి బాధ్యత తీసుకుని ఆడితే ఆ జట్టు ఛాంపియన్‌గా రూపుదిద్దుకుంటుంది. ఇది మాకు సానుకూల సంకేతం. ఈ విజయం కోసం మేం ఎంతో కష్టపడ్డాం. గత ఆరేడు నెలల్లో టెస్టు మ్యాచ్‌లు గెలవడం మాకు చాలా కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో ఈ దేశంలో సమష్టిగా ఆడి మ్యాచ్ నెగ్గడం ఎంతో ప్రత్యేకం'' అని అతనన్నాడు.

వంతిక, పద్మిని ముందంజ

బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచకప్‌లో వంతిక అగర్వాల్, నందిత, పద్మిని రౌత్ ముందంజ వేశారు. తొలి రౌండ్లో పద్మిని 2-0తో జాంగ్ లాన్‌లిన్ (చైనా)పై నెగ్గగా.. వంతిక 0.5-1.5తో షాహ్రదోవా (తుర్క్‌మెనిస్థాన్)ను ఓడించింది. నందిత 2-0తో ఒర్టిజ్ అనాహి (ఈక్వెడార్)పై గెలిచింది. కిరణ్ మనీషా 0.5-1.5తో సాంగ్ యుగ్జిన్ (చైనా) చేతిలో ఓడింది. గాల్ జోకా (హంగేరీ)తో పోరులో తొలి గేమ్‌లో ఓడిన కె.ప్రియాంక.. రెండో గేమ్‌లో విజయం సాధించింది. టైబ్రేక్‌లో వీరి మధ్య ఫలితం తేలనుంది.

ఆఖరి వన్డేలో భారత్ ఓటమి

వర్సెస్టర్: ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో అయిదు యూత్ వన్డేల సిరీస్‌లో 3-1తో తిరుగులేని ఆధిక్యం సాధించిన భారత అండర్-19 జట్టు చివరి మ్యాచ్‌లో తడబడింది. సోమవారం 7 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ చేతిలో ఓడింది. మొదట భారత్ 9 వికెట్లకు 210 పరుగులే చేయగలిగింది. గత మ్యాచ్‌లో రికార్డు శతకం సాధించిన వైభవ్ సూర్యవంశీ (33; 42 బంతుల్లో 3×4, 2×6) ఈసారి అంచనాలను అందుకోలేకపోయాడు. అంబ్రిష్ (66 నాటౌట్) టాప్ స్కోరర్. కనిష్క్ చౌహాన్ (24), హర్వంశ్ (24), రాహుల్ (21) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. అలెక్స్ ఫ్రెంచ్ (2/37), ఆల్బర్ట్ (2/24) భారత్‌ను కట్టడి చేశారు. బెన్ మయెస్ (82 నాటౌట్), డాకిన్స్ (66) మెరుపులతో ఇంగ్లాండ్ 31.1 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. కెప్టెన్ థామస్ (49 నాటౌట్) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 113 బంతులు మిగిలుండగానే ఇంగ్లాండ్ ఛేదన పూర్తయింది.

ఫ్లెచర్ మెరుపు శతకం

లాస్‌ఏంజిలెస్ విజయం



ఫ్లెచర్

లాడర్‌హిల్: ఆండ్రి ఫ్లెచర్ (118; 58 బంతుల్లో 10×4, 8×6) సీజన్లో రెండో సెంచరీ సాధించడంతో మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో లాస్‌ఏంజిలెస్ 11 పరుగుల తేడాతో శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్‌ను ఓడించింది. మొదట ఫ్లెచర్‌కు తోడు హేల్స్ (58), షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (49) మెరుపులు మెరిపించడంతో లాస్‌ఏంజిలెస్ 3 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో శాన్‌ఫ్రాన్సిస్కో కూడా దీటుగా స్పందించింది. సంజయ్ కృష్ణమూర్తి (92; 40 బంతుల్లో 7×4, 7×6), హసన్ ఖాన్ (35), హమ్మద్ అజామ్ (38), బార్ట్‌లెట్ (27) జట్టును విజయం దిశగా నడిపించారు. కానీ ఆఖర్లో చకచకా వికెట్లు కోల్పోయిన శాన్‌ఫ్రాన్సిస్కో.. 18.5 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటైంది. కార్తీక్ గట్టెపల్లి (3/31), హోల్డర్ (2/28), షాడ్లీ (2/44) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. మరో మ్యాచ్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్ 6 వికెట్ల తేడాతో ఎంఐ న్యూయార్క్‌ను ఓడించింది.

లారాపై గౌరవంతో..

● 367 వద్ద ఆగిపోయిన ముల్డర్

- దక్షిణాఫ్రికా 626/5 డిక్లేర్డ్
- ఇన్నింగ్స్ ఓటమి దిశగా జింబాబ్వే



ముల్డర్

బులవాయో: జింబాబ్వేతో రెండో టెస్టు తొలి రోజు దక్షిణాఫ్రికా స్కోరు 465/4. తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ 264 పరుగులతో అజేయంగా నిలిచాడు. రెండో రోజూ అతడి దూకుడు కొనసాగింది. జట్టు స్కోరు 600 దాటింది. అతను 400 మార్కుకు చేరువ అయ్యాడు. ఇంకొన్ని ఓవర్లు ఆడితే టెస్టు క్రికెట్ చరిత్రలో ఆ ఘనత సాధించిన ఏకైక బ్యాటర్ బ్రయాన్ లారా (400 నాటౌట్)ను దాటేస్తాడు. కానీ ముల్డర్ ఆ రికార్డు వద్దనుకున్నాడు. లారా మీద గౌరవంతో అతను 367 (334 బంతుల్లో 49×4, 4×6) పరుగుల వద్ద ఆగిపోయాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను 626/5 వద్ద డిక్లేర్ చేశాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన జింబాబ్వే.. సుబ్రయెన్ (4/24), కొడి యూసుఫ్ (2/20), వియాన్ ముల్డర్ (2/20)ల ధాటికి 170 పరుగులకే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడింది. సీన్ విలియమ్స్ (83) ఒంటరి పోరాటం చేశాడు. రెండో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 51/1తో నిలిచింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే జింబాబ్వే ఇంకా 405 పరుగులు చేయాలి. తొలి టెస్టులో ఆ జట్టు 328 పరుగుల తేడాతో ఓడింది. టెస్టుల్లో అత్యధిక స్కోరు లారా లాంటి గొప్ప బ్యాటర్ పేరు మీదే ఉండాలని, తనకు మరో అవకాశం వచ్చినా ఆ రికార్డును దాటే ప్రయత్నం చేయనని ముల్డర్ చెప్పడం విశేషం. టెస్టుల్లో అతడిది అయిదో అత్యధిక స్కోరు.

టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు

1. లారా (400 నాటౌట్; ఇంగ్లాండ్‌పై 2004లో)
2. హేడెన్ (380; జింబాబ్వేపై 2003లో)
3. లారా (375; ఇంగ్లాండ్‌పై 1994లో)
4. జయవర్ధనే (374; దక్షిణాఫ్రికాపై 2006లో)
5. ముల్డర్ (367 నాటౌట్; జింబాబ్వేపై 2025లో)

క్వార్టర్స్‌లో జకోవిచ్



జకోవిచ్

లండన్

ఏడుసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన అతడు నాలుగో రౌండ్లో 1-6, 6-4, 6-4, 6-4తో 11వ సీడ్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. ఆరో సీడ్ జకోవిచ్ ఆరంభంలో తీవ్రంగా తడబడ్డాడు. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన డిమినార్.. ఒకటి, అయిదు, ఏడో గేముల్లో బ్రేకులు సాధించి.. అలవోకగా తొలి సెట్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత జకోవిచ్ పుంజుకున్నాడు. పరస్పర బ్రేకులతో హోరాహోరీగా సాగిన రెండో సెట్‌ను జకోవిచ్ సొంతం చేసుకున్నాడు. మూడో సెట్ కూడా నువ్వా నేనా అన్నట్లు సాగింది. అయితే కీలకమైన 9వ గేమ్‌లో బ్రేక్ సాధించిన జకోవిచ్.. వెంటనే సర్వీసును కాపాడుకుని సెట్‌ను చేజిక్కించుకున్నాడు. కానీ డిమినార్ పుంజుకున్నాడు. రెండో గేమ్‌లోనే బ్రేక్ సాధించిన అతడు.. నాలుగో సెట్లో ఆరు గేములయ్యేసరికి 4-2తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ చక్కని అవకాశాన్ని చేజార్చుకున్నాడు. పుంజుకున్న జకోవిచ్ వరుసగా రెండు సార్లు ప్రత్యర్థి సర్వీసు బ్రేక్ చేసి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏస్‌లు, 38 విన్నర్లు కొట్టాడు. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్ చేరడం జకోవిచ్‌కు ఇది 16వసారి. ఎనిమిదిసార్లు ఛాంపియన్ రోజర్ ఫెదరర్.. రాయల్ బాక్స్‌లో కూర్చుని ఈ మ్యాచ్‌ను వీక్షించడం విశేషం. జకోవిచ్ సెమీఫైనల్లో స్థానం కోసం కొబోలి (ఇటలీ)తో పోటీపడతాడు. మరో మ్యాచ్‌లో కొబోలి 6-4, 6-4, 6-7 (4-7), 7-6 (7-3)తో సిలిచ్ (క్రొయేషియా)పై విజయం సాధించాడు. రెండో సీడ్ అల్కరాస్ (స్పెయిన్) కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో అతడు 6-7 (5-7), 6-3, 6-4, 6-4తో రుబ్లెవ్ (రష్యా)పై విజయం సాధించాడు. ఇతర నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో పదో సీడ్ షెల్టన్ (అమెరికా) 3-6, 6-1, 7-6 (7-1), 7-5తో సొనెగో (ఇటలీ)పై, నోరీ (బ్రిటన్) 6-3, 7-6 (7-4), 6-7 (7-9), 6-7 (5-7), 6-3తో జారీ (చిలీ)పై నెగ్గారు.

బెన్సిచ్ ముందుకు: మహిళల సింగిల్స్‌లో బెన్సిచ్ (స్విట్జర్లాండ్) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. నాలుగో రౌండ్లో ఆమె 7-6 (7-4), 6-4తో అలెగ్జాండ్రోవా (రష్యా)ను ఓడించింది. మరో ప్రిక్వార్టర్స్‌లో సమసోవా (రష్యా) 7-5, 7-5తో బౌజాస్ మనీరో (స్పెయిన్)పై గెలిచింది. ఏడో సీడ్ ఆండ్రీవా (రష్యా) 6-2, 6-3తో పదో సీడ్ నవారో (అమెరికా)ను ఓడించి తుది ఎనిమిదిలో చోటు దక్కించుకుంది. అనిసిమోవా (అమెరికా), సీగ్మండ్ (జర్మనీ) కూడా క్వార్టర్స్‌లో ప్రవేశించారు. నాలుగో రౌండ్లో అనిసిమోవా 6-2, 5-7, 6-4తో నొస్కోవా (చెక్)పై నెగ్గగా.. సీగ్మండ్ 6-3, 6-2తో సియర్రా (అర్జెంటీనా)ను ఓడించింది.

యుకి జోడీ పరాజయం: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకి బాంబ్రి కథ ముగిసింది. మూడో రౌండ్లో యుకి, గాలోవే (అమెరికా) జోడీ 4-6, 6-3, 6-7 (4-10)తో గ్రానోలర్స్ (స్పెయిన్), జెబలోస్ (అర్జెంటీనా) ద్వయం చేతిలో పరాజయంపాలైంది.

ఐసీసీ సీఈవోగా సంజోగ్ గుప్తా

దుబాయ్: జై షా సారథ్యంలోని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సీఈఓగా భారత్‌కు చెందిన సంజోగ్ గుప్తా నియమితుడయ్యాడు. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వ్యక్తిగత కారణాలతో సీఈఓ పదవి నుంచి జెఫ్ అలర్డైస్ (ఆస్ట్రేలియా) తప్పుకోగా.. అతని స్థానంలో సంజోగ్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం జియోస్టార్ సీఈవో (స్పోర్ట్స్- లైవ్ ఎక్స్‌పీరియన్స్)గా వ్యవహరిస్తున్న సంజోగ్ తక్షణం ఐసీసీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐసీసీకి అతను ఏడో సీఈవో అవుతాడు. 25 దేశాల నుంచి మొత్తం 2500 కంటే ఎక్కువ దరఖాస్తులు రాగా.. 12 మంది అభ్యర్థులతో తుది జాబితాను రూపొందించారు. ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, ఈసీబీ ఛైర్మన్ రిచర్డ్ థాంప్సన్, ఎస్‌ఎల్‌సీ అధ్యక్షుడు షమ్మి సిల్వా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాలతో కూడిన నామినేషన్స్ కమిటీ.. సంజోగ్ పేరును ఖరారు చేసింది. ఈ ప్రతిపాదనకు ఐసీసీ ఛైర్మన్ జై షా ఆమోదం తెలిపాడు. గతంలో డేవిడ్ రిచర్డ్స్, మాల్కం స్పీడ్, అలర్డైస్ (ఆస్ట్రేలియా), డేవిడ్ రిచర్డ్‌సన్, హరూన్ లోర్గాత్ (దక్షిణాఫ్రికా), మను సాహ్నో (భారత్)లు ఐసీసీ సీఈవోలుగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఆసియా షూటింగ్‌కు ఇషా, కైనన్

దిల్లీ: ఆసియా ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ షూటర్లు ఇషా సింగ్ (25 మీటర్ల పిస్టల్), కైనన్ షెనాయ్ (పురుషుల ట్రాప్) బరిలో దిగనున్నారు. ఆగస్టు 16 నుంచి 30 వరకు కజకిస్థాన్‌లోని షిమ్కెంట్‌లో జరగనున్న ఈ టోర్నీ కోసం 35 మందితో కూడిన జట్టును భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) ప్రకటించింది. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ రెండు వ్యక్తిగత విభాగాల్లో పాల్గొంటుంది. మహిళల 10 మీటర్ల పిస్టల్, 25 మీ పిస్టల్‌లో మను తన అదృష్టం పరీక్షించుకోనుంది. రుద్రాంక్ష్ పాటిల్ (పురుషుల 10 మీ ఎయిర్ రైఫిల్), అంజుమ్ మౌద్గిల్ (మహిళల 50 మీ రైఫిల్ 3 పొజిషన్స్), ఐశ్వరి ప్రతాప్‌సింగ్ తోమర్ (పురుషుల 50 మీ రైఫిల్ 3 పొజిషన్స్), సౌరభ్ చౌదరి (పురుషుల 10 మీ ఎయిర్ పిస్టల్), మెహులి ఘోష్ (మహిళల 10 మీ ఎయిర్ రైఫిల్), కిరణ్ అంకుష్ జాదవ్ (పురుషుల 10 మీ ఎయిర్ రైఫిల్)తో సహా పలువురు షూటర్లకు భారత జట్టులో చోటు దక్కింది.

ఆసీస్‌దే సిరీస్



లైయన్

సెయింట్ జార్జ్ (గ్రెనడా): వెస్టిండీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. రెండో టెస్టులో 133 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసిన కంగారూ జట్టు సిరీస్‌లో 2-0 ఆధిక్యం సంపాదించింది. 277 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ 143 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ స్టార్క్ (3/24), నాథన్ లైయన్ (3/42), హేజిల్‌వుడ్ (2/33), కమిన్స్ (1/26), వెబ్‌స్టర్ (1/15) సమష్టిగా సత్తాచాటి విండీస్ పనిపట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 286 పరుగులు చేయగా.. విండీస్ 253 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 243 పరుగులకు ఆలౌటైంది. మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో ఆసీస్ 159 పరుగుల ఆధిక్యంతో విండీస్‌పై విజయం సాధించింది. ఈనెల 13న జమైకాలోని కింగ్‌స్టన్ మైదానంలో మూడో టెస్టు (డేనైట్) ప్రారంభంకానుంది.

మహారాష్ట్ర జట్టులో పృథ్వీ



పృథ్వీ షా

ముంబయి: ముంబయి యువ బ్యాటర్ పృథ్వీ షా మహారాష్ట్ర జట్టులో చేరాడు. 2025-26 దేశవాళీ సీజన్లో మహారాష్ట్ర తరఫున పృథ్వీ బరిలో దిగనున్నాడు. గత నెలలో అతనుమరో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోరగా.. ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) పాలక మండలి అతని విజ్ఞప్తికి ఆమోదం తెలిపింది. అంతకుముందు ఫిట్‌నెస్, క్రమశిక్షణ సమస్యల కారణంగా ముంబయి రంజీ ట్రోఫీ జట్టు నుంచి పృథ్వీని తప్పించారు. దీంతో 2025-26 సీజన్‌లో మహారాష్ట్రకు ఆడాలని పృథ్వీ నిర్ణయించుకున్నాడు. ''అంతర్జాతీయ క్రికెటర్ పృథ్వీ అధికారికంగా ఎంసీఏతో విడిపోయాడు. రానున్న దేశవాళీ సీజన్‌లో అతను మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహిస్తాడు'' అని మహారాష్ట్ర క్రికెట్ సంఘం పేర్కొంది. ''నా కెరీర్‌లోని ఈ దశలో మహారాష్ట్ర జట్టులో చేరడం వల్ల క్రికెటర్‌గా మరింత ఎదగగలనని నమ్ముతున్నా. ఎంసీఏకు నా కృతజ్ఞతలు'' అని పృథ్వీ తెలిపాడు.

పరామర్శ యాత్రా... జనంపై దండయాత్రా?

- మామిడి రైతులతో మాట్లాడేందుకు రేపు బంగారుపాళ్యానికి జగన్
- భారీగా జనాన్ని తీసుకురావాలంటూ పార్టీ నేతలకు లక్ష్యాలు
- మండలాల వారీగా బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు
- బల ప్రదర్శన కోసం బక్కజీవులను బలిపీఠం ఎక్కిస్తారా?
- పల్నాడు జిల్లా రెంటపాళ్ల యాత్రలో ముగ్గురి మృతిని మరిచారా?

ఈనాడు, అమరావతి: సీఎంగా ఉన్నప్పుడు తనకు మనిషి అనే వాడు కనిపించకూడదన్నట్లుగా పరదాల మాటున పర్యటనలు సాగించిన వైకాపా అధ్యక్షుడు జగన్.. అధికారంపోయాక జనం తనతోనే ఉన్నారని చాటుకునేందుకు అవకాశాలను సృష్టించుకుని మరీ ప్రయత్నిస్తున్నారు. పరామర్శల పేరిట పర్యటనలు చేస్తూ భారీగా జనాన్ని తరలించి బల ప్రదర్శనకు దిగుతున్నారు. జగన్ తీరు పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణసంకటం చందంగా మారింది. ఇటీవల పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనే ఇందుకు నిదర్శనం. తాడేపల్లి నుంచి రెంటపాళ్ల వరకు జగన్ సాగించిన రోడ్ షోలో వైకాపా కార్యకర్త సింగయ్య నిండు ప్రాణం పోయింది. ఆ 'షో' సత్తెనపల్లి చేరగానే అక్కడ జయవర్ధన్‌రెడ్డి అనే మరో కార్యకర్త మృత్యువాత పడ్డారు. ప్రదర్శన కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌లో ఓ రోగి చనిపోయారు. 100 మందికి మించి రావొద్దని పోలీసులు వారించినా లెక్కచేయకుండా జగన్ చేసిన పరామర్శ యాత్ర ఫలితమిది..

చిత్తూరు జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర దక్కడం లేదని, రైతులను పరామర్శిస్తానంటూ బుధవారం పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం మార్కెట్ పర్యటనకు జగన్ సిద్ధమయ్యారు. మామూలుగా అయితే ఆ మార్కెట్‌కు వెళ్లి రైతులతో మాట్లాడి, సమస్యలేమైనా ఉంటే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరవచ్చు. ఇందుకు భిన్నంగా భారీ జన సమీకరణకు వైకాపా అధినాయకత్వం సిద్ధమైంది. భద్రతా కారణాల రీత్యా 500 మంది వరకే అనుమతిస్తాం, అంతకుమించి జన సమీకరణ వద్దని పోలీసులు చెబుతున్నా.. కుదరదు 10 వేల మందిని అనుమతించాలని పార్టీ నేతలు కోరారు. మరోవైపు ఉమ్మడి చిత్తూరుతో పాటు కడప జిల్లాలోని పార్టీ నాయకులకు జనసమీకరణ లక్ష్యాలు విధించారు. ప్రతి మండలానికి 15-20 కార్లు, కొన్నిచోట్ల 100 కార్లు, 400-500 వరకు ద్విచక్రవాహనాలపై జనాన్ని తరలించాలని నాయకులను ఆదేశించారు. తోతాపురి మామిడితో ఎలాంటి సంబంధమూ లేని కడప, పులివెందుల లాంటి చోట్ల నుంచీ జనాన్ని తరలిస్తుండటంతోనే జగన్ యాత్ర పరమార్థమేంటో స్పష్టమవుతోంది. పరామర్శకే అయితే మందీ మార్బలం ఎందుకు?


గత నెలలో జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా జరిగిన రోడ్‌షోలో వైకాపా కార్యకర్త విన్యాసం

ఎక్కడికి వెళ్లినా అలజడులే..

- కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకంటూ జగన్ ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడుకు వెళ్లగా అక్కడ అలజడి రేగింది. పోలీసులపై వైకాపా కార్యకర్తలు దాడికి దిగారు.
- పొగాకు రైతుల పరామర్శ పేరిట జగన్ ప్రకాశం జిల్లా పొదిలికి వెళ్లినప్పుడు వేల మందిని సమీకరించారు. సాక్షి ఛానల్ చర్చలో అమరావతి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన వారిని వెనకేసుకొచ్చినందుకు... క్షమాపణ చెప్పాలంటూ అక్కడ మహిళలు నిరసన తెలిపితే.. వారిపై వైకాపా కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడికి తెగబడ్డారు. ఆ దాడిలో పోలీసులకూ గాయాలయ్యాయి.
- గుంటూరు మిర్చియార్డును జగన్ సందర్శించినప్పుడు.. పోలీసులతో వైకాపా నేతలు దురుసుగా వ్యవహరించారు.
- శ్రీసత్యసాయి జిల్లాలో వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడూ భారీగా జనసమీకరణ చేశారు.

రేపు ప్రభుత్వం మారుతుంది.. పోలీసులను ఎవరు కాపాడతారు

- విలేకర్ల సమావేశంలో వెంకట్రామిరెడ్డి బెదిరింపులు
- పోలీసు వ్యవస్థ నీచస్థాయికి దిగజారిందంటూ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి పోలీసులనూ బెదిరించే స్థాయికి చేరారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఛైర్మన్‌గానూ ఉన్న ఆయన గత సాధారణ ఎన్నికల ముందు వైకాపాకు అనుకూలంగా ప్రచారం చేశారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అయినా జగన్‌ను వెనకేసుకొచ్చి కూటమి ప్రభుత్వంపై వెంకట్రామిరెడ్డి తరచూ విమర్శలు చేస్తున్నారు. ఉద్యోగుల సమస్యల పేరుతో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించిన ఆయన... జగన్ కారు ప్రమాదంలో ఓ రాజకీయ నేత విమర్శలు చేశారు. "గుంటూరులోని కారు ప్రమాదంలో ఎస్పీ మొదట ఒక మాట చెప్పారు. మళ్లీ రెండు రోజుల తర్వాత మాట మార్చారు. రేపు ప్రభుత్వం మారుతుంది. 'పెట్టింది తప్పుడు కేసు అయితే పోలీసులను ఎవరు కాపాడతారు'' అంటూ బెదిరింపులకు గురిచేశారు. పోలీసు వ్యవస్థ దరిద్రంగా, నీచస్థాయికి దిగజారిందని వ్యాఖ్యానించారు.

జగన్ క్షమించమని అడిగారా?

గత వైకాపా ప్రభుత్వంలో ఒక ఐఏఎస్ అధికారి ఉద్యోగులను చిన్న మాటంటే అప్పటి ముఖ్యమంత్రే స్వయంగా సారీ చెప్పారంటూ జగన్‌ను వెంకట్రామిరెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు. 11వ పీఆర్సీని అస్తవ్యస్తంగా అమలు చేసి, ఉద్యోగులకు భారీగా బకాయిలు పెట్టి, సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పట్టించుకోకుండా జీపీఎస్ తెచ్చిన జగన్ ఉద్యోగులకు చాలా మేలు చేశారంటూ వైకాపా భజన చేశారు.

నేడు ఒలకబోస్తున్న ప్రేమ... ఆనాడు ఏమైంది?

- అధికారంలో ఉండగా మామిడి రైతులను పట్టించుకోని జగన్
- వైకాపా హయాంలో కిలో ధర రూ.9 నుంచి 10
- ప్రస్తుతం రూ.200 కోట్ల భారం పడుతున్నా... కిలోకు రూ.12 చెల్లిస్తున్న ప్రభుత్వం
- ఇంత చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ వైకాపా యాగీ

ఈనాడు, చిత్తూరు: తాను సీఎంగా ఉన్నప్పుడు మామిడి రైతులను పట్టించుకోని జగన్.. ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారు. తోతాపురి ధరలు పతనమైనా అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పరామర్శ పేరిట చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డు పర్యటనకు సిద్ధమయ్యారు. వైకాపా హయాంలో రెండేళ్లు మామిడి ధరలు పాతాళానికి చేరినా చలించని జగన్ ఇప్పుడు సమస్యపై మాట్లాడుతుండటం.. సర్వత్రా తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అన్నదాతలు ఇబ్బంది పడకూడదని దాదాపు రూ.200 కోట్ల భారాన్ని భరిస్తూ మామిడికి రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ధరను ఇస్తున్న విషయం జగన్‌కు పట్టదా అని కర్షకులు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరేళ్లుగా తోతాపురి మామిడి సాగు విస్తీర్ణం, దిగుబడులు ఇలా..

సంవత్సరం	సాగు(ఎకరాల్లో)	దిగుబడి (లక్షల టన్నులు)
2020–21	76,265	1.95
2021–22	81,265	2.02
2022–23	87,485	2.18
2023–24	1,05,510	2.63
2024–25	1,05,510	2.11
2025–26	1,00,060	5.08

'పెద్దాయన' సంస్థ ఐదేళ్లూ దోచుకున్నా..

జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'పెద్దాయన' హవా సాగింది. మామిడి రైతులను ఆయన పీల్చి పిప్పి చేశారు. తన గుజ్జు పరిశ్రమకు కాయలను అమ్మిన రైతులకు తక్కువ ధర చెల్లించారు. గిట్టుబాటు కాదంటూ రైతులు వేరే చోట్లకు మామిడిని తరలించాలని ప్రయత్నించగా.. దౌర్జన్యంగా ట్రాక్టర్లను తీసుకెళ్లి కిలోకు రూ.5-6 మాత్రమే ఇచ్చారు. ఆ నాయకుడి ఆదేశాలతో జిల్లాలోని మిగతా గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు ఏకమై అన్నదాతల శ్రమను దోచుకున్నాయి. కలెక్టర్లు మద్దతు ధర ప్రకటించినా ఆ మేరకు ఎవరూ కొనలేదు. ఇప్పుడు మామిడి రైతు కోసం వస్తున్నానంటున్న జగన్.. ఐదేళ్లపాటూ సాగిన ఈ దోపిడీని ఎందుకు అరికట్టలేదు?

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే భేష్..

పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు.. మామిడి రైతుల సమస్యపై కంటితుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నాయి. హెక్టారుకు 5 టన్నుల చొప్పున రెండు హెక్టార్ల వరకే కొంటామని కర్ణాటక సర్కారు స్పష్టంచేసింది. అదీ ఒక రైతుకు గరిష్ఠంగా రూ.40 వేలే ఇస్తామని, నెల రోజుల పాటే కొనుగోలు చేస్తామంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతులు ఎంత పంటను తీసుకొచ్చినా కిలోకు రూ.4 అదనంగా చెల్లిస్తామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. చివరి కాయ వరకూ కొంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఇలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తూ రైతులకు మేలు చేస్తున్నా.. జగన్ ఓర్వలేకే విమర్శలకు దిగుతున్నారని రైతాంగం అభిప్రాయపడుతోంది.

ప్రభుత్వ సాయం.. రూ.92 వేలు



– నారాయణస్వామి, రైతు, బంగారెడ్డిపల్లె, చిత్తూరు మండలం

నాకు నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ఐదేళ్లుగా ఎకరాకు 2-3 టన్నుల కాయలే కాశాయి. ఈసారి 5.75 టన్నుల చొప్పున దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కనీస ధరను ప్రకటించి... కిలోకు రూ.4 చొప్పున ఖాతాలో అదనంగా వేస్తున్న ప్రోత్సాహకం డబ్బుతో నాకు రూ.92 వేలు అందుతాయి. గుజ్జు పరిశ్రమ నుంచి రూ.1.38 లక్షలు వస్తాయి. ఎరువులు, పురుగు మందులు, కూలీలు, రవాణా ఖర్చులన్నీ పోగా నాలుగు ఎకరాలపై రూ.70 వేలు మిగులుతుంది. వైకాపా హయాంలో రెండుసార్లు ధరలు తగ్గినా ఒక్క రూపాయి అదనంగా ఇవ్వలేదు.

వైకాపా హయాంలో దక్కని ఊరట

వైకాపా హయాంలో 2021, 2023 సీజన్లలో తోతాపురి మామిడి ధరలు పాతాళానికి చేరాయి. 2021 జూన్‌లో గుజ్జు పరిశ్రమలు కిలో రూ.6-7కే కొనుగోలు చేశాయి. 2023లో అధికారులు కిలోకు రూ.19 ధర నిర్ణయించగా గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు రూ.12-14కే కొన్నాయి. చివరికి అధికారులు కిలోకు రూ.15.50గా కనీస ధర ప్రకటించినా యాజమాన్యాలు పట్టించుకోలేదు. కిలో రూ.9-10కే కొన్నాయి. ఆ రెండు సీజన్లలో ఎకరాకు సరాసరి 2.48 నుంచి 2.50 టన్నుల దిగుబడి వచ్చింది. ఇంతలా ధరలు, దిగుబడులు పతనమైనా జగన్ ఏనాడూ జోక్యం చేసుకోలేదు. అన్నదాతలకు కిలోకు రూపాయి కూడా అదనంగా చెల్లించలేదు. ఇప్పుడేమో కూటమి సర్కారును విమర్శిస్తున్నారు. రైతులు నష్టాలతో దెబ్బతింటున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆరోపిస్తూ పరామర్శ యాత్రకు సిద్ధమయ్యారు.


వైకాపా హయాంలో మద్దతు ధర లభించడం లేదని 2021 జూన్ 21న చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మామిడికాయలను పారబోసి నిరసన తెలిపిన రైతులు, రైతు సంఘాల నాయకులు

ఇప్పుడు అడుగడుగునా భరోసా

కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ఎకరాకు 2 టన్నుల దిగుబడే వచ్చింది. కిలో తోతాపురి రూ.22-రూ.28 పలికింది. ఈ సంవత్సరం ఎకరాకు 5 టన్నుల చొప్పున దిగుబడి వచ్చింది. ధరలు పతనమవుతాయని ప్రభుత్వం ముందుగానే ఊహించింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్.. సీజన్ పూర్తిగా ప్రారంభం కాకముందే జూన్ 3న కిలోకు కనీస ధర రూ.12గా నిర్ణయించారు. దీనికి అదనంగా ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని ప్రకటించారు. రెండు జిల్లాల కలెక్టర్లూ... రోజూ మూడు, నాలుగు గంటల చొప్పున మామిడిపై సమీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి నాలుగైదు పరిశ్రమలను సందర్శిస్తున్నారు. సీఎం చంద్రబాబు, సీఎంవో అధికారులు నిత్యం పరిస్థితిని తెలుసుకుంటూ సూచనలు ఇస్తున్నారు. ఈ నెల 4న సీఎం కుప్పంలోనూ సమీక్షించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉద్యాన శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించారు.

జెండా పీకేసే సమయం వచ్చిందనే ఈ యాత్రలు

- జగన్‌పై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం
- రైతుల నుంచి ఇప్పటికే 80% మామిడి కొన్నామని వెల్లడి



ఈనాడు, దిల్లీ: అధికారంలో ఉన్నప్పుడు పరదాల మాటున తిరుగుతూ ప్రజల వైపు కన్నెత్తి చూడని జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తన పార్టీకి జెండా పీకేసే పరిస్థితి వచ్చిందన్న ఆందోళనలతోనే పరామర్శల యాత్రలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లా మామిడి రైతుల సమస్యను తాము రెండు నెలల క్రితమే గ్రహించి కిలో రూ.12 చొప్పున తోతాపురి మామిడి కొనుగోలుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇప్పటికే రైతుల నుంచి 80% కొని డబ్బులు కూడా చెల్లించామని, ఇప్పుడు జగన్ పరామర్శలంటూ శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మామిడి కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులో 50% కేంద్రం భరించాలని కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్‌ను కోరడానికి దిల్లీకి వచ్చిన అచ్చెన్నాయుడు సోమవారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మామిడి గత ఏడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, ఈ ఏడాది 6.5 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందన్నారు. అంత ఉత్పత్తిని పల్ప్ కంపెనీలు కొనే పరిస్థితి ఉండదని గ్రహించి ముఖ్యమంత్రి రెండు నెలల ముందే కిలో మామిడిని రూ.12 చొప్పున కొనాలని ఆయా సంస్థలను ఆదేశించారని, రూ.4 రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడానికి సిద్ధమైందని వివరించారు. కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు అక్కడి మామిడి రైతులను గాలికొదిలేసినా, అక్కడ రూ.16కి కిలోకు కొంటున్నట్లుగా వైకాపా తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు.

రైతులను పలకరించడానికి 25 వేల మంది అవసరమా?

జగన్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డంగా సంపాదించిన అవినీతి సొమ్మును వెదజల్లి జనసమీకరణతో యాత్రలు చేస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 7 జిల్లాల నుంచి జనాన్ని సమీకరించి 800 బస్సులు, 2,000 కార్లతో దండయాత్ర చేయడానికి సమాయత్తమవుతున్నారని.. రైతులను పలకరించడానికి 25 వేల మంది అవసరమా? అని ప్రశ్నించారు. కరేడు భూసేకరణ విషయంలో ప్రభుత్వం మూర్ఖంగా ముందుకెళ్లదని, రైతులతో మాట్లాడి శాంతియుతంగా సమస్య పరిష్కరించడానికే ప్రయత్నిస్తామని అచ్చెన్నాయుడు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని, యూరియా, డీఏపీ బఫర్ స్టాక్ ఉంచామని తెలిపారు.


జగన్‌కు స్వాగతం పలుకుతున్న వైకాపా కార్యకర్తలు. చిత్రంలో ఎంపీ అవినాష్‌రెడ్డి తదితరులు

బెంగళూరు నుంచి పులివెందులకు జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు వచ్చారు. ఆయన బెంగళూరు నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పులివెందులలోని బాకరాపురం హెలిపాడ్‌కు సాయంత్రం 5.20 గంటలకు చేరుకున్నారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జగన్ తన క్యాంపు కార్యాలయానికి వెళ్లి ప్రజాదర్బార్ నిర్వహించారు.

అవగాహన లేకే జగన్ అనుచిత వ్యాఖ్యలు: మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, అమరావతి: మామిడి రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర గురించి జగన్‌కు అవగాహన కూడా లేదని అందుకే ఆయన కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ మాట్లాడుతూ 'మామిడి రైతుల పరామర్శ పేరుతో జగన్ దండుపాళ్యం బ్యాచ్‌తో చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం వెళ్లనున్నారు. ప్రశాంత వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారు' అని విమర్శించారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్‌ఏ), జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంయుక్త నిధులతో 417 గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు అనుమతిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.32 లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో ఆర్జీఎస్‌ఏ ద్వారా రూ.25 లక్షలు, నరేగా ద్వారా రూ.7 లక్షల మెటీరియల్ నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా ఎమ్మెల్యేపై మురికి వ్యాఖ్యలు

- ప్రశాంతిరెడ్డిపై బూతులతో రెచ్చిపోయిన వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డి
- ఆ తర్వాత ఆయన ఇంటిపై దాడి

ఈనాడు, నెల్లూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వైకాపా నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బరితెగించి మరీ మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మురికి వ్యాఖ్యలు చేయడంతో సోమవారం రాత్రి ఆయన ఇంటిపై దాడి జరిగింది. కోవూరు నియోజకవర్గం పడుగుపాడులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం వైకాపా నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రసన్నకుమార్‌రెడ్డి నోరుపారేసుకున్నారు. ప్రశాంతిరెడ్డి చరిత్ర మొత్తం తనకు తెలుసంటూ. . దారుణమైన పదజాలాన్ని వాడారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎవరూ దొరకనట్టు ఆమెను చేసుకున్నారని.. ఆయన కోరితే ఓ కన్నెపిల్లను తెచ్చి తానే పెళ్లి చేసేవాడినంటూ మాట్లాడారు. 'పదేళ్ల కిందట నువ్వు ఎక్కడున్నావ్? ఆ ప్రభాకర్‌రెడ్డికి ఒకటే చెబుతున్నా.. నీ దగ్గర రూ.వేల కోట్ల ఆస్తులున్నాయ్. జాగ్రత్తగా ఉండాలి నువ్వు. ఇప్పటికే నిన్ను చంపడానికి రెండు సిట్టింగ్‌లు అయ్యాయని నా దగ్గర సమాచారం ఉంది' అంటూ మరి కొన్ని మురికి వ్యాఖ్యలు చేశారు. 'అతనో పిచ్చోడు. ఎందుకు ఈమెను పెళ్లిచేసుకున్నాడో తెలియదు. అతను అడిగి ఉంటే.. జిల్లాలో ముక్కుపచ్చలారని ఏ అమ్మాయినైనా అతనికిచ్చి పెళ్లి చేసేవాడిని' అని అన్నారు.



కోవూరు నియోజకవర్గం పడుగుపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కారు... ఫర్నిచర్ ధ్వంసం

నెల్లూరు నగరం జేవీఆర్ కాలనీ సమీపంలోని ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై సోమవారం రాత్రి దాడి జరిగింది. 8.30 నుంచి 9 గంటల మధ్యలో కొందరు మూకుమ్మడిగా దాడికి పాల్పడి కారు ధ్వంసం చేశారు. ఇంటిలోకి వెళ్లి ఫర్నిచర్, కుర్చీలను విరగ్గొట్టారు. కిటికీలు పగలగొట్టారు. దుస్తులను బయటకు తీసుకొచ్చి తగలబెట్టారు. ఆ సమయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో లేరు. సమాచారం తెలుసుకున్న వైకాపా నేతలు అనిల్‌కుమార్‌యాదవ్, ఆనం విజయకుమార్‌రెడ్డి, మేరిగ మురళీ, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదంతా తెదేపా నాయకుల పనేనని ఆరోపించారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


దాడిలో దెబ్బతిన్న ప్రసన్నకుమార్‌రెడ్డి కారు


ఇంట్లో ధ్వంసమైన ఫర్నిచర్, సామగ్రి

జగన్, అవినాష్‌రెడ్డిల నిర్లక్ష్యంతోనే విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయానికి అనుమతులు తీసుకోలేదు: షర్మిల


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న షర్మిల

ఈనాడు–కడప, న్యూస్‌టుడే–మారుతీనగర్: గత వైకాపా పాలనలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయానికి అనుమతులు తీసుకురాకుండా మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. సీవోఏ(కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్) అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ వారం రోజులుగా కడపలోని విశ్వవిద్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సోమవారం ఆమె మద్దతు తెలిపారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 500 మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారేందుకు మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిలు కారణమని షర్మిల మండిపడ్డారు. విశ్వవిద్యాలయంలో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వ్యాలిడేటెడ్ సర్టిఫికెట్ వస్తుందో లేదోనసే అయోమయంలో ఉండటం బాధాకరమన్నారు. ఒక్కో విద్యార్థి రూ.15 లక్షల వరకు ఖర్చు పెట్టి చదివినా వారి భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 2020లో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన సమయంలో సీవోఏ అనుమతి ఇవ్వలేదన్నారు. అప్పటి వైకాపా ప్రభుత్వం విద్యార్థులను మభ్యపెట్టి ప్రవేశాలు కల్పించిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.

షెడ్డు కూలిన ఘటనకు సింహాచలం దేవస్థానానిదే బాధ్యత

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: 'సింహాచలం క్షేత్రంలో జరిగే చందనోత్సవం, గిరి ప్రదక్షిణలకు లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఏడాదిలో జరిగే ఈ రెండు ప్రధాన ఉత్సవాలను కూడా సక్రమంగా నిర్వహించకపోతే ఎలా? చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు మరణించిన ఘటన జరిగిన రెండు నెలలకే తొలిపావంచా వద్ద షెడ్డు కూలింది. ఉత్సవం రోజున కూలి ఉంటే ప్రమాద తీవ్రత ఊహించలేనిది' అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సింహాచలం అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సింహాచలం తొలిపావంచా వద్ద షెడ్డు కూలిన ప్రాంతాన్ని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవస్థానంలో పటిష్ఠమైన యంత్రాంగం ఉన్నప్పటికీ పర్యవేక్షణ లేకపోవడం సరికాదన్నారు. షెడ్డు కూలిన ఘటనకు దేవస్థానం బాధ్యత వహించాలన్నారు. గుత్తేదారులపై నెపం నెట్టడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు.


సింహాచలం క్షేత్రం తొలిపావంచా వద్ద షెడ్డు కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

3 జిల్లాల్లో 3.33 లక్షల టన్నుల మామిడి కొనుగోలు

ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: రైతుల నుంచి ఇప్పటి వరకు 3.33లక్షల టన్నుల తోతాపురి మామిడిని కొనుగోలు చేశామని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు వేగవంతం చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో 2,41,652 టన్నులు, తిరుపతి జిల్లాలో 72,978, అన్నమయ్య జిల్లాలో 18,397 టన్నులు కొనుగోలు చేశామని.. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలో అధికశాతం ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద వేచి ఉండే సమయం 12 నుంచి 24 గంటలు ఉండగా.. మూడు యూనిట్ల వద్ద 48 నుంచి 72 గంటలు పడుతోందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 12 గంటల్లో దిగుమతి అవుతోందన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామని.. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో పాటు అన్ని సౌకర్యాలూ కల్పించామని వెల్లడించారు.

మహిళలపై నేరాలకు ఆస్కారమున్న 900 హాట్‌స్పాట్‌ల గుర్తింపు

- శక్తి బృందాలతో అక్కడ నిరంతర నిఘా
- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి

ఈనాడు, అమరావతి: మహిళలపై నేరాలు జరిగేందుకు ఆస్కారమున్న 900 హాట్‌స్పాట్‌లను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శక్తి బృందాలు ఈ హాట్‌స్పాట్‌లను నిరంతరం సందర్శిస్తూ అక్కడ ప్రత్యేక నిఘా పెడుతున్నాయని, ఒంటరిగా ఉన్న మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్నాయని వివరించారు. ఈవ్‌టీజర్లను పట్టుకోవడం, బహిరంగ మద్యపాన ప్రదేశాలను గుర్తించడంతో పాటు ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం శక్తి బృందాలు పనిచేస్తున్నాయని అన్నారు. "ఇటీవల కాలంలో ఏలూరు జిల్లా తంగెళ్లమూడిలో కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళుతున్న ఓ మహిళను శక్తి బృందాలు కాపాడాయి. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, పలాసల్లో అదృశ్యమైన మహిళలను వెతికి కుటుంబసభ్యులకు అప్పగించాయి. విజయనగరం జిల్లా గజపతి నగరంలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న వారిని పట్టుకున్నాయి. శక్తి బృందాల పనితీరుకు ఇవి కొన్ని ఉదాహరణలే. మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వరమే శిక్షలు పడేలా చేస్తున్నాం. గతేడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకూ 261 కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా చేశాం" అని హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు.

వానల్లో డ్రైవింగ్.. జాగ్రత్త గురూ!

జోరు వానలో కారు ప్రయాణం ఆహ్లాదకరమే. అదే సమయంలో ప్రతిక్షణం ఒక పరీక్షే! ఏమరుపాటుగా ఉన్న ఒక్క క్షణం చాలు.. ప్రమాదం ముంచుకు రావడానికి. అందుకే డ్రైవింగ్‌లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



మన దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 75 శాతం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనే జరుగుతున్నాయని... 47 శాతం వర్షాకాలంలోనే జరుగుతున్నాయని గుర్తించారు. వానల్లో వాహనాల డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో ఈ గణాంకాలు చెబుతున్నాయి.

అధిక వేగంతో వాహనాలు ప్రయాణించే సమయంలో వాటి నుంచి వెలువడే పొగ, ఆయిల్ మరకలు, టైర్ల ఒత్తిడి కారణంగా రోడ్డుపై సన్నటి పొర ఏర్పడుతుంది. వర్షం కురవడం ప్రారంభమైన సమయంలో ఇది జారుడు స్వభావాన్ని కలిగి ఉంటుంది. అందుకే వర్షం మొదలైందనే తొందరలో వేగం పెంచి వాహనం నడపకూడదు.



చెక్ చేశారా?

- వర్షం ఉన్నా, లేకున్నా వాహనం బయటకు తీసే సమయంలోనే అన్నీ సరిగా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి.
- విండ్ షీల్డ్ వైపర్స్ ఆన్ చేసి చూడాలి. బ్లేడ్స్ దెబ్బతింటే మార్చుకోవాలి.
- వైపర్‌కు నీరు పంప్ అవుతుందా? నాజిల్స్ పనిచేస్తున్నాయా? కనెక్షన్స్ ఎలా ఉన్నాయి? ట్యాంకులో సరిపడా నీరుందా?.. చూడాలి.
- హెడ్ లైట్స్, టెయిల్ లైట్స్, బ్రేక్ లైట్స్, టర్న్ ఇండికేటర్లు, అత్యవసర పార్కింగ్ లైట్లు ఆన్ చేసి చూసుకోవాలి.
- బ్యాటరీ కండిషన్ నిర్ధారించుకోవాలి. బ్రేక్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలి

ఆగి.. వెళ్లండి!

- భారీవర్షం కురుస్తున్న సమయంలో వైపర్ ఉపయోగించినా ముందు వెళుతున్న వాహనాలు సరిగా కనిపించకుంటే కొద్దిసేపు ఆగడం ఉత్తమం.



- అలాగని వాహనాన్ని రోడ్డుపక్కనే నిలపకూడదు. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలు.. అదుపుతప్పి దూసుకొచ్చే ప్రమాదం ఉంటుంది.
- ముందు వేగంగా వెళుతున్న చోదకుడు బ్రేక్ వేస్తే.. వెనక వచ్చే వారు గమనించేలోగానే ప్రమాదం జరిగిపోతుంది. అందుకే సడన్ బ్రేక్ వేయకూడదు.
- జారే రోడ్లపై సాధారణం కంటే తక్కువ వేగంతో ప్రయాణించాలి. ముందున్న వాహనానికి సురక్షిత దూరం పాటించాలి.
- రహదారిలో ఒకే లేన్ లోనే ప్రయాణించాలి. ఎక్స్‌ప్రెస్ వే అయితే మధ్య లేన్‌లో ఉండాలి. ముందెళ్లే వాహనాలను అధిగమించే ప్రయత్నం చేయొద్దు.
- డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడడం, భారీ శబ్దాలతో మ్యూజిక్ వినడం ఆపేయాలి. అవి ఏకాగ్రతను దెబ్బతీస్తాయి.
- వర్షం కురిసే సమయంలో డీఫాగర్, ఎయిర్ కండిషనింగ్ ఉపయోగిస్తే అద్దాలపై పొగమంచు ఏర్పడకుండా ఉంటుంది. ఉష్ణోగ్రతను సౌకర్యవంతమైన స్థాయిలో ఉంచాలి.
- ప్రయాణానికి ముందే టైర్ల మన్నిక, గాలి తనిఖీ చేసుకోవాలి. గాలి ఒత్తిడి ఎక్కువున్నా, తక్కువున్నా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది.



చూసి నడపండి..

- వరద ప్రవహించే మార్గంలో ప్రయాణాన్ని నివారించాలి. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే వాహనం వేడింగ్ డెప్త్ (సురక్షితంగా దాటగలిగే గరిష్ఠ నీటిలోతు) తెలుసుకోవాలి. కారు మాన్యువల్ లేదా కంపెనీ వెబ్‌సైట్‌లో ఈ వివరాలుంటాయి. నీటిలోతు ఎక్కువ ఉంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి.



- నీరున్న మార్గంలో ప్రయాణించడం తప్పనిసరయితే మొదటి గేర్‌లో స్థిరంగా నడపాలి. వేగం పెంచడం, తగ్గించడం చేయొద్దు. అలా చేస్తే నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది. అకస్మాత్తుగా యాక్సిలేటర్ తొక్కడం, బ్రేక్ వేయడం చేయొద్దు.
- నీటి మధ్యలో వాహనం ఆగిపోతే ఆందోళన చెందొద్దు.. వెంటనే స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించొద్దు.. ఇంజిన్ పట్టుకుపోయే (హైడ్రోలాక్) ప్రమాదం ఉంది.
- ఇంజిన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు.. ఎయిర్ కండిషన్ ఆపాలి. దారి సరిగా కన్పించకపోతే.. హజార్డ్, ఫాగ్‌లైట్లు ఉపయోగించాలి.
- నీటి ప్రవాహం నుంచి బయటకు వచ్చాక.. బ్రేక్‌లు సున్నితంగా వాడాలి. కాస్త ఆరబెట్టాలి.
- వీలుంటే ఎత్తుగా ఉన్న ప్రదేశంలోకి తీసుకెళ్లి బ్యాటరీ డిస్‌కనక్ట్ చేయాలి. మెకానిక్‌ను సంప్రదించాలి. బీమా సంస్థ ప్రతినిధికి సమాచారం ఇవ్వాలి.
- అత్యవసర పరిస్థితుల్లో జాతీయ రహదారుల్లోని సహాయ కేంద్రం, టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సహాయం కోరాలి.



ఇలా చేయండి...

- హైవే ట్రాఫిక్, హైవే వెదర్ యాప్‌ల ద్వారా. ప్రయాణ మార్గంలో వాతావరణం గమనించాలి
- తుపాను, గాలుల హెచ్చరికలుంటే.. వాయిదా వేసుకోవాలి. తప్పనిసరైతేనే ప్రయాణం చేయాలి.
- జాతీయ, రాష్ట్ర రహదారులపై సహాయ కేంద్రాలు, టోల్‌ఫ్రీ నంబర్లు సేకరించుకోవాలి
- వాహనంలో ఫ్లాష్ లైట్, ప్రథమచికిత్స కిట్, దుప్పటి.. ఇతర అత్యవసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలి

వానలకు రోడ్లు జారుడుగా ఉంటాయి వేగం తగ్గించి నడపాలి. ముందు వెళ్లే వాహనాలకు మధ్య దూరం పాటించాలి. వైపర్ ట్యాంకులో లిక్విడ్స్ కలిపి వాష్ చేయడం వల్ల గ్లాస్ క్లీన్‌గా కనబడుతుంది. కారు లోపల వైపు అద్దానికి వచ్చే చెమ్మను ఏసీలోని ఆప్షన్స్ ద్వారా తగ్గించుకోవాలి. టైర్లు నాలుగేళ్లకోసారి లేదా 35-40వేల కిమీ తిరిగిన తర్వాత మార్చుకుంటే మంచిది.

– పైడిరాజు, వాహనరంగ నిపుణులు, విశాఖపట్నం

- ఈనాడు, విశాఖపట్నం



నేడు నేవీలోకి ఐఎన్ఎస్ నిస్తార్

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డులో నిర్మించిన డైవింగ్ సపోర్టు నౌక ఐఎన్ఎస్ నిస్తార్ నేవీలోకి మంగళవారం చేరనుంది. ప్రధానంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జలాంతర్గాములకు సహకారంగా నిస్తార్ సేవలు అందిస్తుంది. దీనితో పాటు మరో నౌక 'నిపుణ్' నిర్మాణానికి షిప్‌యార్డు రూ.2,230 కోట్ల ఆర్డర్‌ను దక్కించుకున్న సంగతి తెలిసిందే.

మరింత కచ్చితంగా వాతావరణ అంచనాలు

రూ.1,800 కోట్లతో రెండు ఉపగ్రహాలను ప్రయోగించనున్న ఐఎండీ

శ్రీహరికోట, న్యూస్‌టుడే: కచ్చితత్వంతో మరింత మెరుగ్గా వాతావరణ అంచనాలను తయారుచేసేందుకు వీలుగా ఇన్సాట్-4 సిరీస్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపాలని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) నిర్ణయించింది. ఇస్రో సాయంతో రెండు ఉపగ్రహాలను ప్రయోగించి, 2028-29 నాటికి వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలకు రూ.1,800 కోట్ల వ్యయం అవుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. చిత్రాల్లో మెరుగైన రిజల్యూషన్‌తో వచ్చేలా, పిడుగుపాటును గుర్తించేందుకు సైతం వీలుగా అత్యాధునిక సెన్సర్లను ఈ ఉపగ్రహాల్లో అమర్చనున్నారు. కొండ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో వాతావరణ అంచనాలకు పరికరాలు, రాడార్లు ఏర్పాటు చేయడం కష్టమని, ఉపగ్రహ ఆధారిత వ్యవస్థల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని ఐఎండీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఐఎండీ వినియోగించే రెండు ఉపగ్రహాల ద్వారా మేఘాల విస్ఫోటాలు, ఉరుములు, మెరుపులు, తదితర వాతావరణ పోకడలను గుర్తించడంలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యలు తలెత్తకుండా అత్యాధునిక సెన్సర్లతో ఇన్సాట్-4 సిరీస్ ఉపగ్రహాలు రూపుదిద్దుకుంటాయి. వీటి ద్వారా అంచనాల్లో కచ్చితత్వం 20 శాతం నుంచి 30 శాతం వరకు మెరుగుపడనుందని ఐఎండీ అంచనా వేస్తోంది.

కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందేభారత్‌లో మరో 8 కోచ్‌లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రైల్లో రాకపోకలు సాగించేవారికి రిజర్వేషన్ కష్టాలు తగ్గనున్నాయి. కాచిగూడ-యశ్వంత్‌పూర్, యశ్వంత్‌పూర్-కాచిగూడల మధ్య రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో కోచ్‌ల సంఖ్య 8 నుంచి 16కి పెరిగింది. దీంతో ఈ రైల్లో సీట్ల సంఖ్య 530 నుంచి 1,128కి చేరుకుందని ద.మ.రైల్వే వెల్లడించింది. ఈ నిర్ణయం ఈ నెల 10 నుంచి అమల్లోకి రానుందని జోన్ సీపీఆర్వో సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఈ రైల్లో ఛైర్ కార్ కోచ్‌ల సంఖ్య 7 నుంచి 14కి, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌ల సంఖ్య ఒకటి నుంచి రెండుకు పెరిగింది. ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023 సెప్టెంబరు 24న వర్చువల్‌గా ప్రారంభించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సీట్ల భర్తీ నిష్పత్తి 100 శాతంపైనే ఉంది. ఈ నేపథ్యంలో కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తూ రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మహబూబ్‌నగర్‌తో పాటు ఏపీలో కర్నూలు, అనంతపురం, ధర్మవరం స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

చేసిన మోసం 30 ఏళ్లు వెంటాడింది

కార్వార, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం కార్వార సమీపంలోని శిరసికి చెందిన ఓ వ్యక్తిని మూడు దశాబ్దాల తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. కారణం తెలిస్తే అవాక్కవ్వాల్సిందే.. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక యువకుడి నుంచి మూడు దశాబ్దాల క్రితం రూ.200 తీసుకుని కేశవమూర్తిరావు (55) పరారయ్యాడు. శిరసికి చెందిన వెంకటేశ మహదేవ వైద్య నుంచి నగదు తీసుకుని వంచించారని కేశవమూర్తిపై కేసు నమోదైంది. ఈ కేసులో కార్వార ఠాణా పోలీసులు కేశవమూర్తిని అరెస్టు చేశారు. ఆయన ఇదే తరహాలో పలువురి నుంచి నగదు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న నిందితుడు తన స్వగ్రామానికి తిరిగి వచ్చాడని తెలుసుకున్న పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.



ఈ మూడు తప్పులతో నిద్రలేమి

రాత్రిపూట గాఢనిద్ర కావాలంటే ఈ మూడు తప్పులు చేయకండి.

1. పడక గదిలో మొబైల్ చూస్తూ గడపడం.
2. రోజూ ఒకే వేళకు నిద్రపోకపోవడం.
3. పడుకొనే ముందు కెఫీన్ ఉన్న పదార్థాలను తీసుకోవడం.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

ఉద్యోగుల పదోన్నతులపై ఉత్తర్వులను..

3 నెలల్లో సానుకూలంగా అమలు చేస్తాం

- పురోగతిని న్యాయస్థానం ముందు ఉంచుతాం
- హైకోర్టుకు నివేదించిన ఏజీ
- విచారణ సెప్టెంబరు 1కి వాయిదా

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబరు నెలలో ఇచ్చిన తీర్పును సానుకూలంగా మూడు నెలల్లో అమలు చేస్తామని, పురోగతిని కోర్టు ముందు ఉంచేందుకు ఐదు వారాల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ జె.సుమతిల ధర్మాసనం విచారణను సెప్టెంబరు ఒకటో తేదీకి వాయిదా వేసింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఉద్యోగులు ఉమ్మడి హైకోర్టులో (సం.2016, 2017) వ్యాజ్యాలు దాఖలు చేశారు. 2018 డిసెంబరు 11న విచారణ జరిపిన ధర్మాసనం. . అన్నివర్గాల వారికి పదోన్నతుల్లో తగిన ప్రాతినిధ్యం ఉందా? లేదా? అనే విషయాన్ని అధ్యయనం చేయకుండా పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించారని ఆక్షేపించింది. బాధిత ఉద్యోగుల వాదనను పరిగణనలోకి తీసుకొని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా పదోన్నతులను సమీక్షించాలని తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సెక్రటేరియేట్ బీసీ, ఓసీ ఎంప్లాయీస్ అసోసియేషన్, పలువురు ఉద్యోగులు 2019, 2020, 2022 సంవత్సరాల్లో కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు దాఖలు చేశారు.

కమిటీల మీద కమిటీలతో కాలయాపన: పిటిషనర్ల తరఫు న్యాయవాది

సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫున న్యాయవాది రమణ వాదనలు వినిపిస్తూ.. "రాష్ట్రంలో 31 శాఖల్లోని ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. సెక్రటేరియేట్ ఉద్యోగుల పదోన్నతి విషయంలో మాత్రమే కమిటీ వేసింది. హైకోర్టు తీర్పును అమలు చేయకుండా కమిటీల మీద కమిటీలను వేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. 31శాఖల ఉద్యోగుల పదోన్నతులపై ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకోండి" అని ధర్మాసనాన్ని కోరారు.

సూపర్ న్యూమరరీ పోస్టుల సృష్టి చిన్న విషయం కాదు: ధర్మాసనం

ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. "బాధ్యులైన అధికారులను కోర్టు ధిక్కరణ కింద శిక్షించేందుకు సిద్ధంగా ఉన్నాం. శిక్షించమని కోరుతున్నారా? లేదా కోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరుతున్నారా? గత ఆరేళ్లుగా కోర్టు ఉత్తర్వులు అమలు కాలేదు. కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు విచారణకు వచ్చేలా మీరు చర్యలు తీసుకోలేదు. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించడం చిన్న విషయం కాదు. మూడు నెలల్లో సానుకూలంగా అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ కోరుతున్నారు. ఆయన అభ్యర్థనను గౌరవించాల్సి ఉంది" అని పేర్కొంది. విచారణను సెప్టెంబరు ఒకటో తేదీకి వాయిదా వేసింది.

సరిగ్గా సాక్ష్యం చెప్పనందుకు ఏడాది జైలు

- ఫిర్యాదుదారుపై క్రిమినల్ కేసు
- శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణ బిల్లుల చెల్లింపునకు ఇద్దరు లబ్ధిదారుల నుంచి లంచం తీసుకున్న గృహనిర్మాణ సంస్థ ఏఈకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పని ఫిర్యాదుదారుకు ఏసీబీ కోర్టు ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు కథనం మేరకు.. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగలక్ష్మి, సుంకర దైవకృప గతంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇళ్లు నిర్మించుకున్నారు. 2009లో వాటి బిల్లుల మంజూరుకు అప్పటి ఉండ్రాజవరం మండల గృహ నిర్మాణ సంస్థ ఏఈ యలమంచిలి ప్రకాశరావు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.3 వేల చొప్పున లంచం డిమాండ్ చేశారు. దీంతో లబ్ధిదారుల తరఫున అదే గ్రామానికి చెందిన బస్వా నాగవెంకట గణేశ్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఇంజినీర్ లబ్ధిదారుల వద్ద లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. కేసు తుది విచారణలో గణేశ్ సరిగా సాక్ష్యం చెప్పకపోవడంతో.. లంచం తీసుకున్న ప్రకాశరావుపై కేసు కొట్టేసి, గణేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. సోమవారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో తుది విచారణలో చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కొబ్బరి నూనె ధర రెట్టింపు

కోనసీమ మార్కెట్‌లో కిలో రూ.400-450

న్యూస్‌టుడే, అంబాజీపేట: కోనసీమ మార్కెట్‌లో కొబ్బరినూనె ధరలు బాగా పెరిగాయి. ఇటీవలి వరకు కిలో నూనె ధర రూ.200-250 ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.400-450 వరకు ఎగబాకింది. ప్రస్తుతం కొబ్బరి క్వింటాలు రూ.23,500 నుంచి రూ.24,000 ఉంది. పచ్చికాయలు వెయ్యింటికి రూ.20 వేలు పలకడంతో రైతులు నేరుగానే విక్రయిస్తున్నారు.



అంబాజీపేటలో కొబ్బరినూనె సీసాలు

తగ్గిన కొత్తకొబ్బరి దిగుబడి: కొత్త కొబ్బరి దిగుబడి సరిగా రాకపోవడం సహా కూలీల ఖర్చులు పెరగడంతో కొబ్బరి సాగుపై ఎవరూ మక్కువ చూపడం లేదు. ఈ ప్రభావం నూనె మార్కెట్‌పై పడటంతో ధరలు రెట్టింపయ్యాయి. క్వింటాలు కొబ్బరికి 60 కిలోల నూనె ఉత్పత్తి అవుతుంది. ధర ఉండటంతో ఏపీలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి పట్టణాలతో పాటు పలు ప్రాంతాలకు కొబ్బరికాయలు ఎగుమతి అవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ధరలు నిలకడగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకుడు గునిశెట్టి శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.

EENADU Vol: 51, Issue: 329 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

భాజపా అందరినీ బెదిరించాలని చూస్తోంది

• ఖనిజాల కోసమే తరచూ ఛత్తీస్‌గఢ్‌కు అమిత్ షా • కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శ



రాయ్‌పుర్: దేశంలోని ప్రతి ఒక్కరినీ భాజపా బెదిరిస్తోందని, ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లోని సైన్స్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన 'జై జవాన్- జై కిసాన్- జై సంవిధాన్' ర్యాలీలో ఆయన మాట్లాడారు. 'ప్రధానికి విదేశాల్లో పర్యటించడానికి సమయం ఉంటుందిగానీ 2023 మే నుంచి ఘర్షణలు జరుగుతున్నా మణిపుర్‌ను సందర్శించడానికి సమయం దొరకడం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌సహా ఇతర నేతలను ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో భయపెట్టడానికి భాజపా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీలనూ నేషనల్ హెరాల్డ్ కేసులో ఇరికించే ప్రయత్నం చేసింది. భయపడకుండా ఉండగలిగితేనే మీరు బతుకుతారు. మన నీరు, అడవి, భూమిని కాపాడుకోవాలంటే మీరందరూ వారిపై (భాజపా) ఐక్యంగా పోరాటం చేయాలి. అదానీ, అంబానీవంటి వారు ఇక్కడకు (ఛత్తీస్‌గఢ్) వచ్చి భూమిని ఆక్రమించుకుంటున్నారు. గనుల కోసం లక్షల చెట్లను నరికేస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తరచూ ఇక్కడికి ఎందుకు వస్తున్నారు. ఇదేమైనా ఆయన అత్తమామల ఊరా.. రాష్ట్రంలోని బొగ్గు, ఇతర ఖనిజ నిక్షేపాలను దోచుకోవడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు ఇక్కడకు వస్తున్నారు. వాళ్లకు ఇక్కడి ప్రజల మీద ఎలాంటి శ్రద్ధ లేదు. మోదీ, అమిత్ షా ఈ పారిశ్రామికవేత్తలకు మద్దతిస్తున్నారు. ఖనిజాలను తనిఖీ చేయడం కోసమే అమిత్ షా ఇక్కడకు వచ్చేది' అని ఖర్గే ఆరోపించారు.

మోదీ ప్రభుత్వ వాదనలో నిజాయతీ లేదు

• కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శ



దిల్లీ: ఆదాయ సమానత్వం కలిగిన దేశాల్లో భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందని మోదీ ప్రభుత్వం చేస్తున్న వాదన పూర్తిగా మోసపూరితమైనది, నిజాయతీ లేనిదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. దేశంలో 2011-12, 2022-23 మధ్య కాలంలో అసమానతలు గణనీయంగా తగ్గాయని, నాలుగో ఆదాయ సమానత్వ దేశంగా భారత్ ఎదిగిందని ప్రపంచ బ్యాంకు తాజా గణాంకాలు విడుదల చేసింది. దీని ఆధారంగా మోదీ ప్రభుత్వ జారీచేసిన అధికారిక ప్రకటనపై జైరాం సోమవారం ఈ మేరకు స్పందించారు. ఈ ప్రకటనకు మూలాలు కనుగొని దాన్ని ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ)ని డిమాండ్‌చేశారు. "మీరు వరుస క్రమాన్ని అర్థం చేసుకోవాలి. భారత్‌లో పేదరికం, అసమానత్వం గురించి హెచ్చరికలు జారీచేస్తూ ఈ ఏప్రిల్‌లో ప్రపంచ బ్యాంకు కొన్ని గణాంకాలను విడుదల చేసింది. మూడు నెలల్లో అంటే ఈ నెల 5న ఆదాయ సమానత్వ దేశాల్లో భారత్ మెరుగైన స్థానంలో ఉందని మోదీ అనుకూలవర్గాలు పీఐబీలో అసత్య ప్రకటనను విడుదల చేశాయి. మోదీ ప్రభుత్వం ఈ గణాంకాల పట్ల నిర్లక్ష్యం వహించమే కాదు కావాలనే మోసం చేస్తోంది. 2019 లెక్కల ప్రకారం ఆదాయ సమానత్వంలో 216 దేశాల్లో భారత్ 176వ స్థానంలో ఉంది. వాస్తవానికి మన దేశం ఆర్థిక సమానత్వంలో 4వ స్థానంలో కాదు, అసమానత్వంలో 40వ స్థానంలో ఉంది. మోదీ పాలనలో గత కొన్నేళ్లుగా అసమానతలు పెరిగి మరింత తీవ్రమయ్యాయి" అని జైరాం వ్యాఖ్యానించారు.

✦ మోదీ ప్రభుత్వం కేవలం పెద్ద వ్యాపారాలపై దృష్టి సారించిందని, ఫలితంగా ఆర్థిక అభివృద్ధి మందగించిందని జైరాం రమేశ్ విమర్శించారు. 'ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించడానికి బదులుగా ప్రభుత్వ అనుకూల వ్యక్తులను మాత్రమే ప్రోత్సహిస్తూ ఆశ్రిత పెట్టుబడి విధానాన్ని ఆచరిస్తోంది' అని పేర్కొన్నారు.



గోవాలో సంప్రదాయ 'చిఖల్ కలో' వేడుకలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకుని బురదలో నృత్యం చేస్తున్న స్థానికుడు

శాంతి సమయం ఓ భ్రమ మాత్రమే

• రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

దిల్లీ: శాంతి సమయం అనేది ఓ భ్రమ మాత్రమేనని.. ప్రశాంతత వేళ కొన్నా కూడా భారత్ ఎల్లప్పుడూ సర్వసన్నద్ధంగా ఉండాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయటంలో భారత బలగాలు చేసిన కృషిని ఆయన అభినందించారు. సోమవారం దిల్లీలోని డీఆర్‌డీఓ భవనంలో నిర్వహించిన కంట్రోలర్స్ కాన్ఫరెన్స్‌లో రక్షణ మంత్రి మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్‌లో భారత్ రక్షణ పరికరాల పనితీరుతో మన సైనిక ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. మన రక్షణ రంగం కొత్త గౌరవాన్ని సంపాదించింది. గతంలో పలు దేశాల నుంచి రక్షణ పరికరాలను దిగుమతి చేసుకున్న ప్రస్తుత భారత్‌లోనే చాలా వరకు ఉత్పత్తి చేస్తున్నాం. మన లక్ష్యానికి ఉన్న స్పష్టత, సంసిద్ధత, ఉన్నత స్థాయి సంస్కరణలు మన విజయానికి కారణం' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అనంతరం కార్గిల్ అమరవీరుడు కెప్టెన్ విక్రమ్ బాత్రా వర్ధంతి సందర్భంగా రక్షణమంత్రి నివాళులర్పించారు. దేశ సేవలో ఆయన చేసిన ధైర్యసాహసాలు, త్యాగం గొప్ప ఉదాహరణగా నిలిచాయని రాజ్‌నాథ్ కొనియాడారు.

పద్మ అవార్డు గ్రహీత భార్యకు వైద్యం చేయడానికి నిరాకరణ

• వైద్యురాలి సస్పెన్షన్

ధార్: పద్మశ్రీ అవార్డు గ్రహీత సుబ్రతో దాస్(62) భార్య సుస్మితా దాస్(60)కు కుక్క కాటుకు మందు ఇవ్వడానికి నిరాకరించిన ఓ వైద్యురాలిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కేంద్రానికి 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్యాటక ప్రాంతమైన మాండూలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వడోదరాకు చెందిన సుబ్రతో దంపతులు దర్శనానికి వచ్చినపుడు సుస్మితాదాస్‌ని ఓ వీధి కుక్క కరిచింది. దీంతో వారు రేబిస్ మందు కోసం సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా అక్కడ వైద్యురాలిగా పనిచేస్తున్న చాందిని దబ్రోలియా అందుబాటులో లేరు. కేంద్రంలో ఉన్న మిగిలిన సిబ్బంది చికిత్స అందించేందుకు నిరాకరించి, దూరంగా ఉన్న మరో ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. దీంతో బాధితురాలిని సుబ్రతో మరో కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక మిశ్ర ప్రాథమిక దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తులో వైద్యురాలు దోషిగా తేలడంతో నిందితురాలిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కార్యాలయాలు, కళాశాలలు, సేవా కేంద్రాలు ఏ ప్రభుత్వ సంస్థలైనా పౌరులతో గౌరవంగా వ్యవహరించాలని, నిర్ణీత సమయంలో అవసరమైన సేవలందించాలని మిశ్రా స్పష్టంచేశారు.

ఆపరేషన్ బ్లూస్టార్‌లో కాంగ్రెస్‌కు బ్రిటన్ సాయం

• భాజపా ఎంపీ ఆరోపణలు

ఈటీవీ భారత్: ఆపరేషన్ బ్లూస్టార్ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి బ్రిటన్ సాయం చేసిందని భాజపా ఎంపీ నిషికాంత్ దుబె ఆరోపించారు. సిక్కు జాతికి ఆ పార్టీ అనేకసార్లు అన్యాయం చేసిందని విమర్శించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని సోమవారం ఎక్స్‌లో స్పష్టం చేశారు. '1947లో కర్తార్‌పుర్ సాహిబ్‌ను పాకిస్థాన్‌కు అప్పగించారు. ఆ సమయంలో యావత్ సిక్కు జాతి ఆందోళనలు చేపట్టింది. 1984లో సిక్కు వేర్పాటువాదం పెరిగినప్పుడు బింద్రన్‌వాలేను రంగంలోకి దింపారు. జైల్‌సింగ్‌ను రాష్ట్రపతిని చేశారు. ఆ తర్వాత బ్రిటన్ సైన్యం సాయంతో స్వర్ణ దేవాలయంపై దాడి చేశారు. ఇందిరా గాంధీ హత్యతో సిక్కు అల్లర్లు చెలరేగాయి. అనేక మంది సిక్కులను దిల్లీలో కాంగ్రెస్ నేతలు హత్య చేయించారు. దీనిపై కమిటీని ఏర్పాటు చేయగానే మరో సిక్కు మన్మోహన్ సింగ్‌ను ప్రధాన మంత్రిని చేశారు. ఇలా అనేకసార్లు సిక్కులను కాంగ్రెస్ వాడుకుంది' అని దుబె ఆరోపించారు. '1984లో బ్రిటన్ సహకారంతో స్వర్ణ దేవాలయంపై ఇందిరా గాంధీ దాడి చేయించారు. ఆ సమయంలో అనేక మంది బ్రిటన్ అధికారులు అమృత్‌సర్‌లోనే ఉన్నారు. స్వర్ణ దేవాలయంపై దాడి చేసేందుకు కాంగ్రెస్ 6 నెలలపాటు ప్రణాళికలు రచించింది' అని దుబె పేర్కొన్నారు.

భారత్‌తో పోరుకు విదేశీసాయం అందలేదు: పాక్

• దాడిచేస్తే దీటుగా బదులిస్తామని డాంబికాలు

ఇస్లామాబాద్: ఇటీవల భారత్‌తో జరిగిన పోరులో తమకు విదేశాల నుంచి ఎలాంటి సాయం అందలేదని పాక్ చెబుతోంది. చైనా వివిధ ఆయుధ వ్యవస్థల్ని పరీక్షించుకునేందుకు పాక్‌కు వాటిని అందజేసిందని భారత సైన్యం ఉప అధిపతి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ ఇటీవల దిల్లీలో చేసిన వ్యాఖ్యలపై పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్ సోమవారం స్పందించారు. ఇస్లామాబాద్‌లో 'జాతీయ రక్షణ విశ్వవిద్యాలయం'లో అధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తమదేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించాలని ఎలాంటి ప్రయత్నం జరిగినా నిస్సంకోచంగా, తగినరీతిలో స్పందిస్తామని చెప్పారు. "ఆపరేషన్ బన్యాన్ అల్ మార్సూస్‌ను విజయవంతంగా పూర్తిచేశాం. దీనికి విదేశీ సాయం తీసుకున్నామనడం బాధ్యతారాహిత్యం, అవాస్తవం. దశాబ్దాలపాటు చేసిన కృషితో దేశీయంగా సాధించిన సామర్థ్యాన్ని గుర్తించడానికి ఇష్టపడక ఇలా మాట్లాడుతున్నారు. పూర్తిగా రెండు దేశాలకు పరిమితమైన సైనిక ఘర్షణలో ఇతర దేశాల పేర్లను లాగడం తగదు" అని మునీర్ చెప్పారు. జనసమ్మర్ద ప్రాంతాలు, సైనిక స్థావరాలు, ఆర్థిక కేంద్రాలు, ఓడరేవులు వంటివాటిని లక్ష్యంగా చేసుకునేందుకు (భారత్) ప్రయత్నిస్తే అంతకుమించిన స్థాయిలో బదులిస్తామని హెచ్చరించారు. ప్రసార మాధ్యమాల్లో చేసే హడావుడితో, దిగుమతి చేసుకున్న ఆకర్షణీయమైన హార్డ్‌వేర్‌తో, రాజకీయ నినాదాలతో కాకుండా విశ్వాసం, వృత్తినైపుణ్యం, కార్యకలాపాలపై స్పష్టత, సంస్థాగత బలం, జాతి ప్రజల సంకల్పం వంటివాటితోనే యుద్ధాలను గెలవగలమని చెప్పుకొచ్చారు.



కేరళలోని త్రిశ్శూర్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో ఉంటున్న విజయరాఘవన్ (79), సులోచన (75) పరస్పరం ఇష్టపడటంతో నిర్వాహకులు సోమవారం వారి వివాహం జరిపించారు. రాష్ట్రమంత్రి ఆర్. బిందు సమక్షంలో ఇరువురూ ఒక్కటయ్యారు

గాంధీ విగ్రహాన్ని అపవిత్రం చేసే యత్నం

• పుణెలో ఒకరి అరెస్టు

పుణె: మహారాష్ట్రలోని పుణె రైల్వేస్టేషన్ సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని అపవిత్రం చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసికి చెందిన సూరజ్ శుక్లాగా గుర్తించారు. అతనికి మతిస్థిమితం సరిగా లేదని తేల్చారు. ఆదివారం సాయంత్రం శుక్లా పదునైన ఆయుధంతో గాంధీ విగ్రహాన్ని అపవిత్రం చేయడానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. పదునైన మరో కత్తితో పాటు నిందితుడి దగ్గర మతపరమైన కొన్ని పుస్తకాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

జన గణనలో పౌరులే నేరుగా వివరాలు నమోదు చేయొచ్చు

• తొలిసారిగా అవకాశం కల్పిస్తున్న కేంద్రం
• త్వరలో అందుబాటులోకి ప్రత్యేక వెబ్ పోర్టల్

దిల్లీ: దేశవ్యాప్తంగా చేపట్టనున్న జన, కుల గణనలో పౌరులు నేరుగా తమ వివరాలను సమర్పించేందుకు మొదటిసారిగా అవకాశం కల్పిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను తీసుకొస్తున్నారు. త్వరలోనే అది అందుబాటులోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వ అధికారులు సోమవారం వెల్లడించారు. 'దేశంలో మొదటిసారిగా డిజిటల్ రూపంలో చేపట్టనున్న జన గణనలో సిబ్బంది (ఎన్యుమరేటర్లు) తమ ఫోన్లు, ట్యాబ్‌లలో ఉన్న యాప్‌ద్వారా పౌరుల సమాచారాన్ని సేకరిస్తారు. రెండు విడతలుగా ఇది కొనసాగనుంది. 2026 ఏప్రిల్ 1న మొదలు కానున్న మొదటి విడతలో ఇళ్ల వివరాలతో కూడిన జాబితాను (హెచ్‌ఎల్‌వో) తయారు చేస్తారు. ఆ తర్వాత 2027 ఫిబ్రవరి 1 నుంచి జనగణన మొదలవుతుంది. ఇదే సమయంలో కుల గణన చేపడతారు. ఈ రెండు విడతల్లోనూ ప్రజలు సొంతంగా తమ వివరాలను ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో నమోదు చేయవచ్చు' అని అధికారులు పేర్కొన్నారు.

పాకిస్థాన్‌లో వరదలు.. 72 మంది మృతి

ఇస్లామాబాద్, తైపీ: పాకిస్థాన్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో 10 రోజుల వ్యవధిలో 72 మంది మృతిచెందినట్లు సోమవారం అధికారులు వెల్లడించారు. మరో 130 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. వాయవ్య ఖైబర్ పఖ్తుంఖ్వా, తూర్పు పంజాబ్, దక్షిణ సింధ్, బలూచిస్థాన్ ప్రావిన్సుల్లో భారీగా ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లింది. మరోవైపు.. తైవాన్‌లో డానాస్ తుపాను కారణంగా భారీ ఈదురుగాలులతో కూడా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇద్దరు మృతిచెందగా, మరో 334 మందికి పైగా గాయపడ్డారు. ఫెర్రీ సేవలు, విమానాలు రద్దు కావడంతో పెంఘు, మాట్సు, గ్రీన్ దీవుల్లో వేలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారు.

ఎన్‌వోఎస్ పథకానికి 106 మంది ఎంపిక

దిల్లీ: నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ (ఎన్‌వోఎస్) పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి 106 మంది ఎంపికయ్యారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ వెల్లడించింది. వీరిలో తొలి 40 మంది తాత్కాలిక ధ్రువపత్రాలను వెంటనే అందుకుంటారని, మిగిలిన వారిని నిధుల లభ్యత ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. మొత్తం 440 దరఖాస్తులు అందగా.. క్యూఎస్ యూనివర్సిటీ ర్యాంకులు, రాష్ట్ర కోటా, వివిధ కేటగిరీల రిజర్వేషన్ల కారణంగా అర్హులైనప్పటికీ 64 మందిని ఎంపిక చేయలేకపోయామని వివరించింది. నిర్దిష్ట అర్హతలు లేకపోవడం, ధ్రువపత్రాలను సరిగ్గా సమర్పించకపోవడంతో 270 మందిని పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంది. ఎస్సీలు, సంచార జాతులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, సంప్రదాయ చేతివృత్తి వర్గాలకు చెందిన విద్యార్థులు.. విదేశాల్లో ఇంజినీరింగ్, సైన్స్, హ్యూమనిటీస్, మేనేజ్‌మెంట్ రంగాల్లో విద్యనభ్యసించేందుకు కేంద్రం ఎన్‌వోఎస్ పథకాన్ని తీసుకొచ్చింది.

నా యాత్ర క్షేమంగా సాగడానికి కృషి చేశారు



ఐఎస్ఎస్‌లో శుభాంశు శుక్లా

• ఇస్రో ఛైర్మన్‌తో మాట్లాడిన శుభాంశు

బెంగళూరు: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగామి శుభాంశు శుక్లా తాజాగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్‌తో మాట్లాడారు. తన రోదసి యాత్ర క్షేమంగా సాగడానికి సంస్థ ఎంతో కృషి చేసిందన్నారు. మరోవైపు శుక్లా ఆరోగ్యం, రోదసిలో చేస్తున్న ప్రయోగాలు, ఇతర కార్యకలాపాల గురించి నారాయణన్ ఆరా తీశారు. భూమికి తిరిగొచ్చాక ఆ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భవిష్యత్‌లో భారత్ చేపట్టబోయే మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్'కు ఇవి ఉపయోగపడతాయని చెప్పారు. శుభాంశుతో మాటామంతి కార్యక్రమంలో ఇస్రోకు చెందిన పలువురు సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. వీరిలో విక్రమ్‌సారాభాయ్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, హ్యూమన్ స్పేస్ ప్రోగ్రామ్‌కు చెందిన ఎం.మోహన్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ డైరెక్టర్ పద్మకుమార్ తదితరులు ఉన్నారు.



తోటి వ్యోమగాములతో..

పెను ఉపద్రవం కానున్న జీర్ణ వ్యవస్థ క్యాన్సర్

దిల్లీ: ప్రపంచంలో 2008 నుంచి 2017 సంవత్సరాల మధ్య కాలంలో జన్మించిన 1.5 కోట్ల మంది జీవితాల్లో ఏదో ఒక దశలో జీర్ణ వ్యవస్థ సంబంధ క్యాన్సర్ బారిన పడతారని ఓ అధ్యయనం హెచ్చరించింది. ఈ విషయంలో చైనా, భారత్ మొదటి, రెండు స్థానాల్లో ఉంటాయని తెలిపింది. ఈ 1.5 కోట్ల జీర్ణ వ్యవస్థ క్యాన్సర్ కేసుల్లో మూడింట రెండొంతులు ఆసియాలో.. మిగిలినవి అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో చోటు చేసుకుంటాయని పేర్కొంది. 185 దేశాల్లో జీర్ణ వ్యవస్థకు సంబంధించిన క్యాన్సర్ గణాంకాలను ఈ సందర్భంగా నిపుణులు విశ్లేషించారు. 2008-2017 సంవత్సరాల మధ్య జన్మించిన వారిలో ప్రపంచ వ్యాప్తంగా 1.56 కోట్ల జీర్ణ వ్యవస్థ క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా వేశారు. ఆసియాలో మొత్తం 1.06 కోట్ల జీర్ణవ్యవస్థ క్యాన్సర్ కేసులు నమోదైతే అందులో 65 లక్షల కేసులు భారత్, చైనాలలో సంభవిస్తాయని పరిశోధకులు పేర్కొన్నారు. సమయానికి వ్యాధి నిర్ధారణ, చికిత్సలు చేపడితే 75 శాతం కేసుల్ని నివారించొచ్చని అధ్యయనం సూచించింది.

ఉగ్రవాది పాసియా అప్పగింతకు రంగం సిద్ధం

ఇంటర్నెట్‌డెస్క్: పంజాబ్‌లో పలు ఉగ్రదాడులకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పాసియా అలియాస్ జోరాను భారత్‌కు తీసుకురానున్నారు. అమెరికా నుంచి అతడి అప్పగింతకు రంగం సిద్ధమైంది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పంజాబ్‌లో పోలీస్‌స్టేషన్లు, ప్రజా వ్యవస్థలపై జరిగిన ఉగ్రదాడుల్లో హ్యాపీ పాసియా ప్రమేయం ఉంది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో అతను సంప్రదింపులు జరిపినట్లు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, హర్విందర్ సింగ్ రిందా నెట్‌వర్క్‌లు సహా పలు ఖలిస్థానీ సంస్థల నుంచి హ్యాపీకి సహాయ సహకారాలు అందాయి. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అతడిని వాంటెడ్ టెర్రరిస్ట్‌గా పేర్కొంటూ, ఆచూకీ తెలిపినవారికి రూ.5 లక్షల నజరానా ప్రకటించింది. పాసియాను భారత్‌కు రప్పించేందుకు భారత దర్యాప్తు సంస్థలు అమెరికా భద్రతా సంస్థలతో కలిసి పనిచేస్తున్న క్రమంలో కాలిఫోర్నియాలో ఏప్రిల్ 17న పట్టుబడ్డాడు.

నవంబరులో అయోధ్య రామాలయ ధ్వజారోహణ!

అయోధ్య: అయోధ్య రామాలయంలో పవిత్ర ధ్వజారోహణ కార్యక్రమం నవంబరు నెలలో నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని ఆలయ అధికారి ఒకరు సోమవారం ఓ జాతీయ వార్తా సంస్థకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రత్యేక అతిథులు హాజరు కానున్నారు. ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమ నిర్వహణకు రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నవంబరు నెలలో రెండు తేదీలను పరిశీలిస్తోందని, జ్యోతిష్యవేత్తలు అతి పవిత్రమైనదిగా తేల్చే రోజున కార్యక్రమం నిర్వహిస్తారని తెలిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలోని 161 అడుగుల ప్రధాన గోపురంపై పవిత్ర వేద మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజాన్ని ఎగురవేస్తారు. ఆలయ సముదాయంలోని ఇతర గోపురాలపై కూడా ధ్వజాలు ఎగరేస్తారు.

క్షుద్రవిద్య అనుమానంతో ఐదుగురి హత్య

• బిహార్‌లో దారుణం

పూర్ణియా(బిహార్): క్షుద్ర విద్యలు ప్రయోగిస్తున్నారనే అనుమానంపై ముగ్గురు మహిళలతో సహా ఒక గిరిజన కుటుంబానికి చెందిన ఐదుగురిని హత్యచేసి మృతదేహాలను దహనం చేసిన ఉదంతం బిహార్‌లోని పూర్ణియా జిల్లా టెటగామా గ్రామంలో జరిగింది. బాధిత కుటుంబంలో సజీవంగా మిగిలిన సోను కుమార్ అనే వ్యక్తి ఈ దురాగతాన్ని తన సమీప బంధువుకు ఏకరువు పెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 40 నుంచి 50 మంది గ్రామస్థులు తన పూరి గుడిసెను చుట్టుముట్టి తల్లితో సహా ఐదుగురు కుటుంబ సభ్యుల్ని హతమార్చారని, తాను ఎలాగోలా తప్పించుకొని బయటపడ్డానని సోను కుమార్ తెలియజేశాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ దురాగతానికి సంబంధించి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మృతుల్ని సీతాదేవి, కాలీ, రాణీ, దేవీ, బాబూలాల్, మంజీత్‌రామ్‌లుగా గుర్తించినట్టు పూర్ణియా డీఐజీ ప్రమోద్ కుమార్ మండల్ వెల్లడించారు. హత్యానంతరం మృతదేహాలను ఒక ట్రాక్టర్లో అడవుల్లోకి తీసుకెళ్లి దహనం చేశారని ఆయన తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేయడంతోపాటు పలువురిని అదుపులో తీసుకున్నామని వెల్లడించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఒక బాలుడు మరణించిన నేపథ్యంలో తలెత్తిన అనుమానాలు ఈ హత్యకు దారితీసినట్టు భావిస్తున్నారు.

టెక్సాస్ వరదల్లో 82కి చేరిన మృతుల సంఖ్య

కెర్‌విల్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో వరదల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 82కి చేరింది. మరో 41 మంది గల్లంతయ్యారు. ఒక్క కెర్ కౌంటీలోనే అత్యధికంగా 68 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 28 మంది చిన్నారులు ఉన్నారు. దాదాపు 850 మందిని రక్షించినట్లు అధికారులు ప్రకటించారు. గాడ్వలూప్ నది తీరాన ఉన్న బాలికల వేసవి శిబిరం వరదల్లో మునిగిపోవడంతో దాదాపు 27 మంది చిన్నారులు సహా ఒక కౌన్సిలర్ మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మరో 10 మంది బాలికల జాడ తెలియాల్సి ఉంది. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మోదీకి మండీ కనిపించడం లేదు: కాంగ్రెస్

టెక్సాస్‌లో వరదల కారణంగా 82 మంది మృతి చెందడంపై విచారం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టడంపై కాంగ్రెస్ స్పందించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో వరదలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నా మోదీకి కనిపించడంలేదని, ఎక్కడో ఉన్న టెక్సాస్ గురించి విచారం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ మండిపడింది.

విరిగిపడిన కొండచరియలు.. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి

దిల్లీ: హరియాణాలోని మండీ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటన గతవారం చోటుచేసుకోగా తాజాగా వెలుగులోకి వచ్చింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో నీరు ఇంట్లోకి రాకుండా పక్కకు పంపేందుకు రమేశ్ కుమార్ కుటుంబం ఇంటి బయటకు వచ్చింది. అప్పుడే కొండచరియలు విరిగిపడటంతో రమేశ్‌తో సహా భార్య, అతని తల్లి ప్రాణాలు కోల్పోయారు. అయితే.. 11 నెలల చిన్నారి ఇంట్లోనే ఒంటరిగా ఉండిపోయింది. సహాయక బృందాలు పాపను రక్షించాయి.

ఉద్వాసనకు గురైన కొన్ని గంటల్లోనే రష్యా మంత్రి మృతి



మాస్కో: అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేతిలో ఉద్వాసనకు గురైన రష్యా రవాణా మంత్రి రోమన్ స్తారోవోయ్త్ సోమవారం పదవి కోల్పోయిన కొన్ని గంటల్లోనే మరణించారు. ఇది ఆత్మహత్యగా భావిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ నుంచి వచ్చిన బెదిరింపుల నేపథ్యంలో విమానాల నిలిపివేత వల్ల తలెత్తిన గందరగోళ పరిస్థితి స్తారోవోయ్త్ ఉద్వాసనకు కారణమైంది. ఆయన గత సంవత్సరం మే నెలలో రవాణా మంత్రిగా నియమితులయ్యారు. పుతిన్ ఆయనకు ఉద్వాసన పలికిన అనంతరం యాండ్రే నికిటిన్‌ను రవాణా మంత్రిగా నియమించారు. నికిటిన్ గత ఫిబ్రవరి వరకూ నోవోగొరోడ్ ప్రాంతానికి గవర్నర్‌గా పనిచేశారు. మాస్కోలోని షెరెమెట్యెవో, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పుల్కోవో విమానాశ్రయాల నుంచి బయల్దేరాల్సిన వందల విమానాలను గత వారాంతంలో రద్దు చేసిన కారణంగా వేలమంది ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడుల కారణంగా పశ్చిమ, మధ్య రష్యా ప్రాంతాల్లోని ఇతర విమానాశ్రయాల్లోనూ విమానాలు రద్దు చేశారు.

మహారాష్ట్ర తీరంలో విదేశీ బోటు కలకలం

• అప్రమత్తమైన భద్రతా సిబ్బంది

ముంబయి: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా తీర ప్రాంతంలో ఓ విదేశీ బోటు అనుమానాస్పదంగా కనిపించడం కలకలం రేపింది. రేవ్‌దండాలోని కొర్లాయ్ తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో ఈ పడవను గుర్తించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారమందుకున్న రాయ్‌గఢ్ పోలీసులు బాంబు నిర్వీర్య బృందంతో అక్కడికి చేరుకున్నారు. ఈ పడవ ఏ దేశానికి చెందింది? ఏ మార్గంలో వచ్చిందన్న కోణాల్లో నౌకాదళం, తీరగస్తీ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. ఆ పడవపై వేరే దేశానికి చెందిన గుర్తులున్నట్లు సోమవారం అధికారులు వెల్లడించారు. ఇది పాకిస్థాన్‌కి చెందిన పడవగా అనుమానిస్తున్నారు. అది తీరానికి కొట్టుకొచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. భారీ వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా పడవ ఉన్న ప్రాంతానికి చేరుకునేందుకు తీవ్ర ఆటంకం ఎదురవుతోందని అధికారులు తెలిపారు. ఈ పరిణామాలతో తీర ప్రాంతంతో పాటు జిల్లా వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా తీరంలో భారీగా పోలీసులను మోహరించారు.

మళ్లీ గద్దెనెక్కండి మహారాజా!

నేపాల్ మాజీ రాజు జ్ఞానేంద్ర షా 74వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా సోమవారం కాఠ్‌మాండూలో పెద్దఎత్తున రాజరికం మద్దతుదారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తిరిగి దేశ అధికార పగ్గాలు చేపట్టి రాజ్యాన్ని కాపాడాలంటూ నినదించారు. 2008లో నేపాల్‌లో రాజరికాన్ని రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.



25 ఏళ్ల శిక్ష పూర్తి కాలేదు

• అబుసలేం విడుదల పిటిషన్‌ను తోసిపుచ్చిన బాంబే హైకోర్టు


ముంబయి: సత్ప్రవర్తనతో లభించే ఉపశమనంతో కలిపితే తన 25 ఏళ్ల శిక్షాకాలం పూర్తయిందని, జైలు నుంచి విడుదల చేయాలని గ్యాంగ్‌స్టర్ అబు సలేం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే 25 ఏళ్ల శిక్షాకాలం పూర్తి కాలేదని జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ రాజేశ్ పటేల్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. అబు సలేం అరెస్టు తేదీ 2005 అక్టోబరు అని, ఇంకా 25 ఏళ్లు పూర్తి కావడానికి సమయముందని పేర్కొంది. పోర్చుగల్‌లో తలదాచుకున్న అబు సలేంను అప్పట్లో అక్కడి ప్రభుత్వ సాయంతో భారత్ వెనక్కి తీసుకొచ్చింది. అతడిని అప్పగించే సమయంలో ఆ దేశం కొన్ని షరతులు పెట్టింది. అతడికి మరణ శిక్ష విధించకూడదని, 25 ఏళ్లకు మించి శిక్ష విధించకూడదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అబు సలేం కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు అతడి వాదనను తోసిపుచ్చింది. సమయమొచ్చినప్పుడు తుది విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

ఉరి శిక్షల కేంద్రం... సౌదీ అరేబియా!

• గత ఏడాది ఏకంగా 345 మందికి అమలు: ఆమ్నెస్టీ

దుబాయ్: 'సౌదీ అరేబియాలో నిరుడు 345 మరణ శిక్షలను అమలు చేశారు. గత మూడు దశాబ్దాలతో పోలిస్తే ఇదే అత్యధికం. మాదక ద్రవ్యాల కేసులే ఇందుకు ముఖ్య కారణం. ఈ ఏడాది ఆరు నెలల్లోనే 180 మందిని ఉరికంబం ఎక్కించారు' అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సోమవారం వెల్లడించింది. కేవలం హత్యల కేసుల్లోనే ఉరిని అమలు చేస్తామంటూ 2022లో సౌదీ యువరాజు మహ్మద్‌బిన్ సల్మాన్ చేసిన ప్రకటనకు విరుద్ధంగా ప్రాణాంతకం కాని డ్రగ్స్ కేసుల్లోనూ ఈ శిక్షలు అమలవుతున్నాయని పేర్కొంది.





మరో మల్టీస్టారర్ ఖరారు

అగ్ర కథానాయకులు కలిసిమెలిసి నటించేందుకు ముందుకొస్తుండటంతో ఆసక్తికరమైన కలయికల్లో సినిమాలు కుదురుతున్నాయి. గత కొన్నేళ్లుగా మల్టీస్టారర్ సినిమాలు జోరు ఊపందుకున్న సంగతి తెలిసిందే. ఆ వరసలో మరో సినిమాకి రంగం సిద్ధమైంది. అగ్ర కథానాయకులు బాలకృష్ణ - వెంకటేశ్ కలయికలో ఓ సినిమా రూపొందబోతోంది. ఈ విషయాన్ని అమెరికాలో జరుగుతున్న 'నాట్స్ 2025' వేడుకలో కథానాయకుడు వెంకటేశ్ స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తోన్న సినిమాలో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే బాలకృష్ణతో కలిసి కెమెరా ముందుకు వెళ్లనున్నారు. బాలకృష్ణ ప్రస్తుతం 'అఖండ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఆ తర్వాత గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేయనున్నారు. అందులోనే వెంకటేశ్ కూడా నటించే అవకాశాలున్నాయి.



అడవి గర్జనలు ప్రతిధ్వనిస్తాయి!

'కాంతార' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు రిషబ్ శెట్టి. ఆయన హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన ఈ విజయవంతమైన సినిమాకి ఇప్పుడు ప్రీక్వెల్ సిద్ధమైంది. 'కాంతార: చాప్టర్-1' పేరుతో ముస్తాబైన ఈ పాన్ ఇండియా చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ మేరకు సోమవారం రిషబ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర కొత్త లుక్‌ను విడుదల చేశారు. "ఇతిహాసాలు పుట్టిన చోట అడవి గర్జనలు ప్రతిధ్వనిస్తాయి. హృదయాన్ని కదిలించే కథది తిరిగి స్వాగతం" అంటూ ఆ పోస్టర్‌కు ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు. ఆ ప్రచార చిత్రంలో రిషబ్ చేతిలో ఆయుధం పట్టుకుని శత్రుమూకలపైకి దూసుకొస్తున్నట్లు కనిపించారు. ఆయన హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఈనాడు సినిమా

సినిమా: 'జియామ్'
నటీనటులు: మార్క్ ప్రిన్, నైచా నుట్టనిచా
విడుదల: బుధవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్


ప్రియురాలి కోసం జాంబీలతో పోరాటం



రెడీ ఇన్ ఓటీటీ

ఓ ప్రమాదకర వైరస్ కారణంగా మనిషిని మరో మనిషి కిరాతకంగా చంపి తినడం తరహా మనం జాంబీ కాన్సెప్ట్ సినిమాల్లో చూస్తూనే ఉంటాం. ఈ నేపథ్యంతో ఓటీటీలో ఎన్నో సినిమాలు, సిరీస్‌లు వచ్చాయి. కానీ ఆ సినిమా ప్రేక్షకులకు ఎంత థ్రిల్‌ని పంచింది, ఎంత భయపెట్టింది..చాలా అంశంపైనే దాని విజయం ఆధారపడి ఉంటుంది. అయితే ఇదే జాంబీ కథలో ప్రేమను మిళితం చేసిన సినిమాయే 'జియామ్'. తన ప్రేయసి రిన్(నైచా నుట్టనిచా)ని జాంబీల నుంచి రక్షించేందుకు సిద్ధపడతాడు సింగ్ (మార్క్ ప్రిన్). ఇందులో ఇతను థాయ్ యోధుడిగా కనిపిస్తాడు. రిన్ వైద్యురాలిగా పనిచేస్తున్న ఆసుపత్రిలో అకస్మాత్తుగా జాంబీ వైరస్ వ్యాపిస్తుంది. దాంతో అక్కడి పరిస్థితులన్నీ గందరగోళంగా మారిపోతాయి. అక్కడ ఉన్న వారందరికి వైరస్ సోకి ఆకలితో ఉన్న జాంబీలా తయారవుతారు. అలాంటి గుంపుతో సింగ్ తలపడుతూ రిన్‌ని వెతుకుతాడు. తన చుట్టూ ఉన్న అందరూ జాంబీలుగా మారిపోయాక రిన్ ఎలా ఉంది? ఆ జాంబీలతో ఫైట్స్ చేస్తూ సింగ్.. రిన్‌ని కాపాడుకున్నాడా? లేదా? అనేదే ఈ సినిమా. థాయ్ యాక్షన్ హారర్ చిత్రంగా రూపొందిన ఈ చిత్రాన్ని కల్ప్ కల్లాకర్ తెరకెక్కించారు. ఒళ్లు గగుర్పొడిచే సన్నివేశాల మధ్య జాంబీలతో హీరో చేసే ఫైట్స్ యాక్షన్ సినీ ప్రియుల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి.

కింగ్డమ్.. ఏదో పెద్దగా!



విడుదల ఎప్పుడెప్పుడా అంటూ ఆసక్తిని రేకెత్తించిన 'కింగ్డమ్' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేకమైన ప్రోమోతో విడుదల విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా... గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సత్యదేవ్ కీలకపాత్ర పోషించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. విడుదల తేదీని ప్రకటిస్తూ వదిలిన ప్రోమోలో 'ఏదో పెద్దగా జరగబోతోంది...' అంటూ చూపించిన విజువల్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. విజయ్ దేవరకొండ రెండు రకాల గెటప్పుల్లో కనిపించారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఇది కేవలం సినిమా కాదు, మేమంతా మక్కువతో నిర్మించిన ఓ గొప్ప ప్రపంచం. ప్రతి ఫ్రేమ్ మరపురానిదిగా ఉండాలని మేం కోరుకున్నాం. జులై 31న ఈ చిత్రం బాక్సాఫీస్ తుపానుకే నాంది పలుకుతుంది. మునుపెన్నడూ లేని విధంగా ఓ గొప్ప అనుభూతిని అందిస్తుంది' అన్నారు. యాక్షన్, హీరోయిజం, డ్రామా సమ్మేళనంగా రూపొందిన ఈ సినిమాలో విజయ్ దేవరకొండ గూఢచారిగా కనిపించనున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఛాయాగ్రహణం: జోమోన్ టి. జాన్, గిరీశ్ గంగాధరన్, కూర్పు: నవీన్ నూలి.

చివరి దాకా నాతో నడుస్తావా ప్రేమా

"నిన్ను చూసిన నా కళ్లకు అదృష్టం వరించింది.. చివరి దాకా నాతో నడుస్తావా ప్రేమా!" అంటూ తన ప్రేయసి కోసం ప్రేమ పాటలు పాడుతున్నారు అజయ్ దేవగణ్. ఇదంతా ఆయన నటిస్తున్న 'సన్ ఆఫ్ సర్దార్ 2' చిత్రం కోసమే. మృణాల్ ఠాకూర్ కథానాయిక. ఈ యాక్షన్ కామెడీ చిత్రానికి విజయ్ కుమార్ ఆరోరా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 25న రానుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా 'పెహ్లే తు దుజా తు..' అనే పాటను విడుదల చేశారు. ఇందులో అజయ్, మృణాల్ జోడీ, వారి కెమిస్ట్రీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. విశాల్ మిశ్రా ఆలపించారు. సంజయ్ మిశ్రా, రవి కిషన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాను అజయ్, జ్యోతి దేశ్ పాండే నిర్మిస్తున్నారు.



భారీ సెట్‌లో చిత్రీకరణ షురూ



విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. పూరి కనెక్ట్స్, జె.బి మోషన్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంయుక్తా మేనన్ కథానాయిక. టబు, విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సోమవారం నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. ప్రస్తుతం ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో విజయ్, సంయుక్తతో పాటు కీలక తారాగణంపై ముఖ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. ఇది పూరి శైలికి తగ్గట్లుగా సాగే ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. ఇందులో విజయ్ మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. ఇందులో సత్యభామగా నా నటన అందరికీ గుర్తుండిపోతుంది" అంటోంది నటి మాళవిక మనోజ్. ఇప్పుడామె.. సుహాస్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ గోదల తెరకెక్కించారు. ఇది ఈ నెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది మాళవిక మనోజ్.

ఈత రాకున్నా సీన్ కోసం నీళ్లలో దూకేశా



"తమిళ చిత్రం 'జో'లో నా నటన నచ్చి దర్శకుడు రామ్ నన్నీ కథతో సంప్రదించారు. ఈ కథను ఒక్క లైన్‌లో చెప్పడం చాలా కష్టం. దీంట్లో ప్రేమ, వినోదంతో పాటు చాలా కోణాలున్నాయి. స్క్రిప్ట్ విన్నప్పుడు చాలా విభిన్నంగా ఉందనిపించి వెంటనే ఓకే చెప్పేశా. నేనిందులో సత్యభామ అనే మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తాను. ఆ పాత్ర చాలా హైపర్‌గా గడుసుతనంతో ఉంటుంది. ప్రతి నటి కోరుకునే వైవిధ్యభరితమైన పాత్రిది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది".

- "సత్యభామ పాత్ర నా నిజ జీవితానికి చాలా దూరంగా ఉంటుంది. కానీ, ఆ పాత్రను నా సొంతం చేసుకుని చక్కగా చేశా. తెలుగులో తొలి అడుగులోనే ఇలాంటి సినిమా చేయడం.. ఇంత మంచి నటనా ప్రాధాన్యమున్న పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. నాకు స్వతహాగా ఈత రానప్పటికీ ఈ సినిమాలోని ఓ సీన్ కోసం భయపడుతూనే నీళ్లలో దూకి స్విమ్ చేశాను".
- "నాకెప్పుడూ వైవిధ్యభరితమైనవి, సవాల్ విసిరే పాత్రలు చేయాలని ఉంటుంది. ప్రతి సినిమాలోనూ రొటీన్ పాత్రలే చేస్తే ప్రేక్షకులకే కాదు నాకు బోర్ కొట్టేస్తుంది. నేనిప్పుడు నాకు సౌకర్యవంతంగా అనిపించిన సినిమాలే చేస్తున్నా. గ్లామర్ పాత్రలు చేయాలా.. వద్దా? అనే నిబంధన నాకైతే లేదు. కథ నచ్చి.. చేసే పాత్ర నాకు సౌకర్యంగా అనిపిస్తే గ్లామర్‌గా కనిపించడానికీ సిద్ధమే".

గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా



'మారెమ్మ' చిత్రంతో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు మాధవ్. ఆయన.. దీపా బాలు జంటగా నటిస్తున్న ఈ సినిమాని మంచాల నాగరాజ్ తెరకెక్కిస్తున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో మాధవ్ రగ్గడ్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే శక్తిమంతమైన యాక్షన్ కథతో రూపొందుతున్న సినిమా. కచ్చితంగా అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, ఛాయాగ్రహణం: ప్రశాంత్ అంకిరెడ్డి.

గాల్వాన్ యుద్ధం.. బరిలోకి సల్మాన్



సముద్ర మట్టానికి 15,000 అడుగుల ఎత్తులో.. ఒక్క బుల్లెట్ కూడా పేల్చకుండా గాల్వాన్ లోయలో జరిగిన యుద్ధం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'బాటిల్ ఆఫ్ గాల్వాన్'. బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. "కొన్ని యుద్ధాల్లో గెలవడానికి బుల్లెట్ల అవసరం లేదు" అంటూ ఇటీవలే ఈ చిత్రాన్ని ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఈ సినిమా షూటింగ్‌ను ఆగస్టులో మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మొదటి షెడ్యూల్ లడఖ్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ షెడ్యూల్‌లో సల్మాన్‌పై చిత్రానికి కీలకంగా నిలిచే యాక్షన్ సన్నివేశాల్ని తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ఆర్మీ అధికారిగా కనిపించనున్నారు సల్మాన్.

కృతి కాదు.. కియారానే?



మరికొద్ది రోజుల్లో 'వార్ 2'తో ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ అందాల తార కియారా అద్వాణీ. ఈ చిత్రంతో పాటు ఈమె ఖాతాలో 'డాన్ 3' కూడా ఉన్న సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడు. అయితే కొన్ని రోజులుగా కియారా స్థానంలో కృతి సనన్ నటించనున్నట్లు నెట్టింట్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడీ సినిమా గురించి మరో ఆసక్తికర విషయం బయటికొచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సమాచారం. "కొన్ని కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్‌కు చాలా ఆలస్యం అయ్యింది. మరోవైపు ఈ సినిమాకు హీరోయిన్‌గా సంతకం చేసిన కియారా గర్భవతి కావడం కూడా మరో కారణం. ఈ పరిస్థితుల దృష్ట్యా చిత్రీకరణను ఆపాల్సి వచ్చింది. ఇప్పుడు 2026లో 'డాన్ 3'ను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంది చిత్రబృందం. ఇందులో రణ్‌వీర్ సరసన నటించేది కృతి సనన్ కాదు.. కియారానే" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

డాన్ 3లో అతిథిగా షారుక్?



'డాన్' ఫ్రాంఛైజీలో వస్తున్న 'డాన్ 3' సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి బాలీవుడ్‌లో ఓ ఆసక్తికర విషయం వినిపిస్తోంది. 'డాన్ 3' చిత్రంలో షారుక్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దీనికి ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్నారు. "ఆ పాత్ర గురించి పెద్దగా తెలియదు. ఫర్హాన్ అక్తర్, షారుక్‌ని సంప్రదించి ఆ పాత్రని, అతని చుట్టూ ఉన్న కథని వివరించారని తెలుస్తోంది. షారుక్ ప్రస్తుతం 'కింగ్'తో బిజీగా ఉన్నప్పటికీ, వారి స్నేహం వల్ల అతను ఆ పాత్రని చేయడానికి అంగీకరించాడని" సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే రణ్‌వీర్ సింగ్, షారుక్ ఖాన్‌ను తొలిసారి తెరపై చూడొచ్చు. ఈ చిత్రానికి ఇంకో ప్రత్యేకం ఏంటంటే ప్రియాంక చోప్రా.. రోమా పాత్రను తిరిగి పోషించే అవకాశం ఉందని సమాచారం. తను ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో భాగంగా హిందీ సినిమాలను మిస్ అవుతున్నానని చెప్పింది.

ఈసారి పంచాయత్‌లో ప్రేమకథ

ఓటీటీ బొమ్మ



యాక్షన్స్, థ్రిల్లర్స్ అంటూ ఉవ్విళ్లూరుతున్న ప్రేక్షకులకు స్వచ్ఛమైన పల్లెటూరి వాతావరణాన్ని పరిచయం చేసింది 'పంచాయత్' వెబ్ సిరీస్. ఇప్పటికే మూడు భాగాలుగా వచ్చి విశేష ఆదరణను సొంతం చేసుకుంది. ఇటీవలే ఈ ఫ్రాంఛైజీలో నాల్గో భాగం విడుదలై హిట్ మాట వినిపించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడిందులో 'పంచాయత్ సీజన్ 5' రాబోతుంది. దీపక్ కుమార్ మిశ్రా, అక్షత్ సంయుక్తంగా రూపొందిస్తున్నారు. జితేంద్ర కుమార్, నీనా గుప్తా, రఘువీర్ యాదవ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టర్‌ను విడుదల చేసింది సిరీస్ బృందం. "హాయ్ సీజన్ 5.. ఫులేరాకు తిరిగి రావడానికి సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యల్ని జోడించింది. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న సిరీస్‌లో ఈసారి ప్రేమకథను ప్రధాన కథాంశంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సిరీస్ వచ్చే ఏడాది విడుదల కానుంది.

సోషియో ఫాంటసీ కథతో...

కార్తీక్‌రాజు, నోయల్, మిస్తీ చక్రవర్తి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'దీర్ఘాయుష్మాన్ భవ'. ఎం.పూర్ణానంద్ దర్శకుడు. వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. నిర్మాత నట్టికుమార్ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "కొత్త నిర్మాతలకి చిత్ర పరిశ్రమ ఎప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుంది. అయితే కొత్త నిర్మాతలు చిత్ర పరిశ్రమ మీద కనీసం ఒక ఏడాదిపాటు అవగాహన పెంచుకుని వస్తే బాగుంటుంది. ఈ విషయంపైనే చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాత మండలి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూనే ఉన్నాయి. మంచి అభిరుచితో ఈ సినిమా తీసినట్టు అనిపిస్తోంది. ప్రచార చిత్రాలు, పాటలు బాగున్నాయి. ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు. నట్టికుమార్ మాట్లాడుతూ "కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుందీ చిత్రం. చిన్న సినిమాల సమస్యల్ని తీర్చేందుకు పరిశ్రమ, ప్రభుత్వాలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాల"ని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ "ఆహ్లాదం పంచే హాస్యంతో తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిద"న్నారు. భావోద్వేగాలతో కట్టిపడేసే సినిమా అని చెప్పారు నిర్మాత. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్పీ, ఓ.కల్యాణ్, జెమినీ సురేశ్, రాంబాబు గోసాల తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.


మిస్తీ, కార్తీక్

మొబైల్ రీఛార్జ్ మరింత భారం



డిసెంబరుకు 10-12% పెరగొచ్చు: జెఫ్రీస్ అంచనా

దిల్లీ: మొబైల్ ప్రీపెయిడ్ చందాదార్లకు చేదు వార్త. ఈ ఏడాది డిసెంబరు నాటికి మొబైల్ రీఛార్జ్ ప్లాన్ల ధరలు 10-12% పెరిగే అవకాశం ఉందని బ్రోకరేజీ జెఫ్రీస్ అంచనా వేసింది. జియో, ఎయిర్‌టెల్‌కు వేగంగా చందాదార్లు జత అవుతుండటం, వొడాఫోన్ ఐడియాకు తగ్గుతున్నందున ధరలు పెంచేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపింది. 2024 జులైలో ప్లాన్ల ధరలను టెలికాం సంస్థలు 11-23% పెంచిన సంగతి విదితమే. ఈసారి 5జీ పురోగతికి అనువుగా టారిఫ్‌ల పెంపు ఉండొచ్చని చెబుతున్నారు. డేటా వినియోగం, వేగం, సమయం ఆధారంగా ధరలు సర్దుబాటు చేస్తారని సమాచారం. మధ్య స్థాయి, ప్రీమియం చందాదార్లను టెలికాం కంపెనీలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని విశ్లేషకులు తెలిపారు.

✦ మొబైల్ కనెక్షన్ల సంఖ్య, ఈ ఏడాది మే నెలలో 108 కోట్లకు చేరింది. ఇది 29 నెలల గరిష్ఠస్థాయి. ఆ నెలలో రిలయన్స్ జియో కనెక్షన్లు 55 లక్షలు పెరగడంతో, మార్కెట్ వాటా 53 శాతానికి చేరింది. భారతీ ఎయిర్‌టెల్‌కు 13 లక్షల మంది క్రియాశీలక చందాదార్లు జత చేరడంతో, మార్కెట్ వాటా 36 శాతానికి చేరింది.

అనంత్ టెక్నాలజీస్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు!

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సంస్థ అనంత్ టెక్నాలజీస్, దేశీయ శాటిలైట్లను వినియోగించి శాటిలైట్ ఇంటర్నెట్ సేవల విపణిలోకి అడుగుపెట్టబోతోంది. ఈ రంగంలోకి అడుగుపెడుతున్న తొలి ప్రైవేటు కంపెనీ ఇదే. శాటిలైట్ సేవలను ప్రారంభించేందుకు ఇటీవలే కంపెనీకి ఇన్-స్పేస్ నుంచి అనుమతి లభించింది. 100 జీబీపీఎస్ వరకు వేగంతో డేటా సేవలు అందించేందుకు 4-టన్నుల జియోస్టేషనరీ (జీఈఓ) కమ్యూనికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలో ఏర్పాటు చేసేందుకు అనంత్ టెక్నాలజీస్ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూ.3,000 కోట్లు ప్రారంభ పెట్టుబడిగా పెట్టబోతోంది.

ఉత్తరప్రదేశ్ ఆర్థిక మండలి సభ్యుడిగా సుబ్బారావు పావులూరి



రక్షణ, అంతరిక్ష రంగాలకు సేవలు అందించే అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఎండీ సుబ్బారావు పావులూరి, ఉత్తర ప్రదేశ్ ఆర్థిక మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మండలిలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 15 మంది సభ్యులున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోకి పెట్టుబడులను ఆకర్షించడం, అధిక ఎగుమతులు నమోదు చేయటం ఈ మండలి ప్రధాన లక్ష్యం.

ఈనాడు బిజినెస్

రూ.2 లక్షల కోట్ల 'డ్రోన్ల' తయారీ!

2030కి సాకారం: నెక్స్‌జెన్ నివేదిక



దిల్లీ: దేశీయంగా వ్యవసాయం, రక్షణ, రవాణా, మౌలిక సదుపాయాలు, ఫొటోగ్రఫీ.. ఇలా పలు రంగాల్లో డ్రోన్ల వాడకం అధికమైంది. పాకిస్థాన్‌తో యుద్ధం తరవాత డ్రోన్ల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం తయారీకి రూ.2,000 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ఆవిష్కరించనుందనే వార్తలొస్తున్నాయి. 2030 కల్లా దేశీయంగా వీటి తయారీ 2300 కోట్ల డాలర్ల (సుమారు రూ.2 లక్షల కోట్ల)కు చేరొచ్చని నెక్స్‌జెన్ అనే సంస్థ తాజా నివేదికలో అంచనా వేసింది. 15 నగరాల్లోని 150 కంపెనీల నుంచి సేకరించిన అభిప్రాయాలతో నివేదిక రూపొందించింది. ఈ ప్రకారం..

✤ 2030 కల్లా మనదేశంలో రక్షణ, వ్యవసాయం, ప్రెషిసన్ ఫార్మింగ్ రంగాల నుంచి డ్రోన్లకు అధిక గిరాకీ ఉండొచ్చని 40% డ్రోన్ కంపెనీలు పేర్కొన్నాయి.

✤ 2030 నాటికి అంతర్జాతీయంగా వ్యవసాయ డ్రోన్ల విపణి పరిమాణం 5.89 బిలియన్ డాలర్ల (సుమారు రూ.50,000 కోట్ల)కు చేరొచ్చని అంచనా.

✤ డ్రోన్ల ద్వారా వ్యవసాయ రంగానికి పలు ప్రయోజనాలు ఉన్నాయి. పంట చౌర్యం, జంతువులు పంటను పాడుచేయడం లాంటివి చోటుచేసుకోకుండా వీటి సాయంతో పర్యవేక్షించొచ్చు. అందువల్లే అయిదేళ్లలో గ్రామీణ భారతంలో డ్రోన్లు ఒక బూమ్ సృష్టించే అవకాశం ఉందని 20% కంపెనీలు అంచనా వేశాయి. లాజిస్టిక్, మౌలిక రంగాలూ కీలక పాత్ర పోషించనున్నాయని 15% కంపెనీలు తెలిపాయి.

దిల్లీలో డ్రోన్ల ఎక్స్‌పో: డ్రోన్ల పరిశ్రమకు మరింత ఊతం ఇచ్చేందుకు దిల్లీలో ఈనెల 31- ఆగస్టు 1 తేదీల్లో అతిపెద్ద డ్రోన్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పో- 2025 నిర్వహించనున్నారు. నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో మనదేశంతో పాటు రష్యా, తైవాన్, కెనడా, ఉక్రెయిన్ వంటి దేశాలు తమ ఆవిష్కరణలు ప్రదర్శించనున్నాయి. 50 దేశీయ, అంతర్జాతీయ డ్రోన్ల తయారీ కంపెనీలు ఇందులో తమ ఉత్పత్తులను పరిచయం చేయనున్నాయి.

టాటా ఏస్ ప్రో 3 వేరియంట్లు



ఈనాడు, హైదరాబాద్: చిన్న తరహా సరకు రవాణా వాహనం ఏస్ ప్రోను టాటా మోటార్స్ విపణిలోకి విడుదల చేసింది. పెట్రోల్, విద్యుత్, పెట్రోల్-సీఎన్‌జీ ఇంజిన్లతో దీన్ని తీసుకొచ్చింది. 750 కిలోల బరువును రవాణా చేసే విధంగా, 6.5 అడుగుల డెక్‌తో ఈ వాహనం అందుబాటులోకి వచ్చింది. పెట్రోలు ఇంజిన్ వాహనం ప్రారంభ ధర రూ.3.99 లక్షలు కాగా, విద్యుత్ మోడల్ రూ.6.5 లక్షలు, పెట్రోల్-సీఎన్‌జీ మోడల్ ధర రూ.4.99 లక్షలుగా ఉంది. టాటా మోటార్స్ వాణిజ్య వాహన విభాగం వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ పినాకి హల్దార్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి పొందాలనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని, ఏస్ ప్రో తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, రుణాలు అందించేలా చూస్తున్నామన్నారు. ఇ-కామర్స్, గిడ్డంగులు, కిరాణా వస్తువులు, రోజువారీ పార్శిళ్ల డెలివరీకి ఉపయోగపడుతుందన్నారు.

జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ఆకాశ ఎయిర్ తన బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు సంబంధించిన మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల కోసం మూడేళ్ల కాలానికి జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఆకాశ ఎయిర్‌కు 30 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలున్నాయి. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరో స్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న జీఎంఆర్ ఏరో టెక్నిక్ ఎంఆర్‌ఓ (మరమ్మతు, నిర్వహణ, ఓవర్‌హాల్) సౌకర్యంలో ఆకాశ ఎయిర్ విమానాలకు సమయానుకూల పరీక్షలు నిర్వహిస్తారు. జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్, అకౌంటబుల్ మేనేజర్ అశోక్ గోపీనాథ్ మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యం, ప్రామాణికత, వినియోగదారుల అవసరాలను గుర్తించడం, ఆధునిక నిర్వహణ పరిష్కారాలను అందిస్తున్నందునే, విమాన సంస్థలు తమను విశ్వసిస్తున్నాయన్నారు. ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకులు బెల్సన్ కౌటిన్హో మాట్లాడుతూ.. విమానాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో భాగస్వామ్యం ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో విమానాలను నడిపేందుకు దోహదం చేస్తుందని, దేశంలో ఎంఆర్‌ఓ రంగానికీ మద్దతు ఇచ్చేందుకు తోడ్పడుతుందన్నారు.

అమెరికా నుంచి రిలయన్స్‌కు ఈథేన్

- చైనాకు వెళ్లాల్సిన సరకు మన దేశానికి
- వాణిజ్య ఒప్పందానికి ముందు సానుకూలతలు



భారత్‌పై అమెరికా విధించిన సుంకాల అమలుకు నిర్ణయించిన గడువుకు ముందే ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు ఉన్నతస్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇంతకన్నా ముందే ఇరు దేశాల మధ్య మరో సానుకూలత కనిపించింది. అమెరికా నుంచి చైనాకు వెళ్లాల్సిన ఈథేన్, ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు దిగుమతి కావడం.. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందాన్ని సానుకూల పరిచే అంశంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వాణిజ్యలోటు తగ్గనుంది: మనదేశంపై అమెరికా ప్రధాన ఆరోపణ.. తమ వస్తువులపై భారీగా సుంకం విధిస్తోందని. దీంతోపాటు ద్వైపాక్షిక వాణిజ్యంలో, తమకే అధికలోటు ఉంటోందని. ఇందుకోసం అమెరికా నుంచి మరిన్ని ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకోవాలనీ కోరుతోంది. ఇప్పుడు అమెరికా నుంచి ద్రవీకృత ఈథేన్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ అందుకోనుంది. దీనిని ఎథిలీన్‌గా మార్చి, ప్లాస్టిక్స్ తయారీకి ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ఇప్పటివరకు ముడిచమురు నుంచి దీనిని విడదీస్తున్నారు. ఇందువల్ల 30 శాతం సామర్థ్యమే వస్తోంది. అదే ఈథేన్ నుంచి అయితే 80% ఎథిలీన్ వస్తుందట. దీని వల్ల రిలయన్స్‌కు ముడిపదార్థాల వ్యయాలు తగ్గడమే కాదు, అమెరికాకు మనదేశంతో వాణిజ్యలోటూ కొంత తగ్గుతుంది. ఇది ఒకరకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను సంతోషపరిచే అంశమే.

వాణిజ్య ఒప్పందానికి ఎలా ఉపయోగం అంటే: రిలయన్స్ ఈథేన్ దిగుమతులు వ్యూహాత్మక సమయంలో జరుగుతున్నాయి. సుంకాల విధింపునకు ట్రంప్ నిర్ణయించిన గడువుకు ముందే ఇది జరగడం వల్ల అమెరికాలో జౌళి, ఎలక్ట్రానిక్స్ మార్కెట్లను మెరుగుపరచుకోవాలనుకుంటున్న మనదేశం, బేరసారాలకు ఉపయోగించుకోవచ్చు.

ట్రంప్‌తో అనుబంధం: ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో ఇవాంకా ట్రంప్, జేర్డ్ కుష్నర్‌కు అంబానీ ఆతిథ్యం ఇచ్చారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యాక, అతికొద్దిమంది అతిథులకు ఇచ్చిన విందుకు సతీసమేతంగా ముకేశ్ అంబానీ హాజరయ్యారు కూడా. ఆ విధంగా ట్రంప్ కుటుంబంతో ముకేశ్‌కు మంచి అనుబంధం ఏర్పడింది. తాజాగా ఇంధన అనుబంధంతో.. అమెరికాతో మన వాణిజ్య వ్యూహాత్మక విలువను పెంచుకోవడంతో పాటు, అంతర్జాతీయ పెట్రోరసాయనాల రంగంలో చైనా ఆధిపత్యానికి గండికొట్టొచ్చు. అమెరికా కుబేరుడు ఎలాన్‌మస్క్‌తో ట్రంప్‌నకు విభేదాలు పెరిగిన నేపథ్యంలో ముకేశ్ రూపంలో ఇంకో బిలియనీర్‌తో సన్నిహితత్వం పెరిగే అవకాశాన్నీ కొట్టిపారేయలేం.

వింటేజ్ కాఫీ.. 5,000 టన్నుల కొత్త యూనిట్

రూ.215.76 కోట్లు సమీకరిస్తున్న సంస్థ



ఈనాడు, హైదరాబాద్: స్థానిక ఇన్‌స్టంట్ కాఫీ సంస్థ వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్.. ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకోనుంది. ఈ సంస్థకు ఏటా 6,500 టన్నుల స్ప్రే డ్రైడ్ అగ్లోమరేటెడ్ కాఫీ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. దీన్ని వచ్చే మార్చికి 11,000 టన్నులకు విస్తరించే ప్రక్రియలో ఉంది. దీనికి అదనంగా కొత్తగా 5,000 టన్నుల వార్షిక సామర్థ్యం గల ఫ్రీజ్ డ్రైడ్ ఇన్‌స్టంట్ కాఫీ ప్లాంటు నెలకొల్పనున్నట్లు తెలిపింది. ఇందుకోసం సంస్థాగత మదుపరులు, వ్యక్తుల నుంచి రూ.215.76 కోట్లు సమీకరించేందుకు ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ పద్ధతిలో 1.50 కోట్ల ఈక్విటీ షేర్లు, 24 లక్షల కన్వర్టబుల్ వారెంట్లు జారీ చేయనుంది. ఒక్కో షేరు, కన్వర్టబుల్ వారెంట్‌ను రూ.124 ధరకు జారీ చేయాలని నిర్ణయించారు. ఈక్విటీ షేర్లు తీసుకుంటున్న సంస్థల్లో బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్, అస్టోర్న్ కేపిటల్, సువామా ఎన్‌హాన్స్‌డ్ డైనమిక్ గ్రోత్ ఈక్విటీ ఫండ్, వికాస ఇండియా ఈఐఎఫ్-1 ఫండ్, ఇండియా ఎమర్జింగ్ జైంట్స్ ఫండ్, కొన్ని ఇతర సంస్థలుండగా, కొందరు వ్యక్తులు కూడా తీసుకున్నారు. కొత్త ప్లాంటు అందుబాటులోకి వస్తే మొత్తం 16,000 టన్నుల ఫ్రీజ్ డ్రైడ్ ఇన్‌స్టంట్ కాఫీ సామర్థ్యం ఉన్నట్లు అవుతుందని వింటేజ్ కాఫీ సీఎండీ టి. బాలకృష్ణ వివరించారు. దీనివల్ల ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఐరోపా, పశ్చిమ ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఈక్విటీ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో రూ.1.05 లక్షల కోట్ల నష్టాలు

2024-25పై సెబీ అధ్యయనం

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ఈక్విటీ డెరివేటివ్స్ ట్రేడింగ్ ద్వారా దాదాపు 91% మంది వ్యక్తిగత మదుపర్లు నష్టపోయినట్లు సెబీ అధ్యయనంలో వెల్లడైంది. 2023-24లోనూ ఈ ట్రేడింగ్‌లో నష్టపోయిన వారి సంఖ్య ఇంచుమించు ఇంతే స్థాయిలో ఉండటం గమనార్హం. వీళ్లంతా నష్టపోయిన మొత్తం 2023-24లో రూ.74,812 కోట్లు కాగా, 2024-25లో ఈ విలువ 41% పెరిగి రూ.1,05,603 కోట్లకు చేరింది. అయితే 2023-24తో పోలిస్తే ఫ్యూచర్స్, ఆప్షన్లలో ట్రేడ్ చేసే వారి సంఖ్య 2024-25లో 20% తగ్గింది. రెండేళ్లక్రితంతో పోలిస్తే ఇంకా 24% ఎక్కువగానే ఉంది. ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో చిన్న మదుపర్లు భారీగా నష్టపోతున్నందున, వారి ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు సెబీ చేపట్టిన చర్యలు 2024 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

కోడి గుడ్లు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
విజయవాడ	570
గోదావరి	535
విశాఖపట్నం	560
చిత్తూరు	633

వాహన రిటెయిల్ విక్రయాలు 5% పెరిగాయ్



వాహన విభాగం	జూన్ విక్రయాలు	వృద్ధి (%)
ద్విచక్ర	14,46,387	5
వాణిజ్య	73,367	7
త్రిచక్ర	1,00,625	7
ట్రాక్టర్లు	77,214	9
ప్రయాణికుల	2,97,722	2

దిల్లీ: ఈ ఏడాది జూన్‌లో ప్రయాణికుల వాహనాలు (కార్లు, జీపులు, వ్యాన్లు), ద్విచక్ర వాహనాలతో కలిపి అన్ని వాహన విభాగాల్లో రిటెయిల్ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన సుమారు 5% పెరిగాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా సోమవారం వెల్లడించింది. జూన్‌లో మొత్తం వాహనాల రిజిస్ట్రేషన్లు 20,03,873కు చేరాయి. 2024 జూన్ నాటి 19,11,354 కంటే ఇవి 4.84% ఎక్కువ. భారీ వర్షాలు కురుస్తుండటం, విపణిలో ద్రవ్య లభ్యత తక్కువగా ఉండటంతో.. కొత్త వాహనాలకు బుకింగ్‌లు తగ్గాయని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ వెల్లడించారు. డీలర్ల వద్ద సుమారు 55 రోజులకు సరిపడా వాహన నిల్వలు ఉన్నాయని తెలిపారు.

3 నెలల్లో విక్రయాలు ఇలా: ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మొత్తం వాహనాల రిటెయిల్ విక్రయాలు 5% పెరిగి 65,42,586కు చేరాయి. 2024 ఇదే సమయంలో ఇవి 62,39,877గా నమోదయ్యాయి. ప్రయాణికుల వాహనా విక్రయాలు 3% పెరిగి 9,71,477కు చేరాయి. ద్విచక్ర వాహనాల విక్రయాలు 5% పెరిగి 47,99,948కు చేరాయి. వాణిజ్య వాహన, ట్రాక్టర్ల విభాగంలో వరుసగా 1%, 12% వృద్ధి నమోదైంది.

2030 కల్లా 700 హోటళ్లు

- ఆదాయాలు రూ.15,000 కోట్లకు
- ఐహెచ్‌సీఎల్‌పై చంద్రశేఖరన్ అంచనా



దిల్లీ: భారత్‌లో వినియోగం-ప్రయాణాలు పెరుగుతున్నందున ఆతిథ్య రంగ వృద్ధికి ఊతం లభిస్తోందని, భవిష్యత్తు చాలా బలంగా, ఉజ్వలంగా కనిపిస్తోందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్) వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదార్లనుద్దేశించి ఆయన మాట్లాడుతూ '2030 కల్లా ప్రపంచవ్యాప్తంగా 700 హోటళ్ల లక్ష్యాన్ని సాధిస్తాం. ఆదాయాలను రెట్టింపు చేసుకుని రూ.15,000 కోట్లను అధిగమిస్తామ'ని అన్నారు. 'మన సేవల రంగం 8 శాతానికి పైగా వృద్ధి కనబరుస్తోంది. భారత్‌కు వచ్చే విదేశీ ప్రయాణికుల సంఖ్య ఏటా పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 74 కొత్త హోటళ్ల నిమిత్తం సంతకాలు జరిగాయి. 26 కొత్త హోటళ్లను ప్రారంభించడంతో, మన మొత్తం హోటళ్ల సంఖ్య 380కు చేరింది. ఏకీకృత పద్ధతిన ఆదాయాలు రూ.8,565 కోట్లుగా ఉన్నాయి. పన్ను తర్వాత లాభం రూ.1908 కోట్లుగా ఉంద'ని చంద్రశేఖరన్ తెలిపారు.

టాటా గ్రూప్ కంపెనీల్లో భద్రతకే తొలి ప్రాధాన్యం: విస్తరణ ప్రణాళికలతో అడుగు ముందుకేస్తున్న తరుణంలో టాటా గ్రూప్‌లోని అన్ని కంపెనీల్లో భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఎయిరిండియా దుర్ఘటన అనంతరం గ్రూప్ కంపెనీల్లో చేపట్టిన భద్రతా చర్యలపై వాటాదార్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ 'ప్రధాన కంపెనీల సీఈఓలతో ఒక బృందం ఏర్పాటు చేశాం. టాటా గ్రూప్ కంపెనీల్లో భద్రతపై ఇది దృష్టి సారిస్తుంది. అత్యాధునిక తయారీని చేపడుతున్నాం. కాబట్టి భద్రతపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఇది ఎప్పుడూ చేసే పనే అయినా.. ఇపుడు మరింతగా చేయాలని నిర్ణయించామ'న్నారు.

జేన్‌స్ట్రీట్ లాంటి ఉదంతాలు మరోసారి జరగకుండా చూస్తాం

సెబీ ఛైర్మన్ పాండే



ముంబయి: అమెరికా హెడ్జ్‌ఫండ్ జేన్‌స్ట్రీట్ మన స్టాక్‌మార్కెట్లో రూ.వేల కోట్లను అక్రమంగా ఆర్జించడం వంటివి మరోసారి జరగనివ్వబోమని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. ఇందుకుగాను నిఘా వ్యవస్థలను నవీకరించే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లో అక్రమ పద్ధతుల ద్వారా నికరంగా రూ.36,671 కోట్లను జేన్‌స్ట్రీట్ ఆర్జించినట్లు సెబీ నిర్ధారించి, ఆ సంస్థపై రూ.4,843 కోట్ల జరిమానా విధించింది. ఇదే తరహాలో ఇతర ఫండ్‌లు లేదా మదుపర్లు ఎవరైనా అక్రమ పద్ధతులకు పాల్పడ్డారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఇకపై ఇలాంటివి చోటుచేసుకుంటాయని అనుకోవడం లేదు. జేన్ స్ట్రీట్ వ్యవహారంలో ప్రాథమికంగా నిఘా సమస్య కారణం. అందువల్ల దీనిని నవీకరించడంపై దృష్టి పెడుతున్నామ'ని పాండే చెప్పారు. నియంత్రణాధికార పరిధికి లోబడే జేన్‌స్ట్రీట్‌పై చర్యలు చేపట్టామని చెప్పారు. 'ఇలాంటి అక్రమ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టడం ఒక్కటే పరిష్కారం కాదు. అత్యుత్తమ నిఘా వ్యవస్థలు అవసరం' అని ఆయన తెలిపారు. డెరివేటివ్స్ మార్కెట్లో చిన్న మదుపర్ల ప్రయోజనాలు పరిరక్షించేందుకు మున్ముందు చేపట్టే చర్యలు కేవలం వివరాలు/ గణాంకాల ఆధారంగానే ఉంటుందని పాండే వెల్లడించారు. గత మూడు నెలల్లో డెరివేటివ్స్ విభాగంలో చిన్న మదుపర్ల పనితీరుపై పూర్తి వివరాలను త్వరలోనే సెబీ ప్రకటిస్తుందని అన్నారు.

'జరిమానా' పదం ఉపసంహరణ!: తప్పుడు కార్యకలాపాలకు పాల్పడిన బ్రోకర్లపై చర్యలు తీసుకునే సమయంలో 'జరిమానా' అనే పదాన్ని వాడకూడదనే ఆలోచనలో సెబీ ఉన్నట్లు సెబీ పూర్తి కాల సభ్యుడు కె సి వర్ష్ణేయ్ తెలిపారు. 'వాస్తవానికి వీటిల్లో చాలా వరకు జరిమానాలు కావని మీకు తెలుసు. జరిమానా పదాన్ని వాడటం ద్వారా అనవసరంగా వాళ్లపై మచ్చ పడినట్లు అవుతుంది. అందువల్ల దీని కంటే సబబు అయిన పేరు ఒకటి ఉంటే బావుంటుంద'ని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన చెప్పారు. జరిమానాలను హేతుబద్ధీకరించే ప్రక్రియలో సెబీ ఉందన్నారు.

ఈ ఏడాది 9 కోట్ల చ.అ. కార్యాలయ స్థలాలకు గిరాకీ



కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

దిల్లీ: ఈ ఏడాది దేశంలోని 8 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల స్థూల లీజింగ్ రికార్డు స్థాయిలో 90 కోట్ల చదరపు అడుగులకు మించే అవకాశం ఉన్నట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తాజా నివేదికలో తెలిపింది. గతేడాది 8.9 కోట్ల చ.అ గిరాకీ రికార్డును అధిగమించనుంది. కరోనా పరిణామాల తర్వాత కార్యాలయ స్థలాల మార్కెట్ వృద్ధి చెందుతునే ఉన్నట్లు నివేదిక వివరించింది.

✦ ఈ 8 ప్రధాన నగరాల్లో ఈ సంవత్సరం జనవరి-జూన్‌లో 4.17 కోట్ల చ.అ కార్యాలయ స్థలం లీజుకు వెళ్లింది. గతేడాది (2024) ఇదే కాలంలో 4.1 కోట్ల చ.అ. నమోదైంది.

✦ కార్యాలయ స్థల లీజులు 2025 జనవరి-జూన్‌లో పుణె, చెన్నై, దిల్లీలో పెరగ్గా.. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాల్లో తగ్గాయి.

జనవరి-జూన్‌లో కార్యాలయ స్థలాల లీజు వృద్ధి (మి.చ.అ)

నగరం	వృద్ధి(%)	2024	2025
ముంబయి	−7	8.8	8.2
దిల్లీ-ఎన్‌సీఆర్	14	6.5	7.4
బెంగళూరు	−20	12.3	9.8
చెన్నై	22	3.4	4.1
హైదరాబాద్	−6	4.6	4.3
కోల్‌కతా	−22	1	0.8
అహ్మదాబాద్	−33	0.3	0.2

క్యాప్‌జెమినీ చేతికి డబ్ల్యూఎన్‌ఎస్

దిల్లీ: ఏఐ (కృత్రిమమేధ) సామర్థ్యాల్లో మరింతగా రాణించేందుకు వీలుగా, వ్యాపారాల రూపాంతరీకరణ సేవల సంస్థ, లండన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే డబ్ల్యూఎన్‌ఎస్‌ను 3.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.28,200 కోట్ల) కు కొనుగోలు చేస్తున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ సేవల దిగ్గజం క్యాప్‌జెమినీ సోమవారం ప్రకటించింది. జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ సామర్థ్యాలను మరింత పెంచుకునేందుకు ఈ స్వాధీనత ఉపయోగ పడుతుందని వివరించింది. డబ్ల్యూఎన్‌ఎస్ షేరు ప్రస్తుత ధర కంటే 17% అధికంగా 76.50 డాలర్ల చొప్పున చెల్లించేందుకు అంగీకరించామని క్యాప్‌జెమినీ తెలిపింది.

ఎక్కడి సూచీలు అక్కడే

సెన్సెక్స్ ▲ 10 — 83443

నిఫ్టీ ◆ 00 — 25461

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.321 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,853 కోట్లు



సమీక్ష

రోజంతా ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో, దేశీయ సూచీలు స్తబ్దుగా ముగిశాయి. అమెరికా టారిఫ్‌ల విధింపునకు ఇచ్చిన గడువు సమీపిస్తుండటంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. బలహీన అంతర్జాతీయ సంకేతాలూ తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 54 పైసలు తగ్గి 85.94 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.29% లాభంతో 68.50 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ, హాంకాంగ్ నష్టపోగా.. కొరియా, షాంఘై లాభపడ్డాయి. బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.10,000 కోట్లు తగ్గి రూ.461.13 లక్షల కోట్లు (5.37 లక్షల కోట్ల డాలర్ల)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 34 పాయింట్ల (క్రితం ముగింపు 83,432.89) నష్టంతో 83,398.08 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీ 83,516.82 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 9.61 పాయింట్ల లాభంతో 83,442.50 వద్ద ముగిసింది. నిఫ్టీ ఎటువంటి మార్పులేకుండా 25,461.30 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,407.25- 25,489.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 12 లాభపడ్డాయి. హెచ్‌యూఎల్ 3.01%, కోటక్ బ్యాంక్ 1.07%, ట్రెంట్ 0.94%, రిలయన్స్ 0.90%, ఐటీసీ 0.87%, ఏషియన్ పెయింట్స్ 0.77% పెరిగాయి. బీఈఎల్ 2.46%, టెక్ మహీంద్రా 1.83%, అల్ట్రాటెక్ 1.28%, మారుతీ 1.07%, ఎటెర్నల్ 1%, ఇన్ఫోసిస్ 0.93% నష్టపోయాయి. ఎఫ్ఎమ్‌సీజీ 1.50%, యుటిలిటీస్ 0.71%, చమురు-గ్యాస్ 0.31%, విద్యుత్ 0.31% మెరిశాయి. టెలికాం, ఫోకస్డ్ ఐటీ, కమొడిటీస్, ఐటీ, లోహ 1.24% వరకు పడ్డాయి.

✦ ఒడిశాలో రూ.3,600 కోట్ల పెట్టుబడితో కొత్త ఉక్కు ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్లు **జిందాల్ (ఇండియా) లిమిటెడ్** ప్రకటించింది. 2030 కల్లా ఒడిశాలో 3 దశల్లో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించింది.

✦ దేశవ్యాప్తంగా రిటెయిల్, కార్పొరేట్ బృందాలకు స్పెషలైజ్డ్ జెమోలాజికల్ విక్రయాల్లో శిక్షణ ఇచ్చేందుకు జెమోలాజికల్ సైన్స్ ఇంటర్నేషనల్ (జీఎస్ఐ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాటా గ్రూప్ ఆభరణాల బ్రాండ్ 'తనిష్క్' తెలిపింది.

✦ తమ జర్మనీ అనుబంధ సంస్థ జీఎంబీ గ్లాస్‌మాన్యుఫాక్టర్ బ్రాండెన్‌బర్గ్ జీఎంబీహెచ్ దివాలా ప్రక్రియకు దరఖాస్తు చేసుకున్నట్లు **బొరోసిల్ రెన్యూవబుల్స్** తెలిపింది. కాట్‌బస్‌లోని కోర్టులో జర్మనీ దివాలా చట్టం (ఐఎన్‌ఎస్ఓ) కింద ఇందుకు దరఖాస్తు చేసుకుంది.

✦ పర్యావరణహిత ఆహార ప్యాకేజింగ్, సేవల ఉత్పత్తులను తయారు చేసే **గ్లెన్ ఇండస్ట్రీస్** తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.92-97 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.63.02 కోట్లు సమీకరించనుంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లు బీఎస్‌ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదుకానున్నాయి.

✦ డిజిటల్ చిరునామాలను సృష్టించేందుకు తమ మ్యాపిల్స్ మ్యాప్‌ను ఇండియా పోస్ట్ డిజిపిన్ ప్లాట్‌ఫామ్‌తో ఏకీకృతం చేసినట్లు దేశీయ నేవిగేషన్ సంస్థ **మ్యాప్‌మైఇండియా** ప్రకటించింది.

✦ **స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్** తొలి పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) ఈనెల 10 న ప్రారంభమై 14న ముగియనుంది. ధరల శ్రేణి రూ.387-407గా నిర్ణయించారు. ఈ ఐపీఓ ద్వారా రూ.583 కోట్లు సమీకరించాలని చూస్తుంది.

ట్రంప్-మస్క్ విభేదాలతో టెస్లా షేరు పతనం

న్యూయార్క్: దక్షిణ కొరియా, జపాన్ ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, అమెరికా మార్కెట్లు సోమవారం 1% వరకు నష్టాల్లో కొనసాగుతున్నాయి. విద్యుత్తు కార్ల సంస్థ టెస్లా అధినేత మస్క్ రాజకీయ పార్టీని ప్రకటించడాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో, టెస్లా షేర్లు 8% వరకు పతనమయ్యాయి. ఒకప్పుడు ట్రంప్, మస్క్ అత్యంత సన్నిహితులుగా ఉన్నా.. తదుపరి ఇద్దరి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. అమెరికాలో మూడో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు మస్క్ ప్రకటించడంతో వారి మధ్య అగాధమే ఏర్పడినట్లయింది. 'ఒకవేళ ఈ రాజకీయ యుద్ధం ముదిరిందంటే మస్క్/టెస్లా/స్పేస్‌ఎక్స్‌కు ట్రంప్ మరిన్ని అడ్డంకులను సృష్టించే అవకాశం లేకపోలేద'ని విశ్లేషకులు అంటున్నారు. చైనా కంపెనీలైన బీవైడీ, గ్రేట్‌వాల్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్న టెస్లాకు తాజా పరిణామాలు ఇబ్బంది కలిగించేవే. గత డిసెంబరు 17న 479.76 డాలర్ల వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని తాకిన టెస్లా షేరు, అప్పటి నుంచి ఇప్పటిదాకా 40% వరకు తన విలువను కోల్పోయింది. భారత కాలమాన్ల ప్రకారం సోమవారం రాత్రి 11:30 గంటలకు టెస్లా షేరు నాస్‌డాక్‌లో 6.90% నష్టంతో (గత శుక్రవారం పోలిస్తే) 293.60 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఇన్సులినంటే భయమేల?

డాక్టర్ సలహా

సమస్య: మా అమ్మకు 72 ఏళ్లు. పదేళ్లుగా మధుమేహం ఉంది. ఇటీవల రక్త పరీక్ష చేస్తే గ్లూకోజు చాలా ఎక్కువగా ఉంది. హెచ్‌బీఏ1సీ 14 ఉన్నట్టు తేలింది. డాక్టర్ ఇన్సులిన్ తీసుకోవాలని సూచించారు. కానీ ఇంజెక్షన్ అంటే బాగా భయపడుతోంది. దీన్ని పోగొట్టేదెలా? ఒకవేళ ఇంజెక్షన్‌కు అంగీకరిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?


– రూపం, హైదరాబాద్

సలహా: ఎలాగోలా మీ అమ్మగారిని ఒప్పించటమే శ్రేయస్కరం. మాత్రలతో ఫలితం కనిపించకపోవటం వల్లనే డాక్టర్ ఇన్సులిన్ సూచించి ఉంటారు. గ్లూకోజు నియంత్రణకు ఇదే మంచి మార్గం. లేకపోతే గుండె, కళ్లు, కిడ్నీల వంటి కీలక అవయవాలు దెబ్బతినే ప్రమాదముంది. మధుమేహానికి వాడే గ్లిఫ్లోజైన్, గ్లిప్టిన్, గ్లుటైడ్ల వంటి మందులు పరోక్షంగా రక్తంలో గ్లూకోజు తగ్గేలా చేస్తాయి. ప్రత్యక్షంగా తగ్గించేది ఇన్సులిన్ ఒక్కటే. మధుమేహ మందులన్నీ క్లోమగ్రంథి నుంచి ఇన్సులిన్ వేగంగా విడుదలయ్యేలా చేయటం లేదా ఇన్సులిన్‌కు కణాలు స్పందించే స్వభావాన్ని పెంచటం ద్వారా గ్లూకోజు తగ్గటానికి తోడ్పడతాయి. అదే నేరుగా ఇన్సులిన్ తీసుకుంటే ఎక్కువ ఫలితం కనిపిస్తుంది కదా. ఇది కణాల చుట్టూరా ఉండే ద్రవంలో కలిసి నేరుగా ప్రభావం చూపుతుంది. కాకపోతే దీన్ని ఇంజెక్షన్ రూపంలో తీసుకోవాల్సి రావటమే సమస్య. రోజుకు రెండు సార్లయినా తీసుకోవాల్సి ఉంటుంది. దీనికే చాలామంది భయపడుతుంటారు. సూది గుచ్చుకుంటే నొప్పి పుడుతుందని వెనకాడుతుంటారు. నిజానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ సూది చిన్నగా, సన్నగా ఉంటుంది. ఇప్పుడు కొత్తరకం సూదులు చాలా వచ్చాయి. 28 నుంచి 32 నంబరు వరకూ ఉన్నాయి. నంబరు ఎంత పెరిగితే అంత సన్నవని చెప్పుకోవచ్చు. సూదుల మీద సిలికాన్ పూత ఉండటం వల్ల నునుపుగా, మెత్తగానూ ఉంటాయి. ఇవి 4 మి.మీ. నుంచి 12 మి.మీ. పొడవే ఉంటాయి. అందువల్ల ఎంత గట్టిగా గుచ్చినా కండరం, ఎముకకు తాకవు. చర్మం పైపొరకే పరిమితమవుతాయి. గుచ్చుకున్న సంగతీ పెద్దగా



తెలియదు. చీమ కుట్టినట్టు అనిపించొచ్చు. కడుపు వద్ద అయితే అసలు సూది తీసుకున్నట్టయినా తెలియదు. మన భారతీయుల్లో తొడ, భుజం వద్ద కొవ్వు పదార్థం తక్కువ. స్పర్శజ్ఞానం ఎక్కువ. అందువల్ల సూదిని పొడిచినప్పుడు కండరం, నాడులు తగులుతాయి. కండరంలోకి ఇన్సులిన్ వెళ్తే కరిగిపోయి, తక్కువసేపే పనిచేస్తుంది. సూది నాడులకు తగిలితే గుచ్చుకున్నట్టు తెలుస్తుంది. అదే పొట్ట భాగంలోనైతే కొవ్వు ఎక్కువగా ఉంటుంది. స్పర్శను తెలియజేసే నాడుల చివర్లు అంతగా ఉండవు. కాబట్టి సూదిని గుచ్చినా పెద్దగా తెలియదు. పొట్ట మీద రెండు వేళ్లతో చర్మాన్ని పట్టి, నొక్కినప్పుడు మధ్య భాగం తాత్కాలికంగా మొద్దుబారుతుంది. అక్కడ స్పర్శ తెలియదు. సూది గుచ్చుకున్నట్టు అనిపించదు. మీ అమ్మగారిని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే ఇంజెక్షన్ ఇచ్చి చూపుతారు. ఎలా తీసుకోవాలో నేర్పిస్తారు. కాబట్టి తానే తీసుకోవటానికి అంగీకరించొచ్చు.

- నడుం చుట్టూ ఉండే చర్మం పొర, పిరుదులకూ ఇన్సులిన్ తీసుకోవచ్చు. కాకపోతే దీనికి ఇతరుల సాయం కావాలి. ఇంజెక్షన్ తీసుకోవటానికి కష్టపడే పెద్దవాళ్లకిది అనువు కూడా. సూదిని చూడరు కాబట్టి పెద్దగా తెలియదు.
- సూదిని ఏటవాలుగా గుచ్చితే నొప్పి పుడుతుంది. కాబట్టి నిట్ట నిలువుగా (90 డిగ్రీల కోణంలో) గుచ్చాలి. ఒక సూదిని మూడు రోజుల వరకూ లేదా సిలికాన్ పూత గరుకుగా అయ్యేంతవరకూ వాడుకోవచ్చు. ఎవరి సూదిని వారే వాడుకుంటారు కాబట్టి దాన్ని స్పిరిట్‌తో గానీ వేడి నీటితో గానీ శుభ్రం చేయొద్దు. అలా చేస్తే సిలికాన్ పూత కరిగిపోతుంది. అలాగే వేలితో అంటుకోకూడదు, కింద పడేయకూడదు. ఇంజెక్షన్ తీసుకున్నాక సూదిని దాని గొట్టంలో జాగ్రత్తగా పెట్టి, భద్రపరచుకోవాలి. ఇంజెక్షన్ తీసుకున్నాక రుద్దకూడదు. రుద్దితే ఇన్సులిన్ త్వరగా లోపలికి వెళ్తుంది. ఒకవేళ రక్తం చుక్క వస్తే దూదితో అద్దితే సరిపోతుంది.
- ఎప్పుడూ ఒకటే చోట కాకుండా వేర్వేరు చోట్ల ఇంజెక్షన్ తీసుకోవాలి. ఒకటే చోట ఎక్కువసార్లు తీసుకుంటే అక్కడ కొవ్వు పదార్థం పెరిగి, కాయలా తయారవుతుంది.



- డా॥ పి.వి.రావు,
మధుమేహ నిపుణులు


మీ సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

పంటికి ఎముక దన్ను

ప్రమాదమో, చిగుళ్ల ఇన్‌ఫెక్షనో, వయసు మీద పడటంతో పట్టు సడలటమో.. కారణమేదైనా దంతాలు ఊడిపోవటం తరచూ చూస్తుంటాం. కృత్రిమ దంతాల (ఇంప్లాంట్స్) పుణ్యమాని ఇప్పుడు బోసి నోళ్లు తిరిగి పంటి సిరితో కళకళలాడుతున్నాయి. ఒకప్పుడు సంక్లిష్టమైన ప్రక్రియగా భావించిన వీటి అమరిక రోజురోజుకీ తేలికైన, చవకైన, చిన్నకోతతోనే చేయగల చికిత్సగా మారిపోతోంది. అయితే దీనికి ఎముక దన్ను చాలా కీలకం. లేకపోతే పట్టు తప్పుతుంది. మరెలా? ఇలాంటి పరిస్థితుల్లో ఎముక మార్పిడి (బోన్ గ్రాఫ్టింగ్) ప్రక్రియ ఎంతగానో ఆదుకుంటోంది.



నేల గట్టిగా ఉంటేనే చెట్టు దృఢంగా నిలుస్తుంది. మట్టిలోకి వేళ్లు బలంగా పాతుకుంటాయి. తుపాన్లు వచ్చినా కూలిపోవు. దంతాలు కూడా అంతే. దవడ ఎముక బలంగా ఉంటేనే పళ్లు దృఢంగా ఉంటాయి. సహజ దంతాలకే కాదు కృత్రిమ దంతాలకూ ఇది వర్తిస్తుంది. ఇవి స్థిరంగా నిలవటానికి తగినంత ఎముక ఉండటం తప్పనిసరి. సాధారణంగా దంతాలతో కొరకటం, నమలటం వంటి పనులతో కింద ఉండే ఎముక మీద ఒత్తిడి పడుతుంది. దీని మూలంగా కొత్త ఎముక ఏర్పడుతూ వస్తుంది. ఎముక మోతాదు తగ్గకుండా, కొనసాగుతూ వస్తుంది. కానీ ఏ కారణంతోనైనా పన్ను ఊడిపోతే ఎముక మీద ఎలాంటి ఒత్తిడీ పడదు. అప్పుడు ఎముక కరగటం మొదలవుతుంది. తొలి మూడు నెలల్లోనే 50% ఎముక క్షీణిస్తుంది! అందుకే పన్ను ఊడిన వెంటనే ఇంప్లాంట్ అమర్చటం మంచిదని భావిస్తుంటారు. ఆలస్యమైనకొద్దీ ఎముక కరిగి, ఇంప్లాంట్ అమర్చటమూ కష్టమవుతుంది. ఒకవేళ అమర్చినా కుదురుగా ఉండకపోవచ్చు. ఒకప్పుడు దీని విషయంలో పెద్దగా చేయగలిగిందేమీ ఉండేది కాదు. ఎముక మార్పిడి ప్రక్రియ రావటంతో అసాధ్యమనుకున్న ఇంప్లాంట్స్‌నూ అమర్చటం సాధ్యమవుతోంది. తగినంత సహజ ఎముక లేనప్పుడు ఇది ఎముక ఆకృతిని తిరిగి నిర్మించటానికి, ఇంప్లాంట్ కుదురుగా ఉండటానికి బలమైన పునాదిగా నిలుస్తుంది. ఎముక మార్పిడిలో సాధారణంగా శరీరంలోని ఇతర భాగాల నుంచి కొంత ఎముకను తీసుకొచ్చి అతికిస్తుంటారు (ఆటోగ్రాఫ్ట్). ఇది సహజమైంది కాబట్టి బాగా కుదురుకుంటుంది. అందుకే దీన్ని ఉత్తమమైందని, ప్రామాణికమైందని భావిస్తారు. అయితే రెండు సార్లు సర్జరీ చేయాల్సి రావటం, అసౌకర్యం కలగటం వంటి ఇబ్బందులు ఉండొచ్చు. కొందరికి ఆయా భాగాల్లో తగినంత ఎముక అందుబాటులో లేకపోవచ్చు కూడా. అలాంటప్పుడు జీవన్మృతుల నుంచి (ఆలోగ్రాఫ్ట్), ఆవు వంటి జంతువుల నుంచి (జెనోగ్రాఫ్ట్) సేకరించిన ఎముకనూ వాడుకోవచ్చు. ఇప్పుడు ప్రయోగశాలలో తయారైన కృత్రిమ ఎముక (సింథటిక్ గ్రాఫ్ట్) కూడా ఉంది. ఇది గూడులాగా దన్నుగా నిలుస్తుంది. దీనిలోకి రక్తం చేరుకొని, క్రమంగా దాని చుట్టూ కొత్త ఎముక ఏర్పడుతుంది. అందువల్ల ఒకరకంగా దీన్ని సహజ ఎముకనే అనుకోవచ్చు.



డా॥ ఎం.వికాస్ గౌడ్
డెంటల్ సర్జన్
డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్
బంజారాహిల్స్
హైదరాబాద్

పద్ధతులు రకరకాలు

బోన్ గ్రాఫ్టింగ్‌లో చాలా పద్ధతులే ఉన్నాయి. ఆయా అవసరాలకు అనుగుణంగా వీటిని ఎంచుకుంటారు. ప్రధానంగా నాలుగు రకాల పద్ధతుల గురించి చెప్పుకోవాల్సి ఉంటుంది.

గైడెడ్ బోన్ రీజనరేషన్: ఎముకలో లోపాలను సరిచేయటానికి, దంతం కుదురుగా ఉండటానికిది తోడ్పడుతుంది. ఇన్‌ఫెక్షన్ మూలంగా క్షీణించినప్పుడు ఎముకను మొత్తం శుభ్రం చేసి, అక్కడ వేరే చోటు నుంచి ఎముకను తీసుకొచ్చి పెడతారు. దీనిపై ప్రత్యేక రక్షణ పొరనూ పెట్టి, కుట్టేస్తారు. చిగురు, అనుసంధాన కణజాలం వంటివి ఎముక కన్నా త్వరగా వృద్ధి చెందుతాయి. ఇవి అతికించిన ఎముకలోకి చొచ్చుకురాకుండా ఈ రక్షణ పొర అడ్డుకుంటుంది. దీంతో ఎముక స్థిరంగా ఏర్పడుతుంది.

రిడ్జ్ స్ప్లిట్ ప్రక్రియ: దవడ ఎముక మీది గట్టు చాలా ఇరుకుగా ఉన్నప్పుడు దీన్ని చేస్తారు. ఇందులో ఎముకను చీల్చి, అటూ ఇటూ సంగ్రహించిన ఎముకను పెడతారు. దీంతో అది గట్టిపడి, వెడల్పు అవుతుంది. ఫలితంగా ఇంప్లాంట్ అమర్చటం తేలికవుతుంది. అది స్థిరంగానూ ఉంటుంది.

సైనస్ అగ్మెంటేషన్: ముక్కు చుట్టుపక్కల గాలిగదులుంటాయి. వీటికి నోటి పైభాగంలోని వెనక దంతాలు దన్నుగా నిలుస్తాయి. ఒకవేళ పన్ను ఊడిపోతే గాలి గదులు కిందికి జారి, దంత మూలంలోకి చొచ్చుకొస్తాయి. ఇంప్లాంట్ అమర్చటానికి తగినంత ఎముక ఉండదు. అందువల్ల గాలిగదులను పైకి లేపాల్సి ఉంటుంది. ముందుగా చిగురును కొద్దిగా కోసి, దవడ ఎముకలో చిన్న రంధ్రం చేస్తారు. కత్తిరించిన ముక్కను గాలిగదుల్లోకి పైకి నెడతారు. ఆ వెంటనే ఖాళీ భాగంలో ఎముక పదార్థాన్ని కూరుస్తారు. తర్వాత దానిలో ఇంప్లాంట్ అమరుస్తారు. కొందరికి వెంటనే ఇంప్లాంట్ అమర్చొచ్చు, కొందరికి కొంత కాలం తర్వాత చేయొచ్చు.

బ్లాక్ గ్రాఫ్ట్: దీన్ని పెద్ద ఎముక మార్పిడి అనుకోవచ్చు. ఎక్కువ భాగంలో ఎముక క్షీణిస్తే ఇది ఉపయోగపడుతుంది. ఇందులో సాధారణంగా శరీరంలోని ఇతర భాగాల నుంచి కాస్త పెద్దమొత్తంలో ఎముకను తెచ్చి, స్క్రూల సాయంతో బిగిస్తారు. క్రమంగా అది కుదురుకొని, స్థిరపడుతుంది.

ప్రయోజనాలు ఇవీ..

చిన్నకోతతోనే: జంతువుల, కృత్రిమ ఎముక పదార్థాలతో ఇంప్లాంట్ అమర్చటం చాలా తేలిక. స్వల్ప లోపాలను చిన్న కోతతోనే బాగు చేయొచ్చు. ఎముక ఎలా కుదురుకుంటుందో ముందే బాగా అంచనా వేయొచ్చు కూడా.

మంచి ఫలితాలు: శరీరానికి సరిపడిన పదార్థాలు త్వరగా కుదురుకుంటాయి. ఎముక తిరిగి బాగా వృద్ధి చెందుతుంది. ఇంప్లాంట్ విజయవంతమయ్యే అవకాశాలూ ఎక్కువగానే ఉంటాయి. ఇంప్లాంట్ అమర్చేటప్పుడే ఎముక మార్పిడి చేయటం వల్ల రెండు పనులూ ఒకేసారి పూర్తవుతాయి. ఇంప్లాంట్ కుదురుకోవటానికి, కొత్త ఎముక ఏర్పడటానికి తగినంత సమయం లభిస్తుంది. రెండూ ఒకేసారి కుదురుకుంటాయి.

ఎక్కువ మందికి ఉపయోగం: ఒకప్పుడు తగినంత ఎముక లేకపోతే కృత్రిమ దంతం అమర్చటం సాధ్యం కాదని తేల్చేసేవారు. ఇప్పుడు ఎముక మార్పిడి, కొత్త పద్ధతుల రాకతో సురక్షితంగా చేయటం సాధ్యమవుతుంది. దీంతో ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుతోంది.

జాగ్రత్తలు అవసరం

ఎముక అంటుకట్టి, ఇంప్లాంట్ అమర్చిన తర్వాత ప్రత్యేక జాగ్రత్తలేమీ అవసరం లేదు గానీ నోరు శుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యం. తిరిగి చిగుళ్ల ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా చూసుకోవాలి. పొగ తాగే అలవాటుంటే మానెయ్యాలి. అరుదుగా కొందరిలో జంతు, కృత్రిమ ఎముకలను శరీరం ఎముకను తిరస్కరించొచ్చు. అప్పుడు దాన్ని శుభ్రం చేసి, తీసేస్తే సరిపోతుంది.

తీపితో పీడ కలలు!

పీడ కలలతో బాధపడుతున్నారా? అయితే పడుకునే ముందు పాల పదార్థాలు.. కేకులు, బిస్కట్లు, ఐస్‌క్రీముల వంటి తీపి పదార్థాలు తింటున్నారేమో చూసుకోండి. కొందరిలో ఇవి చెడు కలలకు దారితీస్తున్నట్టు బయటపడింది మరి. పీడకలల విషయంలో తీపి పదార్థాల అనంతరం పాల ఉత్పత్తులు రెండో స్థానాన్ని ఆక్రమిస్తున్నట్టు గుర్తించారు. ఎందుకిలా? ఆహార అలర్జీలు లేదా లాక్టోజ్ పడకపోవటం ప్రధానంగా కారణమవుతున్నాయని చెబుతున్నారు. రాత్రిపూట ఆలస్యంగా తినటం, ఆకలిని పట్టించుకోకపోవటం వంటి అనారోగ్యకర అలవాట్లతో పీడకలలు, చెడు కలలు మరింత ఎక్కువగా వస్తున్నట్టూ తేలింది.

గాలి కాలుష్యంతో ఊపిరితిత్తి క్యాన్సర్

ఊపిరితిత్తి క్యాన్సర్‌ను పొగతాగేవారిలో వచ్చే జబ్బుగానే చాలాకాలంగా భావిస్తున్నారు. కానీ ఇదిప్పుడు పొగ అలవాటులేని వారిలోనూ ఎక్కువవుతోంది. దీనికి గాలి కాలుష్యం, ఇతరత్రా పర్యావరణ అంశాలు దోహదం చేస్తున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా తాజా అధ్యయనంలో బయటపడింది.



ఊపిరితిత్తి క్యాన్సర్‌తో ముడిపడిన డీఎన్ఏ మార్పులకూ ఆరుబయట నుసి పదార్థ ప్రభావానికీ బలమైన సంబంధం ఉంటున్నట్టు విస్తృత జన్యు అధ్యయనంలో తేలింది. అలాగని వాయు కాలుష్యంతో నేరుగా ఊపిరితిత్తి క్యాన్సర్ వస్తుందని కాదు. కానీ క్యాన్సర్ తలెత్తటానికిది దోహదం చేస్తున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ఎంత ఎక్కువగా వాయు కాలుష్యానికి గురైతే అంత ఎక్కువగా ఊపిరితిత్తి కణితి డీఎన్ఏలో మార్పులు తలెత్తుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. పొగ తాగటంతో ముడిపడిన డీఎన్ఏ మార్పులే వాయు కాలుష్య ప్రభావంతోనూ తలెత్తుతుండటం గమనార్హం. వాయు కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లో నివసించే వారిలో టీపీ53, ఈజీఎఫ్ఆర్ మార్పులు మరింత ఎక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. ఊపిరితిత్తి క్యాన్సర్‌కు సంకేతాలైన ఇవి ఎస్‌బీఎస్4 డీఎన్ఏ మార్పులతో ప్రేరేపితమవుతుంటాయి. వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే చోట్ల నివసించేవారిలో ఎస్‌బీఎస్4 ముద్రలు నాలుగు రెట్లు అధికంగా ఉంటున్నట్టు బయటపడింది. నిజానికి ఊపిరితిత్తి క్యాన్సర్‌కు వాయు కాలుష్యం దోహదం చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు చాలాకాలంగా భావిస్తున్నారు. కానీ పొగ తాగటం, ఇతరులు వదిలిన పొగతో పోలిస్తే గాలిలోని నుసి పదార్థం ఎంతవరకూ దోహదం చేస్తోందనేది కచ్చితంగా తెలియదు. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం జన్యు మార్పుల ఆధారంగా వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టింది.

క్యాన్సర్‌ను పట్టుకోండి!

శరీరం మాట్లాడుతుంది. శ్రద్ధగా వినండి. అలసత్వం వద్దు. జబ్బులను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. క్యాన్సర్ విషయంలో ఇది మరింత ముఖ్యం. అలాంటి నిర్లక్ష్యం చేయకూడని కొన్ని క్యాన్సర్ లక్షణాలు ఇవిగో..

- ఆహార, వ్యాయామ నియమాలేవీ పాటించకుండా.. అకారణంగా బరువు తగ్గుతుంటే క్లోమ, జీర్ణాశయ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్ కారణం కావొచ్చు.
- విడవకుండా అలసట వేధిస్తుంటే.. విశ్రాంతి తీసుకున్న తర్వాతా నిస్సత్తువ వీడకపోతే రక్త, ఎముకమజ్జ క్యాన్సర్లను అనుమానించాల్సిందే. ఇలాంటి క్యాన్సర్లు ఒంట్లో శక్తిని త్వరగా హరించేస్తుంటాయి.
- కారణమేదీ తెలియకుండా తరచూ జ్వరం వస్తున్నట్టయితే రక్తక్యాన్సర్, లింఫోమా, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేసే ఇతరత్రా క్యాన్సర్లకు సంకేతం కావొచ్చు.
- మూడు నెలలు దాటినా దగ్గు తగ్గకపోవటం, కళ్లెలో రక్తం పడటం, గొంతు బొంగురు పోవటం వంటివి ఊపిరితిత్తి, గొంతు లేదా తల, మెడ క్యాన్సర్లలో కనిపిస్తుంటాయి.
- కొద్దిపాటి పనికే ఆయాసం, ఛాతీ బిగపట్టినట్టు అనిపించటం ఊపిరితిత్తి క్యాన్సర్, ఊపిరితిత్తి ధమనుల్లో అడ్డంకి, ఇతర అవయవాల క్యాన్సర్ ఊపిరితిత్తి చేరుకోవటానికి హెచ్చరిక అయ్యిండొచ్చు.



- హఠాత్తుగా చూపు మసకబారటం, ఒకటికి రెండు కనిపించటం, కళ్ల ముందు మిరుమిట్లు గొలపటం వంటివి మెదడు, కళ్ల క్యాన్సర్ల లక్షణాలు కావొచ్చు. వీటికి మధుమేహమూ దోహదం చేస్తుండొచ్చు. మధుమేహం క్లోమ క్యాన్సర్ ఉద్ధృతం చేస్తుంది మరి.
- దీర్ఘకాలంగా అజీర్ణం, ఛాతీలో మంట, ముద్ద సరిగా కిందికి దిగకపోవటం, కడుపుబ్బరం వంటివి అన్నవాహిక, జీర్ణాశయం, క్లోమ క్యాన్సర్లలో పొడసూపుతుంటాయి. హఠాత్తుగా, అకారణంగా ఆకలి తగ్గటం కూడా హెచ్చరిక సంకేతమే.
- మలంలో లేదా మూత్రంలో రక్తం పడటం పెద్దపేగు, మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లలో కనిపిస్తుంది.
- హఠాత్తుగా, అతి తీవ్రంగా జీవితంలో ముందెన్నడూ ఎరుగని విధంగా తలనొప్పి వేధిస్తుంటే.. ముఖ్యంగా వికారం, వాంతి, తల తేలిపోవటం లేదా నాడీ సంబంధ లక్షణాలూ కనిపిస్తుంటే మెదడు కణితి కారణం కావొచ్చు. ఇతర చోట్ల నుంచి క్యాన్సర్ మెదడులోకి వ్యాపించినా ఇలాగే ఉండొచ్చు. ముఖం, చేతులు, కాళ్లు హఠాత్తుగా మొద్దుబారినట్టు అనిపించినా దీన్ని అనుమానించాలి.
- దీర్ఘకాల లేదా అకారణ నొప్పులనూ విస్మరించొద్దు. ముఖ్యంగా ఎముకలు, కీళ్లలో నొప్పి వస్తుంటే తాత్సారం చేయొద్దు. ఇతర భాగాల నుంచి ఎముకల వంటి అవయవాలకు విస్తరించే క్యాన్సర్లలో ఇలాంటి నొప్పులు కనిపిస్తుంటాయి.
- కొత్త పుట్టుమచ్చలు రావటం లేదా అప్పటికే ఉన్నవి రంగు, సైజు, ఆకారం మారటం.. పుండ్లు మానకపోవటం మెలనోమా వంటి చర్మక్యాన్సర్లకు సంకేతాలు కావొచ్చు.

నెలసరి ఆహారం!

కొందరు మహిళలు నెలసరి వచ్చినప్పుడు ఉప్పు, చక్కెరతో కూడిన చిరుతిళ్లు ఎక్కువగా తినేస్తుంటారు. కానీ వీటి కన్నా ఐరన్, యాంటీఆక్సిడెంట్లు, పీచు లభించే పదార్థాలు తినటం మంచిది. నిజానికి ఇలాంటివి ఎప్పుడు తిన్నా మంచిదే గానీ నెలసరి సమయంలో తింటే మరింత మేలు. ఇవి నీరసం ఆవహించకుండా, అధికంగా ఉన్న ఈస్ట్రోజన్‌ను శరీరం మరింతగా శోషించుకునేలా, వాపు ప్రక్రియ తగ్గేలా చేస్తాయి.



- కోడి మాంసం, గుడ్లు, బఠానీలు, బీన్స్, పప్పులు, టోఫు, అంజీరా, ఎండుద్రాక్ష, బ్రోకలీ, ఆకుకూరలు, పిస్తా, గుమ్మడి విత్తనాల్లో ఐరన్ దండిగా ఉంటుంది. ఇది ఎర్ర రక్తకణాలు ఏర్పడటానికి, నెలసరి సమయంలో కోల్పోయిన రక్తం భర్తీ కావటానికి తోడ్పడుతుంది. ఆరోగ్యంగా, హాయిగా ఉండేలా చేస్తుంది.



- చిలగడ దుంప, పంపర పనస, స్ట్రాబెర్రీ, కర్బూజా, యాప్రికాట్, బ్రోకలీ, ఆకుకూరలు, నిమ్మకాయ, నారింజ, బత్తాయి వంటి వాటితో యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి వాపు ప్రక్రియను తగ్గించటం ద్వారా పొత్తి కడుపు నొప్పి, కడుపుబ్బరం వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు మూడ్‌నూ మెరుగు పరుస్తాయి.



- శరీరంలో అధికంగా ఉండే ఈస్ట్రోజన్‌ను తగ్గించే పదార్థాలు.. ముఖ్యంగా పీచు పదార్థాలు తినటం నెలసరి సమయంలో చాలా మేలు చేస్తుంది. కొన్నిరకాల నూనెలు, మాంసంలో ఈస్ట్రోజన్ ఉంటుంది. ఇది గర్భాశయం గోడను మందంగా చేయటం వల్ల నొప్పి తలెత్తుతుంది. పీచు పదార్థాలతో దీన్ని నిలువరించొచ్చు. ఎందుకంటే పీచుతో మల విసర్జన సాఫీగా అవుతుంది. మలంతో పాటు ఈస్ట్రోజన్ కూడా బయటకు పోతుంది. తవుడుతో కూడిన నిండు గింజ ధాన్యాలు, పప్పులు, ఎండు పప్పులు, పండ్లు, గోబీపువ్వు వంటి కూరగాయలు, క్యారెట్, యాపిల్స్‌తో పీచు దండిగా లభిస్తుంది.
- అలాగే నీరు కూడా తగినంత తాగాలి. టమోటాలు, పుచ్చకాయ వంటి వాటితోనూ నీరు అందుతుంది.



శరీరం కూర్చోవటానికి కాదు

కంప్యూటర్ల ముందు కూలబడతాం. ల్యాప్‌టాప్‌లో ఒడిలో పెట్టుకొని చూస్తుంటాం. మొబైల్ ఫోన్లలో తల దూర్చకుండా ఒక్క నిమిషమైనా ఉండలేం. ఇలా ఆధునిక డిజిటల్ ప్రపంచం మనిషిని, పనులను పూర్తిగా మార్చేసింది. అన్నింటికీ పరికరాలే ఆధారం. గంటలకొద్దీ కూర్చోవటమే పని. దుస్తులు ఉతకటం, ఇల్లు ఊడ్చటం వంటి వాటికీ యంత్రాలే శరణ్యమవుతున్నాయి. సరుకులు కొనుక్కొని రావటానికీ గడప దాటాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే వచ్చేస్తాయి. ఒకవేళ బయటకు వెళ్లినా వాహనాల మీదే ప్రయాణం. మొత్తంగా మనిషి నడవటమే మరచిపోతున్నాడు. ఇది ఆరోగ్యాన్ని గణనీయంగా దెబ్బతీస్తోందన్న సంగతిని విస్మరిస్తున్నాడు..

నిజానికి మన శరీరం కూర్చోవటానికి తయారైంది కాదు. నిటారుగా నిల్చోవటానికి, నడవటానికి, పరుగెత్తటానికి, గుంజీలు తీయటానికి, తరచూ కదలటానికి అనుగుణంగానే పరిణామం చెందింది. సుదీర్ఘంగా కూర్చోవటం మన సహజ భంగిమ కానే కాదు. కూర్చున్నప్పుడు మన తుంట్లు, మోకాళ్లు, మడమలు అదేపనిగా వంగిన స్థితిలో ఉంటాయి. ఇది రక్తప్రసరణ తగ్గటానికి దారితీస్తుంది. వెన్నెముకకు దన్నుగా నిలిచే వీపు, పిరుదుల కండరాల వంటివి క్రమంగా, చడీచప్పుడు చేయకుండా బలహీనమవుతాయి. గమనించాల్సిన విషయం ఏంటంటే- ఎక్కువసేపు కూర్చోవటం వల్ల తలెత్తే ప్రభావాలు వెంటనే కనిపించకపోవటం. ఇవి నెమ్మదిగా పొడసూపుతాయి. మొదట్లో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ క్రమంగా బలహీనత, ఒత్తిడీ పెరిగిపోయి నడుం, మెడ, భుజాల నొప్పితో బయటపడుతుంది. మోకాళ్లు, తొడ నొప్పులూ బయలుదేరొచ్చు. రక్త ప్రసరణ లోపించటం, నాడులు నొక్కుకుపోవటం వల్ల కొందరికి కాళ్లు, పాదాలు మొద్దుబారొచ్చు, సూదులు పొడుస్తున్నట్టు అనిపించొచ్చు. దురదృష్టం కొద్దీ చాలామంది వీటిని పెద్దగా పట్టించుకోరు. వయసు మీద పడటం, బరువు పెరగటం, ఇతరత్రా జబ్బుల లక్షణాలుగానూ భావిస్తుంటారు.

జబ్బుల ముప్పులూ

కదలకుండా ఉండిపోవటం కండరాలు, కీళ్ల మీదే కాదు. ఇతరత్రా అంశాల పైనా ప్రభావం చూపుతుంది. జీవక్రియలు నెమ్మదిస్తాయి. బరువు, రక్తపోటు పెరుగుతాయి. మధుమేహం, గుండెజబ్బు వంటి దీర్ఘకాల సమస్యల ముప్పునూ పెంచుతుంది. కొన్ని రకాల క్యాన్సర్ల బారినపడే అవకాశమూ ఉంది. మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటుంది. బద్ధకంగా ఉండిపోయేవారిలో ఆందోళన, కుంగుబాటు ఎక్కువగా కనిపిస్తుండటమే దీనికి నిదర్శనం.

ఏం చేయాలి?

సమస్య గురించి తెలిస్తే పరిష్కారమూ కనిపించినట్టే. కాకపోతే గుర్తించటమే కావాలి. ఎక్కువసేపు కూర్చోవటం వల్ల తలెత్తే అనర్థాలను తగ్గించుకోవటానికీ ఇదే వర్తిస్తుంది. మనసుంటే మార్గం అదే దొరుకుతుంది. ఇది అంత కష్టమైందేమీ కాదు కూడా.

కదలటం ముఖ్యం

రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాల సేపు ఒకింత తీవ్రమైన ఏరోబిక్ వ్యాయామాలు చేయటం మంచిదన్నది నిపుణుల సూచన. వేగంగా నడవటం, పరుగెత్తటం, సైకిల్ తొక్కటం, ఈత కొట్టటం, డ్యాన్స్ వంటివేవైనా చేయొచ్చు. ఒకవేళ ఇవి మొదట్లో కష్టంగా అనిపిస్తే రెండు, మూడు దఫాలుగా విభజించుకోవచ్చు. ప్రతి గంటకు ఐదు నిమిషాల సేపు నడిచినా మంచి మార్పు కనిపిస్తుంది. మొత్తమ్మీద వారానికి కనీసం 150 నిమిషాలు నడిచేలా చూసుకోవాలి.

నిటారు డెస్కులు

డెస్క్ ఉద్యోగాలు చేసేవారు ప్రతి అరగంటకో, గంటకో ఓసారి లేచి నిల్చోవాలి. ఒంటిని సాగదీయాలి. ఆఫీసులో అటూఇటూ కాసేపు నడవాలి. వీలుంటే ఆఫీసు బయట పరుగెత్తొచ్చు కూడా. శరీరాన్ని అటూ ఇటూ వంచటం, గుంజీలు తీయటమూ చేయొచ్చు. నిల్చొని పనిచేసే డెస్కులు ఉంటే ఇంకా మంచిది. కాసేపు నిల్చొని, కాసేపు కూర్చొని పనులు చేసుకోవచ్చు.

ఇంటి పనులతో

ఇంట్లోనూ వీలైనంతవరకూ ఎవరి పనులు వాళ్లే చేసుకోవటానికి ప్రయత్నించాలి. నిల్చొని వంట చేయొచ్చు, పాత్రలు తోమొచ్చు. వంగి ఇల్లు ఊడ్చొచ్చు, దుస్తులు ఉతకొచ్చు. దగ్గరలోని దుకాణాలకు వెళ్లేటప్పుడు వాహనాలకు బదులు నడిచి వెళ్లొచ్చు. నడుస్తూ ఫోన్ మాట్లాడటం, టీవీ చూస్తున్నప్పుడు ఒళ్లు విరుచుకోవటం వంటి తేలికైన మార్పులూ మంచి ఫలితం చూపిస్తాయి.

ఆరుబయట ఆటలు


చిన్న పిల్లలను, యుక్తవయసువారిని ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. మొబైల్ ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, టీవీలు చూసే సమయాన్ని పరిమితం చేయాలి. వారంలో ఒక గంటే దీనికి కేటాయించాలని కొన్ని దేశాలు సూచిస్తున్నాయి. కొన్నిదేశాలైతే 16 ఏళ్ల లోపువారికి ఫోన్ వాడకాన్ని పరిమితం చేయాలనీ చెబుతున్నాయి.

ఏ వయసువారైనా

వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా గానీ ఒకేసారి గంట కన్నా ఎక్కువసేపు కూర్చోవటం తగదు. వృద్ధులు తేలికైన యోగాసనాలు, నెమ్మదిగా నడవటం వంటి వాటిని ప్రయత్నించొచ్చు. కండరాలు బలంగా ఉండటానికి, సాఫీగా కదలటానికి తోడ్పడతాయి.

అవగాహనతో మెలగాలి

ఎవరికైనా కూర్చోకుండా ఉండటం సాధ్యం కాదు. కానీ ఎంతసేపు కూర్చుంటున్నామనేది గ్రహించుకోవాలి. ఎక్కువసేపు కూర్చోవాల్సి వస్తే మధ్యమధ్యలో లేచేలా చూసుకోవాలి. కదలిక అనేది ఐచ్ఛికం కాదు. తప్పనిసరి. అన్ని వయసుల్లోనూ, జీవితంలో అన్ని దశల్లోనూ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికిది కీలకం. మొత్తమ్మీద దీనిపై అవగాహన అవసరం.



కాంతి ఒక శక్తి రూపం. ఇది మానవుడు, ఇతర జీవులు వస్తువులను చూడటానికి వీలు కల్పిస్తుంది. కాంతి విద్యుదయస్కాంత వికిరణం. దీని ప్రసారానికి యానకం అవసరం లేదు. కాంతి తరంగం, కణం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తుంది. కాంతి కణాల రూపంలో ప్రయాణిస్తుందని న్యూటన్ ప్రతిపాదించగా, తరంగాల రూపంలో ప్రయాణిస్తుందని హైగెన్స్ తెలిపారు. కాంతి చిన్నచిన్న శక్తి ప్యాకెట్ల రూపంలో ప్రయాణిస్తుందని మాక్స్ ప్లాంక్ ప్రతిపాదించారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

సరళరేఖలో ప్రయాణం..
శూన్యంలో అధిక వేగం!

కాంతి

ఆప్టిక్స్ (కాంతి శాస్త్రం)

కాంతి ప్రసారం, స్వభావం, ప్రవర్తనను అధ్యయనం చేసే భౌతికశాస్త్ర శాఖను కాంతి శాస్త్రం లేక దృశా శాస్త్రం అంటారు. కాంతిని ఇచ్చే వస్తువును కాంతి జనకం అంటారు. కాంతి కిరణాలు ఎల్లప్పుడూ సరళరేఖలోనే ప్రయాణిస్తాయి. కాంతి గాలి లేదా శూన్యంలో దాదాపు 3×10^8 మీ./సె. వేగంతో ప్రయాణిస్తుంది.

✦ కాంతి అత్యంత తేలికైన ఫోటాన్ కణాలతో తయారైందని ఆధునిక సిద్ధాంతాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుత సిద్ధాంతాల ప్రకారం ఏ పదార్థ కణాలైనా కాంతి కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించలేవు.

రకాలు

✦ కాంతి దృష్ట్యా వస్తువులు రెండు రకాలు. అవి.

స్వయం ప్రకాశకాలు: స్వయంగా కాంతిని విడుదల చేసే వాటిని స్వయం ప్రకాశకాలు అంటారు.

ఉదా: సూర్యుడు, మిణుగురు పురుగు

అస్వయం ప్రకాశకాలు: ప్రకాశించని వస్తువులను అస్వయం ప్రకాశకాలు అంటారు. ఇవి వాటంతట అవి స్వయంగా కాంతిని విడుదల చేయవు, కానీ వాటిపై కాంతి పడినప్పుడు మాత్రమే కనిపిస్తాయి.

ఉదా: చంద్రుడు, భూమి, మనిషి, కాగితం మొదలైనవి.

❒ పతన కాంతిలో ఎక్కువ భాగాన్ని తమ ద్వారా ప్రయాణించడానికి అనుమతించే వాటిని పారదర్శక పదార్థాలు అంటారు.

ఉదా: గాజు, నీరు, గాలి

❒ పాక్షిక పారదర్శక పదార్థాలు కాంతిలో కొంత భాగాన్ని మాత్రమే వాటి ద్వారా ప్రయాణించడానికి అనుమతిస్తాయి. వీటి ద్వారా మనం స్పష్టంగా చూడలేం.

ఉదా: నూనె పూసిన కాగితం, పారాఫిన్ మైనం, నల్ల కళ్లజోళ్లు, X-కిరణాల ఫిల్మ్‌లు మొదలైనవి.

❒ అపారదర్శక పదార్థాలు తమ ద్వారా కాంతిని ప్రసరింపజేయవు. ఇవి వాటిపై పడే కాంతిని పరావర్తనం చెందిస్తాయి లేదా శోషించుకుంటాయి.

ఉదా: పుస్తకాలు, చెక్క, రాయి, రబ్బరు, చెట్లు.

కాంతి పరావర్తనం

✦ ఒక వస్తువుపై పతనమైన కాంతి అదే యానకం ద్వారా వెనక్కి తిరిగి ప్రయాణించడాన్ని కాంతి పరావర్తనం అంటారు.

✦ పతన కోణం i, పరావర్తన కోణం rకి సమానంగా ఉంటుంది.

✦ పతన కిరణం, కాంతి పతనమైన బిందువు వద్ద పరావర్తన తలానికి గీసిన లంబం, పరావర్తన కిరణం అన్నీ ఒకే తలంలో ఉంటాయి.

పుటాకార దర్పణం

గోళాకార అద్దం లోపలి ఉపరితలం నుంచి పరావర్తనం జరిగితే దాన్ని పుటాకార దర్పణం అంటారు.

ఉపయోగాలు: టార్చ్‌లైట్‌లు, సెర్చ్‌లైట్‌లు, వాహనాల హెడ్‌లైట్లలో వినియోగిస్తారు. ముఖానికి సంబంధించిన పెద్ద ప్రతిబింబాన్ని చూడటానికి, షేవింగ్ అద్దం మాదిరిగా ఉపయోగిస్తారు.

✦ దంతాల పెద్ద చిత్రాలను చూసేందుకు దంతవైద్యులు పుటాకార దర్పణం వినియోగిస్తారు.

✦ సౌర కొలిమిల్లో వేడిని ఉత్పత్తి చేయడానికి, సూర్యరశ్మిని కేంద్రీకరించడానికి పెద్ద పరిమాణంలో పుటాకార దర్పణం ఉపయోగిస్తారు. డిష్ యాంటెనా కూడా పుటాకార దర్పణంలా పని చేస్తుంది.

పుటాకార దర్పణం - వస్తువు, ప్రతిబింబ స్థానాలు

వస్తువు స్థానం	ప్రతిబింబ స్థానం	ప్రతిబింబ పరిమాణం	ప్రతిబింబ లక్షణం
అనంతదూరంలో	నాభి F వద్ద	చాలా చిన్నది, బిందురూపం	నిజ, తలకిందులు
Cకి అవతల	F, Cల మధ్య	చిన్నది	నిజ, తలకిందులు
C వద్ద	C వద్ద	సమాన పరిమాణం	నిజ, తలకిందులు
C, Fల మధ్య	Cకి అవతల	పెద్దది	నిజ, తలకిందులు
F వద్ద	అనంత దూరంలో	చాలా పెద్దది	నిజ, తలకిందులు
P, Fల మధ్య	దర్పణం వెనుక	పెద్దది	మిథ్యా, నిటారు

ప్రతిబింబాలు - వాటి లక్షణాలు

ఒక వస్తువు నుంచి పరావర్తనం చెందే కాంతి ద్వారా ప్రతిబింబం ఏర్పడుతుంది.

నిజ ప్రతిబింబం: కాంతి కిరణాలు వాస్తవంగా కలిసినప్పుడు ఏర్పడే దాన్ని నిజ ప్రతిబింబం అంటారు. దీన్ని తెరపై పట్టుకోవచ్చు. నిజ ప్రతిబింబం ఎల్లప్పుడు తలకిందులుగా ఉంటుంది. కేంద్రీకృత కాంతి పుంజం కారణంగా ఈ ప్రతిబింబం ఏర్పడుతుంది.

మిథ్యా ప్రతిబింబం: పొడిగించిన కాంతి కిరణాలు కలిసినట్లు కనిపించినప్పుడు ఏర్పడే ప్రతిబింబాన్ని మిథ్యా ప్రతిబింబం అంటారు.

❒ ఊహాత్మక కిరణాల కలయిక వల్ల ఏర్పడటంతో ఈ ప్రతిబింబాన్ని తెరపై పట్టుకోలేం. మిథ్యా ప్రతిబింబాలు ఎల్లప్పుడు నిటారుగా ఉంటాయి.

❒ వికేంద్రీకృత కాంతి కిరణపుంజం కారణంగా ఇలాంటి ప్రతిబింబం ఏర్పడుతుంది.

సమతల దర్పణం – ప్రతిబింబ లక్షణాలు:

❒ సిల్వర్ బ్రోమైడ్ పూత పూసిన సమతల గాజు ఫలకాన్ని సమతల దర్పణం అంటారు. సమతల దర్పణం ద్వారా ఏర్పడే ప్రతిబింబాలు మిథ్యా ప్రతిబింబాలై ఉంటాయి.

❒ ఇందులో పార్శ్వ విలోమం (ప్రతిబింబం కుడి ఎడమలు తారుమారవ్వడం) జరుగుతుంది. వస్తువు పరిమాణం, ప్రతిబింబ పరిమాణం సమానం. అంతేకాకుండా దర్పణం నుంచి వస్తువు దూరం, ప్రతిబింబ దూరం సమానం. ఒక వ్యక్తి సమతల దర్పణంలో పూర్తి చిత్రాన్ని చూడాలంటే తన ఎత్తులో కనీసం సగం ఎత్తు ఉన్న దర్పణం అవసరం.

కుంభాకార దర్పణం

గోళాకార అద్దం బయటి ఉపరితలం పరావర్తన తలంగా పనిచేస్తే దాన్ని కుంభాకార దర్పణం అంటారు.

బయటకి ఉబ్బెత్తు ఆకారంలో ఉండే దర్పణాలు కుంభాకార దర్పణాలకు ఉదాహరణ. ఈ దర్పణంపై పడే కాంతి కిరణాలు వికేంద్రీకరణ చెందుతాయి.

ఉపయోగాలు: వీటిని వెనక వచ్చే వాహనాలను చూసేందుకు అమర్చే అద్దాలుగా వినియోగిస్తారు. భద్రతా ప్రయోజనాల కోసం వాడతారు. సోడియం రిఫ్లెక్టర్ దీపంలో ఉపయోగిస్తారు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 704

Engulf

Telugu meaning: ముంచు, మింగివేయు

English meaning: The word engulf (ఎంగల్ఫ్) is a verb that describes something being completely surrounded, covered, or swallowed up, often by a natural force or strong emotion.

Synonyms: Swallow, Overwhelm

Antonyms: Release, Uncover

Usage: **1.** Flames engulfed the entire building within minutes of the explosion.

2. He was engulfed by a wave of guilt after realizing the consequences of his actions.

స్టడీ జోన్: స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖ మహిళలు




బ్రిటిష్ వలస పాలకుల నుంచి భారత్‌ను కాపాడి, దేశానికి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేసే లక్ష్యంతో ఎంతోమంది భారతీయులు పోరాటాలు చేశారు. దేశ స్వరాజ్యమే ధ్యేయంగా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. కేవలం పురుషులే కాక మహిళలు కూడా తమవంతు బాధ్యతగా పోరాటాల్లో భాగమై, వాటిని ముందుండి నడిపారు. నాటి సమాజంలో ఉన్న మూఢ విశ్వాసాలు, పురుషాధిక్యతను తట్టుకుని నిలబడి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది స్త్రీలు కీలకంగా వ్యవహరించి జైళ్లకు వెళ్లారు. ఆంగ్లేయుల అరాచక పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దేశ, విదేశాల్లో విప్లవకారులకు మార్గదర్శకులుగా నిలిచారు. సంఘ సంస్కరణల కోసం కృషి చేశారు. ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని రగిలించారు. వారి అచంచల సంకల్పం, నిబద్ధత దేశానికి విముక్తిని ప్రసాదించడంలో అత్యంత కీలకంగా దోహదపడ్డాయి.

☛ రాణి అబ్బక్క చౌతా, రాణి వేలు నాచియార్, కిట్టూరు చెన్నమ్మ లాంటి ఎందరో వనితలు 1857 తిరుగుబాటుకు ముందే బ్రిటిష్ వలస విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. సిపాయిల ఉద్యమ కాలంలో ఝాన్సీ లక్ష్మీబాయి, బేగం హజరత్ మహల్; 1885లో కాంగ్రెస్ స్థాపన తర్వాత స్వాతంత్ర్యోద్యమంలో కస్తూర్బా గాంధీ, సరోజినీ నాయుడు, మేడం కామా, అనిబిసెంట్, ముత్తు లక్ష్మి రెడ్డి, లక్ష్మీ సెహగల్, సుచేత కృపలానీ, మాతంగిని హజ్రా, కమలాదేవి చటోపాధ్యాయ, అరుణా అసఫ్ అలీ మొదలైన ఎందరో మహిళామణులు సాగించిన పోరాటాలు ఆధునిక భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టాలు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖ మహిళలను గమనిస్తే..

పేరు	కాలం	పని
1. ఝాన్సీ లక్ష్మీబాయి	1828-58	1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్నారు.
2. సావిత్రి బాయి ఫులే	1831-97	లింగవివక్షకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.
3. అనిబిసెంట్	1847-1933	హోమ్‌రూల్ లీగ్ స్థాపించి, స్వపరిపాలనను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం నడిపారు.
4. మేడం బికాజీ కామా	1861-1936	విదేశీగడ్డపై (జర్మనీ) మొదటిసారి భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.
5. కస్తూర్బా గాంధీ	1869-1944	1915-43 వరకు అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు.
6. మాతంగిని హజ్రా	1870-1942	శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.
7. సరోజినీ నాయుడు	1879-1949	శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు.
8. కమలాదేవి చటోపాధ్యాయ	1903-88	సహాయనిరాకరణ, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొన్నారు.
9. అరుణా అసఫ్ అలీ	1909-96	ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు.
10. దుర్గాబాయి దేశ్‌ముఖ్	1909-81	ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు.
11. రాణి గైడిన్లూ	1915-93	ఈశాన్య రాష్ట్రాల్లో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.
12. ఉషా మెహతా	1920-96	'మహాత్మాగాంధీ అండ్ హ్యూమన్ నిజం' అనే గ్రంథం రాశారు.

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు



ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా జనాభా రోజురోజుకూ పెరిగిపోతుంటే మరోవైపు భూమిపై పలురకాల వ్యర్థ పదార్థాలు పేరుకుపోతున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నా విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంత మాత్రమే. వ్యర్థాల నిర్వహణ కోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షా అభ్యర్థులకు అవగాహన అవసరం.

భారతదేశంలో మురుగు నీటి నిర్వహణ


☛ మన దేశంలో ప్రతి రోజూ సుమారు 33 వేల మిలియన్ లీటర్ల మురుగునీరు విడుదలవుతోంది. ఈ మురుగు నీటిలో కొంత శాతమే శుద్ధి చేస్తున్నారు. దీనికి కారణం, భారతదేశ పట్టణాలు, నగరాల మురుగునీటి నిర్వహణ సామర్థ్యం 18.6% మాత్రమే.

భారత్‌లో ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్

☛ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు అంటే ఇ-వ్యర్థాలను తిరిగి వినియోగించడానికి లేదా వేరొక వస్తువులు తయారు చేయడానికి రిఫర్బిష్‌మెంట్ లేదా రిపేరింగ్ ప్రక్రియలకు వినియోగించని వ్యర్థాలను ఇ-వేస్ట్‌గా పరిగణిస్తారు.

ఇ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ, వేస్ట్ టు వెల్త్, భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The United Arab Emirates (UAE) has introduced a new nomination-based Golden Visa programme, offering Indian citizens lifetime residency without the need for large property or business investments. This move marks a shift from the existing visa framework and is part of a pilot project that begins with India and Bangladesh.

Sakshi bagged India's first gold medal at the second World Boxing Cup at the World Boxing Cup – Astana, Kazakhstan on 6 July 2025. She defeated USA's Yosline Perez in the women's 54kg final.

US President Donald Trump signed into law the 'One Big Beautiful Bill'. The House approved the bill in a 218 to 214 vote, after the Senate narrowly approved the bill in a 51-50 vote that required Vice President JD Vance to break a tie.

For more Current Affairs: Scan QR code

Latest Updates

Project Staff Posts

CSIR's Fourth Paradigm Institute, Bangalore, conducts interviews for the Project Staff posts on a temporary basis. The total no. of posts is 15. Eligible candidates can appear for interview on 22 July 2025.

Apprentice Posts

Munitions India Limited, a subsidiary of the Government of India, Ministry of Defence, is inviting applications for recruiting Graduate and Diploma Apprentice posts in various departments. The total number of posts is 140. The last date for online applications is 18th July 2025.

Manager Jobs

National Innovation Foundation India, a government sector undertaking under the Ministry of Science and Technology, invites applications for the following posts of Manager, Associates and Fellows on a temporary basis. The total no. of posts is 14. Eligible candidates can apply offline before 25 July 2025.

Did You Apply..?

Today (July 8) is the last date for the following jobs/ Apprentice posts

☛ CSO Jobs in Bank of Baroda. ***Qualification:*** Degree.

☛ Project Assistant posts in CSMCR. ***Eligibility:*** 10th, ITI, PG, PhD.

☛ Associate Legal posts in MoEFCC. ***Qualification:*** Degree, Diploma, M.Sc.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Probability

1. In a bag there are seven yellow balls, four white balls and five green balls. Two balls are drawn from the bag one after the other without replacement. If the first ball hapens to be white ball, six more white balls are added to the bag. Find the probability that both the balls are white in colour.

A) $\frac{5}{28}$ B) $\frac{3}{28}$ C) $\frac{19}{28}$ D) $\frac{7}{28}$ E) $\frac{9}{28}$

2. There are 120 students in a class of collage of which 43 are boys studying physics and 18 girls are not studying physics. If there are 63 girls in all the probability that a boy picked up at random is not studying physics is...

A) $\frac{4}{9}$ B) $\frac{43}{120}$ C) $\frac{19}{40}$ D) $\frac{2}{9}$ E) $\frac{11}{19}$

3. In a bag there are 5 gold medals 7 silver medals and 10 bronze medals. 3 medals are drawn one by one. If the first medal comes out to be of gold then 4 more gold medals are added to bag. After the second drawn no new medals are added. Find the probability that all the three medals drawn are of gold medals.

A) $\frac{9}{330}$ B) $\frac{13}{330}$ C) $\frac{7}{330}$ D) $\frac{9}{26}$ E) $\frac{3}{287}$

4. The probabilities of that four persons hit a target $\frac{1}{5}, \frac{1}{6}, \frac{2}{7}, \frac{1}{4}$ respective ly. If only one hits the target. What is the probability that it was the third person?

A) $\frac{120}{379}$ B) $\frac{420}{379}$ C) $\frac{2}{7}$ D) $\frac{5}{7}$ E) $\frac{220}{379}$

5. From a pack of cards, two cards are drawn one after the other with replacement. The probability of the first card is Queen and second is black?

A) $\frac{1}{26}$ B) $\frac{30}{52}$ C) $\frac{29}{52}$ D) $\frac{3}{26}$ E) $\frac{5}{26}$

6. A lot of 30 bulbs contain 5 defective bulbs. Three bulbs are drawn at random from the lot one after the other. The probability that all the three are non defective is..

A) $\frac{115}{302}$ B) $\frac{115}{230}$ C) $\frac{115}{203}$ D) $\frac{5}{6}$ E) $\frac{7}{6}$

7. Three persons work independently on a problem. If the respective probabilities that they will solve it are $\frac{2}{5}, \frac{1}{6}, \frac{1}{3}$, then the probability that none can solve it is..

A) $\frac{1}{6}$ B) $\frac{1}{5}$ C) $\frac{1}{4}$ D) $\frac{1}{3}$ E) $\frac{2}{5}$

8. In a class of 45 students with roll number 1 to 45. A student is picked up at a random to answer a question. Find the probability that the roll number of the selected students is either multiple of 4 or 9.

A) $\frac{1}{3}$ B) $\frac{2}{45}$ C) $\frac{2}{3}$ D) $\frac{3}{5}$ E) $\frac{5}{8}$

9. The probability that a contractor will get a tiles flooring contract is $\frac{3}{7}$ and the probability of that he will not get the carpentary contract is $\frac{2}{5}$. If the proba bility of getting at least one contract is $\frac{4}{5}$. What is the probability that will get both?

A) $\frac{2}{35}$ B) $\frac{8}{35}$ C) $\frac{4}{35}$ D) $\frac{6}{25}$ E) $\frac{7}{25}$

10. Three fair dice are thrown simultaneously. What is the probability that the sum of numbers on their tops is atleast 7.

A) $\frac{49}{216}$ B) $\frac{49}{108}$ C) $\frac{103}{108}$ D) $\frac{49}{54}$ E) $\frac{47}{55}$

11. Wife and Husband both appear for an Interview. The Probability of the selection of wife is $\frac{1}{6}$. While the probability of rejection of Husband is $\frac{2}{5}$. What is the probability that only one of them is selected?

A) $\frac{14}{33}$ B) $\frac{13}{30}$ C) $\frac{17}{30}$ D) $\frac{17}{33}$ E) $\frac{19}{33}$

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.



కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ 2025, మే 5 నుంచి 8 వరకు వాషింగ్టన్ డీసీలో జరిగిన 2025 వరల్డ్ బ్యాంక్ ల్యాండ్ కాన్ఫరెన్స్‌లో భారత ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రదర్శించింది?
జ: SVAMITVA (సర్వే ఆఫ్ విలేజెస్ ఆబాదీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్.)

■ దేశంలోనే మొదటి అంతర్‌రాష్ట్ర చిరుత కారిడార్‌ను ఏ రెండు రాష్ట్రాలను కలిపి ఏర్పాటు చేయనున్నారు?
జ: రాజస్థాన్, మధ్యప్రదేశ్ (ఈ ప్రాజెక్టు మధ్యప్రదేశ్‌లోని పాల్పూర్ కునో నేషనల్ పార్క్, గాంధీసాగర్ అభయారణ్యాలను రాజస్థాన్‌లోని ముకుందర హిల్స్ టైగర్ రిజర్వ్‌తో కలుపుతుంది.)

■ ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని 2025లో ఏ రోజున నిర్వహించారు? (ప్రపంచ ఆరోగ్యసంస్థ సహకారంతో గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా (GINA) అనే సంస్థ ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.మేక్ ఇన్‌హేల్డ్ ట్రీట్‌మెంట్స్ యాక్సెసిబుల్ ఫర్ ఆల్ అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)
జ: మే 6

మరింత సమాచారం

■ ఖేలో ఇండియా యూత్‌గేమ్స్ ఏడో ఎడిషన్‌ను 2025 మే 4 నుంచి 15 వరకు ఎక్కడ నిర్వహించారు?
జ: బిహార్, న్యూదిల్లీ

వ్యర్థాలను వదిలించే ట్రిపుల్ ఆర్!

జనరల్ స్టడీస్ పర్యావరణ అంశాలు



పరిసరాలు, పర్యావరణంతో సహా మానవ ఆరోగ్యానికీ ఘనవ్యర్థాలు ఇబ్బందికరంగా మారాయి. అభివృద్ధితో పాటు వినియోగ స్థాయి పెరుగుతున్నకొద్దీ అవి వేగంగా పోగవుతుంటాయి. అత్యధిక జనాభా ఉన్న భారత్‌లో ఈ సమస్య మరింత ఎక్కువ. వ్యర్థాలను సరిగా నిర్వహించకపోతే పరిశుభ్రత లోపించి నేల, నీరు, గాలి కలుషితమవుతాయి. ఈ సవాళ్లను సమర్థంగా పరిష్కరించే ఉపాయమే 'ఆర్‌ఆర్‌ఆర్'. ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిన ఆ విధానాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యర్థాల భారాన్ని శాస్త్రీయంగా వదిలించుకుంటే వచ్చే ఆర్థిక, సామాజిక లాభాలతో పాటు ఈ అంశాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ విధానాలను, నియమాలను తెలుసుకోవాలి.

ఘనవ్యర్థాల నిర్వహణ

(ఆర్‌ఆర్‌ఆర్ ప్రాధాన్యం)

ఘన వ్యర్థ పదార్థ నిర్వహణలో రెడ్యూసింగ్ (తగ్గించు), రీ-యూజింగ్ (పునరుపయోగం), రీ-సైక్లింగ్ (పునఃచక్రీయ ప్రక్రియ) కీలకమైన విధానాలు. ఈ త్రివిధ విధానాలను (3 ఆర్‌లు) పాటిస్తే సమాజంలో, ఆవాసాల్లో ఘనవ్యర్థ పదార్థాల సమస్యలను తగ్గించవచ్చు.

రెడ్యూసింగ్: మూడు ఆర్‌లలో మొదటిది, సమర్థమైంది రెడ్యూసింగ్. ప్రతి వ్యక్తి పదార్థ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఘనవ్యర్థ పదార్థ ఉత్పాదన కూడా తగ్గుతుంది. సాధ్యమైనంత మేరకు ప్లాస్టిక్, పాలిథిన్ లాంటి పదార్థాలను తక్కువగా వినియోగించడం ద్వారా వాటి వ్యర్థాలు తగ్గుతాయి. ✿ బయటకు వెళ్లేటప్పుడు వస్త్రం లేదా వైరుతో తయారుచేసిన సంచి తీసుకెళ్లడం ద్వారా ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని తగ్గించవచ్చు. అదేవిధంగా ప్లాస్టిక్ పరికరాలకు ప్రత్యామ్నాయంగా స్టీల్ పరికరాలను ఉపయోగించడం మంచిది. ✿ ఇళ్లలో అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్తును వినియోగించడం ద్వారా ఆదా అవుతుంది. కాలుష్యం తగ్గుతుంది.

రీ-యూజింగ్: పాత వస్తువులను పారేయకుండా వాటిని ఏదో విధంగా ఉపయోగించడాన్ని పునర్వినియోగం లేదా పునరుపయోగం అంటారు. ఇంట్లో పాత ఫర్నిచర్, దుస్తులు, బొమ్మలు, పుస్తకాలను ఇతరులకు ఇవ్వడమే పునరుపయోగం. ఇలాంటి చర్యల ద్వారా పాతవాటిని సద్వినియోగం చేసుకోవడానికి వీలవుతుంది. ఇటీవల కాలంలో వాడిన వస్తువులను ఆన్‌లైన్‌లో అమ్మే ధోరణి పెరగడం పునర్వినియోగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.

రీ-సైక్లింగ్: ప్రస్తుతం వ్యక్తిగత, గృహ, వాణిజ్య, పారిశ్రామిక చర్యల ద్వారా విడుదలవుతున్న ఘనవ్యర్థాలను రీసైక్లింగ్ విధానంలో తిరిగి వినియోగించదగిన కొత్త పదార్థాలుగా తయారు చేయడానికి ప్రాధాన్యం పెరిగింది. దీనినే రీ-సైక్లింగ్ అంటారు. ఈ ప్రక్రియలో ఘనవ్యర్థాన్ని తడి, పొడి, ప్రమాదకర రకాలుగా వేరు చేసి రీసైక్లింగ్ కంపెనీలకు సరఫరా చేస్తారు. ఎప్పటికప్పుడు ఘనవ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ ద్వారా వాయు, జల, నేల కాలుష్యాలను నివారించవచ్చు.

పునరుపయోగం - విధానాలు, లాభాలు

వాడిన వస్తువులను, అవసరం లేని వస్తువులను తిరిగి ఉపయోగించే విధానాన్ని పునరుపయోగం అంటారు. సమాజంలోని అల్పాదాయ, మధ్య ఆదాయ, అధిక ఆదాయ వర్గాల అవసరాలకు తగినట్లుగానే కొన్ని వస్తువులను కొద్దికాలం పాటు మాత్రమే వినియోగించడంతో వ్యర్థంగా మిగిలిపోతాయి. ఉదాహరణకు అధిక ఆదాయ కుటుంబం 5 సంవత్సరాల పాటు వాడిన వాహనం లేదా ఫర్నిచర్ మధ్య ఆదాయం లేదా అల్ప ఆదాయ కుటుంబానికి ఉపయోగపడుతుంది.

పునరుపయోగం విధానాలు: ✿ అనేక రకాల పదార్థాలను పునరుపయోగానికి వీలుకల్పించే విధానాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిపట్ల ప్రజల్లో అవగాహన మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉంది.



1) పెద్ద ఆఫీసులలో కొద్దికాలం వినియోగించి, నిరర్థకంగా మారే టేబుల్స్, డెస్కులు, కుర్చీలు, క్యాబినెట్‌లు, ట్రేలు తదితరాలను గ్రామస్థాయి పాఠశాలలు, ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలకు అందించవచ్చు. 2) అభివృద్ధి చెందిన దేశాల ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్యపరికరాలను పేద దేశాల ఆసుపత్రులను తరలిస్తే అక్కడ ఉపయోగించుకోవచ్చు. 3) ఇళ్లలో మిగిలిపోయిన ట్యాబ్లెట్లు, కొన్ని ఏమాత్రం వినియోగించని టానిక్‌లను పారవేయడం కంటే వాటిని ప్రభుత్వ ఆసుపత్రులకు లేదా జనరిక్ మందుల షాపులకు ఇస్తే వాడుకోవచ్చు. 4) ఏ రోజుకారోజు పెద్ద రెస్టారెంట్లలో మిగిలే అదనపు




ఆహారాన్ని వెంటనే అనాథాశ్రమాలు, ఇళ్లు లేని పేదలు, యాచకులకు సరఫరా చేయగలిగితే వ్యర్థాల విడుదలను నివారించవచ్చు. 5) ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను ఎప్పటికప్పుడు బాగు చేయించుకోవడం ద్వారా కొత్తవాటిని కొనుక్కోవాల్సిన అవసరం ఉండదు. 6) పారిశ్రామిక స్థాయిలో కూడా కొన్ని నిరుపయోగ పదార్థాలను, ఇతర పరిశ్రమలకు తరలించినప్పుడు పునరుపయోగానికి వీలవుతుంది.

పునరుపయోగం లాభాలు: ✿ వ్యర్థంగా మిగిలిపోతున్న పదార్థాలను మళ్లీ ఉపయోగించడం ద్వారా సమాజంలో ఘన వ్యర్థ పదార్థాల విడుదల తగ్గుతుంది. దాంతో జల, వాయు, నేల కాలుష్యాలు తగ్గుతాయి. పెట్రోలియం, కలప, ఇతర సహజవనరుల వినియోగం తగ్గుతుంది. ✿ వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ ఉద్గారాల విడుదల తగ్గుతుంది. ✿ పట్టణాల్లో ప్రత్యేకంగా రీ-యూజ్ కేంద్రాలను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించవచ్చు.

భారత్‌లో ఘనవ్యర్థాల నిర్వహణ: భారతదేశంలో క్రమంగా ఘన వ్యర్థ పదార్థాల ఉత్పత్తి పెరుగుతోంది. ఏటా 960 మిలియన్ టన్నులకు పైగా గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగ ఘనవ్యర్థాలు విడుదల అవుతున్నట్లు అంచనా. ఇందులో 50%కి పైగా సేకరణకు నోచుకోవట్లేదు. 2030 నాటికి కేవలం మున్సిపల్ ఘనవ్యర్థాలే ఏటా 150 మిలియన్ టన్నులకు చేరుతుందని భావిస్తున్నారు.

భారత్‌లో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణకు చర్యలు: ఘన వ్యర్థ పదార్థాల ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో ఇప్పటి వరకు కేంద్ర పర్యావరణ అడవుల మంత్రిత్వశాఖ అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది.



2006లో నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ పాలసీని విడుదల చేసింది. పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థల బాధ్యతను ప్రతిబింబించే విధంగా ఒక చార్టర్‌ను కూడా ఈ విధానంలో పొందుపరిచారు. ఘనవ్యర్థాల విడుదలకు కారణమవుతున్న 17 ప్రధాన పరిశ్రమలను గుర్తించారు.

ముఖ్యమైన రీసైక్లింగ్ పద్ధతులు

1) పైరోలైసిస్, గ్యాసిఫికేషన్: కర్బన వ్యర్థాలను అధిక ఉష్ణోగ్రత వద్ద నియంత్రిత ఆక్సిజన్ సరఫరా ద్వారా విచ్ఛిన్నం చేసే పద్ధతి పైరోలైసిస్. దీని



నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ వాయువుల మిశ్రమాన్ని సింథసిస్ గ్యాస్ అంటారు. ఇది మంచి వాయు ఇంధనం. ✿ వివిధ కర్బన వ్యర్థాల నుంచి శక్తిని సంగ్రహించే విధానమే గ్యాసిఫికేషన్. కర్బన వ్యర్థాలను నేరుగా మండించడం కంటే సింథసిస్ గ్యాస్‌గా అభివృద్ధి చేసి దానితో విద్యుదుత్పాదన చేయడం మెరుగైన విధానం.

2) లాండ్‌ఫిల్ గ్యాస్ రికవరీ: లాండ్‌ఫిల్ (చెత్తకుప్ప) నుంచి విడుదలయ్యే మీథేన్ వాయువును లాండ్‌ఫిల్ గ్యాస్ (ఎల్ఎఫ్‌జీ) అంటారు. ఇది



వాతావరణంలోకి విడుదలైతే భూతాపం సంభవిస్తుంది. అందుకే లాండ్‌ఫిల్స్ నుంచి విడుదలవుతున్న మీథేన్‌ను సేకరించి విద్యుత్తు ఉత్పాదనకు వినియోగించడం సరైన పద్ధతి.

3) అల్యూమినియం రీసైక్లింగ్: ప్రస్తుతం అధిక వినియోగంలో ఉన్న అల్యూమినియం క్యాన్, టిన్‌లను రీసైక్లింగ్ చేసి తేలికైన, దృఢమైన మెటల్ ఫ్రేమ్‌లను తయారు చేయవచ్చు.



రీసైక్లింగ్ అవుతున్న అల్యూమినియాన్ని మెగ్నీషియంతో కలిపి మాగ్నేలియం, డురాల్యుమిన్ అనే మిశ్రమ లోహాలను తయారు చేయవచ్చు. ఈ మిశ్రమ లోహాలు తేలికగా, దృఢంగా ఉంటాయి. వీటిని ఆటోమొబైల్స్, విమాన భాగాల తయారీలో ఉపయోగిస్తారు.

4) ఉడ్ ప్లాస్టిక్: ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో రంపపు పొట్టు కలపడం ద్వారా లభించే సరికొత్త పదార్థం ఉడ్ ప్లాస్టిక్. దీనిని హాంకాంగ్‌లో తొలిసారిగా అభివృద్ధి చేశారు. దీని తయారీకి ఉపయోగించే పరికరాన్ని ఉడ్‌ప్లాస్టిక్ లంబర్ అంటారు. దీనిని అటు ప్లాస్టిక్, ఇటు కలపకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చు. ఫర్నిచర్ తయారీ, ఫ్లోరింగ్, ఫెన్సింగ్‌ల్లో వినియోగిస్తారు. దాని వల్ల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించవచ్చు.

5) వరిపొట్టు నుంచి విద్యుత్తు: వరిపొట్టు నుంచి విద్యుత్తు అనే విధానం ప్రస్తుతం దేశంలో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 80 కోట్ల టన్నుల వరిపొట్టు అందుబాటులోకి వస్తున్నట్లు ఇంటర్నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేసింది. వరిపొట్టును మండించడం ద్వారా విద్యుత్తు ఉత్పత్తితో పాటు అమార్ఫస్ సిలికా కూడా లభిస్తుంది. దీనిని సిమెంటు పరిశ్రమల్లో వాడతారు. రొయ్యల పొట్టు నుంచి కూడా ఈ రకమైన విద్యుత్తు ఉత్పాదన సాధ్యమవుతుంది. ✿ ఈ విధానంలో విద్యుదుత్పత్తికి బిహార్‌కు చెందిన జ్ఞానేష్ పాండే సమర్థమైన ప్లాంటును అభివృద్ధి చేశారు. దీనికి ఐఆర్ఆర్ఐ గుర్తింపు లభించింది.

6) బూడిద నుంచి ఇటుకలు: విద్యుత్తు ప్లాంట్లలో వచ్చే బూడిద, మసి నుంచి ఇటుకలు, టైల్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. దేశంలో వీటి వినియోగం కూడా పెరిగింది.

7) వేస్ట్ టు ఎనర్జీ: భారత్‌లో ఇప్పుడిప్పుడే వేస్ట్ టు ఎనర్జీ (వ్యర్థాల నుంచి శక్తి) ఉత్పాదన ఊపందుకుంటోంది. ఈ తరహా శక్తి ఉత్పాదనకు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయి. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ కూడా ఈ రకమైన ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఏటా భారత్‌లో పట్టణ ప్రాంతాల నుంచి



55 మిలియన్ టన్నుల మున్సిపల్ ఘనవ్యర్థాలతో పాటు 38 బిలియన్ లీటర్ల మురుగు విడుదలవుతోంది. దీనికి అదనంగా పరిశ్రమల్లోనూ భారీ మొత్తంలో ఘన, ద్రవ వ్యర్థాలు పోగవుతున్నాయి. వాటి నుంచి శక్తిని ఉత్పత్తి చేయడానికి దేశంలో దాదాపు 250 వరకు ప్లాంటులు ఉన్నాయి. ఇలాంటి పరిశ్రమల ద్వారా ఒకవైపు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి, మరోవైపు పరిసరాల పరిశుభ్రత మెరుగవుతుంది. బయోమిథనేషన్, ఇన్సినరేషన్, థర్మోకెమికల్ కన్వర్షన్ పద్ధతులను వాటిల్లో ఉపయోగిస్తారు. స్వీడన్ లాంటి దేశాలు ఈ రకమైన ప్లాంటులను సమర్థంగా నిర్వహిస్తున్నాయి. ✿ స్వచ్ఛభారత్‌లో భాగంగా వేస్ట్ టు పవర్ ప్లాంటులను జబల్‌పుర్, హైదరాబాద్, నల్గొండ, చెన్నైల్లో ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

8) సింథటిక్ డీజిల్: చెత్త నుంచి సింథటిక్ డీజిల్‌ను ఉత్పత్తి చేసే విధానం. కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు ఈ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. పారిస్‌లో 85% వ్యర్థాలను రీసైక్లింగ్ ద్వారా సింథటిక్ డీజిల్‌గా మారుస్తూ ఏటా 1.6 లక్షల టన్నుల చమురు ఆదా చేస్తున్నారు. ✿ సింథటిక్ డీజిల్ తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్న పద్ధతి 'ఫిషర్-ట్రోప్ష్'. దీనిద్వారా జీవరాశి నుంచి సింథటిక్ డీజిల్ తయారీకి వీలవుతుంది.



రచయిత:
ఈదుబిల్లి వేణుగోపాల్

'ఒక సంవత్సరంలో స్వరాజ్యం'


సహాయ నిరాకరణోద్యమం

జనరల్ స్టడీస్-భారతదేశ చరిత్ర

భారత స్వాతంత్ర్య పోరాటంలో సహాయ నిరాకరణోద్యమం ఒక ప్రధాన ఘట్టం. గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన దేశవ్యాప్త తొలి ప్రజాఉద్యమం. పరిశ్రమలు, విద్యాసంస్థలు సహా బ్రిటిష్ ప్రభుత్వాన్ని పోషించే అన్ని రకాల పన్నులు, కొనుగోళ్లను బహిష్కరించాలన్న మహాత్ముడి పిలుపు దేశాన్ని ఏకం చేసింది. అప్పటి వరకు ప్రజల్లో బ్రిటిష్ పాలన అంటే ఉన్న భయాన్ని పోగొట్టింది. హిందూ, ముస్లింల ఐక్యతను పెంచింది. ఆంగ్లేయుల వస్తువులను వదిలి స్వదేశీ తయారీ వైపు ప్రజలు మొగ్గుచూపారు. చౌరీచౌరా ఉదంతంతో ఈ పోరాటం నిలిచిపోయినప్పటికీ భారతీయుల ఐక్యతా శక్తిని, అహింసా సిద్ధాంతంపై ఉన్న నిబద్ధతను చాటింది. ఈ మహోద్యమం మొదలు నుంచి ముగిసే వరకు పరిణామక్రమం, ప్రధాన ఘటనలు, ఉద్యమ నాయకులు, భిన్న వైఖరులు, నినాదాలు, ఫలితాల గురించి పోటీ పరీక్షార్థులు వివరంగా తెలుసుకోవాలి.

1. కింది వాటిలో ఏ కాంగ్రెస్ సమావేశంలో సహాయ నిరాకరణ తీర్మానం చేశారు?
   1) నాగ్‌పుర్ 2) కోల్‌కతా
   3) విజయవాడ 4) అమృత్‌సర్

2. చౌరీచౌరా సంఘటన ఏ సంవత్సరంలో జరిగింది?



   1) 1920 2) 1921 3) 1922 4) 1923

3. కింది వాటిలో 1922లో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేయడానికి ఏది కారణం?
   1) సుభాష్ చంద్రబోస్ లాంటి నాయకులు వ్యతిరేకించారు.
   2) చౌరీచౌరా సంఘటన
   3) బ్రిటిష్ ప్రభుత్వ ఒత్తిడికి గాంధీజీ తలవంచారు.
   4) పాల్గొనేవారు ఉత్సాహంగా లేరు.

4. చౌరీచౌరా ఉదంతంతో స్వాతంత్ర్య సమరంలోని ఏ ఉద్యమం ఒక్కసారిగా ఆగిపోయింది?
   1) స్వదేశీ ఉద్యమం
   2) సహాయ నిరాకరణోద్యమం
   3) ఉప్పు సత్యాగ్రహం
   4) క్విట్ ఇండియా ఉద్యమం


5. సహాయ నిరాకరణోద్యమ సమయంలో విదేశీ దుస్తులను తగలబెట్టడం వ్యర్థంగా భావించినవారు?
   1) జవహర్‌లాల్ నెహ్రూ
   2) మోతీలాల్ నెహ్రూ
   3) రవీంద్రనాథ్ ఠాగుర్
   4) సుభాష్ చంద్రబోస్

6. సహాయ నిరాకరణోద్యమానికి సంబంధించి కింది కారకాల్లో ఏది మిగిలిన వాటితో పోలిస్తే ఎక్కువ విజయాన్ని సాధించింది?
   1) కౌన్సిల్ ఎన్నికలు బహిష్కరించడం
   2) న్యాయస్థానాలను బహిష్కరించడం
   3) ఆర్థిక బహిష్కరణ
   4) విద్యా బహిష్కరణ

7. కింది సంస్థల్లో ఏది కాంగ్రెస్ సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని పూర్తిగా ఉల్లంఘించి 1920లో జరిగిన కౌన్సిల్ (మండలి) ఎన్నికల్లో పాల్గొంది?
   1) ఆంధ్ర మహాసభ 2) హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్
   3) జస్టిస్ పార్టీ 4) స్వరాజ్ పార్టీ

8. కింది ప్రకటనల్లో సరికానిది.
   ఎ) సహాయ నిరాకరణోద్యమం 1920, సెప్టెంబరులో ప్రారంభించిన రాజకీయ ప్రచారం.
   బి) జలియన్‌వాలా బాగ్ మారణకాండను 'అమృత్‌సర్ ఊచకోత' అని కూడా పిలుస్తారు. ఇది 1922, ఏప్రిల్ 13న జరిగింది.
   1) ఎ 2) ఎ, బి 3) బి 4) ఏదీకాదు

9. భారతదేశంలో సహాయ నిరాకరణోద్యమానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
   ఎ) గాంధీజీ 1920లో సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. బ్రిటిష్ ప్రభుత్వానికి సహకరించొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
   బి) ముస్లింలు ప్రారంభించిన ఖిలాఫత్ ఉద్యమం, మహాత్మా గాంధీ నేతృత్వంలోని సహాయ నిరాకరణోద్యమం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ఉమ్మడి ఘర్షణగా విలీనమయ్యాయి.
   1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీకాదు



గాంధీజీ

10. కింది వాటిలో సహాయ నిరాకరణోద్యమానికి సంబంధించి సరైన వాక్యాలను ఎన్నుకోండి.
    ఎ) 1924, డిసెంబరులో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ ఎనిమిదో సమావేశంలో సహాయ నిరాకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు.
    బి) సహాయ నిరాకరణ తీర్మానాన్ని గాంధీజీ ప్రవేశపెట్టారు.
    సి) సి.ఆర్.దాస్, బి.పి.పాల్, ఎం.ఎ.జిన్నా, ఎం.ఎం. మాలవియ సహాయ నిరాకరణ తీర్మానాన్ని వ్యతిరేకించారు.
    డి) సహాయ నిరాకరణ తీర్మానానికి అనుకూలంగా అత్యధిక ఓట్లు వచ్చాయి.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
    3) బి, సి, డి 4) ఎ, బి, డి

11. కింది వాటిని పరిశీలించి సరైన వాక్యాలను ఎంచుకోండి.
    ఎ) సహాయ నిరాకరణ ఉద్యమం భారతదేశంలోని అన్నివర్గాల ప్రజలను స్వాతంత్ర్య సమరంలోకి తీసుకొచ్చింది.
    బి) చౌరీచౌరాలో హింసాత్మక ఘటన చోటు చేసుకుంది.
    1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీకాదు

12. ప్రతిపాదన (ఎ): 1920 నాటి సహాయ నిరాకరణోద్యమం భారత స్వాతంత్ర్య పోరాటానికి విస్తృత పరిధిని కలిగించింది.
    కారణం (ఆర్): గాంధీజీ నాయకత్వంలోని ఈ ఉద్యమంలో పెద్దసంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొన్నారు.
    1) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ.
    2) ఎ, ఆర్ లు సరైనవి; కానీ ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
    3) ఎ ఒప్పు, ఆర్ తప్పు.
    4) ఎ తప్పు, ఆర్ ఒప్పు.

13. కిందివాటిని జతపరచండి.

జాబితా - ఎ	జాబితా - బి
ఎ) చీరాల పేరాల పోరాటం	1) పర్వతనేని వీరయ్య చౌదరి
బి) పల్నాడు సత్యాగ్రహం	2) చౌరీచౌరా
సి) పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం	3) కన్నెగంటి హనుమంతు
డి) సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల	4) రామదండు

    1) ఎ-3, బి-2, సి-4, డి-1 2) ఎ-2, బి-4, సి-3, డి-1
    3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-3, సి-1, డి-2

14. సహాయ నిరాకరణోద్యమ సమయంలో ఏ సంస్థలను స్థాపించలేదు?
    ఎ) బీసెంట్ థియోసోఫికల్ కాలేజీ, మదనపల్లి
    బి) జామియా మిలియా ఇస్లామియా, దిల్లీ
    సి) కాశీ విద్యాపీఠ్, బెనారస్
    డి) అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి

15. కింది వాటిలో మహాత్మాగాంధీ ప్రారంభించిన మొదటి ప్రజాఉద్యమం?
    1) సహాయ నిరాకరణోద్యమం
    2) ఉప్పు ఉద్యమం
    3) క్విట్ ఇండియా ఉద్యమం
    4) నీలిమందు ఉద్యమం

16. ఖిలాఫత్ సమస్యపై సహాయ నిరాకరణోద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
    1) 1918 2) 1920 3) 1922 4) 1924

17. 1920 భారత జాతీయ కాంగ్రెస్ నాగ్‌పుర్ సమావేశంలో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది ఎవరు?
    1) చిత్తరంజన్ దాస్ 2) అనీ బిసెంట్
    3) బిపిన్ చంద్రపాల్
    4) మదన్‌మోహన్ మాలవియ

18. భారత జాతీయ కాంగ్రెస్ ఏ సంవత్సరంలో మొదటి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించింది?
    1) 1917 2) 1918 3) 1920 4) 1922


19. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1920 2) 1919 3) 1921 4) 1922

20. గాంధీజీ 'ఒక సంవత్సరంలో స్వరాజ్యం' అనే నినాదాన్ని ఎప్పుడు ఇచ్చారు?
    1) దండి యాత్ర సమయంలో
    2) సహాయ నిరాకరణోద్యమ సమయంలో
    3) శాసనోల్లంఘన ఉద్యమ సమయంలో
    4) రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా

21. కింది వాటిలో సహాయ నిరాకరణోద్యమం గురించి సరికానిది?
    1) ఉద్యమ కాలం 1920 నుంచి 1922 వరకు.
    2) ఒక సంవత్సరంలోపు స్వరాజ్యాన్ని సాధించాలనేది దాని నినాదం.
    3) ఇది బహిష్కరణ కార్యక్రమాన్ని కలిగి ఉంది.
    4) జిన్నా ఈ ఉద్యమానికి మద్దతిచ్చారు.

22. సహాయ నిరాకరణోద్యమ సమయంలో మహాత్మా గాంధీ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన ఏ బిరుదును తిరస్కరించారు?
    1) హింద్ కేసరి
    2) కైజర్ - ఇ - హింద్
    3) రాయ్ బహదూర్ 4) భారతరత్న

23. సహాయ నిరాకరణోద్యమం సమయంలో న్యాయవాద వృత్తిని వదులుకున్నవారు?
    1) మహాత్మా గాంధీ
    2) మదన్ మోహన్ మాలవియ
    3) తేజ్ బహదూర్ సప్రూ
    4) చిత్తరంజన్ దాస్



చిత్తరంజన్ దాస్

24. సహాయ నిరాకరణోద్యమం సమయంలో న్యాయవాద వృత్తిని విడిచిపెట్టిన బిహార్ న్యాయవాది?
    1) జయప్రకాష్ నారాయణ
    2) రాజేంద్రప్రసాద్
    3) సహజానంద సరస్వతి 4) రాజ్‌కుమార్ శుక్లా

25. సహాయ నిరాకరణోద్యమానికి మద్దతు ఇచ్చి, చివరికి దాని ఫలితాన్ని చూడనివారు?
    1) బాలగంగాధర్ తిలక్ 2) లాలాలజపతి రాయ్
    3) మోతీలాల్ నెహ్రూ 4) చిత్తరంజన్ దాస్

26. 1920 నాటి సహాయ నిరాకరణోద్యమంలో రాహుల్ సాంకృత్యాయన్ ఏ ప్రాంతంలో చురుగ్గా ఉన్నారు?
    1) ఛప్రా 2) దిల్లీ 3) లఖ్‌నవూ 4) పట్నా

27. చౌరీచౌరా సంఘటన ఎప్పుడు జరిగింది?
    1) 1922, ఫిబ్రవరి 5 2) 1922, ఫిబ్రవరి 4
    3) 1922, ఫిబ్రవరి 2 4) 1922, ఫిబ్రవరి 6

28. చౌరీచౌరా ఏ జిల్లాలో ఉంది?
    1) డియోరియా 2) గోరఖ్‌పుర్
    3) కుషీ నగర్ 4) మహారాజ్ గంజ్

29. ఏ సంఘటన తర్వాత మహాత్మా గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని తన 'ఘోరతప్పిదం' (హిమాలయన్ బ్లండర్)గా అభివర్ణించారు?
    1) చౌరీచౌరా 2) ఖేడా సత్యాగ్రహం
    3) నాగ్‌పుర్ సత్యాగ్రహం
    4) రాజ్‌కోట్ సత్యాగ్రహం

30. చౌరీచౌరా సంఘటన జరిగినప్పుడు మహాత్మా గాంధీ ఎక్కడ ఉన్నారు?
    1) దిల్లీ 2) కోల్‌కతా
    3) చౌరీచౌరా 4) బార్డోలి

31. 1920లో ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం ఎప్పుడు ముగిసింది?
    1) 1920 2) 1921 3) 1922 4) 1924

32. దిల్లీలో 1922, ఫిబ్రవరి 24న జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించుకుంటున్నందుకు గాంధీజీకి వ్యతిరేకంగా తిరుగుబాటు తీర్మానాన్ని ఎవరు ప్రవేశపెట్టారు?
    1) కె.టి.షా
    2) బిపిన్ చంద్రపాల్
    3) సుభాష్ చంద్రబోస్ 4) డాక్టర్ మూంజే

33. 1923 – 28 సమయంలో భారత రాజకీయాల్లో విప్లవాత్మక కార్యకలాపాలు పునరావృతం కావడానికి కారణం?
    1) హర్‌దయాళ్, లాలాలజపతి రాయ్ లాంటి నాయకుల ప్రభావం పెరగడం.
    2) గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని వాయిదా వేయడం.
    3) విదేశీ సంఘటనల ప్రభావం.
    4) భారతీయుల డిమాండ్లను ఆంగ్లేయులు తిరస్కరించడం.



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-1; 2-3; 3-2; 4-2; 5-2; 6-3; 7-3; 8-3; 9-4; 10-3; 11-1; 12-1; 13-4; 14-4; 15-1; 16-2; 17-1; 18-3; 19-1; 20-2; 21-4; 22-2; 23-4; 24-2; 25-1; 26-1; 27-1; 28-2; 29-1; 30-4; 31-3; 32-4; 33-2.

మంచి కెరియర్లో ప్రవేశించి నైపుణ్యాలతో రాణిస్తుంటే భవిత బంగారుమయమవుతుందంటాం. మంచి కారు, సొంత ఇల్లు, నగలు కొనుక్కొని జీవితాన్ని ధగధగలాడేలా తీర్చిదిద్దుకోవచ్చనుకుంటాం. మరి కెరియరే బంగారు ఆభరణాలతో ముడిపడితే ఎలా ఉంటుంది! ఇండియన్ గోల్డ్ జ్యూలరీ జెమ్స్ పరిశ్రమ 50 లక్షల మందికి ఉపాధినిస్తోంది. ప్రస్తుతం సాంకేతిక సొగసులు అద్దుకొని కొత్త తరాన్ని స్వాగతిస్తోంది!



పసిడి కాంతుల పచ్చని కెరియర్!

రోజూ రెండు రకాల వార్తలను వింటున్నాం, చదువుతున్నాం. ఒకటి ప్రపంచంలో ఏదో ఒక మూల యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతుంటే, రెండోది - ఏ రోజుకారోజు చుక్కలను చేరుతున్న బంగారం ధరలు. అప్పుడప్పుడూ ఈ రెండిటికీ సంబంధం ఉందన్న విశ్లేషణలు వస్తుంటాయి. ఎప్పటికీ తరగనిది, నిత్యం విలువ పెరుగుతూ ఉండేది స్వర్ణ ఆభరణాలనేది స్పష్టం. విశ్వమంతా విశాల విపణి కావడంతో నేడు గోల్డ్ జ్యూలరీ, జెమ్స్ ఇండస్ట్రీ కొత్త అవకాశాలతో ఆహ్వానిస్తోంది.

మనం రోజూ చూసే ఆభరణాల వెనుక విస్తుపోయే భారీ మార్కెట్ దాగి ఉంది. ఏయేటికాయేడు విస్తరిస్తున్న వ్యాపారం ఉంది. వ్యవస్థీకృత ఆభరణాల సంస్థల్లో విభిన్న ఉద్యోగాలున్నాయి. ఇందుకు కారణం- ఒక పక్క బంగారం ధరలు రాకెట్లా దూసుకెళుతున్నా డిమాండ్ మాత్రం చెక్కుచెదరకపోవటం. 2023లో 774 టన్నులుగా ఉన్న దేశంలో బంగారం డిమాండ్ 10 శాతం పెరిగి 2025లో 800 టన్నులు దాటింది. ఈ రెండేళ్ళలో బంగారం రేటు 31 శాతం పెరిగినా డిమాండ్ మాత్రం చెక్కుచెదరలేదని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తేల్చి చెప్పింది. దేశ స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో ఏడు శాతానికి చేరిన గోల్డ్, డైమండ్ వ్యాపారం ప్రభుత్వానికీ వరప్రదాతగా నిలిచింది.

ప్రభుత్వ ప్రోత్సాహం



పళ్లెం బంగారమైనా దాని ధగధగలు చూడాలంటే గోడ చేర్పు కావాలంటారు. విలువ రీత్యా చకచకా పైకి ఎగబాకుతున్న స్వర్ణ పరిశ్రమకు కావలసిన ఇంధనాన్ని కేంద్ర ప్రభుత్వం వివిధ విధానాల ద్వారా సమకూరుస్తోంది.

▼ ఎగుమతులకు అనువైన ప్రాధాన్య రంగంగా స్వర్ణ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తోంది.

▼ బంగారం కొనుగోలుకు గమ్యస్థానంగా పరిగణించే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దుబాయి)లో వజ్రాల, ఆభరణాల తయారీకి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

▼ 2023 నవంబర్ - 2024 జనవరి మధ్య మూడు నెలలపాటు భారత్ రత్న మెగా పి.ఎఫ్.సి. పేరిట దేశంలోని ఆభరణాల తయారీదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహించింది.

▼ అంతర్జాతీయ స్వర్ణ మార్కెట్లో బ్రాండ్ ఇండియా ప్రగాఢ ముద్ర కోసం వివిధ ఈవెంట్లను వరుసగా నిర్వహిస్తోంది.

బడా కంపెనీలు- భారీ ప్రణాళికలు

దేశంలో ఆభరణాల తయారీ కంపెనీలు వ్యవస్థీకృత రంగంలో 450 ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి చేసే జాతీయ, అంతర్జాతీయ ఆభరణాల విలువ 2027 నాటికి 8 లక్షల 50వేల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఇక అవ్యవస్థీకృత మార్కెట్టుపై శాస్త్రీయ గణాంకాలు అందుబాటులో లేనప్పటికీ ఇంటింటికీ ఓ స్వర్ణకారుని సేవలు భారతీయ సంస్కృతిలో భాగమని మరువలేము. దేశంలో అవ్యస్థీకృత స్వర్ణ విపణి వ్యవస్థీకృత మార్కెట్టుకు సమానంగా ఉంటుందని అంచనా. అంటే 50 లక్షల మంది వ్యవస్థీకృత సంస్థల ద్వారా ఉపాధి పొందితే.. మరో 50 లక్షల మంది అవ్యవస్థీకృత రంగంలో సేవలందిస్తున్నారు. అంతా కలిసి దేశ ఆభరణాల పరిశ్రమ కోటి మందికి తగ్గకుండా నీడనిస్తోంది

ఆధునిక హంగులు

పెరటి వ్యాపకంగా ఉండే కోళ్ల పెంపకం పౌల్ట్రీ వ్యాపారంగా రూపుదిద్దుకున్నట్టూ.. వేన్నీళ్లకు చన్నీళ్లన్నట్టుండే పాల వ్యాపారం మిల్క్ అండ్ డెయిరీ ప్రొడక్ట్స్‌గా విశ్వరూపం చూపిస్తున్నట్టూ బంగారం వ్యాపారం కూడా కొత్త సింగారాలు పోతోంది. సాంప్రదాయికంగా పొందే స్వర్ణకారుని సేవలు కళ్లు మిరుమిట్లు గొలిపే షోరూమ్స్‌గా వెలిశాయి. నగరాలు, రాష్ట్రాలు, దేశాల సరిహద్దులు దాటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. లక్షల డిజైన్ల ఆర్నమెంట్స్‌తో కోట్ల వినియోగదారుల హృదయాలను కొల్లగొడుతున్నాయి. అడ్వాన్స్ గోల్డ్ పర్చేజ్ స్కీమ్ నుంచి కస్టమైజ్డ్ జ్యూలరీ మేకింగ్ వరకూ కొత్త బిజినెస్ వ్యూహాలతో వ్యాపారాన్ని మరో స్థాయికి తీసుకెళుతున్నాయి

అవకాశాలు అపారం

అవకాశాల అన్వేషణలో ఉన్న ఉద్యోగార్థులు ఒక పరిశ్రమను ఇంతగా ఎందుకు అధ్యయనం చేయాలంటే... ఇండస్ట్రీ ఎదుగుదలపైనే కంపెనీల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పరిశ్రమ విస్తృతిని బట్టే ఉద్యోగావకాశాలుంటాయి. వినియోగదారుల ప్రోత్సాహంతో పాటు ప్రభుత్వ అండదండలుంటేనే నూతన వ్యాపార, ఉద్యోగావకాశాలు విశాలమవుతాయి. ఈ కోణం నుంచి పరిశీలించినప్పుడు భారత స్వర్ణాభరణాల మార్కెట్టుకు తిరుగులేదు. అయితే ఈ పరిశ్రమకు ఎటువంటి మానవ వనరుల అవసరం ఉందో లోతుగా తెలుసుకుని ముందుకెళితే భవిష్యత్తు స్వర్ణకాంతులీనుతుంది.



- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

స్టాక్ ట్రేడింగ్ రిసెర్చ్

సంస్థ: సెర్టిఫైజ్‌హబ్
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, స్టాక్ ట్రేడింగ్
స్టైపెండ్: రూ. 2,000-2,500
☛ https://lnk.ink/iqCL7

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఉష్నిక్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, సేల్స్ సపోర్ట్
స్టైపెండ్: రూ. 4,000-7,000
☛ https://short-link.me/Internshala

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: గణపతి వెల్స్
నైపుణ్యాలు: కేన్వా, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ. 3,000-4,000
☛ https://lnk.ink/jnKWZ

ఐఓఎస్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: డాక్టర్స్ యాప్ నైపుణ్యాలు: ఐఓఎస్, జావా, రెస్ట్ ఏపీఐ, స్టోరీబోర్డింగ్, ఎక్స్‌కోడ్
స్టైపెండ్: రూ. 8,000
☛ https://lnk.ink/qT6op

గ్రాఫిక్ డిజైనర్ అండ్ వీడియో ఎడిటర్

సంస్థ: మ్యాగ్‌బ్లాక్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఫిగ్మా
స్టైపెండ్: రూ. 10,000-15,000
☛ https://lnk.ink/g5OS5

వాట్సాప్ మేనేజర్

సంస్థ: బడ్డింగ్ మారినర్స్
నైపుణ్యాలు: కేన్వా, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టైమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ. 2,000
☛ https://lnk.ink/IGsqv

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 1

ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ఏ అవకాశాలు?

బీఎస్సీ ఆర్గానిక్ ఫార్మింగ్ మూడో ఏడాది చదువుతున్నా. ఈ కోర్సుతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - కె.అరవింద్



■ ఆర్గానిక్ ఫార్మింగ్‌లో డిగ్రీ పూర్తి చేసినవారికి ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

● ఆర్గానిక్ సర్టిఫికేషన్ కంపెనీల్లో సర్టిఫికేషన్, క్వాలిటీ ఇన్‌స్పెక్షన్ విభాగాల్లో ఫీల్డ్ ఆడిటర్‌గా, ఆర్గానిక్ ఫార్మ్స్ కంపెనీల్లో ఫార్మ్ మేనేజర్, అసిస్టెంట్ అగ్రానమిస్టు, సాయిల్ అనలిస్ట్, ప్రొడక్షన్ సూపర్‌వైజర్లుగా పనిచేయవచ్చు. గ్రీన్ హౌస్ మేనేజ్‌మెంట్ లోనూ అవకాశాలున్నాయి.

● ఎగుమతి సంస్థల్లో క్వాలిటీ కంట్రోల్, సప్లై చెయిన్, ల్యాబ్ అసిస్టెంట్, అగ్రి స్టార్టప్స్‌లో సేంద్రియ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగాలుంటాయి.

● రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ సంస్థల్లో ఫీల్డ్ రిసెర్చ్ అసిస్టెంట్, ట్రెయినర్, డెమో ఆఫీసర్లుగా రైతులకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది.

● రిటెయిల్ కంపెనీల్లో ప్రొడక్ట్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్, కస్టమర్ ఎడ్యుకేషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా పని చేయవచ్చు.

● కన్సల్టెన్సీ సంస్థల్లో రైతులకు సలహాదారులుగా చేరవచ్చు.

● రైతులకు సాంకేతిక సహాయం కోసం సేంద్రియ వ్యవసాయం విభాగంలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలుంటాయి.

● అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్, మార్కెటింగ్ అసిస్టెంట్ ఉద్యోగాలనూ ప్రయత్నించవచ్చు.

● ప్రభుత్వరంగ సంస్థలైన ఐసీఏఆర్, నాబార్డ్, ఎన్ఎస్‌సీ, ఎఫ్‌సీఐ, ఇఫ్కో, క్రిభ్కో, అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో టెక్నికల్ అసిస్టెంట్, రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్, ఫీల్డ్ ఆఫీసర్, టెక్నికల్ ట్రెయినీ ఉద్యోగాలు లభిస్తాయి.

● వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్, డెమాన్‌స్ట్రేటర్, ల్యాబ్ టెక్నీషియన్, రిసెర్చ్ అసిస్టెంట్‌లుగా కూడా అవకాశం ఉంటుంది.

పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఎమ్మెస్సీ పూర్తి చేస్తే మరిన్ని ఉద్యోగాలకు అర్హత లభిస్తుంది. డిగ్రీ, పీజీలతో పాటు సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చు.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



ఏఆర్‌సీఐలో సైంటిస్టులు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ అండ్ న్యూ మెటీరియల్ (ఏఆర్‌సీఐ).. 11 సైంటిస్ట్ పోస్టులను ప్రకటించింది. అభ్యర్థులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారు.

సైంటిస్ట్ ఈ-3, సైంటిస్ట్ సీ-1, సైంటిస్ట్ బీ-7 ఖాళీలు ఉన్నాయి.

▼ సైంటిస్ట్-ఈ: ఫిజికల్ సైన్స్‌స్‌లో డాక్టరేట్ డిగ్రీ/ ఇంజినీరింగ్/ టెక్నాలజీ మాస్టర్స్ డిగ్రీ. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పరిశ్రమలు/ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్/ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థల్లో పదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. ఆర్అండ్‌డీ ప్రాజెక్టులు, ప్రోగ్రాముల్లో పనిచేసినవారికి ప్రాధాన్యమిస్తారు.

▼ సైంటిస్ట్ సీ: ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిగ్రీ. ఆర్అండ్‌డీ, విద్యాసంస్థలు, సైన్స్‌అండ్ టెక్నాలజీ సంస్థల్లో నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. మాస్టర్స్ డిగ్రీ చేసిన వారికి ప్రాధాన్యమిస్తారు.

▼ సైంటిస్ట్ బీ: ఫిజికల్ సైన్సెస్/ కెమికల్ సైన్సెస్‌లో మాస్టర్స్ డిగ్రీ. డాక్టరేట్ డిగ్రీ చేసినవారికి ప్రాధాన్యమిస్తారు. రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.

వయసు: సైంటిస్ట్-ఈకి 45, ఇతర పోస్టులకు 35 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: సైంటిస్ట్-ఈ, సీ అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు రూ.1000. సైంటిస్ట్-బీ.. జనరల్, ఓబీసీలకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.300.

వేతనం: సైంటిస్-ఈ నెలకు రూ.2,38,895, సైంటిస్ట్-సీకురూ.1,36,405, సైంటిస్ట్-బీకి రూ.1,14,945. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, ఎన్‌పీఎస్, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్స్యూరెన్స్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎల్‌టీసీ, వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక ఇలా..

✦ సైంటిస్ట్ బీకి రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటాయి. రాత పరీక్ష మల్టిపుల్ చాయిస్ విధానంలో 300 మార్కులకు ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున 100 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-ఏలో సబ్జెక్టు సంబంధిత 90 ప్రశ్నలకు 270 మార్కులు. సెక్షన్-బీలో అనలిటికల్ స్కిల్స్/ లాజికల్ రీజనింగ్‌కు చెందిన 10 ప్రశ్నలకు 30 మార్కులు.

కనీసార్హత మార్కులు సాధించిన వారిని 1:10 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 100 మార్కులు. రాత పరీక్షకు 50 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. రాత పరీక్ష ఆగస్టులో జరగొచ్చు. ఈ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలను ఏఆర్‌సీఎల్, హైదరాబాద్‌లో నిర్వహిస్తారు.

✦ సైంటిస్ట్-ఈ.. 15-20 నిమిషాల ప్రజెంటేషన్ ఇవ్వాలి. గత ఉద్యోగంలో నిర్వర్తించిన విధులు, రిసెర్చ్ ప్రపోజల్ గురించి వివరించగలగాలి.

✦ సైంటిస్ట్-సీ.. గత ఉద్యోగ బాధ్యతలకు సంబంధించి 15-20 నిమిషాల ప్రజెంటేషన్ ఇవ్వాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.07.2025
వెబ్‌సైట్: http://www.arci.res.in/careers

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

Wordwise-34

క్రాస్‌వర్డ్ పజిల్స్ పూర్తి చేసి కొత్త పదాలను ఆనందంగా నేర్చుకోవచ్చు. ఇక్కడ ఉన్న 'వర్డ్ వైజ్'ను ఒకసారి ప్రయత్నించండి. ఇది వినోదంతో పాటు పోటీ పరీక్షల్లో విజయానికి కూడా తోడ్పడుతుంది.

ACROSS

1. To light a fire or spark an interest; warms up both wood and hearts
7. To draw out a reply or reaction — like getting an answer without forcing it!
8. It's the sound thunder makes… or a noisy fight that shakes!
9. In colleges or university, the Assistant Registrar is known by these letters.
10. It swims like a snake, smooth and thin. It's not a snake but a fish.
12. A channel for toons, laughter, and cheer.
13. The word 'Lessee' — which means a person who rents a house or land — is jumbled.

DOWN

1. It's the soft, central part of a seed — or the core idea at the heart of a thought.
2. A short and cute way to say 'I Love You' in texts.
3. Quick and light in movement; moves with ease — like a cat or a dancer.
4. Not SBI, not HDFC — it's a Credit Bank for development.
5. Pretty flowers, often purple, sweet-smelling and bloom in spring.
6. This old-fashioned word means something that lasts forever — timeless and eternal.
11. Short form of subjects like 'English Studies' or 'Environmental Science'.

- డా. వంగీపురం శ్రీనాథాచారి

1	2	3	4	5	6
7					
8					
	■		■	9	
10	11		■	12	
13					

ANSWERS

DOWN: 1. KERNEL 2. ILU 3. NIMBLE 4. DCB (Development Credit Bank) 5. LILACS 6. ETERNE 11. ES

ACROSS: 1. KINDLE 7. ELICIT 8. RUMBLE 9. AR 10. EEL 12. CN (Cartoon Network) 13. LSEESE (LESSEE)

పోర్ట్ అథారిటీలో ఫైర్‌మెన్



గుజరాత్ కచ్‌లోని దీన్ దయాళ్ పోర్ట్ అథారిటీ 35 ఫైర్‌మెన్ పోస్టులను భర్తీ చేయనుంది. ఒప్పంద ప్రాతిపదికన మూడేళ్ల కాలపరిమితికి ఎంపిక చేస్తారు.

మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 19, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 9 కేటాయించారు.

అర్హతలు: పదో తరగతి/ తత్సమాన పరీక్ష.

■ ఫైర్ ఫైటింగ్ డిప్లొమా
■ స్విమ్మింగ్ టెస్టులో పాసవ్వాలి.
■ పారామిలిటరీ ఫోర్స్‌కు అవసరమైన ఎత్తు, బరువు.
■ ఎత్తు ఐదున్నర అడుగులు, బరువు 50 కేజీలు. ఛాతీ 32 అంగుళాలు ఉండి.. గాలి పీల్చినప్పుడు 2 అంగుళాలు పెరగాలి. ■ ఫైర్‌మ్యాన్‌గా ఏడాది అనుభవం.

వయసు: 01.07.2025 నాటికి 25 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ. 31,500. ఎంపికైనవారికి ఉచిత వసతి, సెలవులు, ఉద్యోగికి, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక: అకడమిక్, సాంకేతిక విద్యార్హతలు, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్టు చేసి.. ఎండ్యూరెన్స్ టెస్టుకు ఎంపికచేస్తారు.

▲ దీంట్లో భాగంగా.. 100 మీటర్ల దూరాన్ని 50 కేజీల బరువుతో ఒక్క నిమిషంలో పూర్తిచేయాలి.

▲ నేల మీది నుంచి 18 అడుగుల పొడవున్న తాడును ఎక్కగలగాలి.

▲ దీంట్లో అర్హత సాధించినవారికి స్విమ్మింగ్ టెస్ట్ నిర్వహించి కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

▲ ఎంపికైనవారి వివరాలను డీపీఏ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

చిరునామా: దరఖాస్తులకు సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి.. డిప్యూటీ కన్జర్వేటర్, దీన్ దయాళ్ పోర్ట్ అథారిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్, రూం.నం:211, పోస్ట్ బాక్స్ నం.50, గాంధీధామ్, కచ్, గుజరాత్-370 201కు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 10.07.2025
వెబ్‌సైట్: http://www.deendayal-port.gov.in/

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఎఫ్‌డీడీఐలో ఫ్యాకల్టీ

హరియాణా రోహ్‌తక్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) 4 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ లేదా పీజీ, బీటెక్/బీఈ/బీఎస్సీ ఇంజినీరింగ్ లేదా ఎంటెక్/ఎంఈ/ఎమ్మెస్సీ ఇంజినీరింగ్‌తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: జూనియర్ ఫ్యాకల్టీకి 35 ఏళ్లు, ఫ్యాకల్టీకి 40 ఏళ్లు.
వేతనం: నెలకు ఫ్యాకల్టీకి రూ.65,000, జూనియర్ ఫ్యాకల్టీకి రూ.45,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.07.2025
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://fddiindia.com/career

ఎన్‌హెచ్‌ఏఐలో డిప్యూటీ మేనేజర్లు

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 12 డిప్యూటీ మేనేజర్ (ఐటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి బీటెక్ (కంప్యూటర్ సైన్స్ లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్), గేట్ స్కోరు, పని అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకి 15 ఏళ్ల సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.56,100 - రూ.1,77,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.08.2025
ఎంపిక: గేట్ స్కోరు (కంప్యూటర్ సైన్స్)తో.
వెబ్‌సైట్: https://nhai.gov.in/#/

సీడ్యాక్‌లో కంప్యూటింగ్ రిసెర్చ్...

బెంగళూరులోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్).. ఒప్పంద ప్రాతిపదికన 280 అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రిసెర్చ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ డిజైన్ ఇంజినీర్ ఈ1: 203 ◗ సీనియర్ డిజైన్ ఇంజినీర్ ఈ2: 67
◗ ప్రిన్సిపల్ డిజైన్ ఇంజినీర్ ఈ3: 05 ◗ టెక్నికల్ మేనేజర్ ఈ4: 03
◗ సీనియర్ టెక్నికల్ మేనేజర్ ఈ5: 01 ◗ చీఫ్ టెక్నికల్ మేనేజర్ ఈ6/ కన్సల్టెంట్: 01 **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీజీ, పీజీ డిప్లొమా, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ. **ఎంపిక:** రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూలతో. పని స్థలం: బెంగళూరు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.07.2025.
వెబ్‌సైట్: https://careers.cdac.in/

ఈస్ట్ కోస్ట్ రైల్వేలో టెక్నీషియన్లు

భువనేశ్వర్‌లోని ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం తాత్కాలిక ప్రాతిపదికన వివిధ స్థాయి టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
◗ టెక్-I (SM)-05 ◗ టెక్-II (SM)-01 ◗ టెక్-III (SM)-06
◗ టెక్-I (TCM)-01 ◗ టెక్-II (TCM)-01 ◗ టెక్-III (TCM)-04
అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ/యాక్ట్ అప్రెంటిస్‌షిప్, ఇంటర్‌తో పాటు ఉద్యోగ అనుభవం. ఎంపిక: రాత పరీక్షతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: 04.08.2025.
వెబ్‌సైట్: https://eastcoastrail.indianrailways.gov.in/

పీజీఐఎంఈఆర్‌లో 114 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ & రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 114 గ్రూప్ 'బి' & 'సి' ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
పీజీఐఎంఈఆర్, చండీగఢ్: 51
◗ లీగల్ అసిస్టెంట్- 01 ◗ జూనియర్ టెక్నీషియన్ (ల్యాబ్)- 31
◗ జూనియర్ టెక్నీషియన్ (ఎక్స్-రే)- 06 ◗ జూనియర్ టెక్నీషియన్ (రేడియోథెరపీ)- 03 ◗ టెక్నీషియన్ ఓటీ- 04 ◗ డెంటల్ హైజీనిస్ట్ గ్రేడ్-II- 02 ◗ అసిస్టెంట్ డైటీషియన్- 02 ◗ రిసెప్షనిస్టు- 01 ◗ జూనియర్ ఆడిటర్- 01
పీజీఐ శాటిలైట్ సెంటర్, సంగ్రూర్, పంజాబ్: 63
◗ నర్సింగ్ ఆఫీసర్- 51 ◗ స్టోర్ కీపర్- 01 ◗ జూనియర్ టెక్నీషియన్ (ల్యాబ్)- 06 ◗ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ (యూడీసీ)- 02
◗ జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ (ఎల్‌డీసీ)- 03
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఇంటర్మీడియట్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, లా డిగ్రీ, ఎంబీఏ, ఎమ్మెస్సీలతో పాటు ఉద్యోగానుభవం. కొన్ని పోస్టులకు నర్సింగ్ కౌన్సిల్, డెంటల్ కౌన్సిల్‌లలో నమోదు చేసుకోవాలి.
వయసు: పోస్టును అనుసరించి 18- 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ స్కోరుతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: 04.08.2025.
పరీక్ష కేంద్రాలు: చండీగఢ్/ మొహాలీ, దిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా.
దరఖాస్తు ఫీజు: ఓసీ/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు రూ.1,500, ఎస్సీ/ఎస్టీ రూ.800. దివ్యాంగులకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://pgimer.edu.in/PGIMER_PORTAL/PGIMERPORTAL/home.jsp

వాక్-ఇన్

సీఎస్ఐఆర్ ఫోర్త్ పారడైమ్‌లో..

బెంగళూరులోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఫోర్త్ పారడైమ్ ఇన్‌స్టిట్యూట్.. తాత్కాలిక ప్రాతిపదికన 15 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఆహ్వానిస్తోంది.
◗ ప్రాజెక్ట్ అసోసియేట్-I/II (పీఏటీ I/II): 14
◗ ప్రాజెక్ట్ అసిస్టెంట్ II (పీఏ II): 01
అర్హత: సంబంధిత విభాగంలో బీటెక్/ బీఈ/ ఎమ్మెస్సీ, ఎంఈ/ ఎంటెక్.
వేతనం: ప్రాజెక్ట్ అసోసియేట్-Iకు రూ.31,000; ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.35,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 22.07.2025.
వేదిక: సీఎస్ఐఆర్-4పీఐ, ఎన్ఏఎల్ బేలూర్ క్యాంపస్, విండ్ టన్నెల్ రోడ్, బెంగళూరు. వెబ్‌సైట్: https://csir4pi.res.in/

స్కాలర్‌షిప్

సెంట్రల్ సెక్టర్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్

భారతప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ప్రధాన్‌మంత్రి ఉచ్ఛతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన కింద సెంట్రల్ సెక్టర్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ స్కీమ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
అండర్‌గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.12,000 (మొదటి 3 సంవత్సరాలకు) **పీజీ స్కాలర్‌షిప్:** సంవత్సరానికి రూ.20,000. **ఇంటిగ్రేటెడ్ / ప్రొఫెషనల్ కోర్సులు:** 4వ, 5వ సంవత్సరానికి సంవత్సరానికి రూ.20,000.
అర్హత: ఇంటర్మీడియట్ పరీక్షలో 80 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.4.5 లక్షలకు మించకూడదు. ప్రతి సంవత్సరం 50% మార్కులు, 75% హాజరు అవసరం.
విద్యార్థుల వయసు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 31.10.2025.
వెబ్‌సైట్: https://scholarships.gov.in/All-Scholarships

ఆనందరాజు మృతిపై చంద్రబాబు సంతాపం

ఈనాడు, అమరావతి: రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకుడు వేగేశ్న ఆనందరాజు మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకొన్నారు. సోమవారం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ ఎక్స్‌లో పోస్టుచేశారు.

వృత్తి విద్య ప్రవేశాల ఫీజుపై గందరగోళం

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సు ప్రవేశ రుసుములపై గందరగోళం నెలకొంది. వృత్తి విద్యలో చేరే విద్యార్థులు రెండు రకాల ల్యాబ్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అవి కాకుండా ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన సర్క్యులర్‌లో సైన్సు విద్యార్థులతో సమానంగా రూ.495 చెల్లించాలని పేర్కొన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో చాలామంది ప్రిన్సిపాళ్లు వృత్తి విద్య కోర్సుల ప్రవేశాలకు ఈ మొత్తాన్ని అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో పేద విద్యార్థులపై భారం పడుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోటు బుక్కులు, భోజనం అందిస్తుండగా, మరోపక్క వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలపై గందరగోళం సృష్టిస్తున్నారు.

రెండేళ్లుగా పారితోషికాలు పెండింగ్..

వృత్తి విద్య ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన పారితోషికాలను గత రెండేళ్లుగా అధ్యాపకులకు చెల్లించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్, సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షల విధుల్లో పాల్గొనే ఎగ్జామినర్లకు పారితోషికాలు చెల్లించడం లేదు. ఈ ఏడాది ప్రయోగ పరీక్షల సమయంలో గతేడాది బకాయిలు చెల్లిస్తేనే విధులకు హాజరవుతామని అధ్యాపకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయగా.. బోర్డు అధికారులు నచ్చచెప్పడంతో విధులకు హాజరయ్యారు. కానీ ఇప్పటివరకు పారితోషికాలు చెల్లించలేదు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి: ఎమ్మెల్సీ

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల పదవీవిరమణ ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు కోరారు. సచివాలయంలో సోమవారం పీఆర్టీయూ అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్యతో కలిసి ఆయన సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. "11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలి. ఉపాధ్యాయులకు సరెండర్ సెలవుల పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలి. మధ్యంతర భృతి 30% చెల్లించాలి. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి వైద్య బిల్లు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లించాలి" అని శ్రీనివాసులునాయుడు కోరారు.

భవాని మరిన్ని విజయాలు సాధించాలి: మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: 'ఆసియా యూత్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుతంగా రాణించి బంగారు పతకం సాధించిన విజయనగరం జిల్లాకు చెందిన రెడ్డి భవానికి హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని చిరస్మరణీయ విజయాలు సాధించాలి' అని మాజీ సీఎం జగన్ సోమవారం 'ఎక్స్'లో ఆకాంక్షించారు.



నాయనార్ల శిల, పంచలోహ విగ్రహాల కొలువు

కాకినాడ జిల్లాలో 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీలలితా కుమారీ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ, ఉపాలయాల్లో దక్షిణామూర్తి తదితర దేవతామూర్తుల ప్రతిష్ఠ సోమవారం కనులపండువగా జరిగింది. క్షేత్ర మండపంలోని నాయనార్ల శిల, పంచలోహ విగ్రహాలను కొలువుదీర్చారు. అరుణాచల మాధవి, స్వామి రామానంద మహర్షివెళ్ళితో ఆర్యులకు ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాచపల్లిలో అరుణాచలేశ్వరుని ఆధ్యాత్మిక వారసత్వంగా నిస్సందేని స్వామిజీలు, ప్రముఖులు సృష్టించిన చేశారు. నాయనార్ల విగ్రహాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, గాయని ఎస్.పి.శైలజ, సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్య కళాశాలల నిర్మాణంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

జగన్‌కు.. మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్

ఈనాడు, అమరావతి: చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే వైద్య కళాశాలల నిర్మాణంపై బహిరంగ చర్చకు రావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. మాజీ సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైకాపా విద్యార్థి విభాగం చేసిన పోస్టుపై మంత్రి స్పందించారు. 'ఏనాడూ తప్పితే ఇల్లు కట్టినట్లు లెక్కలు చెప్పడం మానుకుని వాస్తవాలు చెప్పండి. 17 వైద్య కళాశాలలు తామే కట్టేశామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఎందుకు..? వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.8,480 కోట్లు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రాయోజిత పథకాలు, నాబార్డు నిధులు కలిపి ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.1,282.31 కోట్లే.. ఆ పనులకు బిల్లులు చెల్లించలేదు' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

అంతరిక్షంలో జెండా ఎగరేద్దాం.. రండి!

- స్పేస్ పాలసీ 4.0లో ప్రోత్సాహకాలివీ..

ఈనాడు, అమరావతి: అంతరిక్ష(స్పేస్) పరిశోధన రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'ను ప్రభుత్వం సిద్ధం చేసింది. భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడు, శుక్ర గ్రహాలపై పరిశోధనలు నిర్వహించడంపై జాతీయ స్పేస్ ఏజెన్సీలు దృష్టి సారించాయి. నావిగేషన్, సురక్షిత సమాచార మార్పిడి, వాతావరణ సూచనలను అందించే సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు వ్యూహాత్మక స్పేస్ మిషన్లను రూపొందిస్తున్నాయి. జాతీయ స్పేస్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా మానవ అంతరిక్ష యాత్ర, స్పేస్ టూరిజం వెంచర్లలో ఎర్త్ ఆర్బిట్ నివాస మాడ్యూళ్లను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్పేస్ పాలసీని తీసుకొచ్చింది. అంతరిక్ష రంగంలో తయారీ, సేవలను ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ఇందులో భాగంగా స్టార్టప్‌లకు, తయారీ, అసెంబ్లింగ్ యూనిట్లకు పలు రాయితీలను అందించనుంది. వివరాలివీ...

స్టార్టప్‌లకు గ్రాంట్‌లు

నవకల్ప ఆలోచనల ఆధారంగా టెస్టింగ్.. కాన్సెప్టుల తయారీకి...

1. తొలిదశ పరిశోధనలకు రూ.2 లక్షల గ్రాంట్.
2. తొలి, తదుపరి దశల పనితీరు ఆధారంగా ఉత్పత్తి సాధించే వరకు విడతల వారీగా ఒక్కో స్టార్టప్‌నకు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు గ్రాంట్.
3. ప్రభుత్వ శాఖలు.. స్పోక్ సెంటర్లు ప్రత్యేక గ్రాంట్ హ్యాకథాన్‌ల నిర్వహణ.

- బీసీ/ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ/దివ్యాంగులకు... ఒక్కో స్టార్టప్‌నకు గ్రాంటు కింద రూ.20 లక్షలు.
- దీర్ఘకాలిక రుణాలపై 8 శాతం వడ్డీ రాయితీ.
- ఈక్విటీ వాటా విధానంలో రూ.50 లక్షల వరకు ఫండింగ్.
- మార్కెట్ మద్దతు పరంగా ఈక్విటీ వాటాల సమూనాలో రూ.50 లక్షల వరకు ఫండింగ్.
- ఏడాదిలో ఒకసారి ఈవెంట్/ఫెయిర్‌కు హాజరయ్యేందుకు చేసిన ఖర్చులో 75 శాతం.. గరిష్ఠంగా రూ.3 లక్షలు చెల్లింపు.
- రెండు యాక్సిలరేటర్ ప్రోగ్రాంలకు చేసే ఖర్చులో 50 శాతం.. ఒక్కో ప్రోగ్రాంకు రూ.2 లక్షల చొప్పున రెండింటికి అనుమతి.
- పేటెంట్‌కు చేసే ఖర్చులో 50 శాతం(గరిష్ఠంగా రూ.2 లక్షలు).. విదేశీ పేటెంట్ కోసమైతే రూ.10 లక్షల వరకు చెల్లింపు.

పెట్టుబడుల ఆధారంగా తయారీ.. అసెంబ్లింగ్ యూనిట్లకు ప్రోత్సాహకాలు

కేటగిరీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	వ్యవధి (సంవత్సరాలు)
ఎంఎస్ఎంఈ	కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల అమలు	2
భారీ పరిశ్రమలు	రూ.125 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు	3
మెగా పరిశ్రమలు	రూ.500 కోట్లకు పైగా	4

ఎంఎస్ఎంఈలకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(ఎఫ్‌సీఐ)లో రాయితీ

కేటగిరీ	జనరల్	ప్రత్యేక కేటగిరీ	గరిష్ఠంగా ఇచ్చేది
సూక్ష్మ	ఎఫ్‌సీఐపై 25 శాతం.. 2 ఏళ్లలో చెల్లింపు	ఎఫ్‌సీఐపై 45 శాతం	రూ.2 కోట్లు
చిన్న	ఎఫ్‌సీఐపై 25 శాతం.. 3 ఏళ్లలో చెల్లింపు	ఎఫ్‌సీఐపై 45 శాతం	రూ.9 కోట్లు
మధ్య	ఎఫ్‌సీఐపై 25 శాతం.. 4 ఏళ్లలో చెల్లింపు	ఎఫ్‌సీఐపై 35 శాతం	రూ.15 కోట్లు

- టెక్నాలజీ బదిలీ కోసం దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు చేసే ఖర్చులో 50 శాతం.. గరిష్ఠంగా రూ.కోటి చొప్పున నాలుగేళ్లలో చెల్లింపు. దీనికోసం రూ.100 కోట్లతో కార్పస్ నిధి ఏర్పాటు.

- ఐదేళ్లపాటు జీఎస్టీ పూర్తిగా మినహాయింపు.

డీప్‌టెక్.. అడ్వాన్స్‌డ్ టెక్ స్టార్టప్‌లకు

ఈక్విటీ ఆధారిత సీడ్ ఫండ్

1. రూ.కోటి వరకు.
2. గుర్తింపు పొందిన వర్క్‌స్టేషన్లు/కో-వర్కింగ్/నైబర్‌హుడ్ వర్క్/ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఏర్పాటు చేసే స్టార్టప్‌లకు (ఏటా 30 మందికి ఉపాధి కల్పించినట్లయితే) పూర్తిగా అద్దె మినహాయింపు.

తయారీ రంగానికి...

- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా తయారీ, సేవా రంగాలకు యూనిట్‌కు రూపాయి రాయితీ చొప్పున పలు దశల్లో విద్యుత్తు రాయితీలనూ అందించనుంది.
- వాణిజ్య ఉత్పత్తిలోకి వచ్చినప్పటి నుంచి 5 ఏళ్లపాటు జీఎస్టీ పూర్తిగా తిరిగి చెల్లింపు.
- బ్రాండింగ్, మార్కెట్ సహకారానికి చేసే ఖర్చులో 25 శాతం.. గరిష్ఠంగా రూ.కోటి... మూడేళ్లలో చెల్లింపు.
- నైపుణ్య శిక్షణ కోసం చేసే ఖర్చులో 50 శాతం చెల్లింపు.. గరిష్ఠంగా రూ.7 లక్షలు.
- యూనిట్ ఏర్పాటుకు కొనుగోలు చేసిన భూములపై స్టాంపు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ పూర్తిగా తిరిగి చెల్లింపు.

భారీ.. మెగా పరిశ్రమలకు...

- ఎఫ్‌సీఐగా అనుమతించిన మొత్తానికి సమానంగా ప్రోత్సాహకాల చెల్లింపు.
- భూముల కొనుగోలు/లీజు కోసం చెల్లించాల్సిన స్టాంపు.. బదిలీ డ్యూటీ పూర్తిగా మినహాయింపు.
- భూముల మార్పిడి కోసం చేసే ఖర్చు పూర్తిగా మినహాయింపు.

జలజీవన్ మిషన్‌కు కార్పొరేషన్ ఏర్పాటు!

- రాష్ట్ర వాటా నిధుల సమీకరణకు ప్రభుత్వం ప్రణాళిక
- బ్యాంకుల ద్వారా రుణం తీసుకోవాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి: జలజీవన్ మిషన్ పనులకు రాష్ట్ర వాటా నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా కొన్ని జాతీయ బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.11 వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వం సేకరించనుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను బుధవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదం కోసం పెట్టనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రూ.80 వేల కోట్లతో పునర్వ్యవస్థీకరించిన జలజీవన్ పనులకు కేంద్రం నుంచి ఆమోదం వచ్చేలోపు.. వైకాపా హయాంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.26 వేల కోట్లలో మిగిలిపోయిన రూ.22 వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రూ.13 వేల కోట్లతో సింగిల్, మల్టీ విలేజ్ తాగునీటి పథకాల పనులకు ఇటీవల టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఏజెన్సీలను ఖరారు చేసింది. మరో రూ.9 వేల కోట్ల పనులకు ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది. ఇప్పుడీ పనుల్లో ముందడుగు పడాలంటే రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.11 వేల కోట్లు (50%) మొదట సమకూర్చాలి. అప్పుడు గానీ కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదలయ్యే అవకాశం లేదు. ఈ నేపథ్యంలోనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి నిధులు సమీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. దీనికి రాష్ట్ర ఆర్థికశాఖ కూడా అనుమతి ఇవ్వడంతో మంత్రివర్గం ఆమోదం కోసం ప్రతిపాదిస్తున్నారు. కాగా, రుణం మంజూరు చేసేందుకు రెండు, మూడు జాతీయ బ్యాంకులు ముందుకొచ్చాయి. వడ్డీ, వాయిదాల చెల్లింపు తదితర అంశాల్లో తుది నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలుస్తోంది.

రాష్ట్ర వాటా ఇవ్వని వైకాపా ప్రభుత్వం

వైకాపా హయాంలో కేంద్ర ప్రభుత్వం రూ.26 వేల కోట్లకు పైగా విలువైన జలజీవన్ ప్రాజెక్టులు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50% చొప్పున నిధులు సమకూర్చాలన్నది ఒప్పందం. అయితే జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు సమకూర్చని కారణంగా కేంద్రం కేటాయించిన నిధుల్లో నుంచి రూ.4 వేల కోట్లకు మించి ఖర్చు చేయలేకపోయారు. దాంతో చేసిన కొద్దిపాటి పనులూ ప్రయోజనం లేకుండా పోయాయి. నీటి లభ్యత లేకుండానే గ్రామాల్లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో.. అవి అలంకారప్రాయంగా మిగిలాయి. ఈ నేపథ్యంలోనే సమీపంలోని నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించి ప్రజలకు అన్ని సీజన్లలోనూ కుళాయిల ద్వారా నీరు అందించేలా కూటమి ప్రభుత్వం జలజీవన్ పనులను పునర్వ్యవస్థీకరించింది.

వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో మహిళలకు 60 సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజనతో శాసనసభలో సీట్ల సంఖ్య 153కి పెరుగుతుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలులోకి రాబోతున్నాయని, దాని ద్వారా వారికి 51 సీట్లు లభిస్తాయని పేర్కొన్నారు. వాటికి మరో 9 పెంచి 60 సీట్లు కేటాయించే బాధ్యత తనదని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం వన మహోత్సవం-2025ను రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. "ప్రతి ఇంటా మహిళలు రెండేసి మొక్కలు నాటాలి. వారి పిల్లల్లాగే మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ హరితవనంగా మారుతుంది. ప్రకృతిని మనం కాపాడితేనే.. అది మనల్ని కాపాడుతుంది. ఈ ఏడాది 18.03 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని మోదీ ఇప్పటికే పిలుపునిచ్చారు. అమ్మలు కూడా తమ పిల్లల పేరుతో మొక్కలు నాటాలి. ప్రతి ఇంట్లో కనీసం రెండు పెంచాలి. తద్వారా రాష్ట్రమంతా పచ్చదనం నిండిపోతుంది. మా ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తోంది. కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం. గతంలో సౌర విద్యుత్ ప్లాంట్లను అదానీలే పెట్టారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం సోలార్ ప్లాంట్లు ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతనూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఆడబిడ్డలకు అప్పగించాం. పిల్లలకు ఉపాధ్యాయులు హాజరు వేస్తే... ఉపాధ్యాయులకు మహిళలు అటెండెన్స్ వేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి, బస్సులకు యజమానులను చేశాం. హైటెక్ సిటీలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉండే ప్రాంతంలో... రూ.కోట్ల విలువైన స్థలంలో మహిళా శక్తి బజార్‌ను నిర్మించాం. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించాం. ఆ ఉత్పత్తులను చూసి మిస్ వరల్డ్ పోటీదారులు అభినందించారు. ఐకేపీ కేంద్రాల ద్వారానే వడ్లను కొంటున్నాం. పట్టణ ప్రాంతాల్లోని మహిళలూ మహిళా సంఘాల్లో చేరాలి. ఈ ఏడాది సంఘాలకు రూ.21 వేల కోట్ల రుణాలు అందించాం. ఆడబిడ్డలను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నాం. ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం.



వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్క నాటి మట్టి పోస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, పీసీసీఎఫ్ సువర్ణ తదితరులు

ఇల్లు వచ్చిందని నీడను చెరిపేసుకున్నాం!



కలెక్టర్‌ను కలిసేముందు మూగవారైన భర్త రామన్న, పిల్లలు నవీన్, నందినితో చర్చిస్తున్న లక్ష్మి



తమ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు వేసిన ముగ్గు

...ఈ ఫొటోలో నలుగురి మధ్య మాటల యుద్ధం జరుగుతుందనుకుంటే పొరబడినట్లే. వీరి వేదన మాటల్లో చెప్పలేనిది. ఎందుకంటే వీరిలో ముగ్గురు మూగవాళ్లే. తమ బాధను కలెక్టర్‌కు ఎలా విన్నవించాలో సైగల ద్వారా చర్చించుకుంటున్న వీరి సొంతూరు తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి. వీరిలో రామన్న, కీర్తిలక్ష్మి భార్యాభర్తలు. వారి సంతానం నవీన్, నందిని. తండ్రి, ఇద్దరు పిల్లలు మూగవారే. కూలి పనులు చేసుకుంటూ చిన్న పెంకుటింట్లో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో సంతోషించారు. పెంకుటిల్లును కూల్చేసి, కొత్త ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. అంతలోనే అధికారులు వచ్చి... లక్ష్మి కుటుంబానికున్న స్థల విస్తీర్ణం 273 చదరపు అడుగులే ఉందని, ఈ పథకం కింద ఇల్లు కట్టుకోవాలంటే 400-600 చదరపు అడుగుల మధ్య ఉండాలని స్పష్టంచేశారు. దాంతో అంతా కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించడానికి సోమవారం ఆదిలాబాద్ వచ్చారు. "ప్రత్యేక కేటగిరీగా పరిగణించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయం చేస్తా" అని కలెక్టర్ రాజర్షి షా భరోసా కల్పించారు.

– ఈనాడు, ఆదిలాబాద్, న్యూస్‌టుడే, కలెక్టరేట్

ప్రమాదకర పరిస్థితిలో శ్రీశైలం జలాశయం

- తక్షణమే డ్యాం ప్లంజ్‌పూల్ మరమ్మతులకు చర్యలు చేపట్టండి
- కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ లేఖ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణానదిపై కీలక ప్రాజెక్టు శ్రీశైలం ప్రమాదకర పరిస్థితిలో ఉందని, కేంద్రం తక్షణమే స్పందించి డ్యాం దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ మరమ్మతులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి శాఖను తెలంగాణ ప్రభుత్వం కోరింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం రాత్రి శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులతో శ్రీశైలం ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించారు. మంత్రి సూచన మేరకు డ్యాం నిర్వహణ పరిస్థితులపై రాహుల్ బొజ్జా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. 'ఏటా కృష్ణా నదికి వస్తున్న భారీ వరదలతో శ్రీశైలం డ్యాం దిగువన లోతైన గుంత ఏర్పడింది. ఎన్డీఎస్ఏతో పాటు పలు కమిటీలు దీనిపై అధ్యయనం చేసి డ్యాంకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించాయి. మరమ్మతులకు సంబంధించి పలు సిఫార్సులు కూడా చేశాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా కృష్ణా బోర్డుకు, ఎన్డీఎస్ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ)కు పలుమార్లు లేఖలు రాసింది. ఆనకట్ట గ్యాలరీ, స్లూయిస్‌లు కూడా సరిగా లేవు. రాష్ట్ర డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ కూడా ఎన్డీఎస్ఏకు లేఖ రాసింది. ప్రాజెక్టుల గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు శ్రీశైలం గేట్ల నిర్వహణపై తాజాగా ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను తెలంగాణ చేపడుతుండగా ఇటీవలే నిర్వహణ పనులను పూర్తి చేశాం. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీ పరిధిలో ఉంది. డ్యాంను ఆ రాష్ట్రం విస్మరిస్తోంది. కేంద్రం వెంటనే స్పందించి ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ పూనుకునేలా చొరవ చూపాలి' అని లేఖలో కోరారు.

చదువుతో పాటు నెలనెలా జీతం

ఆర్ఏఎన్‌సీఐతో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ అవగాహన ఒప్పందం

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో చదువుతో పాటు నైపుణ్యాల్ని పెంచడం, ఉపాధావకాశ ఆధారిత విద్యనందించడం లక్ష్యంగా డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఒప్పందానికి ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి వెల్లడించారు. సోమవారం వర్సిటీలో రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఎన్‌సీఐ) సంస్థ ఎగ్జిక్యూటివ్ హెడ్ జెస్సీ రాఫెల్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం వీసీ చక్రపాణి మాట్లాడుతూ.. ఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న మొదటి వర్సిటీ తమదేనన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించడం లేదా వ్యాపారవేత్తలుగా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంలో చేరడం ద్వారా నెలకు కనీసంగా రూ.7 వేల నుంచి గరిష్ఠంగా రూ.24 వేలకు పైగా సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. 28 ఏళ్ల వయసుండి, తమ వర్సిటీ నుంచి ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసిన వాళ్లు కూడా అర్హులేనని వెల్లడించారు. త్వరలోనే వర్సిటీ వెబ్‌పోర్టల్‌లో వివరాలను పొందుపరుస్తామని వెల్లడించారు. ఆర్ఏఎన్‌సీఐ ప్రతినిధి సమీర్ నర్సాపూర్ మాట్లాడుతూ పరిశ్రమే ఉత్తమ ఉపాధ్యాయుడు అని, వృత్తిపరమైన ప్రమాణాలను రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఏఎన్‌సీఐ (సౌత్‌రీజియన్) జనరల్ మేనేజర్ చంద్రా వడ్డే తదితరులు పాల్గొన్నారు.

నీట్ యూజీ రాష్ట్ర ర్యాంకర్ల జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: నీట్ యూజీ-2025లో అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. రాష్ట్రం నుంచి 57,934 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 36,776 మంది కనీస మార్కులు సాధించి.. ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశానికి అర్హత సాధించారు. దిల్లీ నుంచి అందిన సమాచారం మేరకు రాష్ట్రం నుంచి వరుస క్రమంలో ర్యాంకులు పొందిన విద్యార్థుల జాబితాను విశ్వవిద్యాలయం వెల్లడించింది. ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ తేదీల నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేస్తామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలు, ప్రవేశాల షెడ్యూలును అనుసరించి రాష్ట్ర స్థాయిలో నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. రిజర్వేషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రకటించిన ప్రొవిజినల్ విద్యార్థుల జాబితాలో స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు.

19వ ర్యాంకుతో ప్రారంభం..

రాష్ట్రం నుంచి తొలి ర్యాంకు 19తో ప్రారంభమైంది. ఈ విద్యార్థికి 669 మార్కులు వచ్చాయి. అర్హత సాధించిన వారిలో చివరి విద్యార్థి 113 మార్కులతో 13,19,140 ర్యాంకు దక్కించుకున్నారు. విశ్వవిద్యాలయం ప్రకటించిన జాబితాలో జాతీయ స్థాయిలో తొలి 100 ర్యాంకులు పొందిన వారిలో రాష్ట్రం నుంచి ఆరుగురు ఉంటే.. 207లోపు ర్యాంకుల్లో 11 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది వరకు విశ్వవిద్యాలయం విద్యార్థుల పేర్లతో ర్యాంకులు ప్రకటించేది. ఈ అవకాశాన్ని మధ్యవర్తులు తమకు అనుకూలంగా మార్చుకుంటుండటంతో ఈ సారి రోల్ నంబర్ల వారీగా ర్యాంకులు ప్రకటించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.

అన్నాబత్తుని శివకుమార్ పినతండ్రి కుమారుడి బెదిరింపులు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పినతండ్రి కుమారుడు రాజశేఖర్ తమను బెదిరించి రూ.లక్షలు దోచుకున్నారని, పొలాన్ని కూడా ఆక్రమించారని బాపట్ల జిల్లా చుండూరు మండలానికి చెందిన మొవ్వా వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. పలు సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర వినతులు స్వీకరించారు. 60 ఏళ్లుగా తమ అధీనంలో ఉన్న భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొంగిదొడ్డికి చెందిన బాలమ్మ కోరారు. తన ఇంటి గోడలు పడగొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గుంటూరుకు చెందిన ఓ బాధిత మహిళ వాపోయారు.

మామిడి రైతులను ఆదుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: మామిడి రైతులను సంక్షోభం నుంచి ఆదుకోవడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల వరకు రైతులు తోతాపురి రకం మామిడి సాగు చేస్తున్నారు. నాలుగేళ్లుగా రైతులు నష్టాల్లో ఉన్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉంది. గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోపిడీ చేస్తున్నారు. రైతులకు కిలోకు రూ.12 చొప్పున ఇవ్వాలని, అందులో రూ.4 ప్రభుత్వం రాయితీగా ఇవ్వాలన్న ఆదేశాలు అమలు కావడం లేదు. గుజ్జు పరిశ్రమల యజమానులు కిలో రూ.4కు మించి కొనడం లేదు. పరిశ్రమల గుత్తాధిపత్యం నుంచి రైతుల్ని కాపాడటానికి ప్రభుత్వం మార్కెటింగ్ ఏజెన్సీల ద్వారా ప్రత్యక్షంగా కొనుగోలు చేయాలి. ఇందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి'' అని శ్రీనివాసరావు కోరారు.

కేరళ పర్యాటక ప్రచారంలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా!

దిల్లీ: గూఢచర్యం ఆరోపణల కేసులో అరెస్టయిన యూ ట్యూబర్ జ్యోతి మల్హోత్రాను కేరళ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఆహ్వానించిందని ఆర్టీఐలో వెల్లడైంది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ప్రకారం.. కేరళను పర్యాటకంగా ప్రోత్సహించేందుకు అతిథులుగా ఎంపిక చేసిన 41మంది ఇన్‌ఫ్లుయెన్సర్లలో జ్యోతి మల్హోత్రా కూడా ఉన్నారు. వీరందరి పర్యటనకు కేరళ ప్రభుత్వం నిధులు సమకూర్చిందని, ప్రయాణం, వసతి, ఆహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని సమాచారం.

మీథేన్ వాయువు పీల్చి 12 మంది తుర్కియే సైనికుల దుర్మరణం

అంకారా: కుర్దిష్ ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురైన తోటి జవాన్ల అవశేషాలను వెతుకుతూ ఉత్తర ఇరాక్‌లోని ఓ గుహలోకి వెళ్లిన 12 మంది తుర్కియే సైనికులు మీథేన్ వాయువు పీల్చి ప్రాణాలు కోల్పోయారు. గుహలోకి మొత్తం 19 మంది సైనికులు వెళ్లారని సోమవారం ఇరాక్ రక్షణ శాఖ వెల్లడించింది. మీథేన్ వాయువు పీల్చడంతో అస్వస్థతకు గురై 12 మంది సైనికులు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు.

పంజాబ్‌లో కారు-మినీ బస్సు ఢీ.. 8 మంది మృతి

ఈటీవీ భారత్: పంజాబ్‌లోని హోశియార్‌పుర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 8మంది మృతిచెందగా, 32 మంది గాయపడ్డారు. అధిక వేగంతో బస్సు నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఎక్స్ వేదికగా విచారం వ్యక్తంచేశారు.

9 వేల పోస్టులు భర్తీ చేయాలి: కార్మిక పరిషత్

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో వివిధ స్థాయిల్లో ఖాళీగా ఉన్న 9 వేల పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావుకు కార్మిక పరిషత్ విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ బోర్డు సమావేశం నేపథ్యంలో సోమవారం ఆయన్ను కలిసి మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని కోరినట్లు కార్మిక పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషగిరిరావు, వై.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఓర్వకల్లు నోడ్ మాస్టర్ ప్లాన్ ఖరారు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ (హెచ్‌బీఐసీ) పరిధిలోని ఓర్వకల్లు నోడ్‌ను 9 వేలకుపైగా ఎకరాల్లో అభివృద్ధి చేసేందుకు రూపొందించిన తుది మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు దశల్లో నోడ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ (భూముల వినియోగం ఎకరాల్లో)

భూముల వినియోగం	మొదటి దశ	రెండో దశ	మొత్తం	శాతం
పారిశ్రామిక అవసరాలకు	1,423.73	3,593.59	5,107.33	52
రవాణా కోసం	216.6	258.17	474.77	5
నివాస ప్రాంతాలకు	41.98	294.38	336.36	3
వాణిజ్య అవసరాలకు	17.56	188.86	206.42	2
ప్రజావసరాలకు	64.49	136.32	200.81	2
ప్రజా వినియోగాలకు	217.35	239.35	456.7	5
రోడ్ల కోసం	276.4	621.64	898.04	9
వినోద సేవల కోసం	363.04	849.56	1,212.6	12
గ్రీన్ జోన్లు	---	510.18	510.18	5
జలవనరుల కోసం	--	405.63	405.63	4